సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 177
మంగళవారం 17-9-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



కొరియాను కొట్టేసి...
ఆరోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరిన భారత్ - 14లో



పచ్చని కొలువులు తోడుంటే..
గ్రీన్ జాబ్స్‌కు ఫుల్ డిమాండ్.. పునరుత్పాదక ఇంధన రంగంలో కొలువుల జోరు - 15లో



దేశ ప్రతిష్ట దిగజార్చే యత్నం
లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు.
- వివరాలు 6లో▶



నేడే రాజీనామా
ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం రాజీనామా చేయనున్నారు.
- వివరాలు 6లో▶



దిగొచ్చిన దీదీ
బెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కారు దిగివచ్చింది. జూనియర్ డాక్టర్ల ఐదు డిమాండ్లలో మూడింటిని ఆమోదించింది.
- వివరాలు 6లో▶



లంచ్ బ్రేక్‌లో లవ్వు!
జనాభాను ఇతోధికంగా పెంచి దేశసేవ చేయాలంటూ రష్యన్లకు ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాజాగా విజ్ఞప్తి చేశారు.
- వివరాలు 6లో▶

ముసాయిదానే.. కొత్త చట్టం!



భూరికార్డులకు సంబంధించి 'ఆర్ఓఆర్-2024' ముసాయిదానే ఫైనల్ చేయాలని సర్కారు నిర్ణయం

- ఒకట్రెండు అంశాల్లోనే మార్పులు.. అది కూడా మార్గదర్శకాల్లోనే సవరణ
- భూసమస్యల పరిష్కారానికి ట్రిబ్యునళ్ల ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు
- రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు, కొత్త చట్టానికి సంబంధం లేదంటున్న రెవెన్యూ వర్గాలు
- ముసాయిదాలోని సెక్షన్-4 ప్రకారం కూడా ఏర్పాటు చేయవచ్చంటున్న నిపుణులు
- ఆర్డీవో స్థాయిలోనూ అప్పీల్ అవకాశం ఉండాలనే సూచనలపై అస్పష్టత
- కొత్త చట్టంపై వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలా? అసెంబ్లీలో చర్చించి ఆమోదించే దాకా ఆగాలా అన్న దానిపై తర్జనభర్జన
- 20వ తేదీన జరిగే కేబినెట్ ఎజెండాపై బుధవారం రానున్న స్పష్టత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రికార్డులకు సంబంధించిన 'రికార్డ్ ఆఫ్ రైట్స్-2024 (ఆర్‌వోఆర్)' చట్టం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి వచ్చింది. ఒకట్రెండు చిన్న చిన్న మార్పులు మినహా ముసాయిదా కింద రూపొందించిన అంశాలనే చట్టం రూపంలో అమల్లోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి త్వరలోనే దీనిపై ఓ స్పష్టత ఇస్తారని.. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాక తుది నిర్ణయం ప్రకటిస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. దాంతోపాటు ఈ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదంతో ఆర్డినెన్స్ జారీ చేస్తారా? లేక అసెంబ్లీలో పెట్టిన బిల్లుపై విస్తృతంగా చర్చించి చట్టంగా చేస్తారా? అన్న దానిపై మాత్రం తర్జనభర్జన కొనసాగుతున్నట్టు వెల్లడించాయి. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈనెల 20న జరిగే కేబినెట్ సమావేశం ముందుకు ఆర్డినెన్స్ వచ్చే అవకాశం లేదని అంటున్నాయి. అయితే కేబినెట్ ఎజెండాపై బుధవారం స్పష్టత వస్తుందని, ఎజెండాలో భూముల చట్టం ఆర్డినెన్స్ ఉంటే రూపకల్పన, జారీ ఏర్పాట్లకు సిద్ధంగానే ఉన్నామని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

ముసాయిదా బిల్లు ఇదే..

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం 'ఆర్‌వోఆర్-2024' ముసాయిదాను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్‌వోఆర్-2020 చట్టంలో పరిష్కరించలేని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతూ 20 సెక్షన్లతో ఈ ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. 1936, 1948, 1971, 2020 నాటి ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి, వాటి అమలుతో చేకూరిన ఫలితాలను బేరీజు వేసి కొత్త చట్టం ముసాయిదాను తయారు చేసింది. తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాల అంచనాల ప్రకారం రూపొందించిన ఈ ముసాయిదాలో పాస్ పుస్తకాలు రాని భూముల సమస్యల పరిష్కారం, కొత్త రికార్డును ఎప్పుడైనా తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ లాంటి వెసులుబాట్లు కల్పిస్తూ అనేక అంశాలను ముసాయిదాలో పొందుపరిచారు.

బిల్లు పెట్టిన తర్వాత ఏం జరిగిందంటే..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆర్‌వోఆర్ చట్టానికి రెండోసారి మార్పు జరుగుతోంది. 2020లో బీఆర్ఎస్ హయాంలో ఆర్‌వోఆర్-2020 చట్టం అమల్లోకి తెచ్చారు. అందులోని అనేక అంశాలకు సవరణలు, మార్పు చేర్పులతో ఆర్‌వోఆర్-2024ను

మిగతా 5వ పేజీలో ▶



దేశ చరిత్రలో హైదరాబాద్ సంస్థానానిది ఓ ప్రత్యేక స్థానం. 224 ఏళ్లపాటు ఈ రాజ్యాన్ని పాలించిన అసఫ్ జాహీల పాలనలో ఎన్నో మెరుపులు, మరెన్నో మరకలు. హైదరాబాద్ రాజ్యాన్ని అన్నింటా ముందుకు నడిపిన నిజాంల దార్శనికత నాణానికి ఒకవైపు అయితే.. మరోవైపు మితిమీరిన నియంతృత్వం, జమీందారుల దోపిడీలు, రజాకార్ల దుశ్చర్యలతో జనం విలవిల్లాడారు. 1947 ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య సంబురాలు చేసుకుంటే.. హైదరాబాద్ సంస్థానం చీకటి వేదనలోనే ఉండిపోయింది.

తరతరాల బానిస బతుకులు బందూకులై పేలిన సాయుధ పోరాటానికి.. జనరల్ జేఎన్ చౌదరి నేతృత్వంలోని భారత సైన్యం తోడై.. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్వేచ్ఛాగాలులు పీల్చింది.

ఈ పరిణామ క్రమంలో కొన్ని ముఖ్య ఘట్టాలు, విశేషాలు లోపలి పేజీల్లో..

వచ్చే నెల నుంచి
కొత్త రేషన్ దరఖాస్తులు

జనవరి నుంచి రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

- వేర్వేరుగా స్మార్ట్ రేషన్‌కార్డులు, స్మార్ట్ హెల్త్ కార్డుల జారీ
- బియ్యం అవసరం లేనివారికి స్మార్ట్ హెల్త్ కార్డులు
- లబ్ధిదారుల ఆదాయ పరిమితి, అర్హతలపై నిబంధనల పునః సమీక్ష
- 21న జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో తుది నిర్ణయం
- 19వ తేదీలోగా ప్రజాప్రతినిధులంతా తమ అభిప్రాయాలను పంపాలని విజ్ఞప్తి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల కోసం అక్టోబర్ నుంచి దరఖాస్తులు స్వీకరించి, వేగంగా జారీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రేషన్‌కార్డులను విభజించి స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ హెల్త్ కార్డులను వేర్వేరుగా జారీ చేస్తామన్నారు. రేషన్ బియ్యం అవసరం లేకున్నా ఆరోగ్యశ్రీ వంటి ప్రయోజనాల కోసం తెల్లరేషన్ కార్డులున్న వారి కోసం ప్రత్యేకంగా స్మార్ట్ హెల్త్ కార్డులను జారీ చేస్తామని వెల్లడించారు. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నాలుగోసారి సమావేశమై చర్చించింది. ప్రభుత్వానికి కొన్ని మధ్యంతర సిఫార్సులు చేసింది. అనంతరం మంత్రులు ఉత్తమ్, పొంగులేటి మీడియాతో మాట్లాడారు.

అర్హతలపై పునః సమీక్ష చేస్తున్నాం..

తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారుల అర్హతలను పునఃసమీక్షిస్తున్నామని మిగతా 2వ పేజీలో ▶

రేషన్.. పరేషాన్!

- కొత్త రేషన్‌కార్డుల అంశంపై ప్రజల్లో సందేహాలెన్నో..
- అర్హతలు పునఃసమీక్షిస్తామన్న మంత్రుల ప్రకటనతో ఆందోళన
- బియ్యం అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్‌కార్డులు ఇస్తామన్న దానిపైనా అనుమానాలు

2లో

రూ.2,075 కోట్లతో ఉస్మా 'నయా' భవనం

- అత్యాధునిక సౌకర్యాలు, హంగులతో నిర్మాణం
- కొత్తగా 6 సూపర్ స్పెషాలిటీ విభాగాలు
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దే యోచన
- రెండు నెలల్లో పనులు మొదలు పెట్టనున్న వైద్య, ఆరోగ్యశాఖ

5లో

2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్

- రాష్ట్రంలో ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- హరిత విద్యుత్‌లో పెట్టుబడులకు తెలంగాణ సరైన వేదికని వెల్లడి
- గుజరాత్‌లో నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ సదస్సులో ప్రసంగం

- వివరాలు 12లో


సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు జూపల్లి, పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, వీహెచ్

మీ ఫామ్‌హౌసుల్లో జిల్లేళ్లు మొలవాల్సిందే

గడీల్లో గడ్డి మొలవాలని చెప్పిన చాకలి ఐలమ్మే మాకు స్ఫూర్తి

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- మేం రాజీవ్‌గాంధీ విగ్రహం అనగానే వాళ్లకు తెలంగాణ తల్లి గుర్తొచ్చింది
- దేశానికి సేవలు చేసిన కుటుంబం గాంధీలది.... రాజీవ్ కుటుంబాన్ని విమర్శించే వాళ్లది దోచుకున్న కుటుంబమని ఆరోపణ

3లో

తెలంగాణ తల్లికి నేడు
పాలాభిషేకాలు

కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు ఎక్కడికక్కడ నిరసన

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తుందని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయానికి, తెలంగాణ అమర జ్యోతికి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడం తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టుపెట్టే సిగ్గుమాలిన చర్యగా భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం రాష్ట్రంలోని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులతో సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలుపాలని సోమవారం

మిగతా 3వ పేజీలో ▶

సమీకృత గురుకులాలకు
ఉమ్మడి ప్రవేశపరీక్ష!



ప్రత్యేక విధానం తీసుకురావడంపై సర్కారు దృష్టి

ఐదో తరగతి మొదలు కళాశాలలకు సెట్

పాత గురుకులాలకు ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు

- వివరాలు 12లో

ఇదంజగత్



అంత ఆలస్యమెందుకు... ఇంకాస్త తొందరగా చేయొచ్చుగా అని మనవాళ్లు అడుగుతున్నార్సార్!

నగరంపై పోలీసుల నజర్

నేడు 3 కీలక ఘట్టాలు

- నిమజ్జనం, తెలంగాణ ప్రజాపాలన, విమోచన దినోత్సవాలు
- నగర పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాట్లు... పాతబస్తీపై ప్రత్యేక దృష్టి
- అదనపు బలగాల మోహరింపు
- సున్నిత, అనుమానిత ప్రాంతాల్లో మఫ్టీలో గస్తీ

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- రాష్ట్రమంతా విధుల్లో 35 వేల మంది..
- డీజీపీ ఆఫీస్, కమాండ్ కంట్రోల్ రూంల నుంచి పర్యవేక్షణ
- 'సాక్షి'తో డీజీపీ జితేందర్

2లో


పబ్లిక్ గార్డెన్స్‌లో ఏర్పాట్లు..

సాక్షి, హైదరాబాద్: సాధారణ పరిస్థితుల్లోనే గణేశ్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక ఊరేగింపు, నిమజ్జనాలను సజావుగా పూర్తి చేయడం నగర పోలీసులకు పెద్ద సవాలు. అలాంటిది ఈసారి మంగళవారం ఒకేరోజు.. హుస్సేన్‌సాగర్‌తో పాటు పలు కీలక చెరువుల్లో నిమజ్జనాలు, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం, తెలంగాణ విమోచన దినోత్సవం జరగనుండటంతో పటిష్ట బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ స్థాయిలో అదనపు బలగాలను మోహరిస్తున్నారు. ప్రతి ఏడాదీ సామూహిక ఊరేగింపు, నిమజ్జనం నేపథ్యంలో ఉత్తరాది సహా వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది ప్రముఖులు నగరానికి వస్తుంటారు. వీరిలో ఆర్ఎస్ఎస్ సహా వివిధ సంస్థలకు చెందిన వారు ఉంటారు. చార్మినార్, ఎంజే మార్కెట్ సహా మరి కొన్ని ప్రాంతాల్లో వీరి ప్రసంగాలు ఉంటాయి. దీంతో పోలీసులు ఆయాచోట్ల అదనంగా జాగ్రత్తలు తీసుకుని బందోబస్తు ఏర్పాటు చేస్తారు. పాతబస్తీ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ప్రధాన రహదారి కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు

మిగతా 2వ పేజీలో ▶



చుట్టూ గోడ, దర్వాజాలతో.. మహానగరం

హైదరాబాద్ ఎప్పుడూ ప్రత్యేకమే. సారవంతమైన భూమి, సమశీతోష్ణ పరిస్థితులు, వర్షాలు.. అందుకే ఈ ప్రాంతంపై అందరికీ మక్కువ. ఇక్కడ బహమనీ సుల్తాన్ల పాలన అంతమైన తర్వాత 1518లో ప్రారంభమైన కుతుబ్‌షాహీల శకం.. 1687లో ఔరంగజేబు గోల్కొండను సొంతం చేసుకునేంత వరకు సాగింది. ఔరంగజేబు ప్రతినిధులుగా మొదలైన అసఫ్ జాహీ (నిజాం)ల పాలన.. 1724లో స్వాతంత్ర్యం ప్రకటించుకుని 1948 వరకు సాగింది. ఏడుగురు నిజాం రాజుల చేతుల మీదుగా హైదరాబాద్ అనేక మార్పులు, చేర్పులకు లోనైంది. వారికంటే ముందే కులీకుతుబ్ షా 1591లో హైదరాబాద్ నిర్మాణం కోసం చార్మినార్ వద్ద పునాది రాయి వేశారు. అనంతర కాలంలో హైదరాబాద్ చుట్టూరా.. 18 అడుగుల ఎత్తు, 8 అడుగుల వెడల్పుతో 9.7 కిలోమీటర్ల మేర గ్రానైట్ రాళ్లతో గోడను నిర్మించారు. నగర ప్రజలు వచ్చిపోయేందుకు వీలుగా పురానాపూల్, డబీర్‌పురా, చాదర్‌ఘాట్, యాకుత్‌పురా, ఆలియాబాద్, చంపాపేట, లాల్‌దర్వాజా, గౌలిపురా, ఫతే దర్వాజా, దూద్‌బౌలి, ఢిల్లీ, మీర్‌జుమ్లా, అఫ్జల్ దర్వాజాలు ఉండేవి. అందులో పురానాపూల్, డబీర్‌పురా దర్వాజాలు నాటి దర్జాకు ప్రతీకలుగా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. సాయంత్రం చీకటి పడగానే అన్ని దర్వాజాలను మూసేసి, తెల్లవారగానే తెరిచేవారు. రాత్రివేళల్లో నగరం వెలుపల పరిస్థితిని కనిపెట్టేందుకు 13 కిటికీలు ఉండేవి. దేశంలోని సంస్థానాల్లో జనసంఖ్య, వైశాల్యం, ఆదాయంలో పెద్దదిగా హైదరాబాద్ సంస్థానం గుర్తింపు పొందింది. తెలుగు, మరాఠా, కన్నడ ప్రాంతాల సమ్మిళితమైన ఈ సంస్థానంలోని 16 జిల్లాల్లో 1931 నాటి లెక్కల మేరకు.. తెలుగు మాట్లాడేవారు 69.72 లక్షలు ఉంటే, 37.86 లక్షలు మరాఠీ, 15.07 లక్షల మంది కన్నడ భాష మాట్లాడేవారు ఉండేవారు. వీరికితోడు వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన మరెందరితోనో హైదరాబాద్ నిండిపోయింది. అప్పట్నుంచే హైదరాబాద్ ఓ కాస్మోపాలిటన్ సిటీ.


హైదరాబాద్ చుట్టూ గోడ


1905లో అఫ్జల్ మహల్‌లో బ్రిటిష్ ప్రతినిధులతో నిజాం మహబూబ్ అలీ ఖాన్, యువరాజు ఉస్మాన్ అలీఖాన్



రేషన్.. పరేషాన్!

- కొత్త రేషన్‌కార్డుల అంశంపై ప్రజల్లో సందేహాలెన్నో..
- రేషన్‌కార్డులకు కోత పడుతుందా? పెళ్లయి విడిపడిన వారికి కార్డులు ఇస్తారా?
- అర్హతలను పునః సమీక్షిస్తామన్న మంత్రుల ప్రకటనతో ఆందోళన
- బియ్యం అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్‌కార్డులు ఇస్తామన్న దానిపైనా అనుమానాలు
- ఇప్పటికే రేషన్‌కార్డు సమస్యలతో 'రుణమాఫీ', ఉచిత విద్యుత్ అందని తీరు
- భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలకూ లింకు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రేషన్‌కార్డుల అంశం ప్రజల్లో పరేషాన్ రేపుతోంది. లక్షలాది మంది కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. దీనిపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వెల్లడించిన అంశాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్‌కార్డులకు కోత పెడతారా? పెళ్లిళ్లు అయి కొత్తగా ఏర్పడిన కుటుంబాలన్నింటికీ కొత్తకార్డులు జారీ చేస్తారా? పాతవాటిలో మార్పు చేర్పులపై ఏం చేస్తారు? రేషన్‌కార్డులు లేకుంటే ప్రభుత్వ పథకాలు అందడం ఎలా? అర్హతల పునః సమీక్ష అంటే ఎలాంటి నిబంధనలు పెడతారనే ప్రశ్నలు వస్తున్నాయి. వచ్చే నెల ప్రారంభం నుంచే కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రులు వెల్లడించారు. రేషన్‌కార్డులను విభజించి, స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ హెల్త్‌కార్డులు ఇస్తామని.. రేషన్‌కార్డులకు అర్హతలపై పునః సమీక్ష చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో గతంలో ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రకటనలు, వ్యాఖ్యలు.. ప్రస్తుతం మంత్రులు వెల్లడించిన అంశాలు.. ఇటీవలి పరిణామాలను బేరీజు వేసుకుంటూ.. రేషన్‌కార్డుల అంశంపై తీవ్రస్థాయిలో చర్చలు మొదలయ్యాయి.

రేషన్ కార్డుల్లో కోత పడుతుందా?

అర్హులైన వారందరికీ కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామని మంత్రులు ప్రకటించారు. అయితే అర్హులను ఎలా నిర్ధారిస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్తగా కార్డుల కోసం ఏడెనిమిది లక్షల మంది ఎదురుచూస్తున్నారు. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల దరఖాస్తులతోపాటు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. కానీ ఆ దరఖాస్తుల డేటాపై స్పష్టత లేదు. దీంతో మరోసారి ప్రజాపాలన నిర్వహించి రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రేషన్‌కార్డుల జారీకి విధి విధానాలేమిటనే విషయంలో స్పష్టమైన వైఖరిని ప్రకటించాల్సి ఉంది. వార్షికాదాయం ప్రాతిపదికన జారీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కొత్తగా ఇచ్చే రేషన్‌కార్డులకే పరిమితి అమలు చేస్తారా? పాతకార్డులకూ వర్తింపజేస్తూ.. అధికాదాయం ఉన్నవారికి రద్దు చేస్తారా? అన్నది తేలాల్సి ఉంది. రాష్ట్రంలో అడ్డగోలుగా రేషన్‌కార్డులు జారీ చేశారని, అధికాదాయం ఉన్నవారు, ప్రజాప్రతినిధులు, ఐటీ కడుతున్నవారికి కూడా రేషన్‌కార్డులు ఉన్నాయని సీఎం రేవంత్ గతంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్డులకు కోతపడొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ పథకాలు అందేది ఎలా?

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులే ప్రామాణికమని సీఎం రేవంత్ గతంలోనే స్పష్టం చేశారు. ఇప్పటికే రేషన్‌కార్డు సమస్యలతో చాలా మంది రైతులకు 'రుణమాఫీ' అందలేదు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందనివారూ ఎంతో మంది ఉన్నారు. భవిష్యత్తులో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలకూ రేషన్‌కార్డుల లింకు ఉండనుంది. దీనివల్ల ఉన్న రేషన్‌కార్డులు రద్దయినా, కొత్త రేషన్ కార్డులు మంజూరుకాకున్నా.. తమకు పథకాలు అందేది ఎలాగని పేదల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్నేళ్లుగా జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయిందని.. అర్హతకోసం పరిగణించే వార్షికాదాయ పరిమితిని దానికి అనుగుణంగా పెంచాలనే విజ్ఞప్తులు వస్తున్నాయి. ఇక రేషన్‌కార్డులను విభజించి బియ్యం వద్దనుకునే వారికి స్మార్ట్ హెల్త్‌కార్డులు జారీ చేస్తామన్న మంత్రుల ప్రకటనతోనూ సందేహాలు మొదలయ్యాయి. అలా స్మార్ట్ హెల్త్‌కార్డులు ఉన్నవారికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయా, లేదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. అయితే ఈ నెల 21న మరోసారి కేబినెట్ సబ్ కమిటీ సమావేశం కానుంది. అనంతరం రేషన్‌కార్డుల అంశంపై స్పష్టత రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

నేడు కేంద్రం ఆధ్వర్యంలో 'విమోచనం'

- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కేంద్ర సాంస్కృతికశాఖ
- ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహిస్తోంది. ఉదయం 7.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తారు. 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'ద్వారా 'సెప్టెంబర్ 17–హైదరాబాద్ విమోచన దినం'ప్రాధాన్యత వివరించేలా సంక్షిప్త ప్రదర్శన ఉంటుంది. ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు పోలీసు బలగాలు, సైనికదళాల పరేడ్ ఉంటుంది. 9 గంటలకు కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ చౌహాన్, బండి సంజయ్ పరేడ్ గ్రౌండ్స్‌లోని యుద్ధస్మారకం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 9.15 గంటలకు జి.కిషన్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేస్తారు. కేంద్ర మంత్రులు సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తారు. 9.20 గంటలకు కేంద్ర సాయుధ బలగాల నుంచి కిషన్‌రెడ్డి గౌరవవందనం స్వీకరిస్తారు. అనంతరం 700 మందికిపైగా కళాకారులు మంగళవాద్యం, బతుకమ్మ, కొమ్ముకోయ, బోనాలు–పోతరాజు, డప్పులు, కోలాటం, లంబాడీ, గుస్సాడి, ఒగ్గు కథ తదితరాలను ప్రదర్శిస్తారు. చివరగా 'హైదరాబాద్ విమోచన దినం శకటం ప్రదర్శన ఉంటుంది. 10.10 గంటలకు కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ఉమా నందూరి స్వాగతోపన్యాసం చేస్తారు. తర్వాత బండి సంజయ్ ప్రసంగిస్తారు. రాష్ట్రం నుంచి పద్మ అవార్డులకు ఎంపికైన ఆరుగురిని సన్మానిస్తారు. 10.30 గంటలకు కిషన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం కేంద్ర సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రులు తిలకిస్తారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలు పాల్గొననున్నారు.

వచ్చే నెల నుంచి కొత్త రేషన్ దరఖాస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఈ నెల 21న ఇంకోసారి సమావేశమై కొత్త విధివిధానాలను ఖరారు చేస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ ఏర్పాటైన నాటికి 91,68,231 రేషన్‌కార్డులు, 3,38,07,794 మంది లబ్ధిదారులు ఉంటే.. గత ప్రభుత్వం పాత రేషన్‌కార్డులన్నీ రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు స్వీకరించిందని చెప్పారు. అప్పట్లో 89,21,907 కొత్త రేషన్‌కార్డులను జారీ చేయగా.. 2,70,36,250 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89.6 లక్షల కార్డులు, 2.81 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం లబ్ధిదారుల వార్షికాదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల్లోపు ఉండాలని.. 3.5 ఎకరాలు/ఆ లోపు తడి, 7.5 ఎకరాలు/ఆ లోపు మెట్ట భూములు ఉండాలని చెప్పారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లలో అమలు చేస్తున్న ఆదాయ పరిమితులను పరిశీలించామని.. రాష్ట్రంలో లబ్ధిదారుల ఆదాయ పరిమితిని పెంచాలా? తగ్గించాలా? ప్రస్తుత నిబంధనలనే కొనసాగించాలా? అన్న అంశాలపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలు కోరుతూ లేఖలు రాయగా.. ఇప్పటి వరకు 16 మంది నుంచి స్పందన వచ్చిందన్నారు. మిగతావారు ఈ నెల 19లోగా అభిప్రాయాలను పంపితే.. పరిశీలిస్తామని చెప్పారు.

జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ..

తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీని జనవరి నుంచి ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. నిరుపేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. దొడ్డు బియ్యం బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్‌కు దారితీస్తోందని.. సన్న బియ్యంతో ఈ సమస్య ఉండదని వివరించారు. వానాకాలంలో పండించిన సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందిస్తామని తెలిపారు.

ఉప ఎన్నికలుంటేనే ఇచ్చారు: పొంగులేటి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కొత్త రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పెన్షన్లు ఇచ్చిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. 2016–2024 మధ్య కాలంలో 6,47,479 కొత్తకార్డులు జారీ చేయగా.. 5,98,000 కార్డులను తొలగించిందని చెప్పారు. అంటే ఇచ్చినది 49,476 కార్డులేనని పేర్కొన్నారు. తాము పారదర్శకత కోసం ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని, వారు విలువైన సలహాలిస్తే భేషజాలకు పోకుండా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

మంత్రివర్గ ఉపసంఘం మధ్యంతర సిఫారసులివీ..

- క్యూఆర్ కోడ్/ మైక్రో చిప్/ బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను జారీ చేయాలి.
- ప్రస్తుత అర్హతలను కొనసాగించాలి.
- 'పరిమితికి లోబడి భూమి ఉండడం ఒక్కటే అర్హత కాదు. భూమి ద్వారా వచ్చే ఆదాయం సైతం ఆదాయ పరిమితికి లోబడి ఉండాలి'అనే నిబంధనను తొలగించాలి. గందరగోళానికి గురిచేసే ఈ నిబంధన అనవసరం.
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సక్సేనా కమిటీ సిఫారసులను పరిశీలించాలి.

చేతనైతే విమోచన ఉత్సవాలు నిర్వహించండి

- లేదంటే పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచనోత్సవాలకు రావాలి
- నిజాంపై పోరాడిన యోధులను స్మరించుకోవాల్సిన రోజు ఇది
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజం



కరీంనగర్‌టౌన్: 'తెలంగాణ ప్రజా పాలన దేనికోసం? ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదు? పేరు మార్చి తెలంగాణ చరిత్రనే కనుమరుగు చేస్తున్నరు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నరు.. అందుకే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి హాజరు కావడం లేదు. కాంగ్రెస్‌కు చేతనైతే విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా నేనే హాజరవుతా. వారికి చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా'అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మంగళవారం ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన దినోత్సవం అంటే నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన రోజని, నాడు రజాకార్లు మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడించిన దురాగతాలను మరచిపోలేమని అన్నారు. సర్దార్ పటేల్ ఆపరేషన్ పోలో ఆపరేషన్ వల్లే నేడు నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందన్నారు. రజాకార్ల దళం సృష్టించిన పార్టీయే ఎంఐఎం అని.. ఆ పార్టీకి భయపడి, ఒక వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ విమోచన దినోత్సవం జరపకుండా ప్రజలను వంచిస్తున్నాయని విమర్శించారు.

బీజేపీ.. చరిత్రను వక్రీకరిస్తోంది

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



సాక్షి,హైదరాబాద్: భారత దేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనం, విమోచన విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ఇందులో బీజేపీ పాత్ర ఏమీలేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఆయన సచివాలయం మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, చరిత్ర ఆధారంగా భవిష్యత్ నిర్మాణం జరగుతుందని, చరిత్రను ఎవరూ మార్చలేరని పేర్కొన్నారు. విలీన ఖ్యాతి అప్పటి కేంద్ర హోంమంత్రి వల్లభాయ్ పటేల్, కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. చరిత్ర తెలియకుండా బీజేపీ, ఇతర కొన్ని పార్టీల నాయకులు విమోచన, విలీనంపై అర్థంలేని మాటలు మట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యే నాటికి బీజేపీ పుట్టనే లేదన్నారు.

సీఎం స్వయంగా ఆహ్వానించినా రారా?

- బీజేపీ నేతల తీరుపై మల్లురవి, మందుల శామేల్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసిన రోజున రాజుల పాలన పోయి ప్రజల పాలన మొదలైందని, ఆ రోజును పురస్కరించుకుని నిర్వహించే ప్రజాపాలన దినోత్సవానికి హాజరు కావాలని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాసినా బీజేపీ నేతలు హాజరు కారా అని ఎంపీ మల్లురవి ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు గజేంద్రసింగ్ షెకావత్‌ను కూడా హాజరు కావాలని సీఎం కోరినా సిగ్గులేకుండా రాలేమని చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. గాంధీభవన్‌లో సోమ వారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మందుల శామేల్‌తో కలసి ఆయన మాట్లాడారు. అసలు తెలంగాణ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాల్గొనలేదని, అప్పటికి ఆ పార్టీనే పుట్టలేదని గుర్తు చేశారు. బీజేపీకి తెలంగాణ విమోచనకు అసలు ఏం సంబంధముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ మనిషైన సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు.

నగరంపై పోలీసుల నజర్

▶ మొదటి పేజీ తరువాయి

ఉంటాయి. దీనికి తోడు ఈసారి సెప్టెంబర్ 17 పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. దీనికి ముందు ఆయన అసెంబ్లీ ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించే అవకాశం ఉంది. ఈ రెండు కార్యక్రమాలకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో ట్రాఫిక్ చిక్కులు మరింత పెరుగుతాయని భావిస్తున్న పోలీసు అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే విమోచన దినోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఆయనతో పాటు రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన బీజేపీ క్యాడర్ పరేడ్ గ్రౌండ్స్‌కు తరలిరానుంది.

గతంలో ఎన్నడూ లేనివిధంగా..

సిబ్బందికి సెలవులు రద్దు చేసిన పోలీసు అధికారులు..ఆయా కార్యక్రమాల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు. సోమవారం రాత్రి నుంచే అధికారు లు విధుల్లో ఉండనున్నారు. అదనపు బలగాలను రంగంలోకి దింపి పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారు. సీసీఎస్, సిట్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్, టీజీఎస్‌ఎస్పీ, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో పాటు కేంద్ర బలగాలను మోహరిస్తున్నారు. వీరికి తోడు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సివిల్, సాయుధ బలగాలను రంగంలోకి దింపుతున్నారు. సున్నిత, అనుమానిత ప్రాంతాల్లో మఫ్టీ పోలీసులతో ప్రత్యేక గస్తీ, నిఘా ఏర్పాటు చేస్తున్నారు. పాతబస్తీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన నగర కమిషనర్ సీవీ ఆనంద్ ఆదివారం అర్ధరాత్రి అనేక ప్రాంతాల్లో పర్యటించారు. నిమజ్జనం బుధవారం ఉదయం వరకు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తుండగా, గురువారం నగరంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉండటంతో దానికీ భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టారు.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- రాష్ట్రం మొత్తం విధుల్లో 35వేల మంది..
- డీజీపీ ఆఫీస్, కమాండ్ కంట్రోల్ రూంల నుంచి పర్యవేక్షణ
- 'సాక్షి'తో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ జితేందర్ తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లపై సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 35వేల మంది పోలీస్ సిబ్బందిని నిమజ్జన బందోబస్తు విధులకు వినియోగిస్తున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలోనే 25వేల మంది విధుల్లో ఉంటారని తెలిపా రు. నిమజ్జనాన్ని పర్యవేక్షించేందుకు లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో, బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో .. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ప్రతి ఊర్లో 'విమోచన'ను జరపాలి

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: ప్రతి ఊర్లో జెండా ఎగురవేసి, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గొప్పగా జరుపుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చా రు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మేధావులు, రాజకీయనేతలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొనాల ని కోరారు. అమరుల త్యాగాలను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో పత్రికా రచయితలు, ఉద్యమకారులు ఎందరో మరణించారన్నారన్నారు. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు వేలాదిమంది అమరుల త్యాగ ఫలితమేనని, వారి త్యాగాలను ఈ జాతి ఎప్పుడూ మరిచిపోదని పేర్కొన్నారు. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జాతి ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టవద్దని చాలా సందర్భాల్లో కోరినా గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదన్నారు. మంగళవారం పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న విమోచన దినోత్సవం ఏర్పాట్లను సోమవారం ఈటల పరి శీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ ఏర్పడితే విమోచన దినాన్ని జరిపి తీరుతామన్న కేసీఆర్ కూడా ఒత్తిళ్లకు లొంగి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించారని మండిపడ్డారు.

ప్రజాపాలన దినోత్సవంగా సెప్టెంబర్ 17

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రతీ ఏటా సెప్టెంబర్ 17వ తేదీని ప్రజాపాలన దినోత్సవ స్మారకంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రం నియంత పాలన నుంచి విముక్తి పొందుతూ భారత దేశంలో విలీనం చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 17న ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి నోట్ ఆధారంగా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

సీఎం సహాయ నిధికి భారీగా విరాళాలు




సాక్షి, హైదరాబాద్: వరద సహాయ, పునరావాస చర్యల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు వెల్లువెత్తాయి. సినీ నటుడు చిరంజీవి రూ.50 లక్షలు, కుమారుడు రామ్‌చరణ్ తరఫున మరో రూ.50 లక్షలను విరాళంగా అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు చెక్కులను అందజేశారు. అమర్ రాజా గ్రూప్ తరఫున మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రూ.కోటి, గరుడపల్లి ఇన్‌ఫ్రా డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి రూ.25 లక్షలు, సినీ నటుడు విశ్వక్‌సేన్ రూ.10 లక్షలు, సినీ నటుడు సాయి దుర్గాతేజ్ రూ.10 లక్షలు, సినీ నటుడు అలీ దంపతులు రూ.3 లక్షల విరాళం చెక్కులను సీఎంకు అందజేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విరాళాల చెక్కులను అందజేస్తున్న సినీనటుడు చిరంజీవి, మాజీమంత్రి గల్లా అరుణ, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహనరెడ్డి, గరుడపల్లి ఇన్‌ఫ్రా డైరెక్టర్ సంజయ్, సినీనటులు సాయి దుర్గాతేజ్, విశ్వక్‌సేన్, అలీ దంపతులు



నిజాం.. ది వరల్డ్ రిచెస్ట్!

అపార ఖనిజ సంపద. ఆహార ధాన్యాలు, నూనెగింజల ఎగుమతులకు తోడు పారిశ్రామిక ఉత్పత్తులతో నాడు దేశంలోనే హైదరాబాద్ అత్యంత ధనిక ప్రాంతం. నిజాం ఉస్మాన్ అలీఖాన్ 1937లో ప్రపంచంలోనే నంబర్ వన్ ధనవంతుడిగా నిలిచాడు. అప్పట్లోనే నిజాం సంపద విలువ రూ.660 కోట్లుగా అంచనా. గోల్కొండ వజ్రాల గనులు, వనపర్తి, గద్వాల, జటప్రోలు, అమరచింత, పాల్వంచ, అనగుండి, గురుగుంట, గోపాల్‌పేట, నారాయణపేట తదితర సంస్థానాల నుంచి వచ్చే ఆదాయాలతో ఉస్మాన్ అలీఖాన్ ప్రపంచ కుబేరుడు అయ్యారు. ప్రఖ్యాత జేకబ్ వజ్రాన్ని నిజాం తన టేబుల్‌పై పేపర్ వెయిట్‌గా వినియోగించుకున్నారంటేనే అర్థం చేసుకోవచ్చు. ఉస్మాన్ అలీఖాన్‌కు హైదరాబాద్ చుట్టూరా 23 వేల ఎకరాల (సర్ఫేకాస్) భూములతోపాటు హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, ఊటీ, మహాబలేశ్వరం, కోల్‌కతా తదితర ప్రాంతాల్లో ఆరు వందలకుపైగా విల్లాలు, విలాసవంతమైన భవంతులు ఉండేవి. ఇప్పటికీ నజ్రీభాగ్ (పరదాగేట్ కింగ్ కోఠి), ఫలక్‌నుమా, చిరాన్ ప్యాలెస్‌లు నిజాం వారసుల చేతుల్లోనే ఉన్నాయి. ఇవి కాకుండా 173 రకాల బంగారు, వజ్రాల ఆభరణాలతో నిజాం ఖజానా నిండి ఉండేది. 1906లో ఉస్మాన్ అలీఖాన్ తన వివాహ వేడుకల్లో ధరించిన రెండు అంచుల కత్తి, బంగారు ఒర, విలువైన రాళ్లతో పొదిగిన పిడి విలువ అప్పట్లోనే రెండు లక్షల డాలర్లు. ఇక కార్లంటే ఇష్టపడే నిజాం ఉస్మాన్ అలీఖాన్ వద్ద రోల్స్ రాయిస్, నేపియర్ మొదలుకుని అన్ని రకాల కార్లు ఉండేవి. వాటిలో చాలా వరకు చౌమహల్లా ప్యాలెస్ ఆవరణలో ఇప్పటికీ చూడొచ్చు.


విలాసవంతమైన వాహనంపై ఉస్మాన్ అలీఖాన్


సైఫాబాద్ రహత్ మంజిల్

గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల పరిహారం

- వారి పిల్లలకు సంక్షేమ వసతి గృహాల్లో ప్రాధాన్యం
- ప్రజాభవన్‌లో 'ప్రవాసి ప్రజావాణి' కౌంటర్.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలను ప్రకటించింది. గల్ఫ్ దేశాల్లో 2021 డిసెంబర్ 7న, ఆ తర్వాత మరణించిన తెలంగాణ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం ఇకపై చెల్లించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం, వలసలు, సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై పరిశీలనకు ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల కోసం 'ప్రవాసి ప్రజావాణి' పేరిట ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేస్తారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రవేశాల్లో ప్రాధాన్యమివ్వనున్నారు. బెహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణవాసులను గల్ఫ్ కార్మికులుగా పరిగణించి.. ఈ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం వర్తింపజేయనుంది.

క్లుప్తంగా...

నేటి ప్రజావాణి వాయిదా

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం వాయిదా పడింది. ప్రజల అర్జీలను స్వీకరించేందుకు ప్రభుత్వం ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 17న గణేష్ నిమజ్జనం కార్యక్రమం కారణంగా.. ఆ రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిణి దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించి మంగళవారానికి బదులు.. శుక్రవారం నిర్వహించే ప్రజావాణికి హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మిలియన్ మార్చ్ తరహాలో కులగణన మార్చ్: జాజుల



పంజగుట్ట (హైదరాబాద్): మిలియన్ మార్చ్ తరహాలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కులగణన మార్చ్ నిర్వహిస్తామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఆయన సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న కులగణన మార్చ్ పోస్టర్‌ను నాయకులు కుందారం గణేష్‌చారి, కుల్కచర్ల శ్రీను, తాటికొండ విక్రమ్‌గౌడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల సమగ్ర కులగణన చేపడతామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయాన్ని మరువద్దన్నారు. మార్చి 15న జీవో 26ను తీసుకువచ్చిన ప్రభుత్వం.. ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలని రేవంత్ కుట్ర: వేముల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహం సచివాలయం ఎదుట పెట్టడం శోచనీయమన్నారు. సచివాలయం, అమరవీరుల స్తూపం మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని కేసీఆర్ నిర్ణయించి 2023 జూన్ 28న డిజైన్స్ కూడా రూపొందించారని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని తాము గుడి కట్టి అందులో ప్రతిష్ఠిద్దామనుకున్నామని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు ప్లాజాను ఏర్పాటు చేయాలని కేసీఆర్ భావించారని చెప్పారు. దీనికోసం జూలై 2023లో కొన్ని డిజైన్స్ తెప్పించినట్లు తెలిపారు. తెలంగాణ ఆత్మను రేవంత్‌రెడ్డి కట్ చేసి రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారని మండిపడ్డారు.

మీ ఫామ్‌హౌసుల్లో జిల్లేళ్లు మొలవాల్సిందే

గడీల్లో గడ్డి మొలవాలని చెప్పిన చాకలి ఐలమ్మే మాకు స్ఫూర్తి

రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'గడీల్లో గడ్డి మొలవాలని చెప్పిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో చెపుతున్నా.. మీ ఫామ్‌హౌసుల్లో జిల్లేళ్లు మొలవాల్సిందే. అప్పటివరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుని వేలకోట్లు వెనుకేసుకున్న వాళ్లు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని తప్పు పడుతున్నారు. వెయ్యి ఎకరాల్లో ఫామ్ హౌస్, ప్రగతి భవన్ కట్టుకున్న మీకు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి పదేళ్లు సరిపోలేదా? మేం రాజీవ్ విగ్రహం పెడతామనగానే వీళ్లకు తెలంగాణ తల్లి విగ్రహం గుర్తొచ్చింది. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కొందరు సన్నాసులు మాట్లాడుతున్నారు. ఎవడ్రా తొలగించేది..ఎవడొస్తాడో చూస్తా..'అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సోమవారం సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.

కాలకేయ ముఠా మళ్లీ ఊళ్ల మీదకు వస్తోంది

'పదేళ్లు మీకు సోయి లేదు కాబట్టే మేం సచివాలయంలో తెలంగాణ విగ్రహం ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణ పరిపాలనకు గుండెకాయ అయిన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసి చూపిస్తాం. డిసెంబర్ 9 లోగా తెలంగాణ తల్లి విగ్రహం అక్కడ ఉంటుందని రాష్ట్ర ప్రజలకు మాట ఇస్తున్నా. కేసీఆర్‌కు అధికారం పోయిందన్న అక్కసు ఉంది. అందుకే కొంతమంది చిల్లరగాళ్లను మనపైకి ఉసిగొల్పుతున్నారు. కాలకేయ ముఠా మిడతల దండుగా మారి తెలంగాణను మింగేసేందుకు మళ్లీ ఊళ్ల మీదకు రాబోతోంది. తెలంగాణ ప్రజలారా అప్రమత్తం కండి. ఈ మిడతల దండును తెలంగాణ పొలిమేరలకు తరమాలి..'అని రేవంత్ అన్నారు.

నెహ్రూ కుటుంబానికి వీళ్లకు పోలికా?

'కొంత మంది సన్నాసులు వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడుతున్నారు. దుర్మార్గుల్లా పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుని, వేలకోట్లు కూడబెట్టుకుని, పదవులు పంచుకున్న వాళ్లా కుటుంబ పాలన గురించి మాట్లాడేది? దేశం కోసం సర్వం కోల్పోయిన కుటుంబం జవహర్‌లాల్ నెహ్రూది. 563 సంస్థానాలను దేశంలో విలీనం చేయించి దేశ సమగ్రతను కాపాడిన ఘనత ఆయనది. మత కల్లోలాలతో దేశంలో రక్తం ఏరులై పారుతుంటే దార్శనికతను ప్రదర్శించి శాంతిని నెలకొల్పింది నెహ్రూ. విద్య, సాగునీటి పారుదలకు శ్రీకారం చుట్టి దేశ భవిష్యత్తుకు పునాదులు వేశారు. భాక్రానంగల్ నుంచి నాగార్జున సాగర్, శ్రీశైలం వరకు ఎన్నో ప్రాజెక్టులు కట్టారు. నెహ్రూ బతికి ఉండగా ఇందిరా గాంధీ ఏ పదవీ తీసుకోలేదు. ఇందిరమ్మను పేదలు ఇప్పటికీ దేవతలా పూజిస్తున్నారు. బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణాలు రద్దు చేయడంతో పాటు పేదలకు భూపంపిణీ చేసి ఇళ్లు ఇచ్చింది ఇందిరమ్మ. లంబాడీలను ఎస్టీల్లో చేర్చింది ఇందిరమ్మ. దేశం కోసం ఆమె ప్రాణ త్యాగం చేసిన తర్వాత ప్రధానిగా రాజీవ్ గాంధీ బాధ్యతలు చేపట్టారు. యువతకు 18 ఏళ్లకు ఓటు హక్కు, గ్రామ పంచాయతీలకు నిధుల కోసం రాజ్యాంగ సవరణ, స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్, దేశంలో సాంకేతిక విప్లవం వంటివన్నీ రాజీవ్‌గాంధీ ఘనతలే. రాజీవ్ గాంధీ మరణించినా సోనియమ్మ ఏ పదవీ తీసుకోలేదు. 2004 నుంచి 2014 వరకు సోనియా, రాహుల్ ఏ పదవీ తీసుకోలేదు. ప్రాణ త్యాగం అంటే ఇందిర, రాజీవ్‌లది. పదవీ త్యాగం అంటే సోనియా, రాహుల్‌గాంధీలది..'అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్

వీళ్లా కుటుంబ పాలన గురించి మాట్లాడేది..?

'ఐదేళ్ల పాటు మహిళలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వని సన్నాసులకు మహిళల ఆత్మ గౌరవం గురించి ఎలా తెలుస్తుంది? అధికారంలోకి వచ్చిన వెంటనే కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు ఇచ్చి.. కూతురును, షడ్డకుడి కొడుకును ఎంపీలను చేసిన చరిత్ర కలిగిన నాయకులు కుటుంబపాలన గురించి మాట్లాడుతున్నారు. రాజీవ్‌గాంధీ దేశానికి కంప్యూటర్‌ను పరిచయం చేసి ఉండకపోతే గుంటూరులో చదివిన కేటీఆర్ అక్కడ ఇడ్లీ, వడ అమ్ముకునే వాడు. లేకపోతే సిద్దిపేటలో చాయ్ అమ్ముకునే వాడు. రాజీవ్‌గాంధీ కంప్యూటర్‌ను తేవడం వల్లే కేటీఆర్ ఈ స్థాయికి చేరారు..' అని సీఎం అన్నారు.

అధికారం కలలు కంటున్న కేటీఆర్: మంత్రి కోమటి

'మళ్లీ అధికారంలోకి వస్తే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తానంటూ కేటీఆర్ కలలు కంటున్నాడని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో 7 చోట్ల డిపాజిట్లు కోల్పోయి, మిగతా చోట్ల మూడో స్థానంలో నిలిచి సిగ్గు లేకుండా మళ్లీ అధికారంలోకి వస్తానని అంటున్నారని ఎద్దేవా చేశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవానికి నాంది పలికిన నాయకుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం చిరస్మరణీయమన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేసిన నేత రాజీవ్‌గాంధీ అని అన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ కె.కేశవరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిమజ్జనంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి

బందోబస్తు ఏర్పాట్లపై సీఎం సమీక్ష

మంగళవారం గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు, పర్యవేక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులను బందోబస్తుపై ఆరా తీశారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 733 సీసీ కెమెరాలతో నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రికి సీపీ వివరించారు. ట్యాంక్‌బండ్‌తో పాటు ప్రధాన మండపాలు, చెరువుల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తూ ప్రతి గంటకు ఒకసారి సిబ్బందికి కమాండ్ కంట్రోల్ నుంచి సూచనలు ఇచ్చి అలర్ట్ చేయాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వర్గీకరణకు కార్యాచరణ రూపొందించాలి

- సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా పక్కాగా అమలు
- వీలైనంత వేగంగా కార్యాచరణ పూర్తి చేయాలి
- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కమిటీ సమావేశంలో మంత్రుల నిర్ణయం


సమావేశంలో మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సోమవారం జలసౌధలో సమావేశమైంది. తొలి సమావేశం కావడంతో కోర్టు తీర్పు అమలుకు సంబంధించి కార్యాచరణపైనే కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలోని పరిస్థితులు, ఎస్సీ, ఎస్టీల్లోని ఉప కులాలు, ఇదివరకు అమలు చేసిన వర్గీకరణ నేపథ్యం, ప్రస్తుతం అమలు చేయాల్సిన అంశాలపైనా చర్చించారు. ఈ క్రమంలో ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యాచరణ తర్వాత చేపట్టాల్సిన అంశాలపై కమిటీ ఆధ్వర్యంలో ముందుకు సాగాలా? లేక ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలా? అనే అంశంపైనా చర్చించారు. కోర్టు తీర్పు అమలు ప్రక్రియ వేగవంతం చేసే క్రమంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రులు చెప్పారు. త్వరితగతిన కార్యాచరణ రూపొందిస్తే తదుపరి చర్యలపై మళ్లీ కమిటీ భేటీ అవుతుందని ఉత్తమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ కో చైర్మన్, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, ఎంపీ మల్లురవి, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లికి నేడు పాలాభిషేకాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటమేంటని తెలంగాణ సమాజమంతా ఆవేదన చెందుతోందని, రేవంత్‌రెడ్డి వెంటనే తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే కచ్చితంగా తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని హెచ్చరించారు.

ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహావిష్కరణా?

'తెలంగాణ తల్లి విగ్రహం కోసం స్థలాన్ని కేసీఆర్ 2023 జూలైలోనే ఎంపిక చేశారు. యావత్తు తెలంగాణ సమాజం కూడా తెలంగాణ తల్లిని గౌరవించుకునేందుకు కేసీఆర్ ఎంపిక చేసిన స్థలానికి ఆమోద ముద్ర వేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ చర్య ప్రతి తెలంగాణ వ్యక్తి మనసునూ గాయపర్చేలా ఉంది. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తాం. సకల మర్యాదలతో గాంధీ భవన్‌కు తరలిస్తాం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఢిల్లీ మెప్పు కోసమే!

'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని మేం ముందుగానే చెప్పాం. రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే పనిచేస్తున్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణ ఆత్మను తాకట్టు పెడుతున్నారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనోభావాల కన్నా కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఢిల్లీ బాసుల మెప్పు పొందటమే ముఖ్యమైపోయింది. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులాములేనని తేలిపోయింది. తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకున్న వాళ్లెవరూ రాజకీయంగా బతికి బట్టకట్టలేదు. తెలంగాణ ప్రజలు వారికి రాజకీయంగా సమాధి తవ్వటం ఖాయం..'అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, ప్రయోజనాల విషయంలో బీఆర్‌ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

విద్యావ్యవస్థ రోజురోజుకూ పతనమవుతోంది!

- రాష్ట్రంలో 20 వేల బడుల పరిస్థితి అగమ్యగోచరం
- సంక్షేమ హాస్టళ్లలో 715 మంది విద్యార్థులు ఆస్పత్రులపాలు
- సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంకు హరీశ్‌రావు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రాష్ట్రంలో విద్యావ్యవస్థ అధ్వానంగా మారిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని భావించి విద్యావ్యవస్థకు కేసీఆర్ పెద్దపీట వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారం కోరుతూ సీఎంకు హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనే యోచనతో కేసీఆర్ పెద్దసంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించారని గుర్తుచేశారు. కానీ 9 నెలల కాంగ్రెస్ పాలనలో పురుగులు లేని భోజనం కోసం, పాము కాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు.

అధ్వానంగా గురుకులాలు

ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి కూడా లేని బడులు 1864 ఉంటే, 30లోపు విద్యార్థులున్నవి 9,447, వందలోపు విద్యార్థులున్నవి 9,609 ఉన్నాయని హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 26,287 ప్రభుత్వ పాఠశాలలకుగాను 20 వేల స్కూళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ ఏడాది 1,900 పాఠశాలలు మూతపడ్డాయన్నారు. గురుకులాల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైందని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో పటిష్టపరిచిన గురుకులాలను మీ ప్రభుత్వం 9 నెలల్లోనే ధ్వంసం చేసిందని, సంక్షేమ హాస్టళ్లను సంక్షోభ హాస్టళ్లుగా మార్చిందని విమర్శించారు. పరిశుభ్రత లోపించి మురుగు, చెత్తా చెదారంతో కంపు కొడుతున్నాయని, పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఏ హాస్టల్ చూసినా దుర్భరంగానే ఉందని మండిపడ్డారు. కుక్క కాటు, పాముకాటు, ఎలుక కాట్లతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని, రోజూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు 715 మందికిపైగా విద్యార్థులు ఆస్పత్రులపాలు కాగా, 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

నా కాళ్లు మొక్కితే రేవంత్‌కు పీసీసీ పదవి ఇప్పించా: కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'రేవంత్ రెడ్డి నా ఇంటికి వచ్చి కాళ్లు మొక్కి పీసీసీ ప్రెసిడెంట్‌ని చేయమని అడగలేదా...? ఆయనను పీసీసీ అధ్యక్షుడిని చేసింది నేనే. రేవంత్‌ను గద్దెదించే వరకు పోరాటం చేస్తా'అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, సంజయ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తనపై ఎప్పుడు దాడి జరిగినా అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే బాధ్యతని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది కేసీఆర్ స్థాయి కాదని తెలంగాణ రేవంత్ జాగీరు కాదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ప్రజలు రేవంత్‌రెడ్డి వీపుని చింతపండు చేయలేదా అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాక తప్పదని చెప్పారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తానే పంపించానని నిన్న సీఎం స్వయంగా చెప్పడం సిగ్గుచేటన్నారు. దాడి చేయించినట్లు ముఖ్యమంత్రే స్వయంగా చెప్పినా డీజీపీ, హోం సెక్రెటరీ ఎందుకు స్పందించలేదని, రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై గవర్నర్‌ను కలిసే అంశాన్ని పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కౌశిక్‌రెడ్డి బచ్చా..: ఎమ్మెల్యే సత్యం

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇప్పించేంత సత్తా.. పాడి కౌశిక్‌రెడ్డికి లేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. కౌశిక్‌రెడ్డి బచ్చా అని, కండకావరంతో ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఆయన మానసిక స్థితిపై తమకు అనుమానాలున్నాయన్నారు. సత్యం సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయనకు తక్షణమే వైద్య పరీక్షలు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రిపై నోరు జారితే కౌశిక్‌రెడ్డికి బడితెపూజ ఖాయమని హెచ్చరించారు.

21న ఏచూరి సంస్మరణ సభ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కన్నుమూసిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను ఈనెల 21న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎం.కోదండరాంతోపాటు ఇతర వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారు.



సరిపోయినంత చీకటి పడినప్పుడే నువ్వు తారలను చూడగలవు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
మంగళవారం, 17 సెప్టెంబర్ 2024

రాజీనామా వ్యూహం

రాజకీయాల్లో వ్యూహ ప్రతివ్యూహాలు కీలకం. అందులోనూ ప్రత్యర్థి ఊహించని రీతిలో ఎత్తుగడలు వేయడం మరీ అవసరం. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రథసారథి అరవింద్ కేజ్రీవాల్ ఆ సంగతి ఒంట బట్టించుకున్నారు. ఇమేజ్ పడిపోతోందనుకున్న ప్రతిసారీ ఏదో ఒక ప్రకటన, వినూత్న నిర్ణయంతో మళ్ళీ పుంజుకొనే ఆయన ఈసారీ అదే పద్ధతిని అనుసరించారు. మద్యం పాలసీ కేసు వ్యవహారంలో ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి విడుదలైన రెండు రోజులకే ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ తీసుకున్న అనూహ్య నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. సీఎం పదవి నుంచి వైదొలగాల్సిందిగా బీజేపీ కొన్ని నెలలుగా డిమాండ్ చేస్తున్నా కిమ్మనాస్తిగా ఉన్న కేజ్రీవాల్ ఇప్పుడే ఎందుకీ నిర్ణయం తీసుకున్నారన్నది ఆసక్తి రేపుతోంది. సీనియర్ మంత్రులు ఆతిషి, సౌరభ్ భరద్వాజ్ మొదలు కేజ్రీవాల్ సతీమణి సునీత దాకా స్వల్పకాలిక కొత్త సీఎం ఎవరవుతారనే చర్చ జరుగుతోంది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సోమవారం సమావేశమై చర్చించగా, మంగళవారం ఉదయం కొత్తనేత ఎంపికకై శాసనసభా పక్ష సమావేశం, సాయంత్రం రాజీనామా లేఖ ఇచ్చేందుకు లెఫ్టినెంట్ గవర్నర్‌తో కేజ్రీవాల్ భేటీ జరగనుండేసరికి ఢిల్లీ రాజకీయం వేడెక్కింది.

అసెంబ్లీని అసలు రద్దు చేయాలనే ఆలోచన కూడా ఉన్నా, కొన్నేళ్ళ క్రితం ఆప్ అసెంబ్లీని రద్దు చేసి, తక్షణ ఎన్నికలకు సిఫార్సు చేసినప్పుడు చెవికెక్కించుకోకుండా కేంద్రం తరువాతెప్పుడో తాపీగా ఎన్నికలు పెట్టింది. ఈసారి కూడా ఆ ప్రమాదం ఉన్నందున కేజ్రీవాల్ చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ప్రజాక్షేత్రంలో తీర్పుతో నిజాయతీ నిరూపించుకొని మళ్ళీ సీఎం కుర్చీలో కూర్చొంటానంటూ కేజ్రీవాల్ ఆదివారం చేసిన భీషణ ప్రతిజ్ఞ వెనుక బయటకు చెప్పని కారణాలు అనేకం. సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సహా ఆప్ నేతలు పలువురు ఇప్పటికే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయారు. అందుకే... 2011లో అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి ప్రభవించిన పార్టీ తమపై వచ్చిన ఆరోపణల్ని తిప్పికొట్టేందుకు ఎన్నికల మార్గం ఎంచుకుంటోంది. అగ్నిపరీక్షకు సిద్ధం అనడం తెలివైన ఎత్తుగడే. రాజీనామా నిర్ణయం రాజకీయ సిక్సర్ అని కొందరు విశ్లేషకులు అంటున్నది అందుకే. అవినీతి మచ్చను తుడుచుకోవడం దగ్గర నుంచి పెరుగుతున్న అధికారపక్ష వ్యతిరేకతను తగ్గించుకోవడం వరకు అనేక విధాలుగా ఈ నిర్ణయం కేజ్రీవాల్‌కు ఉపకరించవచ్చు. ప్రతిపక్ష శిబిరం వల్ల పెరిగిన బీజేపీ వ్యతిరేకత నుంచి లబ్ధి పొందనూవచ్చు.

నిర్ణీత కాలవ్యవధి ప్రకారం చూసినా వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది గనక అయిదు నెలల ముందు రాజీనామా వల్ల కేజ్రీవాల్ వస్తే లాభమే తప్ప, పోయేదేమీ లేదు. తాజాగా బెయిలిస్తూ, సీఎం ఆఫీసుకు వెళ్ళరాదు, అధికారిక ఫైళ్ళపై సంతకాలు చేయరాదు, కేసుపై బహిరంగ ప్రకటనలు చేయరాదంటూ సుప్రీమ్ కోర్ట్ పెట్టిన కఠిన నిబంధనల రీత్యా కేజ్రీవాల్ ఎలాగూ సీఎంగా వ్యవహరించలేరు. కాబట్టి, పదవికి రాజీనామా చేస్తూ, మహారాష్ట్రతో పాటు నవంబర్‌లోనే ముందస్తు ఎన్నికలు జరపాలంటూ ఆయన పోరుబాట పట్టారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ 'ప్రతీకార రాజకీయాలు' చేస్తోందని ఆరోపిస్తూ, బాధితుడిగా తనను తాను చూపించుకోవడానికి కూడా ఆయనకు ఇదే సరైన సమయం. ఎలాగూ ఎన్నికలు జరిగేంత వరకు ఈ కొద్ది కాలం వేరెవరో సీఎంగా ఉన్నా, చక్రం తిప్పేది కేజ్రీవాలే! కనుక బాధ లేదు. అదీ కాక, మధ్యలో కేంద్ర పాలన ఉన్న ఒక్క ఏడాది మినహా 2013 డిసెంబర్ నుంచి ఢిల్లీని ఏలుతున్నందున ఓటర్లలో వ్యతిరేకత పేరుకుంది. దాని నుంచి తప్పించుకోవడానికీ, క్షేత్రస్థాయిలో జనంతో మమేకమై ముచ్చటగా మూడోసారి పార్టీ విజయావకాశాల్ని మెరుగుపరచడానికీ ఈ రాజీనామా డ్రామా అక్కరకొస్తుంది.

అయితే, ఇందులో కొన్ని రిస్కులూ లేకపోలేదు. గడచిన 20 నెలల పైచిలుకు కాలంలో ప్రధాన ఆప్ నేతలు పలువురు ఏదో ఒక అంశంలో జైలుకెళ్ళారు. మద్యం కుంభకోణం వ్యవహారం, కేంద్రం వర్సెస్ ఢిల్లీ సర్కార్‌ల గొడవ మధ్య పాలన పడకేసింది. ఢిల్లీలో ప్రాథమిక పౌర వసతులు కుప్పకూలాయి. ఆ మధ్య అన్యాయంగా ముంచెత్తిన వాన నీళ్ళలో చిక్కుకొని ఐఏఎస్ శిక్షణార్థులు ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అందుకు ఓ మచ్చుతునక. బడి చదువులు, ఆరోగ్య వసతులు సమూలంగా మార్చేస్తామంటూ ఆప్ అధికారంలోకి వచ్చినా, ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌లో పరిస్థితి తద్విరుద్ధంగా ఉంది. వీటన్నిటి నుంచి జనం దృష్టి మరల్చడం అంత సులభమేమీ కాదు. అసెంబ్లీ రద్దు చేయకుండా నవంబర్‌లో ఎన్నికలనేవి మాటల్లోనే తప్ప చేతల్లో సాధ్యం కాదు. రద్దు చేసి అడిగినా, నవంబర్‌లోనే ఎన్నికలు పెట్టడం తప్పనిసరి కాదు. ఒకవేళ నవంబర్‌లోనే ఎన్నికలొస్తే ఆప్‌కు సమయం సరిపోతుందా అన్నదీ ప్రశ్నార్థకమే. ఎన్నికలు జాప్యమైతే అనేక ఇతర రాష్ట్రాల్లోని పార్టీలలో లాగే కొత్త సీఎంతో ఆప్‌లో అసమ్మతి పెరిగే ప్రమాదమూ లేకపోలేదు.

ఆప్ ఇప్పుడు కీలకమైన కూడలిలో ఉంది. ఢిల్లీ, ఆ తర్వాత పంజాబ్‌లలో సత్తా చాటినా, ఇతర రాష్ట్రాలకు విస్తరించడంలో విఫలమైంది. ఇప్పుడు ఢిల్లీలోనే అగ్నిపరీక్షను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికే విలాసవంతమైన సీఎం అధికారిక నివాసం, అమలు కాని పథకాలతో జనంలో పలచనైన కేజ్రీవాల్ ప్రతిష్ఠను కూడగట్టుకోవడం కష్టమే. పైగా కేంద్ర, రాష్ట్ర సర్కార్ల మధ్య పెనుగులాటలో ప్రజలు బాధితులవుతున్నారు. కుంటుబడ్డ పాలనతో కష్టాలు చవిచూస్తున్నారు. కేజ్రీవాల్ అవినీతి పరుడా, కాదా అన్నది తేల్చాల్సింది కోర్టు కాగా ప్రజాకోర్టులో నిజాయతీ సర్టిఫికెట్ తెచ్చుకుంటానని ఆయన చెప్పడం నాటకీయంగా బాగుంటుందే కానీ, నికరంగా ప్రజలకు ఒరిగేది శూన్యం. మరి ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకుంటారని పేరున్న కేజ్రీవాల్ వ్యూహం ఏ మేరకు ఫలిస్తుందో?

చరిత్రాత్మకమైన మహత్తర పోరాటం

సందర్భం



సురవరం సుధాకర్ రెడ్డి

తెలంగాణ సాయుధ పోరాటం మత పోరాటం కాదు. వర్గ పోరాట స్వభావం కలిగిన పోరాటం. ప్రజాస్వామ్యం కోసం, పౌరహక్కుల కోసం, హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడం కోసం జరిగిన పోరాటం.

మొగల్ సామ్రాజ్యంలో భాగమైన దక్షిణ భారతదేశానికి ఔరంగజేబు మరణానంతరం ఢిల్లీ రాజప్రతినిధిగా వచ్చిన సైనికాధిపతే నిజామ్. ఢిల్లీలో మొగల్ సామ్రాజ్య ప్రాభవం తగ్గగానే స్వతంత్రం ప్రకటించుకున్నారు. మైసూరు రాజు టిప్పు సుల్తాన్‌కు, మహారాష్ట్రులకు వ్యతిరేకంగా బ్రిటిషర్లకు నిజాం మద్దతు ఇచ్చినందుకు, నిజాం నవాబును కాపాడేందుకు బ్రిటిష్ సైన్యాన్ని ఇక్కడ ఉంచారు. వారి ఖర్చుల నిమిత్తం, సర్కారు జిల్లాలను, ఆ తర్వాత రాయలసీమను వారికి అప్పగించారు.

ఐనా మిగిలిన హైదరాబాదు సంస్థానం దేశంలోని 550 సంస్థానాలలో పెద్దది. దీని వైశాల్యం 82,696 చదరపు మైళ్ళు. ఇది గ్రేట్ బ్రిటన్ వైశాల్యానికి సమానం. ఇందులో ఎనిమిది తెలుగు జిల్లాలు, ఐదు మరాఠీ జిల్లాలు, మూడు కర్ణాటక జిల్లాలు ఉండేవి. కోటీ ఎనభై లక్షల జనాభాలో సగంమంది మాతృభాష తెలుగు, 25 శాతం మంది మరాఠీ, 12 శాతం మంది ఉర్దూ, 11 శాతం మంది కన్నడ, ఇతర భాషలు మాట్లాడేవారు. కాని ఉర్దూలో తప్ప పాఠశాలలు లేవు. ప్రైవేటుగా మాతృభాషలో పాఠశాలలు పెట్టుకోవడానికి వీల్లేదు.

తెలంగాణ ప్రాంతంలో భూ కేంద్రీకరణ విపరీతంగా వుండేది. మొత్తం సాగులో వున్న భూమి దాదాపు 70% భూస్వాముల చేతుల్లో వుండేది. ఐదు వేల ఎకరాలపైన వున్న భూస్వాములు 550 మంది. చిన్న పెద్ద భూస్వాములలో 1982 మంది ముస్లింలు, 618 మంది హిందూ భూస్వాములు. నిజాం సొంత ఖర్చుల కోసం 636 గ్రామాల్లో ఐదు లక్షల ముప్పై వేల ఎకరాల భూమి వుండేది. 7వ నిజాం ఆస్తి ఆనాడు 400 కోట్ల రూపాయలు. అప్పుడు ప్రపంచంలో కెల్లా ధనవంతుడని పేరుండేది. రాష్ట్రంలో ప్రజలు దుర్భర జీవితం గడిపేవారు. అన్ని కులాలవారు, జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, ప్రభుత్వ అధికారుల దగ్గర వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది.

తెలుగు ప్రజల సంఘంగా ఆంధ్ర జనసభ ప్రారంభమైంది. అది ఆంధ్ర మహాసభగా రూపొందింది. జోగిపేట ప్రథమ ఆంధ్ర మహాసభ సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగింది. 1946 నాటికి ఆంధ్ర మహాసభ ప్రధాన రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది. ఈ దశలో ఆంధ్ర మహాసభలో మితవాదులు, అతివాదులు, జాతీయ వాదుల మధ్య ఘర్షణలో వామపక్షవాదులు మెజారిటీ అయ్యారు. రావి నారాయణ రెడ్డి అధ్యక్షుడైన తర్వాత పేద ప్రజల సమస్యలు, తెలుగులో బోధన, వెట్టిచాకిరీ రద్దు తదితర అంశాలపైన కార్యాచరణ తీసుకున్నారు.

దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం హైదరాబాద్ సంస్థాన ప్రజల మీద ప్రభావం చూపింది. మజ్లిస్ పార్టీకి ఖాశిం రజ్వీ అధ్యక్షుడై, హైదరాబాదును స్వతంత్ర ముస్లిం రాజ్యం చేస్తానని ప్రకటించి రజాకార్ల (వలంటీర్) నిర్మాణానికి పూనుకుని వేలాదిమంది ముస్లిములను చేర్పించి దాడులు ప్రారంభించాడు. నిజాం మద్దతిచ్చాడు. తెలంగాణను ముస్లిం మెజారిటీ సంస్థానంగా చేసేందుకు ఇతర రాష్ట్రాల నుండి 8 లక్షల మంది ముస్లింలను అంతకు ముందు తీసుకువచ్చారని ఒక ఆరోపణ వుంది.

ఈ దశలో కేంద్ర ప్రభుత్వానికి నిజాంకు మధ్య అనేక చర్చల తర్వాత యథాతథ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం నిజాం రాజుగా కొనసాగుతాడు. విదేశాంగ, రక్షణ కేంద్రం బాధ్యతల్లో వుంటుంది. ఇది రాష్ట్ర ప్రజలకు కేంద్రం చేసిన ద్రోహం. ఈలోగా విసునూరి రామచంద్రారెడ్డి ప్రజల మీద దాడులు ఉధృతం చేశాడు. ఆయన తల్లి జానకమ్మ నరరూప రాక్షసి. కడివెండిలో ప్రజలు బలవంతపు ధాన్యం లెవీకి వ్యతిరేకంగా ఊరేగింపు తీస్తే, గడీలోంచి కాల్పులు జరిపి, దొడ్డి కొమరయ్యను బలి తీసుకున్నారు. ఇక, అనేక ఇతర



గ్రామాలలో రజాకార్లు గ్రామాలను తగలబెట్టి, స్త్రీలను మానభంగాలు చేశారు. బైరాన్‌పల్లి, పరకాల తదితర గ్రామాలలో డజన్ల సంఖ్యలో ప్రజలు హతులయ్యారు.

ఈ నేపథ్యంలో 1947 సెప్టెంబరు 11వ తేదీన నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని కూలద్రోసి సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకుగాను, సాయుధ పోరాటం చేయవలసిందిగా రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి పేరుతో ప్రకటన విడుదల చేశారు. సాయుధ పోరాటం దావానలంలాగా వ్యాపించింది. ఈ పోరాటం ముఖ్యంగా నల్లగొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో విస్తృతంగా, ఇతర జిల్లాల్లో కొంత పరిమితంగా జరిగింది. 3,000 గ్రామాలను కమ్యూనిస్టు పార్టీ ప్రభావితం చేసింది. దాదాపు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచింది. హింసను అరికట్టే పేరుతో యూనియన్ సైన్యాలు హైదరాబాదు సంస్థానాన్ని ముట్టడించాయి. 3 రోజుల్లో నిజాం సైన్యం లొంగి పోయింది.

మిలిటరీ గవర్నరుగా నియమించబడ్డ జనరల్ చౌదరి కొందరు రజాకార్లను, ఖాశిం రజ్వీని అరెస్టు చేసి, కమ్యూనిస్టుల మీద యుద్ధం ప్రకటించాడు. సరోజినీ నాయుడు కుమారుడు డాక్టర్ జయసూర్య, మరికొందరు మిలిటరీ గవర్నరును కలిసి నెల రోజుల గడువిస్తే, కమ్యూనిస్టులతో చర్చించి, సాయుధ పోరాటాన్ని ఉపసంహరింపజేస్తామని చెప్పారు. దానికి జనరల్ చౌదరి నిరాకరించి నెల రోజులెందుకు, వారం రోజుల్లో తెలంగాణలో కమ్యూనిస్టులను ఏరివేస్తానని జవాబిచ్చాడు. అనివార్యంగా సాయుధ పోరాటం కొనసాగింది. హైదరాబాదు సంస్థానం, భారత యూనియన్‌లో విలీనమైనందున, నిజాం దుష్ట ప్రభుత్వం కూలిపోయినందున మధ్యతరగతి ప్రజలు, కొందరు మేధావులు సాయుధ పోరాటం ఆవశ్యకత లేదని భావించారు. 1951 చివరిలో పార్టీ కేంద్ర కమిటీ సమావేశమై సాయుధ పోరాటాన్ని ఉపసంహరించాలని నిర్ణయించింది.

1952 నాటికి సీపీఐ మీద నిషేధం తొలగనందున పీపుల్స్ డెమాక్రటిక్ ఫ్రంట్ పేరుతో కమ్యూనిస్టులు + ప్రజాతంత్ర వాదులు కలిసి పోటీ చేశారు. మెజారిటీ స్థానాల్లో పి.డి.ఎఫ్. గెలిచింది. రావి నారాయణరెడ్డి నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి నెహ్రూ కంటే ఎక్కువ ఓట్ల మెజారిటీతో గెలిచారు. నిజాం సంస్థానంలోని కర్ణాటక, మహారాష్ట్ర జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ బలహీనంగా ఉండటంతో కాంగ్రెసుకు వచ్చిన మెజారిటీతో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటైంది. మరొకవైపు రజాకార్లు స్వల్పశిక్షలతో బయటపడితే, కమ్యూనిస్టులపై సుదీర్ఘ శిక్షలు పడ్డాయి. 12 మందికి మరణశిక్షలు విధింప బడ్డాయి. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు, ఆందోళన జరిగింది. వాటిని ముందు యావజ్జీవ కారాగార శిక్షలుగా మార్చి, కొన్నేళ్ళకు రద్దు చేశారు. రాజబహదూర్ గౌర్ రాజ్యసభకు ఎన్నికైనా విడుదల చేయలేదు. చివరకు ఉపరాష్ట్రపతి సర్వేపల్లి జోక్యంతో విడుదలయ్యారు.

భూస్వాములు, వారి తాబేదార్లు, ముందు కాంగ్రెసులో, తర్వాత తెలంగాణ ప్రజాసమితి, తెలంగాణ రాష్ట్ర సమితులలో చేరారు. ఇప్పుడు బీజేపీలో భాగమౌతున్నారు. బీజేపీ వారు చరిత్రను వక్రీకరించి 'ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువుల పోరాటం'గా చిత్రీకరిస్తున్నారు. ముస్లిం కార్మికులు సాయుధ పోరాటానికి మద్దతిచ్చారు. భారత యూనియన్‌లో హైదరాబాదు సంస్థానం విలీనంలో మితవాదుల పాత్ర నామమాత్రం. స్వామి రామానంద తీర్థ నాయకత్వాన కాంగ్రెసు జాతీయవాదులు గట్టిగా పోరాటం చేశారు. కాని సాయుధ పోరాటానిదే ప్రధాన పాత్ర. భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ వల్ల మిలిటరీ హైదరాబాదును విలీనం చేసిందనేది దుష్ప్రచారం మాత్రమే. సాయుధ పోరాటం తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంటుందనే భయంతోనే మిలిటరీని పంపారు. వేలాదిమందిని హత్యలు చేయించిన నిజాంను అరెస్టు చెయ్యకపోగా, రాజప్రముఖ్‌ను చేసి కోటి రూపాయల రాజభరణం ఇచ్చారు. ఇది 'విముక్తా', 'రాజీ'నా ప్రజలు అర్థం చేసుకున్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం మత పోరాటం కాదు. వర్గ పోరాట స్వభావం కలిగిన పోరాటం. ప్రజాస్వామ్యం కోసం, పౌర హక్కుల కోసం, సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనం కోసం జరిగిన పోరాటం. ప్రస్తుత నక్సలైట్ పోరాటం తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగింపు అనే వాదన తప్పు. పోరాటం చైతన్యవంతులైన ప్రజలు నడుపుతారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభించిన నాటికి ఆంధ్ర మహాసభకు ఏడు లక్షల సభ్యత్వం వుంది. 90 లక్షల తెలుగు భాష మాట్లాడే ప్రజల్లో 7 లక్షల సభ్యత్వం అంటే దాదాపు ప్రతి 12 మంది జనాభాలో ఒకరు ఆంధ్రమహాసభ సభ్యులు. ఈరోజు అలాంటి పరిస్థితి లేదు.

ఏమైనా తెలంగాణ సాయుధ పోరాటం, చరిత్రాత్మకమైన మహత్తర పోరాటం. మన దేశం కోసం, మన కోసం, మన స్వేచ్ఛ కోసం ప్రాణాలర్పించిన, పోరాడిన ఆ యోధులను స్మరించుకుందాం.

వ్యాసకర్త సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కూలిన శిఖరం



పాలస్తీనా కోసం కట్టుబడి, దాని జనాలకు గొంతుకనిచ్చిన లెబనీస్ అరబ్ జాతీయవాది, రచయిత, మేధా శిఖరం ఇలియాస్ ఖౌరీ (1948–2024) వెళ్లిపోయారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక. ఈ నష్టానికి దుఃఖిస్తూనే, ఆయన వారసత్వాన్ని ఉత్సవం చేసుకుందాం.

– హనన్ అష్రవీ, పాలస్తీనా మాజీ మంత్రి

రక్షణ పెరగాలి!



మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నామినీ (డోనాల్డ్ ట్రంప్) మీద అరవై రోజుల్లో రెండు హత్యా ప్రయత్నాలు జరగడం అంగీకరించలేనిది. సీక్రెట్ సర్వీస్ రేపు (నేడు) కాంగ్రెస్‌కు వచ్చి, రక్షణ చర్యల పరిధిని విస్తరించడానికి వనరులు ఏం కావాలో మాకు చెప్పాలి. ఉభయ పక్షాల ఓటుతో అదే రోజు కేటాయించాలి.

– రో ఖన్నా, అమెరికా రిపబ్లికన్ నాయకుడు

ఎందుకు విచారణ?



పీఎంఎల్‌ఏ (మనీ లాండరింగ్ నిరోధక చట్టం) కేసులో బెయిల్ రావాలంటే, నిందితుడు తనను తాను అమాయకుడని నిరూపించుకోవాలి. ఒకవేళ బెయిల్ వస్తే అతడు అమాయకుడన్నట్టే! అంటే బెయిల్ రావడం అనేది నిర్దోషిగా నిరూపిస్తుంది. విచారణ అనేది అనవసరం.

– హసిత్ సేథ్, న్యాయవాది

మేధా పరిమితి



ఉపనిషత్తులు ముఖ్యంగా జ్ఞానమార్గంలో పయనిస్తాయి. ఏ అహంకారం లేకుండా, అణకువతో ఉపనిషత్తులను దర్శించేవాడు త్వరలోనే మేధకు తనదైన పరిమితులు ఉన్నాయనీ, అంతకు మించి పోలేదనీ గ్రహిస్తాడు. అది బ్లూ ప్రింట్‌ను ఇవ్వగలదు గానీ అంతకు మించి పోలేదు. అందుకే హృదయం అనేది అత్యవశ్యం.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

వైద్యుల పరిస్థితి



ఒక రోగి బంధువు మమ్మల్ని "ఇక్కడ కూడా ఆర్‌జి కర్ (హాస్పిటల్ ఘటన) అయిపోగలదు" అని బెదిరించాడు. దేశంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో చూడండి!

– దీప్ శిఖా ఘోష్, వైద్యురాలు

సర్కారు రుణమాఫీ ఉత్తి కథ... ఉన్నది ఊరికో వ్యథ!

అభిప్రాయం



టి. హరీశ్ రావు

తెలంగాణలో రైతు రుణమాఫీ విజయవంతమైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకొంటున్నరు. కానీ, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను చూస్తే పూర్తి భిన్నంగా ఉంది. లక్షలాది మంది రైతులు ఇంకా... వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నరు! అయినా వాళ్లకు రుణమాఫీ ఎందుకు కాలేదో కనీసం సమాధానం కూడా ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది. రుణమాఫీ పూర్తయిందని సర్కారు చెప్పేది ఉత్తుత్తి కథే! కానీ, ఊరూరికీ ఒక వ్యథ ఇంకా మిగిలే ఉంది.

పూటకో మాటతో రుణమాఫీ తేదీలను సాగదీశారు గానీ, ఇచ్చిన మాట మాత్రం నిలబెట్టుకోలేదు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తాం" అని 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి చెప్పించిండు. ఎన్నికలకు కొన్ని రోజుల ముందు "కేసీఆర్ రుణమాఫీ అయినోళ్లు గూడా... ఎంబడే పోయి రెండు లక్షల రూపాయిలు తెచ్చుకోన్రి, నేను రాంగనే డిసెంబర్ 9 నాడు రుణమాఫీ చేస్తా" అని ఆయనే స్వయంగా ప్రకటించిండు.

డిసెంబర్ తొమ్మిది పోయింది. ఏదయ్యా మాఫీ అంటే... "పార్లమెంట్ ఎన్నికల కోడున్నది. దేవుళ్ల మీద ఒట్టు... ఆగస్టు 15 లోపు రైతులందరికీ రుణమాఫీ చేస్తా" అన్నడు. మరోసారి ఈ ఏడాది ఏప్రిల్ 15న "నారాయణపేట గడ్డ మీద నుండి మాటిస్తున్నా... ఏకకాలంలో ఏకమొత్తంలో రుణమాఫీ చేస్తాం" అన్నడు. జూన్ 21న జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో "31 వేల కోట్ల రూపాయిలు వెచ్చించి, ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తాం" అని చెప్పిండు. జూలై 16న రుణమాఫీపై ప్రభుత్వ మార్గదర్శకాల సమావేశంలో "రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు రుణాలు ఉన్నాయి. వీరిలో 6.36 లక్షల మందికి రేషన్ కార్డులు లేవు. వాళ్లకు కూడా మాఫీ చేస్తాం" అన్నడు.

ఒక్కొక్క సందర్భంలో ఒక్కో మాట మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఏకంగా 'అందరికీ రుణమాఫీ చేసినం. మాట నిలబెట్టుకున్నం' అని చెప్పుకుంటున్నరు. వరంగల్ డిక్లరేషన్‌లో 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడానికి రూ. 73 వేల కోట్లు నిధులు కేటాయిస్తమన్నరు. 2023–24కు సంబంధించి మార్చి 31 వరకు ఎస్‌ఎల్‌బీసీ పంట రుణాల కింద పెట్టుకున్న లక్ష్యం రూ. 73 వేల కోట్లు. ఇందులో డిసెంబర్ ఆఖరు నాటికి రూ. 49.5 వేల కోట్లు మంజూరు కాగా, మార్చి వరకు అది సుమారు రూ. 65 వేల కోట్లకు చేరింది. కానీ, కాంగ్రెస్ రుణమాఫీ కోసం కేబినేట్ తీర్మానంలో పెట్టింది రూ. 31 వేల కోట్లే! బడ్జెట్‌కు వచ్చేసరికి దాన్ని రూ. 26 వేల కోట్లకు కుదించింది. తీరా ఇప్పుడు రూ. 17,934 కోట్లతోనే మొత్తం రుణమాఫీ అయిపోయిందంటున్నరు!! ఎన్నికల నుంచి పంద్రాగస్టు దాక



ఇలా రుణాల లెక్కలు ఎప్పటికప్పుడు మారుతూ తగ్గిపోతూనే ఉన్నాయి.

"రాష్ట్రంలో 41.78 లక్షల మంది రైతులు రుణాలు తీసుకున్నరని బ్యాంకుల నుంచి లిస్టు వచ్చింది. వీరికి రుణమాఫీ చేయడానికి రూ. 31 వేల కోట్లు అవసరమని గుర్తించినం. ఇప్పటి వరకు 22 లక్షల మంది ఖాతాల్లో డబ్బు జమ చేసినం" అని ఆగస్టు 21న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిండు. మేం అధికారంలో ఉన్నప్పుడు మొదటి దఫాలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తేనే, 35 లక్షల మంది రైతులకు రూ. 17 వేల కోట్లు ఖర్చయినయి. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా అందరికీ రుణమాఫీ చేస్తే, రాష్ట్రంలో 22 లక్షల మంది రైతులే రుణాలు తీసుకొని ఉన్నరా? గతం కంటే రైతుల సంఖ్య పెరగాలే గానీ, 14 లక్షలు తగ్గడమేంది? అసలు ఇదేం లెక్క? మరో 19 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాల్సి ఉంది. దానికి కనీసం మరో 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి ఉంది. కానీ, అంతా అయిపోయిందంటూ చేతులు దులిపేసుకోవాలని చూడటం రైతాంగం పాలిట సర్కారు చేస్తున్న అన్యాయం!

మా సిద్దిపేటలో రుణమాఫీ కాని రైతులు 40 శాతం పైనే ఉన్నరని నేను చేయించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలింది. ఉదాహరణకు సిద్దిపేట– వెంకటపూర్ గ్రామంలో ఇప్పటి వరకు 122 మందికి రుణమాఫీ కాగా, ఇంకా 82 మందికి కాలేదు. సుమారు రూ. 1.13 కోట్ల మాఫీ జరిగింది. ఇంకా రూ.1.5 కోట్ల మాఫీ కావాల్సి ఉంది. ఇలా ఏ గ్రామంలో చూసినా... ఇదే పరిస్థితి రిపీట్ అవుతోంది. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో కూడా దాదాపు 40 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని అధికారిక లెక్కలు చెప్తున్నయ్. ఉదాహరణకు కొడంగల్ మండలం, రుద్రారం గ్రామంలో యూనియన్ బ్యాంకులో రుణం తీసుకున్న రైతుల సంఖ్య 3,500 ఉంటే, మూడు విడతల్లో కలిపి 1709 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. అంటే 1791 మందికి ఇంకా రుణమాఫీ కాలేదు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో చర్చకు రావాలని మేం చేసిన డిమాండ్‌కు ముఖ్యమంత్రి స్పందించకపోవడంలోనే మాఫీలో ఉన్న డొల్లతనం అర్థమవుతోంది.

సిద్దిపేట జిల్లాలో సురేందర్ రెడ్డి అనే రైతు బ్యాంకులో రూ. 1.9 లక్షల పంట రుణం తీసుకున్నడు. తన రేషన్ కార్డులో తల్లి పేరు ఉన్నందున రుణం రూ. 2.7 లక్షలు దాటిందని ఆయనకు రుణమాఫీ చేయలేదు. దీంతో మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం ఎదుటే ఆత్మహత్య చేసుకున్నడు. రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన షరతులు, రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. వరంగల్ డిక్లరేషన్‌లో కానీ, కాంగ్రెస్ గ్యారెంటీల మేనిఫెస్టోలో కానీ రుణమాఫీకి షరతులు విధిస్తామని ఎక్కడా చెప్పలేదు. కానీ, అధికారంలోకి వచ్చాక ఆర్థికభారం తగ్గించుకోవడానికి రకరకాల ఆంక్షలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నరు. 2018కి ముందే రుణాలు తీసుకున్న అనేకమంది రైతులు, వివిధ ఆర్థిక పరిస్థితుల వల్ల రెన్యువల్ చేసుకోనందున ఆ యా రైతులకు ప్రభుత్వం విధించిన కటాఫ్ షరతుల వల్ల మాఫీ జరగలేదు. ఆధార్ కార్డు మ్యాచ్ కాలేదని, రేషన్ కార్డు, పీఎమ్ కిసాన్ నిబంధనలతో అర్హులను తగ్గించి రైతులను మోసం చేసిన్రు.

రెండు లక్షల పైబడిన రుణాల విషయంలో ప్రభుత్వం వింత వాదనలు రైతులను మరింత అయోమయానికి గురి చేస్తున్నయి. రెండు లక్షలపైనున్న రుణాన్ని చెల్లించిన మరుక్షణమే రెండు లక్షల రూపాయలు ఖాతాల్లో పడతాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుంటే, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం రెండు లక్షలపై నున్న రుణాన్ని కట్టవద్దని ప్రజలకు పిలుపునిస్తున్నడు. పూర్తి 2 లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదన్న విషయం తేలిపోయింది. అయినా ప్రకటనలు, ప్రసంగాలతో రైతులను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నరు.

వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారనీ, ఆ హామీని నెరవేర్చినందుకు అదే వరంగల్ వేదికపై జూలై నెలాఖరులోపు 5 లక్షల మంది రైతులతో రాహుల్ గాంధీకి కృతజ్ఞత సభ నిర్వహిస్తామనీ రేవంత్ రెడ్డి చెప్పిండు. తాను మాట ఇచ్చినట్టుగా ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయలేదని రాహుల్ గాంధీకి తెలుసు. అందుకే ఆయన మొహం చెల్లక తెలంగాణలో అడుగుపెట్టడం లేదు!

ఆగస్టు 15 వరకు ఒకే విడతలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తే, నేను రాజీనామా చేసి, తిరిగి పోటీలో నిలబడనని సవాల్ విసిరాను. మేం వెంటపడితే సగం మందికి రుణమాఫీ అయ్యింది. ఇంకా సగం మంది రైతులకు రుణమాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలిచి పోరాడుతుంది. వదిలిపెట్టేది లేదు. జై కిసాన్!

వ్యాసకర్త ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రశ్న – పరిప్రశ్న

ప్రశ్న జ్ఞానార్జనకు, జిజ్ఞాసకు సంకేతం. ప్రశ్నతోనే కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగాయి. ఎందుకు, ఎలా, ఏమిటి, ఎప్పుడు అనే ప్రశ్నల మీదే మానవ పురోగతి ఆధారపడి ఉంది. సందేహాలు కలిగినప్పుడు మనసులో అణచివేసుకుంటే విషయ పరిజ్ఞానపు ఎదుగుదల ఆగిపోతుంది. అలాగని ఏదో ఒకటి అడగాలని, ఎదుటివారిని పరీక్షించాలని ప్రశ్నలు వేయటం మంచిది కాదు. ప్రశ్న అర్థవంతమై ఉండాలి. ప్రశ్నలో నిజాయతీ ఉండాలి.

జ్యోతిర్మయం

ప్రశ్న కంటే మరింత లోతైనది పరిప్రశ్న. బాగా ఆలోచించి ఆధ్యాత్మికోన్నతికి ఉపయోగపడే విధంగా ప్రశ్నించటం పరిప్రశ్న. వాల్మీకి విరచిత రామాయణంలో వాల్మీకి నారదుని భక్తి శ్రద్ధలతో పూజించి పరిప్రశ్నలు వేస్తాడు. విశ్వామిత్రుని శ్రీరాముడు ఎన్నో పరిప్రశ్నలు వేసి విషయాలు తెలుసుకుంటాడు. పరిపరి విధాల ఆలోచించి అడగదగినవారినే శ్రద్ధతో అడగటం పరిప్రశ్న. భగవద్గీత నాలుగో అధ్యాయంలో ఒక శ్లోకం ఉంది.

తద్విద్ధి ప్రణిపాతేన, పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం, జ్ఞానిన స్తత్వ దర్శినః

తత్వ దర్శనం చేసిన జ్ఞానులను ఏ విధంగా సేవించి, ప్రశ్నించి జ్ఞానం పొందాలో వ్యాసులు చెపుతున్నారు. జ్ఞానాన్వేషి అయిన శిష్యుడి అజ్ఞానాన్ని తొలగించటానికి గురువు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు.

ప్రణిపాతేన అంటే కేవలం నమస్కారం చేయటం కాదు, సాష్టాంగ నమస్కారం చేయాలి. కేవలం శరీరంతోనే కాదు మనసు, బుద్ధి లగ్నం చేసి గురువుకు నమస్కారం చేయాలి. పరిప్రశ్నేన అంటే కేవలం అడగటం కాదు... జిజ్ఞాసతో, జ్ఞాన కాంక్షతో వినయంతో, గురువుకు సేవ చేసి ప్రశ్నించాలి అంటున్నారు వేద వ్యాసులు. 'ఆధ్యాత్మిక గురువుల దగ్గరకు ఆత్మజ్ఞానం కోసం వెళ్ళాలి. ప్రాపంచిక విషయాల కోసం కాదు. ఆధ్యాత్మిక గురువు దగ్గరికి చేరి, వినయంతో ప్రశ్నించండి. గురువు చెప్పిన సేవ చేయండి, జ్ఞానోపదేశం పొందండి' అంటున్నాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు చెప్పిన మార్గం అనుసరించడానికి ఎంతో ఆధ్యాత్మిక సాధన అవసరం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి


గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.11.09 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** శతభిషం ప.2.31 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.8.30 నుండి 9.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు తదుపరి రా.10.45 నుండి 11.31 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.41 నుండి 9.32 వరకు, **శ్రీ అనంతపద్మనాభ వ్రతం:** **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.50, **సూర్యాస్తమయం:** 6.01.



నాడే.. ఆధునిక హైదరాబాద్

హైదరాబాద్ చాలా వరకు స్వతంత్ర సంస్థానంగానే కొనసాగింది. 1778లో ఇక్కడ బ్రిటీష్ రెసిడెంట్ నియామకమైనా.. పాలన అంతా నిజాం రాజుల కనుసన్నల్లోనే సాగింది. బ్రిటీష్ వారితో చేసుకున్న ఒప్పందాల మేరకు విదేశీ వ్యవహారాలు నడిచేవి. నిజాం రాజ్య సంరక్షణ కోసం హైదరాబాద్‌లోని తిరుమలగిరి, బొల్లారం, గోల్కొండ కేంద్రాలుగా బ్రిటీష్ సైనిక స్థావరాలు ఉండేవి. సంస్థానంలో సొంతంగా సైన్యంతోపాటు పోలీసు, కస్టమ్స్, పోస్టు, కమ్యూనికేషన్, రైల్వే వ్యవస్థలు ఉండేవి. అన్నింటి కంటే మించి సొంత కరెన్సీ ఉండేది. ఆ కరెన్సీ 1957 వరకు చలామణీ కావడం విశేషం. కాకపోతే హైదరాబాద్ కరెన్సీ విలువ ఇండియన్ యూనియన్ కరెన్సీ కంటే కాస్త తక్కువ విలువ ఉండేది. హైదరాబాద్ రాజ్యంలోని సంస్థానాలు, దేశ్‌ముఖ్‌లు రైతుల నుంచి, కూలీల నుంచి వసూలు చేసిన పన్నుల్లో చాలా వరకు నిజాంకు కప్పంగా కట్టేవారు. నిజాం రాజులు ఆ ఆదాయంలో కొంత మేర హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం వెచ్చించారు. 1870లోనే నిజాం సొంత రైల్వే ఏర్పాటై.. మహారాష్ట్రలోని వాడి– సికింద్రాబాద్ మధ్య రైళ్ల రాకపోకలు నడిచాయి. 1908లో వచ్చిన మూసీ వరదల్లో హైదరాబాద్ బాగా దెబ్బతిన్నది. ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో నగర పునరుద్ధరణ, జంట జలాశయాల నిర్మాణంతోపాటు వరదల నియంత్రణకు బాటలు పడ్డాయి. చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ కాలంలోనే ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్‌లో విద్యుదుత్పత్తి, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉస్మానియా, నీలోఫర్, ఛాతీ, మానసిక, ఎముకల ఆస్పత్రులు ఏర్పాటయ్యాయి. 1920లోనే మోజంజాహీ మార్కెట్‌కు విద్యుత్ సరఫరా మొదలైంది. హుస్సేన్‌సాగర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ, ఆజామాబాద్, కోఠి రెసిడెన్సీకి అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌తో నీటి సరఫరా మొదలైంది.


ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన


చార్మినార్ నుంచి దివాన్ దేవిడీకి వెళ్లే మార్గం

క్లుప్తంగా...

గిరిజన బాలికపై లైంగిక దాడి యత్నం

- వృద్ధుడిపై బంధువుల దాడి.. కేసు నమోదు


పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలో 12 ఏళ్ల గిరిజన బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన షేక్ బడేమియా (62) గత గురువారం అదే గ్రామానికి చెందిన ఓ గిరిజన బాలికను తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో బాలిక నాయనమ్మ ఆమెను వెతుకుతూ బడేమియా ఇంటివైపు రావడంతో భయపడిన వృద్ధుడు బాలికను తలుపు చాటున దాచి ఇంటి వెనుక ఉన్న బాత్‌రూంలోకి వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన బాలిక తనపై బడేమియా లైంగిక దాడికి యత్నించాడని చెప్పింది. పోలీసు కేసు పెడితే గ్రామంలో తల్లిదండ్రుల పరువుపోతుందనే భయంతో ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బాలిక బంధువులు బడేమియాపై దాడి చేశారు. గ్రామంలో ఘర్షణ జరుగుతోందని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. దీంతో బడేమియాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బడేమియాపై దాడి చేసిన వారిపైనా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి


యాదయ్య (ఫైల్)

కొందుర్గు: పాము కాటుతో ఒక కౌలు రైతు మృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లక్ష్మీదేవిపల్లిలో జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన పస్పుల యాదయ్య (40) ఆగిర్యాలలో రెండెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని, వరి సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం పంటకు నీరు పెట్టి, పొలం గట్టుపై తిరుగుతుండగా కాలిపై పాము కాటేసింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. మృతునికి భార్య దుర్గమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఏఐఎఫ్‌టీవో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షునిగా పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి ఎన్నికైనట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ వెల్లడించారు. ఏఐఎఫ్‌టీవో జాతీయ సాధారణ కౌన్సిల్ సమావేశాలు ఇటీవల లక్నోలో జరిగాయి. శ్రీపాల్ రెడ్డి జాతీయ కౌన్సిల్‌కు 2021 నుంచి 2024 వరకూ జాతీయ ఉపాధ్యక్షునిగా పని చేశారు. పాత పెన్షన్ విధానం కోసం దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల మద్దతుతో ఉద్యమిస్తామని శ్రీపాల్ ఈ సందర్భంగా తెలిపారు. విద్యకు అత్యధిక నిధులు కేటాయించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.

రూ.2,075 కోట్లతో ఉస్మా 'నయా'

అత్యాధునిక సౌకర్యాలు, హంగులతో ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణం

- కొత్తగా 6 సూపర్ స్పెషాలిటీ విభాగాలు
- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దే యోచన
- రెండు నెలల్లో పనులు ప్రారంభించనున్న వైద్య, ఆరోగ్యశాఖ



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆసుపత్రికి రూ.2,075 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అత్యాధునిక సౌకర్యాలు, హంగులతో దీన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోనే ఏ ఆసుపత్రీ లేనివిధంగా దీన్ని తీర్చిదిద్దనున్నారు. రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. 2026 నాటికి దీన్ని పూర్తి చేస్తారు. ప్రస్తుత పాత భవనం కూలిపోయే దశలో ఉండటంతో గోషామహల్‌లో 31.39 ఎకరాల్లో కొత్తగా ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మొత్తం 30.28 లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో దీన్ని నిర్మిస్తారు. ప్రస్తుతం 21 సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాలు ఉండగా, కొత్తగా మరో ఆరు సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేస్తారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, పాలియేటివ్ హెల్త్, రుమటాలజీ, జీరియాట్రిక్ మెడిసిన్‌లను కొత్తగా అందుబాటులోకి తీసుకొస్తారు. మొత్తం 2 వేలకు పైగా పడకలతో దీన్ని ఏర్పాటు చేస్తారు. ప్రతి సూపర్ స్పెషాలిటీ విభాగానికి ఒక ఆపరేషన్ థియేటర్‌ను నెలకొల్పుతారు. వృద్ధుల కోసం ఏర్పాటు చేసే జీరియాట్రిక్ స్పెషాలిటీ విభాగంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు ఉంటాయి. వారి కోసం ప్రత్యేకంగా మందులు, థియేటర్లు, వసతులు ఏర్పాటు చేస్తారు. మరోవైపు పాలియేటివ్ కేర్ సూపర్ స్పెషాలిటీలో భాగంగా కేన్సర్ సహా జీవితం చివరి ఘడియల్లో ఉన్న వారికి అవసరమైన సపర్యలన్నీ చేసేలా చర్యలు తీసుకుంటారు. ఆ మేరకు ప్రత్యేకంగా శిక్షణ కలిగిన డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని నియమిస్తారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును ప్రారంభించాక, ఆసుపత్రుల రూపురేఖలను మార్చుతారు. రోగుల పట్ల ఎలా ప్రవర్తించాలన్న దానిపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల విషయంలో ప్రజల్లో ఉన్న ప్రతికూల ఆలోచనను మార్చేలా ఆస్పత్రిని తీర్చిదిద్దుతారు.

దేశానికే రోల్ మోడల్‌గా..

ఉస్మానియా ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దనున్నారు. భవనాన్ని అత్యంత విశాలంగా నిర్మిస్తారు. రోగులు ఉండే గదుల్లోకి గాలీ వెలుతురు ధారాళంగా వచ్చేలా చూస్తారు. ఎక్కడికక్కడ ఉద్యానవనాలతో పచ్చదనం ఎక్కువగా ఉండేలా ప్రణాళిక రచిస్తున్నారు. రోగి సహాయకులు ఉండేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారు. గదులు, డార్మెటరీలు, వాష్‌రూంలు ఏర్పాటు చేస్తారు. ఆస్పత్రిని దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం ప్రముఖ ఆర్కిటెక్ట్‌కు బాధ్యత అప్పగించారు. ఎన్ని అంతస్తుల్లో భవనం నిర్మించాలన్న దానిపై ఆర్కిటెక్ట్ స్పష్టత ఇస్తారు. ఈ మేరకు ఆసుపత్రి మోడల్‌ను త్వరలో విడుదల చేయనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెమినార్లు జరిగేలా, పరిశోధనలకు అనువుగా ఆస్పత్రిని నిర్మిస్తారు. వైద్య రంగంలో కొత్త కొత్త ఆవిష్కరణలు జరిగేలా జూనియర్ డాక్టర్లను ప్రోత్సహిస్తారు. మరోవైపు ప్రపంచంలో ఉన్న ఉన్నతశ్రేణి వైద్య సంస్థలతోనూ ఒప్పందం చేసుకుంటారు. అంతర్జాతీయ వైద్యాన్ని కూడా ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులోకి తెచ్చే అవకాశముంది. అవయవ మార్పిడులు జరిగేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ మేరకు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తారు. ఉస్మానియా కొత్త ఆసుపత్రి భవనాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు, వైద్య రంగానికి మార్గదర్శకంగా ఉండేలా తీర్చిదిద్దుతామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అందుకోసం తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ఏర్పాట్లు చేస్తోందని ఆయన వెల్లడించారు.

కెనడాలో మీర్‌పేట యువకుడి మృతి

- బర్త్ డే వేడుకల్లో విషాదం
- ఈత కొడుతూ సరస్సులో మునిగిన ప్రణీత్



మీర్‌పేట: ఉన్నత చదువు కోసం కెనడా వెళ్లిన యువకుడు ఈతకు వెళ్లి ప్రమాదశాత్తు నీటమునిగి మృతి చెందాడు. ఘటనకు చెందిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట ఓల్డ్ బాలాజీనగర్‌కు చెందిన అడువ రవి, సునీత దంపతులకు ప్రణయ్, ప్రణీత్ అనే ఇద్దరు కుమారులు. 2019లో పీజీ చదివేందుకు చిన్న కుమారుడు ప్రణీత్ (26) కెనడా వెళ్లి అక్కడే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇతడి అన్న ప్రణయ్ కూడా ఉన్నత చదువు నిమిత్తం కెనడా వెళ్లాడు. ఆదివారం ప్రణీత్ జన్మదినం కావడంతో అన్నతోపాటు మరికొంతమంది స్నేహితులతో కలసి శనివారం ఔటింగ్‌కు వెళ్లారు. టోరంటోలోని లేక్ క్లియర్ సరస్సు వద్ద ఉన్న మరో స్నేహితుడి కాటేజీకి చేరుకున్నారు. ఆదివారం ఉదయాన్నే ఆరుగురూ కలసి బోట్‌లో సరస్సును చుట్టివచ్చారు. ఒడ్డుకు వచ్చిన అనంతరం స్నేహితులతో కలసి ఈత కొట్టారు. సరస్సులో కొంతదూరం వెళ్లిన ప్రణీత్ తిరిగి వస్తున్న క్రమంలో ఊపిరాడక నీట మునిగిపోయాడు. దీంతో ప్రణయ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించగా... రెస్క్యూ బృందం వచ్చి సరస్సులో గాలించగా అప్పటికే ప్రణీత్ మృతిచెందాడు. రెస్క్యూ బృందం ప్రణీత్ మృతదేహాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించింది.

ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి...

చిన్న కుమారుడు మృతి చెందాడనే విషయం తెలియడంతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఉన్నత చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగంలో స్థిరపడుతాడనుకుంటున్న సమయంలో ఇలా జరుగుతుందని ఊహించలేదని మృతుడి తండ్రి రవి కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమారుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు చొరవ తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

అయోధ్య బాలరాముడికి దుబ్బాక చేనేత వస్త్రం



దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక చేనేత కార్మికులు మగ్గంపై నేసిన వస్త్రంతో సోమవారం అయోధ్యలో బాలరాముడిని అలంకరించారు. చేనేత కార్మికులు మగ్గంపై నేసిన 15 మీటర్ల లెనిన్ వస్త్రంతో అందంగా అలంకరించారు. మే నెలలో మొదటిసారి దుబ్బాక నేతన్నలు మగ్గంపై నేసిన పింక్ కలర్ లెనిన్‌ఇక్కత్ వస్త్రంతో అలంకరించగా.. తాజాగా సోమవారం తెల్లటి లెనిన్ వస్త్రంతో అయోధ్య బాలరాముడిని అందంగా అలంకరించారు.

ఐదుగురు కార్మికులు తయారు చేసిన వస్త్రం

అయోధ్య బాలరాముడి అలంకరణకు ఉపయోగించిన లెనిన్ వస్త్రాన్ని ఐదుగురు చేనేత కార్మికులు మగ్గంపై తయారు చేశారు. వీరు తయారు చేసిన 15 మీటర్ల లెనిన్ ఇక్కత్ వస్త్రాన్ని ఢిల్లీకి చెందిన ముక్తిర్ ఫ్యాషన్ ఇండియా ప్రైవేట్ కంపెనీ కొనుగోలు చేసింది. తమ కంపెనీ ఆధ్వర్యంలో ఈ వస్త్రంతో అయోధ్య బాలరాముడిని అలంకరించడం పట్ల ముక్తిర్ ఫ్యాషన్ ఇండియా సీఈవో బోడ శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి జర్నలిస్టుకు సీఎం అండ

వైద్యానికి రూ.10 లక్షలు మంజూరు

సాక్షి, హైదరాబాద్: తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న సాక్షి ఢిల్లీ సీనియర్ జర్నలిస్టు కేవీఎస్ఎస్ ప్రకాశ్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ప్రకాశ్ మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అనారోగ్యానికి గురై మూడు రోజుల క్రితం ఢిల్లీలోని మాక్స్ ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందిస్తూ.. ప్రకాశ్ వైద్యానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు చెక్కును మంగళవారం ఢిల్లీలో అధికారులు ప్రకాశ్ కుటుంబ సభ్యులకు అందజేయనున్నారు.

ముసాయిదానే.. కొత్త చట్టం!

▶ మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ముందు పెట్టింది. ముసాయిదాపై ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి 23 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. మంత్రులు, రెవెన్యూ శాఖ సీనియర్ అధికారులు, భూచట్టాల నిపుణులు, మేధావులు, సామాన్యులు.. ఇలా అన్ని వర్గాలు అభిప్రాయాలు స్వీకరించింది. ఈ వివరాలతో జిల్లాల కలెక్టర్లు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

ఆ మూడు అంశాలే కీలకం

ప్రజలతోపాటు భూచట్టాల నిపుణుల నుంచి వచ్చిన అనేక సూచనలు, సలహాల్లో మూడు అంశాలు కీలకమని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటు ప్రతిపాదన ముసాయిదా చట్టంలో లేదని.. భూసమస్యల పరిష్కారం కోసం ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని పలువురు సూచించారు. అయితే రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటుకు, ఆర్ఓఆర్ చట్టానికి సంబంధం లేదని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. అయితే భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా పార్ట్–బీలో పెట్టిన 18లక్షల ఎకరాల భూముల సమస్యలను పరిష్కరించేందుకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి కూడా ఉందని అంటున్నాయి. ఇందుకోసం ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వొచ్చని, లేదా ముసాయిదా చట్టంలోని సెక్షన్–4 ప్రకారం కూడా ఏర్పాటు చేయవచ్చని పేర్కొంటున్నాయి. ఇక అప్పీల్, రివిజన్లకు సంబంధించిన అంశంలోనూ చాలా సూచనలు వచ్చాయి. తహసీల్దార్లు, ఆర్డీవోలు చేసే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు సంబంధించి వివాదాలు వస్తే అప్పీల్‌ను కలెక్టర్లు లేదా అడిషనల్ కలెక్టర్‌కు చేసుకోవాలని.. సెకండ్ అప్పీల్‌ను సీసీఎల్ఏకు, రివిజన్ కోసం ప్రభుత్వానికి లేదంటే సీసీఎల్ఏకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చట్టంలో ప్రతిపాదించారు. అయితే ఈ అప్పీల్ అవకాశం ఆర్డీవో స్థాయిలోనూ ఉండాలని పలువురు సూచించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేటప్పుడు సర్వే మ్యాప్ తప్పనిసరి అని.. ప్రతి భూకమతానికి తాత్కాలిక, శాశ్వత భూఆధార్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇస్తామన్న ప్రతిపాదనలపైనా పలు సూచనలు వచ్చాయి. వీటి విషయంలో ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో తేలాల్సి ఉంది.

సాదాబైనామాలకు అవకాశం

ఆర్ఓఆర్–2024 చట్టం అమల్లోకి వస్తే పెండింగ్‌లో ఉన్న 9.4 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది. ఈ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని ప్రత్యేక సెక్షన్‌లో ప్రతిపాదించారు. ఇక అసైన్డ్ భూముల సమస్య పరిష్కారానికి ఈ చట్టంలో ఎలాంటి ప్రస్తావన లేదనే విమర్శలున్నాయి. అయితే అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడానికి, ఆర్ఓఆర్ చట్టానికి సంబంధం లేదని.. అసైన్డ్ భూములపై హక్కులు రావాలంటే హక్కుల బదలాయింపు నిషేధిత చట్టాన్ని (పీవోటీ) సవరించాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు వివరిస్తున్నాయి. మొత్తమ్మీద ముసాయిదా చట్టంలో ఒకట్రెండు అంశాల్లోనే మార్పు ఉంటుందని.. అది కూడా మార్గదర్శకాలు తయారు చేసినప్పుడు వాటిలో పొందుపరుస్తారని పేర్కొంటున్నాయి.



గట్టులో అరుదైన ఖురాన్ గ్రంథాలు

గట్టు: తరతరాల వారసత్వ సంపదగా భద్రపరచిన అరుదైన రెండు పవిత్ర ఖురాన్ గ్రంథాలను సోమవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల మధ్య బయటకు తీశారు. గట్టు మసీదులో ఏళ్ల తరబడి భద్రపరిచిన రెండు ఖురాన్ గ్రంథాలు కేవలం అంగుళంన్నర పరిమాణంలో ఏకంగా 480 పేజీలు 30 పారే (పర్వాలు)లు ఉండడం విశేషం. ఇందులోని అక్షరాలను భూతద్దం ద్వారా చూస్తేనే కనిపిస్తాయి. ఏటా ఒకసారి మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మాత్రమే వీటికి ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపిస్తారు. ఈ గ్రంథాలను దర్శించుకునేందుకు కర్ణాటకలోని రాయచూర్, యరగిగెరతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు తరలి వచ్చారు.



వాగు దాటి.. వైద్యం చేసి

ఏటూరునాగారం: ములుగు జిల్లా కొండాయి వద్ద జంపన్నవాగుపై వంతెన లేకపోవడంతో.. అవతలి గూడేల ప్రజల వైద్యానికి వైద్య సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది. కొండాయి పల్లె దవాఖానా వైద్యుడు ప్రణీత్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావుతో కలిసి సోమవారం వాగుదాటి ఆశ్రమ పాఠశాల, గ్రామంలోని ప్రజలకు పరీక్షలు, జ్వర సర్వేలు చేపట్టారు. పాఠశాలలో 18 మంది పిల్లలకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు వైద్యుడు ప్రణీత్‌కుమార్ తెలిపారు.

వచ్చేస్తోంది మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో!

అంగారక ప్రయోగాలకు అత్యంత అనువు • ప్రయోగాలకు అంతరిక్ష సంస్థల సన్నాహాలు

2026 విండోలో మిషన్ మార్స్: స్పేస్‌ఎక్స్ సక్సెసైతే 2028లో మానవసహిత మిషన్



మరొక్క నెల రోజులే! సైంటిస్టులంతా రెండేళ్లుగా ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'ఎర్త్–మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో' అక్టోబర్లో అందుబాటులోకి రానుంది. 2022 నాటి ట్రాన్స్‌ఫర్ విండో సందర్భంగా నాసా వంటి అంతరిక్ష సంస్థలు పలు అంగారక ప్రయోగాలు చేశాయి. భావి మార్స్ మిషన్లకు అవసరమైన సామగ్రిని అంగారకునిపైకి ముందే చేరేసేందుకు ప్రయత్నించాయి. మరో నెల రోజుల అంతరం అక్టోబర్ 'విండో'లో కూడా అలాంటి ప్రయోగాలు చేపట్టే దిశగా యోచిస్తున్నాయి.

ఏమిటీ ట్రాన్స్‌ఫర్ విండో?

ఇది భూ, అంగారక గ్రహాలు రెండూ పరస్పరం అత్యంత సమీపానికి వచ్చే సమయమని చెప్పవచ్చు. కనుక సహజంగానే ఆ సందర్భంగా భూమికి, అంగారకునికి మధ్య దూరం అత్యంత తక్కువగా ఉంటుంది. ఆ సమయంలో అతి తక్కువ ఇంధన వ్యయంతో అంగారక ప్రయోగాలు సాధ్యపడుతాయి. ఫలితంగా ప్రయోగ ఖర్చుతో పాటు అరుణ గ్రహాన్ని చేరేందుకు పట్టే సమయమూ తగ్గుతుంది. కేవలం 6 నుంచి 8 నెలల్లో అంగారకున్ని చేరవచ్చు. అదే ఇతర సమయాల్లో అయితే ఏళ్ల కొద్దీ సమయం పడుతుంది. వీటన్నింటికీ మించి ట్రాన్స్‌ఫర్ విండోలో ప్రయోగించే అంతరిక్ష నౌక అంగారకుడు అత్యంత అనువైన పొజిషన్‌లో ఉండగా దాని కక్ష్యలోకి ప్రవేశించగలుగుతుంది. కనుక ప్రయోగం విజయవంతమయ్యే అవకాశం ఎన్నో రెట్లు పెరుగుతుంది. భూమి, అంగారకుల మధ్య ఈ విండో దాదాపు 26 నెలలకు ఓసారి పునరావృతమవుతూ ఉంటుంది. హాన్‌మన్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ సూత్రం ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. ఈ విండో సమయాన్ని కచ్చితంగా లెక్కించడం అంతరిక్ష సంస్థలకు చాలా కీలకం. లేదంటే ప్రయోగం రెండేళ్లు ఆలస్యమయ్యే ప్రమాదముంటుంది.

2026 విండోపై స్పేస్ ఎక్స్ కన్ను

ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ ఎక్స్ తన అంగారక యాత్ర సన్నాహాలకు మరింత పదును పెడుతోంది. అంతా అనుకున్నట్టుగా జరిగితే 2026లో అంగారకునిపైకి మానవరహిత 'స్టార్‌షిప్' మిషన్ చేపట్టనున్నట్టు సంస్థ అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఆ ఏడాది 'ఎర్త్–మార్స్ ట్రాన్స్‌ఫర్ విండో' సందర్భంగా ప్రయోగం ఉంటుందని వెల్లడించారు. అంతరిక్ష నౌక సజావుగా అరుణ గ్రహంపై దిగి తమ మిషన్ విజయవంతమైతే మరో రెండేళ్లలో, అంటే 2028 నాటికి మానవసహిత అంగారక యాత్ర ఉంటుందని చెప్పారు. నాసా, ఇతర అంతరిక్ష సంస్థలు కూడా 20206 విండో సందర్భంగా అంగారకునిపైకి మరింత అదనపు సామగ్రి తదితరాలను చేరవేసేందుకు ఇప్పట్నుంచే ప్రణాళికలు వేస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

నేడే రాజీనామా

ఎల్జీకి సమర్పించనున్న కేజ్రీవాల్

- కొత్త సీఎంపై సర్వత్రా ఉత్కంఠ
- రోజంతా నేతలతో మల్లగుల్లాలు
- నేడు ఎమ్మెల్యేల భేటీలో నిర్ణయం
- ఎస్సీ, మైనారిటీ నేతల పేర్లు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం రాజీనామా చేయనున్నారు. సాయంత్రం 4.30కు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ సందర్భంగా ఎల్జీకి కేజ్రీవాల్ రాజీనామా లేఖ సమర్పిస్తారని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ సోమవారం మీడియాకు తెలిపారు. రెండు రోజుల్లో రాజీనామా చేస్తానని, ప్రజలు గెలిపించాకే తిరిగి సీఎం కుర్చీలో కూర్చుంటానని కేజ్రీవాల్ ఆదివారం సంచలన ప్రకటన చేయడం తెలిసిందే. ఢిల్లీ అసెంబ్లీకి నవంబర్లోనే ముందస్తు ఎన్నికలు పెట్టాలని కూడా ఆ సందర్భంగా ఆయన ఈసీని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రోజంతా ఆప్ నేతలతో కేజ్రీ సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. తన ప్రకటనపై స్పందన ఎలా ఉందని పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఆరా తీశారు. సీఎం అభ్యర్థిపై ఒక్కక్కరి నుంచీ వ్యక్తిగతంగా అభిప్రాయాలు సేకరించారు. అంతకుముందు ఉదయం కీలక నేతలు మనీశ్ సిసోడియా, రాఘవ్ ఛద్దా తదితరులతోనూ ఈ అంశంపై లోతుగా చర్చలు జరిపారు. సీఎం పదవికి మంత్రులు ఆతిశి, గోపాల్ రాయ్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ తదితరుల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు స్పీకర్ రాంనివాస్ గోయల్, కేజ్రీవాల్ భార్య సునీత పేర్లపైనా లోతుగా చర్చ జరుగుతున్నట్టు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో 12 ఎస్సీ రిజర్వుడు శాసనసభ స్థానాలున్నాయి. కనీసం మరో ఆరు స్థానాల్లో మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, లేదా మైనారిటీ నేతకు చాన్స్ దక్కొచ్చన్న వాదనా ఉంది. దాంతో ఎస్సీ, మైనారిటీ వర్గానికి చెందిన పలువురు ఆప్ ఎమ్మెల్యేల పేర్లు కూడా కొత్తగా తెరపైకి వస్తున్నాయి! మంగళవారం కేజ్రీవాల్ రాజీనామాకు ముందు ఉదయం 11.30కు ఆప్ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం జరగనుంది. సీఎం అభ్యర్థిపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. మైనారిటీ వర్గానికి చెందిన ఆప్ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుసేన్ పేరు ఖరారైనా ఆశ్చర్యం లేదని ఆప్ ముఖ్య నేత ఒకరు చెప్పడం విశేషం!

హరియాణాలో సుడిగాలి ప్రచారం!

రాజీనామా అనంతరం కేజ్రీవాల్ హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుడిగాలి ప్రచారం చేస్తారని ఆప్ వర్గాలు చెబుతున్నాయి. హరియాణలో అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. అక్కడ కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు పెట్టుకోలేదు. మొత్తం 90 స్థానాల్లో ఒంటరిగానే అభ్యర్థులను బరిలోకి దింపింది. జమ్మూకశ్మీర్‌లో కూడా కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని సమాచారం.

దిగొచ్చిన దీదీ

జూడాల కీలక డిమాండ్లకు అంగీకారం • కోల్‌కతా పోలీసు కమిషనర్ గోయల్‌పై వేటు

- వైద్యవిద్య డైరెక్టర్ తొలగింపు
- ఆరోగ్య సేవల డైరెక్టర్ కూడా
- ఎలాంటి క్రమశిక్షణ చర్యలుండవు
- విధుల్లో చేరాలని వినతి
- చర్చించి చెబుతామన్న జూడాలు



కోల్‌కతా: మమతా బెనర్జీ సర్కారు దిగివచ్చింది. జూనియర్ డాక్టర్ల ఐదు డిమాండ్లలో మూడింటిని ఆమోదించింది. వైద్య విద్య డైరెక్టర్, ఆరోగ్య సేవల డైరెక్టర్‌లను తొలగించడానికి అంగీకరించింది. వైద్యురాలి తల్లిదండ్రులకు డబ్బు ఇవ్వజూపారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ పైనా వేటు వేసింది. మంగళవారం కొత్త కమిషనర్‌ను నియమిస్తామని సీఎం మమత ప్రకటించారు. వినీత్ గోయల్ కమిషనర్‌గా కొనసాగడానికి సుముఖంగా లేరన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ (నార్త్)ను తొలగించాలని నిర్ణయించామన్నారు. జూనియర్ల డాక్టర్ల ఇతర డిమాండ్లను పరిశీలించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ఐదింటిలో మూడు డిమాండ్లను అంగీకరించినందుకు సమ్మె విరమించి విధులకు హాజరు కావాలని జూనియర్ డాక్టర్లను కోరినట్లు మమత వెల్లడించారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత మమత మీడియాతో మాట్లాడుతూ సమావేశపు వివరాలను వెల్లడించారు. 42 మంది జూనియర్ డాక్టర్లు, బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ సమావేశపు మినిట్స్‌పై సంతకాలు చేశారని మమత తెలిపారు. జూడాలపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఉండవని ప్రకటించారు. చర్చించుకొని తమ నిర్ణయం చెబుతామని జూనియర్ డాక్టర్లు తెలిపారని మమత వెల్లడించారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఆరోగ్యశాఖ కార్యదర్శిని కూడా బదిలీ చేయాలనేది జూడాల డిమాండ్లలో ఒకటి. కాళిఘాట్‌లోని సీఎం నివాసంలో సోమవారం జూనియర్ డాక్టర్లతో రాత్రి 7 గంటలకు మొదలైన చర్చలు 9 దాకా కొనసాగాయి. 42 మంది జూడాలు మమతా బెనర్జీతో సమావేశమయ్యారు. తమ డిమాండ్లను లిఖితపూర్వకంగా సీఎం ముందుంచారు. అనంతరం ఇరుపక్షాలు రెండున్నర గంటల పాటు సమావేశపు మినిట్స్‌కు తుదిరూపునిచ్చాయి. చర్చలు సానుకూలంగా జరిగాయని మమత అన్నారు. అందుకే ఇరుపక్షాలు మినిట్స్‌పై సంతకాలు చేశాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు సోమవారం ఉదయం మమత సర్కారు జూనియర్ డాక్టర్లను చర్చలకు ఆహ్వానించింది. చర్చలకు పిలవడం ఇది ఐదో, ఆఖరుసారని కూడా స్పష్టం చేసింది.

నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: ఆర్.జి.కర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారం ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు మంగళవారం ఈ కేసును మరోసారి విచారించనుంది. సహచర డాక్టర్ పాశవిక హత్యను నిరసిస్తూ ఆగస్టు 9 నుంచి పశ్చిమబెంగాల్ జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరిస్తున్నారు. క్రమశిక్షణ చర్యల బారినపడకుండా ఉండాలంటే సెప్టెంబరు 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని సుప్రీంకోర్టు గతంలో జూడాలను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ జూడాలను సమ్మె కొనసాగించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మంగళవారం జరిపే విచారణ ప్రాధాన్యత సంతరించుకుంది.

దేశ ప్రతిష్ట దిగజార్చే యత్నం

- అందుకోసం అనుక్షణం తాపత్రయ పడతారు
- విద్వేషంతో నిండిన వాళ్లు ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టరు
- రాహుల్‌పై ప్రధాని మోదీ పరోక్ష విమర్శలు

అహ్మదాబాద్: పలు అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. విద్వేషాన్ని నింపుకున్న వాళ్లు దేశ ప్రతిష్టను మసకబార్చేందుకు దొరికే ఏ ఒక్క అవకాశాన్నీ వదిలిపెట్టరని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో రూ.8,000 కోట్ల పలు ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు. తర్వాత దేశంలోనే తొలి వందేభారత్ మెట్రో సర్వీస్ అయిన భుజ్–అహ్మదాబాద్ 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ప్రారంభించారు. దీంతోపాటు ఐదు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లనూ మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ రాహుల్, కాంగ్రెస్‌పై పరోక్ష విమర్శలు చేశారు. '' కొందరు ప్రతికూలత, విద్వేషంతో భారత్‌ను విడగొట్టేందుకు దేశ ఐక్యత, సమగ్రతలను లక్ష్యంగా చేసుకుంటారు. ఇండియా, గుజరాత్‌ల పరువు తీసేందుకు దొరికే ఏ ఒక్క అవకాశాన్నీ వీళ్లు చేజార్చుకోరు. మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టాక తొలి 100 రోజుల్లో పాలనపై విపక్షాలు దారుణంగా విమర్శించాయి. నేను మాత్రం అభివృద్ధి అజెండా అమలుపైనే దృష్టిపెట్టా. నేను జీవిస్తే మీ కోసమే జీవితాన్ని ధారపోస్తా. పోరాడితే మీ కోసమే పోరాడతా. చనిపోవాల్సి వస్తే మీ కోసమే ప్రాణాలప్పిస్తా'' అని వేలాది మంది సభికులనుద్దేశించి అన్నారు.

తొలి భారత్ మెట్రో పేరు మార్పు

మెట్రో నగరాల మధ్య తిరిగే దేశంలో తొలి మెట్రో 'వందే మెట్రో' పేరును ప్రారంభోత్సవానికి కొద్దిసేపటి ముందు కేంద్రం 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'గా మార్చింది. సోమవారం సాయంత్రం ఈ రైలును మోదీ అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది తొమ్మిది స్టేషన్లలో ఆగుతూ 359 కి.మీ. ప్రయాణించి అహ్మదాబాద్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవలు నేటి నుంచి అందుబాటులోకి రానున్నాయి. భుజ్ నుంచి అహ్మదాబాద్‌కు టికెట్ ధర రూ.455గా నిర్ణయించారు.

మరో మెట్రోలో ప్రధాని ప్రయాణం

అహ్మదాబాద్, గాంధీనగర్‌లను కలిపే రెండో దశ మెట్రోను మోదీ ప్రారంభించారు. అందులో గాంధీనగర్ సెక్టార్1 స్టేషన్ నుంచి గిఫ్ట్ సిటీకి వెళ్లారు. గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కొందరు విద్యార్థులు ప్రయాణించారు. రూ.5,384 కోట్ల వ్యయంతో ఫేజ్2 పనులు చేపట్టారు.



అహ్మదాబాద్‌లో మెట్రో రైలులో ప్రయాణిస్తున్న మోదీ..చిత్రంలో గవర్నర్ దేవవ్రత్ ఉన్నారు

భారత సౌర విప్లవం ఒక సువర్ణాధ్యాయం

గాంధీనగర్‌లో నాలుగో ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడి దారుల సదస్సు, ప్రదర్శనను మోదీ ప్రారంభించారు. ''వెయ్యేళ్ల ప్రగతికి భారత్ పునాదులు వేసుకుంటోంది. అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవడమే గాక, అక్కడే కొనసాగాలని లక్షిస్తోంది. మూడో దఫా పాలన తొలి 100 రోజుల్లో మా ప్రాధమ్యాలను గమనిస్తే దేశం వేగం, విస్తృతి అర్థమవుతాయి'' అని పెట్టుబడిదారులను ఉద్దేశించి అన్నారు. ''సౌర, పవన, అణు, జల విద్యుదుత్పత్తి ద్వారా భారత్ ఇంధన అవసరాలు తీర్చుకోనుంది. దేశ 21వ శతాబ్ద చరిత్రలో సౌరవిప్లవ అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో రాస్తారు'' అన్నారు. గాంధీనగర్‌లో వవోల్ ప్రాంతంలోని షాలిన్–2 సొసైటీలో 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజనా' పథక లబ్ధిదారులతో మోదీ మాట్లాడారు.

లంచ్ బ్రేక్‌లో లవ్వు!

- జనాభాను బాగా పెంచండి
- రష్యన్లకు పుతిన్ పిలుపు
- నానాటికీ తగ్గుతున్న జనాభా



అసలే జననాల రేటు తగ్గుతోంది. అది చాలదన్నట్టుగా రెండున్నరేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం రష్యా సైనికులను భారీగా బలి తీసుకుంటోంది. దీనికి తోడు నిర్బంధంగా సైన్యంలో చేరాల్సి వస్తుండటంతో యువకులు భారీ సంఖ్యలో దేశం వీడుతున్నారు. వెరసి రష్యాలో జనాభా శరవేగంగా తగ్గిపోతోంది. ఈ పరిణామం అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను తీవ్రంగా ఆందోళన పరుస్తోంది. దాంతో ఎలాగైనా జనాభాను ఇతోధికంగా పెంచి దేశసేవ చేయాలంటూ రష్యన్లకు ఆయన తాజాగా విజ్ఞప్తి చేశారు. అందుకోసం రోజూ పని మధ్యలో లంచ్, టీ విరామ సమయాల్లో కూడా వీలైనంతగా కిందా మీదా పడాల్సిందిగా సూచించారు! పుతిన్ ఇచ్చిన ఈ గమ్మత్తైన పిలుపుపై నెటిజన్లు అంతే ఆసక్తికరమైన కామెంట్లు కూడా చేస్తున్నారు. లంచ్, కాఫీ బ్రేకులను సంతానోత్పత్తికి వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాల్సిన అవసరం చాలా ఉందని రష్యా ఆరోగ్య మంత్రి యెవగనీ షెస్తోపలోవ్ కూడా పేర్కొనడం విశేషం. ఇది ఆచరణ సాధ్యమా అన్న ప్రశ్నలను ఆయన కొట్టిపారేశారు. ''దయచేసి రోజంతా పనిలో బిజీగా ఉంటున్నామని చెప్పకండి. అది పసలేని సాకు మాత్రమే. సృష్టికార్యానికి ఆఫీసు పని అడ్డంకి కారాదు. లంచ్, కాఫీ బ్రేక్... ఇలా ప్రతి అవకాశాన్నీ సెక్స్ కోసం గరిష్ఠంగా ఉపయోగించుకోండి. లేదంటే కాలం ఎవరి కోసమూ ఆగదు. బేబీలను కనేందుకు బ్రేక్ టైంలో కష్టపడండి'' అంటూ హితబోధ కూడా చేశారు.

పడిపోతున్న ప్రజనన నిష్పత్తి

ఏ దేశంలోనైనా జనసంఖ్య స్థిరంగా ఉండాలన్నా ప్రజనన నిష్పత్తి కనీసం 2.1గా ఉండాలి. రష్యాలో అది నానాటికీ తగ్గిపోతోంది. ప్రస్తుతం ప్రతి మహిళకూ కేవలం 1.4గా ఉంది. 2024 తొలి అర్ధ భాగంలో గత పాతికేళ్లలోనే అత్యంత తక్కువ జననాల రేటు నమోదైంది! ఇది దేశ భవిష్యత్తుకు మరణశాసనమేనంటూ క్రెమ్లిన్ హాహాకారాలు చేస్తోంది.

తొలి కాన్పుకు రూ.9.4 లక్షలు!

జననాల రేటును పెంచేందుకు రష్యా పలు చర్యలకు దిగింది. అబార్షన్, విడాకులు అత్యంత కష్టసాధ్యంగా మార్చేసింది. పిల్లల్ని కని పెంచడమే మహిళల ప్రధాన బాధ్యతంటూ ప్రముఖులు, మత పెద్దలతో చెప్పిస్తోంది. చెల్యాబిన్స్క్ ప్రావిన్స్ తొలి కాన్పుకు ఏకంగా రూ.9.4 లక్షలు ప్రకటించింది!

– సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌పై ద్వేషంతోనే..!

- ఫెన్సింగ్ గుండా ఏకే 47 గురి పెట్టిన నిందితుడు రౌత్
- 400 అడుగుల దూరంలో ట్రంప్
- ఏజెంట్ల కాల్పులతో పలాయనం

వాషింగ్టన్/వెస్ట్‌పామ్ బీచ్ (ఫ్లోరిడా): అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆదివారం హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని హవాయికి చెందిన 58 ఏళ్ల ర్యాన్ వెస్లీ రౌత్‌గా గుర్తించారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 వేళ ట్రంప్ ఫ్లోరిడాలో వెస్ట్‌పామ్ బీచ్‌లోని తన నివాస సమీపంలోని 'ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ కోర్స్'లో గోల్ఫ్ ఆడుతుండగా సమీపంలో రౌత్ ఆయుధంతో అనుమానాస్పదంగా సంచరించాడు. పొదల చాటున మాటేసి గోల్ఫ్ కోర్స్ ఫెన్స్ గుండా ఏకే 47 దూర్చి ట్రంప్‌కేసి గురిపెట్టినట్టు పామ్‌బీచ్ కౌంటీ షెరిఫ్ రిక్ బ్రాడ్‌షా మీడియాకు తెలిపారు. ''ఆ సమయంలో ట్రంప్‌కు రౌత్ కేవలం నాలుగైదు వందల అడుగుల దూరంలో ఉన్నాడు. ఫెన్సింగ్ గుండా చొచ్చుకొచ్చిన ఆయుధాన్ని గమనించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వెంటనే ఆవైపు కాల్పులు జరిపారు. దాంతో రౌత్ తుపాకీ అక్కడే పడేసి కార్లో పారిపోయాడు. ఎఫ్‌బీఐ సమాచారం మేరకు నిమిషాల వ్యవధిలోనే అక్కడికి కొద్ది దూరంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు'' అని వివరించారు. ఘటనా స్థలి నుంచి ఏకే 47 రైఫిల్, బైనాక్యులర్, కెమెరా, రెండు బ్యాక్‌ప్యాక్‌లను ఎఫ్‌బీఐ స్వాధీనం చేసుకుంది. ట్రంపే రౌత్ లక్ష్యమని, ఆయనను హత్య చేసేందుకే ప్రయత్నించాడని ఎఫ్‌బీఐ స్పష్టం చేసింది. ట్రంప్ క్షేమంగా ఉండటం పట్ల అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు హర్షం వెలిబుచ్చారని వైట్‌హౌస్ తెలిపింది. ట్రంప్ కూడా తాను సురక్షితమేనని మద్దతుదారులను ఉద్దేశించి సొంత సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ''నా సమీపంలో కాల్పులు జరిగాయి. ఇవేవీ నన్నాపలేవు. నేను వెనక్కు తగ్గేది లేదు'' అని పేర్కొన్నారు.



ఘటనాస్థలిలో పోలీసులకు దొరికిన ఏకే-47 రైఫిల్, బ్యాగ్, కెమెరా

నేరమయ నేపథ్యం



రౌత్‌ది పూర్తిగా నేరమయ నేపథ్యం. నార్త్ కరోలినాలో అతనిపై బోలెడన్ని కేసులున్నాయి. వాటిలో పోలీసులకు చిక్కకుండా చాలారోజులు పరారీలో కూడా గడిపాడు. 2018లో హవాయికి మారాడు. చిన్న నిర్మాణ కంపెనీ నడుపుతున్నాడు. అతను డెమొక్రటిక్ పార్టీకి మద్దతుదారుడని తేలింది. ట్రంప్‌ను విమర్శిస్తూ పోస్టులు పెడుతుంటాడు. ''అత్యంత చెత్త ప్రెసిడెంట్‌వు. 2016లో నీకు ఓటేసి తప్పు చేశాం. నువ్వు ఓడితేనే మేలు'' అని నిందిస్తూ 2020లో పోస్టులు పెట్టాడు. ''అమెరికన్లను ట్రంప్ తన బానిసలుగా మార్చుకోజూస్తున్నాడు. ఈసారి మనం ఓడటానికి వీల్లేదు'' అంటూ ఏప్రిల్ 22న పోస్ట్ పెట్టాడు. తాను ఉక్రెయిన్ సమర్థకుడినని రౌత్ చెప్పుకుంటాడు. రష్యాపై పోరాడేందుకు కీవ్‌కు వెళ్లానని 2023లో న్యూయార్క్ టైమ్స్‌కు చెప్పాడు.

భారత్‌లో ముస్లింలు బాధలు పడుతున్నారు

- ఇరాన్ సుప్రీం నేత వ్యాఖ్యలు.. ఖండించిన భారత్
- సొంత రికార్డు చూసుకోవాలంటూ హితవు



టెహ్రాన్/న్యూఢిల్లీ: మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ సోమవారం చేసిన ప్రకటనపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు వేదనను అనుభవిస్తున్నారు. మయన్మార్, గాజా, భారత్..తదితర ఏప్రాంతంలోనైనా ముస్లింలు పడుతున్న బాధలను పట్టించుకోకుంటే మనం ముస్లింలమే కాదు'అంటూ ఖమేనీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారత్‌లోని మైనారిటీ వర్గాన్ని గురించి ఇరాన్ సుప్రీం నేత చేసిన ఈ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. తప్పుడు సమాచారంతో చేసిన ఈ ప్రకటన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఇతర దేశాల్లోని మైనారిటీల గురించి వ్యాఖ్యలు చేసే ముందు సొంత మానవ హక్కుల రికార్డును పరిశీలించుకోవాలని ఇరాన్‌కు హితవు పలికింది. ప్రభుత్వ ఉత్తర్వులను తోసిరాజని ఇరాన్‌లో వేలాదిగా మహిళలు హిజాబ్ లేకుండా వీధుల్లోకి వచ్చిన రోజే ఖమేనీ భారత్‌పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

వ్యవస్థల నైతికతను దెబ్బతీస్తాయి

సుప్రీంకోర్టు వ్యాఖ్యలను పరోక్షంగా తప్పుబట్టిన ధన్‌ఖడ్




న్యూఢిల్లీ: స్వతంత్ర్యంగా వ్యవహరించే రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరులోకి జోక్యం చేసుకుంటే వాటి నైతికత దెబ్బతినే ప్రమాదముందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మద్యం విధానంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వకూడదంటూ వాదించిన కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)పై శుక్రవారం సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టడం తెల్సిందే. పంజరంలో చిలుకలా సీబీఐ ప్రవర్తించకూడదని, స్వేచ్ఛాయుత చిలుకనని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత సీబీఐ పైనే ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ధన్‌ఖడ్ చేసిన ప్రసంగం ప్రాధాన్యత సంతరించుకుంది. '' కేంద్ర ఎన్నికల సంఘం, ఇతర దర్యాప్తు సంస్థలు చట్టాల ప్రకారం నడుచుకుంటున్నాయి. స్వీయ నియంత్రణ పాటిస్తూ, తప్పొప్పులు సరిచేసుకుంటున్నాయి. కఠిన సవాళ్లను ఎదుర్కొంటూ కూడా అద్భుతంగా పనిచేస్తున్నాయి. అలాంటి సంస్థల పనితీరుపై వ్యాఖ్యానాలు చేసేవారెవరైనా అత్యంత జాగురూకతతో వ్యవహరించడం మేలు. లేదంటే వాటి నైతికత ప్రమాదంలో పడే అవకాశముంది'' అని అన్నారు.

కమల, బైడెన్‌లను కాల్చరెందుకో: మస్క్



వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పుల వేళ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వివాదాస్పద పోస్ట్ పెట్టారు. ట్రంప్‌పైనే ఎందుకిలా హత్యాయత్నాలు జరుగుతున్నాయని ఒక నెటిజెన్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. దానికి మస్క్ బదులిస్తూ, 'అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లను చంపడానికి కనీసం ఒక్కరు కూడా ప్రయత్నించడం లేదు. అదేంటో నాకు అర్థం కావడం లేదు' అన్నారు. కమల డెమొక్రటిక్ అభ్యర్థిగా ట్రంప్‌పై అధ్యక్ష బరిలో ఉండటం తెల్సిందే. ఎన్నికల్లో ట్రంప్‌కు మస్క్ మద్దతిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. వాటిని చాలామంది తీవ్రంగా తప్పుబట్టారు. దాంతో మస్క్ ఆ పోస్ట్‌ను తొలగించారు. ''నేనో గుణపాఠం నేర్చుకున్నా. ఒక పోస్ట్ పెడితే అది చూసి ఒక వర్గం సరదాగా నవ్వుకున్నంత మాత్రాన అది అందరికీ ఆమోదయోగ్యం కాదని నాకు అర్థమైంది'' అని మరో పోస్ట్ పెట్టారు.

కేంద్రానిది పెట్రో దోపిడీ: ఖర్గే



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా.. తదనుగుణంగా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం చమురు దోపిడీని కొనసాగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నికలకు వెళుతున్న రాష్ట్రాలు బీజేపీని ఓడించి.. మోదీ ప్రేరేపిత ధరల పెరుగుదలను తిరస్కరించాలని కోరారు. ముడి చమురు ధరలు 32.5 శాతం తగ్గాయని, అయినా బీజేపీ పెట్రో దోపిడీని కొనసాగిస్తోందని ఖర్గే సోమవారం 'ఎక్స్'లో ఆరోపించారు. 'మే 16 2014న బ్యారెల్ ముడిచమురు ధర 107.49 డాలర్లు– ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.71.51, డీజిల్ 57.28. సెప్టెంబరు 16, 2024న బ్యారెల్ ముడిచమురు ధర 72.48 డాలర్లు. అయినా సరే.. లీటరు పెట్రోల్ రూ.94.72, డీజిల్ రూ. 87.62' అని ఖర్గే రాసుకొచ్చారు.

జమిలి అసాధ్యం: చిదంబరం



చండీగఢ్: మోదీ 3.0ప్రభుత్వ హయాంలోనే 'ఒకే దేశం –ఒకే ఎన్నిక'విధానం తీసుకువచ్చేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందంటూ వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తీవ్రంగా స్పందించారు. ప్రస్తుత రాజ్యాంగానికి లోబడి జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ఆయన చెప్పారు. ఈ విధానం తీసుకురావాలంటే రాజ్యాంగానికి కనీసం ఐదు సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చిదంబరం చెప్పారు. ఇందుకు కావాల్సిన మెజారిటీ లోక్‌సభలో కానీ, రాజ్యసభలో కానీ మోదీ ప్రభుత్వానికి లేదని తెలిపారు. అంతేకాకుండా, ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమి జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లను ఎత్తివేస్తుందా అన్న ప్రశ్నకు, మేమెందుకు రిజర్వేషన్లను తొలగిస్తామంటూ ఎదురు ప్రశ్నించారు.

రాహుల్ నాలిక కోస్తే 11 లక్షలిస్తా

శివసేన (షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ప్రకటన



ముంబై: భారత్‌లో రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాలుకను కోసిన వారికి రూ.11 లక్షల నజరానా ఇస్తానని మహారాష్ట్రలో శివసేన (షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''రాహుల్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ నిజస్వరూపం బట్టబయలైంది. రిజర్వేషన్లకు మూలకారకులైన అంబేడ్కర్‌నే అప్పట్లో కాంగ్రెస్ ఓడించింది. రాహుల్ వ్యాఖ్యలు ప్రజలను మోసంచేయడమే. రిజర్వేషన్ల కోసం మరాఠాలు, ధన్‌గర్, ఓబీసీలు ఓ పక్క పోరాడుతుంటే రాహుల్ రిజర్వేషన్ల ఫలాలు దక్కవు అన్నట్లు మాట్లాడుతున్నారు. రాజ్యాంగాన్ని మార్చి దేశాన్ని 400 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్రణాళికలు వేసుకుంది'' అన్నారు. ఆయనపై పోలీసులు కేసు నమోదుచేశారు.

తప్పుకున్న సిర్సా బీజేపీ అభ్యర్థి



చండీగఢ్: హరియాణా అసెంబ్లీకి అక్టోబర్ 5వ తేదీన ఎన్నికలు జరగనుండగా సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని సిర్సా నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రోహతాశ్ జంగ్రా నామినేషన్ ఉపసంహరించుకున్నారు. హరియాణా లోక్‌హిత్ పార్టీ(హెచ్‌ఎల్‌పీ)కి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే గోపాల్ కందాకు తమ పార్టీ మద్దతిస్తుందని ప్రకటించారు. గత ఐదేళ్లుగా హెచ్‌ఎల్‌పీ రాష్ట్రంలోని బీజేపీకి మద్దతుగా నిలిచిందని గోపాల్ చెప్పారు.

'ప్రధాని బహుమతుల' వేలం నేటి నుంచే



న్యూఢిల్లీ: స్పోర్ట్స్ షూ, పారాలింపిక్ విజేతలకు చెందిన వస్తువులు, అయోధ్య రామాలయం ప్రతిరూపం, వెండి వీణ..ఇలా ప్రధాని మోదీ ఏడాది కాలంలో అందుకున్న బహుమతుల వేలం ఈ నెల 17న మొదలై అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చెప్పారు. సుమారు రూ.1.5 కోట్లకు పైగా విలువైన 600 జ్ఞాపికలను వేలంలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో ప్రదర్శనను సోమవారం మంత్రి తిలకించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వేలం రూ.600 నుంచి గరిష్ఠంగా రూ.8.26 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024

ఆఖరి రోజూ భక్త జనసంద్రం

బంజారాహిల్స్/ఖైరతాబాద్: వరుసగా సెలవులు రావడంతో గత రెండు రోజులుగా ఖైరతాబాద్ గణనాథుడిని రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. గణనాథుడి షెడ్డు తొలగించడంతో పాటు చుట్టూ ఉన్న పందిరి తొలగించే క్రమంలో రక్షణ చర్యల్లో భాగంగా సోమవారం భక్తులకు దర్శనాన్ని నిలిపివేస్తున్నట్లుగా ముందుగా ప్రకటించినప్పటికీ సరైన సమాచారం తెలియకపోవడంతో సోమవారం కూడా వేలాదిగా భక్తులు ఖైరతాబాద్‌కు తరలి వచ్చారు. దీంతో ఖైరతాబాద్ రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. రైల్వే ట్రాక్ వైపు నుంచి జనాన్ని గణనాథుడి వైపు రానివ్వకపోవడంతో సెన్సేషన్ థియేటర్ మీదుగా వచ్చారు. మరో వైపు గణనాథుడిని అనుకున్న సమయానికి నిమజ్జనం చేసేందుకు అధికారులు త్వరత్వరగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే మండపంతో పాటు గణనాథుడి చుట్టూ ఉన్న కర్రలను పూర్తిగా తొలగించారు.

గరిష్టం/కనిష్టం
31.0/23.0
వాతావరణం
నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం వేళ చల్లని గాలులు వీస్తాయి.

జీహెచ్ఎంసీ రెడీ..

సజావుగా సాగేందుకు అన్ని విభాగాలతో ఏర్పాట్లు

- ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు
- విధుల్లో 15వేల మంది సిబ్బంది
- కొలనుల వారీగా ఇన్‌చార్జి ఆఫీసర్లు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో మంగళవారం జరగనున్న గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనం సజావుగా సాగేందుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేసింది. శోభాయాత్ర మార్గంలో, నిమజ్జనాలు జరిగే కొలనులు, చెరువుల వద్ద వ్యర్థాలు పోగుపడకుండా ఎప్పటికప్పుడు తొలగించేందుకు గణేశ్ యాక్షన్ టీమ్స్ పేరిట కార్మికుల బృందాలను విధుల్లో నియమించింది. వాహనాలు సాఫీగా సాగేలా , చెట్ల కొమ్మలు అడ్డురాకుండా, అంధకారం లేకుండా చర్యలు తీసుకున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. అన్ని విభాగాల అధికారులతో సర్కిల్, జోన్ల స్థాయిలో సమన్వయ బృందాలను ఏర్పాటు చేసింది. కొలనుల వారీగా ఇన్‌ఛార్జి అధికారులను నియమించింది. అధికారుల నుంచి కార్మికుల దాకా మొత్తం 15 వేల మంది సిబ్బంది నిమజ్జన విధుల్లో నిమగ్నమవుతారని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. వీరు మూడు షిఫ్టులుగా 24 గంటలపాటు భక్తులకు సేవలందించనున్నారు. నిమజ్జనం సందర్భంగా మిషన్లతో కలర్ పేపర్లు వెదజల్లడం వల్ల వాటిని తొలగించేందుకు పారిశుధ్య కార్మికులకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నందున భక్తులు కలర్‌పేపర్లు వెదజల్ల వద్దని విజ్ఞప్తి చేశారు. వాటితోపాటు ప్లాస్టిక్‌తో కూడిన రిబ్బన్లను ఎగరేయవద్దని కోరారు.

శోభాయాత్ర, నిమజ్జనాలకు ఏర్పాట్లు ఇలా...

గణేశ్ యాక్షన్ టీమ్స్: 329
కంట్రోల్ రూమ్‌లు: 10
నిమజ్జనాలు జరిగే కొలనులు: 73
అందుబాటులో ఉంచిన క్రేన్‌లు: 468
తాత్కాలిక విద్యుత్‌లైట్లు: 52,270
మొబైల్ టాయ్‌లెట్స్: 309

- ఆయా ప్రాంతాల్లో వైద్యసహాయ కేంద్రాలు, ఇతరత్రా సదుపాయాలు కల్పించినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

ప్రత్యేక వైద్య శిబిరాలు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా గణేశ్ నిమజ్జనం జరుగుతున్న సందర్భంగా ఆయా ప్రాంతాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, అంబులెన్సులను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు హైదరాబాద్ నగరంలో గణేష్ నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలలో ముందస్తుగా 30 చోట్ల హెల్త్ క్యాంప్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ట్యాంక్ బండ్‌కు లక్షలాదిగా తరలివస్తున్న గణేష్ భక్తులు, పర్యాటకులకు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తాగునీటి శిబిరాలు



జలమండలి హెల్ప్‌సెంటర్ క్యాంప్

సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. గణేష్ నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో ఆయన సోమవారం డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణపతి నిమజ్జన శోభయాత్ర మార్గంతోపాటు నిమజ్జనం జరిగే ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాల్లో సుమారు 122 వాటర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా మొత్తం 35 లక్షల వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రమ్ముల్లోనూ మంచినీరు అందిస్తామని, నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా.. సేవలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచినీటి శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ, ఇతర సమస్యలు పరిష్కారానికి నోడల్ అధికారులు, వారిపై పర్యవేక్షణకు ఏరియాకు ఒక రూట్ అధికారి చొప్పున నియమించినట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం!



నిమజ్జనానికి సిద్ధమైన ఖైరతాబాద్ గణనాథుడు..

ఈ క్రతువు త్వరగా పూర్తయ్యేలా చర్యలు

- ఉదయం 6 గంటలకే ఊరేగింపు ప్రారంభం
- ట్యాంక్‌బండ్ చుట్టూ అదనపు క్రేన్ల ఏర్పాటు
- నగర వ్యాప్తంగా సీసీ, వీడియో కెమెరాల నిఘా
- బందోబస్తు విధుల్లో 25 వేల మంది సిబ్బంది

గణేశ్ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సామూహిక ఊరేగింపు, నిమజ్జనం మంగళవారం జరుగనుండటంతో 25 వేల మంది సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ఘట్టం ఏమాత్రం ఆలస్యం కాకుండా గతం కంటే వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అదనపు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల బైండోవర్, వారిపై నిఘా ఉంటుంది. ప్రతి ఏడాది ఈ కార్యక్రమం మరుసటి రోజు మధ్యాహ్నం వరకు సాగుతోంది. దీంతో ఈ ఏడాది మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సహకారంతో మంగళవారం అర్ధరాత్రి లేదా బుధవారం తెల్లవారుజాము లోపు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఖైరతాబాద్ మహా గణేషుడి నిమజ్జనం ఊరేగింపు ఉదయం 6 గంటలకే ప్రారంభమై...మధ్యాహ్నం 1.30 గంటల లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. విగ్రహాల తరలింపునకు వాహనాలు లభించని వారికి పోలీసులే ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలతో పాటు పెద్ద ఎత్తున హ్యాండ్ హెల్డ్ కెమెరాల్నీ వాడి ప్రతి ఘట్టాన్నీ చిత్రీకరించనున్నారు. బందోబస్తు కోసం నగర పోలీసులతో పాటు కేంద్రం, రాష్ట్ర సాయుధ బలగాలనూ మోహరిస్తున్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి షిఫ్ట్ విధానం అమలు చేస్తూ వారికి అవసరమైన ఆహారం, మంచినీళ్లు అందిస్తున్నారు. పోలీసు అధికారులు ఇతర విభాగాలతో పాటు శాంతి, మైత్రి సంఘాలతో సమన్వయం కలిగి ఉండి పనిచేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఏర్పాట్ల వివరాలివి..

- నగరంలోని మండపాలు: దాదాపు 50 వేలు
- సోమవారం నాటికి నిమజ్జనమైనవి: 9 వేలకు పైగా
- ప్రధాన ఊరేగింపులో పాల్గొనే భక్తులు: 10 లక్షల నుంచి 15 లక్షలు

నిమజ్జనం జరిగే ట్యాంకులు:

ట్యాంక్‌బండ్
రాజన్న బౌలి
మీరాలం ట్యాంక్
ఎర్రకుంట చెరువు
షేక్‌పేట చెరువు
సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్
సఫిల్‌గూడ/మల్కాజ్‌గిరి చెరువులు
హస్మత్‌పేట చెరువు

హుస్సేన్‌సాగర్‌కు వచ్చేవి:
హైదరాబాద్, సైబరాబాద్‌లతో పాటు మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన విగ్రహాలు.



బందోబస్తులో పాల్గొనే విభాగాలు

శాంతి భద్రతలు, టాస్క్‌ఫోర్స్, ఎస్బీ, సీఏఆర్, సీఎస్‌డబ్ల్యూ, హోంగార్డ్స్, ఇతర జిల్లాల అధికారులు, ఏపీ–ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఏపీఎస్పీ, ఏఆర్, సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ పోలీసు ఫోర్స్



సిబ్బంది సంఖ్య

నగర పోలీసు విభాగంలోని నలుగురు అదనపు సీపీలు, ఇద్దరు జాయింట్ సీపీలు, తొమ్మిది మంది డీసీపీలు, ఏడుగురు అదనపు డీసీపీలు, 57 మంది ఏసీపీలు, 247 మంది ఇన్‌స్పెక్టర్లు, 690 మంది ఎస్సైలు, 627 మంది ఏఎస్సైలు, 1860 మంది హెడ్–కానిస్టేబుళ్ళు, 5925 మంది కానిస్టేబుళ్ళు, 680 మంది ఎస్పీఓలు, 6000 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 16,108 మంది సిబ్బందికి తోడు 45 ప్లటూన్ల టీఎస్ఎస్పీ బలగాలు.

కంట్రోల్‌రూమ్స్:

పాతబస్తీలోని సర్దార్ మహల్‌లో జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు టీజీ సీసీసీ, బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్, ఎన్టీఆర్ మార్గ్, గాంధీ నగర్ ఔట్‌పోస్ట్ వద్ద మరో మూడు ఏర్పాటు.

అదనంగా వచ్చేది..

- తొమ్మిది మంది ఐజీలు, ఒక డీఐజీలు, ఒక ఎస్పీలు, 66 మంది డీఎస్పీలు, 86 మంది ఇన్‌స్పెక్టర్లు, 493 మంది ఎస్సైలు, ఆరుగురు మహిళా ఎస్సైలు, 1400 మంది ఏఎస్సై/హెడ్‌కానిస్టేబుళ్ళు, 4720 మంది కానిస్టేబుళ్ళు, 149 మంది మహిళా కానిస్టేబుళ్ళు, 1759 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 8689 మంది. వీరికి అదనంగా 97 ఏఆర్ ప్లటూన్లు, నాలుగు కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటాయి.
- ఆరు యూనిట్ల గ్రేహౌండ్స్, మూడు యూనిట్ల ఆక్టోపస్ బలగాలు అందుబాటులో ఉంటాయి.
- నిమజ్జనం, ఊరేగింపుల్లో సహకరించడానికి 2000 వేల మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లతో పాటు స్వచ్ఛంద కార్యకర్తలూ సహకరించనున్నారు.

పికెట్ల వివరాలు

అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో 310, సమస్యాత్మక ప్రాంతాల్లో 605
మొబైల్ పెట్రోలింగ్ యూనిట్లు: 410
నిఘా కోసం కెమెరాలు: 12 వేల కమ్యూనిటీ సీసీ కెమెరాలు, అదనంగా 2 వేల సీసీ కెమెరాలు, మరో 600 హ్యాండ్‌హెల్డ్ కెమెరాలు

- ఐదు చదరపు కిమీ పరిధిపై నిఘా ఉంచే పీటీజెడ్ కెమెరాను బోట్స్‌క్లబ్‌పై ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.
- 500 మీటర్ల పరిధిలో ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్‌తో పని చేసే 10 మెగా కిక్సల్ కెమెరాలు ట్యాంక్‌బండ్ చుట్టూ ఏర్పాటు చేశారు
- సీసీ కెమెరాల కనెక్టివిటీని డీజీపీ కార్యాలయంతో పాటు సీఎం కార్యాలయానికీ ఇచ్చారు.

బాంబు నిర్వీర్య బృందాలు

16, యాక్సెస్ కంట్రోల్ టీమ్స్: 2,
పోలీసు జాగిలాలు: 22
అదనపు వైర్‌లెస్ సెట్లు: 600 (ప్రస్తుతం ఉన్నవి 4 వేలు)

క్రేన్ల మోహరింపు ఇలా:

ఎన్టీఆర్ మార్గ్: 12+4 రిజర్వ్‌లో
ట్యాంక్‌బండ్: 23+2 రిజర్వ్‌లో
మినిస్టర్స్ రోడ్: 3
రాజన్నబౌలి: 3
మీరాలం/ఎర్రకుంట చెరువులు: రెండేసి చొప్పున

- విగ్రహాలను వాహనాలు ఎక్కించడానికి, అవసరమైన చోట్ల వాడటానికి 108 మొబైల్ క్రేన్లు సిద్ధం చేశారు.

సామూహికం..చరిత్రాత్మకం

నగరంలో ఎనిమిదో దశకం నుంచే మొదలైన నిమజ్జన వేడుకలు

- స్వాగత వేదికలు...సాదర ఆహ్వానాలు
- ఏడాదికి ఒకసారి వినాయక సాగరమయ్యే హుస్సేన్ సాగర్
- కన్నుల పండువగా వేడుకలు
- తెల్లవారుజాము వరకు ఎంఎంటీఎస్ రైళ్లు , మెట్రో సర్వీసులు
- వివిధ మార్గాల్లో సిటీబస్సులు

సాక్షి, సిటీబ్యూరో: గణనాథుడి నిమజ్జనమహోత్సవంతో గ్రేటర్ రహదారులు శోభాయమానమవుతాయి. 'గణపతి బప్పా మోరియా' అంటూ హోరెత్తే మహాజనప్రభంజనం...రెండు కళ్లూ చాలవేమో అన్నట్లుగా సాగే నిమజ్జన వేడుకలకు హైదరాబాద్ మహానగరం సన్నద్ధమైంది. కన్నుల పండువగా సాగే వేడుకలు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి. అన్ని ప్రవాహాలు ఒక్కటైనట్లు దారులన్నీ ఏకమై సాగరానికి తరలిరానున్నాయి. వైవిధ్యభరితమైన గణపతి విగ్రహాలు భక్తులకు కనువిందు చేయనున్నాయి. ప్రతి సంవత్సరం ఎంతో అద్భుతంగా జరిగే హైదరాబాద్ వినాయక సామూహిక నిమజ్జన ఉత్సవాలకు ఒక ప్రత్యేకత ఉంది. అప్పటి వరకు ఎక్కడికక్కడ నిమజ్జనం చేసే విగ్రహాలన్నింటినీ ఒక్కచోటకే తరలించడం వెనుక ఒక తప్పనిసరి అవసరం అనివార్యంగా మారింది.

వినాయక సాగరం..

నిజాం కాలం నాటి చారిత్రక హుస్సేన్‌సాగర్ చెరువు నిమజ్జనోత్సవాలతో ఏడాదికి ఒకసారి వినాయకసాగరమవుతోంది. ప్రతి సంవత్సరం వేలాది విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తున్నారు. నిజానికి వందల కొద్దీ చెరువులు, కుంటలు ఉన్న హైదరాబాద్ నగరంలో భక్తులు మొదట్లో ఎక్కడికక్కడ విగ్రహాలను నిమజ్జనం చేసేవారు. ట్యాంక్‌బండ్‌తో పాటు సఫిల్‌గూడ, సరూర్‌నగర్, మీరాలంట్యాంకు, రాజన్నబావి వంటి చెరువులకు కూడా పెద్ద ఎత్తున విగ్రహాలను తరలించేవారు. 1979లో జరిగిన నిమజ్జనోత్సవానికి కంచి శంకరాచార్యులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చార్మినార్ స్వాగత వేదిక పై నుంచి ఆయన ప్రసంగించారు. ఒకవైపు ఆ ప్రసంగం కొనసాగుతుండగానే అల్లర్లు చోటుచేసుకున్నాయి. ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. దీంతో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి వరకు భక్తుల ఆనందోత్సాహాల నడుమ సాగిన వేడుకలో ఆందోళన నెలకొంది. ఆ సమయంలో నిమజ్జనోత్సవాలు విడివిడిగా జరగడమే ఇందుకు కారణమని భావించిన కొందరు పెద్దలు అన్ని విగ్రహాలను ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. అలా వందేమాతరం రామచంద్రయ్య నేతృత్వంలో ఆలె నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి, దత్తాత్రేయ, భరత్‌సింగ్, డాక్టర్ భగవంత్‌రావు, మరి కొందరు కలిసి 1980లో భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వినాయక విగ్రహాలు హుస్సేన్‌సాగర్ లోనే నిమజ్జనం చేస్తున్నారు.



అర్ధరాత్రి వరకు మెట్రో, ఎంఎంటీఎస్..

- నిమజ్జన వేడుకలకు తరలి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎంఎంటీఎస్ రైళ్లు, మెట్రో సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు.
- లింగంపల్లి–ఫలక్‌నుమా, నాంపల్లి–లింగంపల్లి, సికింద్రాబాద్–నాంపల్లి, ఫలక్‌నుమా–సికింద్రాబాద్, తదితర రూట్లలో బుధవారం తెల్లవారుజాము వరకు అందుబాటులో ఉండేవిధంగా 8 ఎంఎంటీఎస్ సర్వీసులను నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు.
- నిమజ్జన ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తుల కోసం మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటనుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు మెట్రో సర్వీసులు నడుస్తాయి. ప్రారంభస్టేషన్‌ల నుంచి ఒంటిగంటకు బయలుదేరి 2 గంటలకు చివరి స్టేషన్లకు చేరుకుంటాయి.
- ఎల్బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం, జేబీఎస్–ఎంజీబీఎస్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు సర్వీసులను ప్రవేశపెడుతున్నారు.
- సుమారు 600 బస్సులను అదనంగా నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికులు ఇళ్లకు చేరే వరకు ఈ బస్సులు అందుబాటులోఉంటాయి, ఇందిరాపార్కు, ఖైరతాబాద్, లక్డీకాపూల్, బషీర్‌బాగ్, అఫ్జల్‌గంజ్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి.

గతానికి భిన్నంగా నిమజ్జనం ఏర్పాట్లు

- భారీగా షీ–టీమ్ బృందాల మోహరింపు
- సోషల్‌మీడియా పైనా ప్రత్యేక నిఘా
- వంతెన ఎత్తు తెలిసేలా ఎక్కడికక్కడ బోర్డులు

పోలీస్ అలర్ట్!

సాక్షి, సిటీబ్యూరో: నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు కమిషనరేట్ల అధికారులు నిఘా, తనిఖీలు, గస్తీ, సోదాలు ముమ్మరం చేశారు. జనసమ్మర్ధ ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాన ఊరేగింపు, నిమజ్జనం జరిగే చెరువుల దగ్గర, నగర వ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. సోషల్ మీడియా పుకార్లను తీవ్రంగా పరిగణించాలని నిర్ణయించారు. సర్వీస్ ప్రొవైడర్లతోనూ సమన్వయంగా పని చేస్తున్నారు. పుకార్లను వ్యాపింపచేస్తున్న ఎస్సెమ్మెస్‌లు, సోషల్‌మీడియాలపై టెక్నికల్ నిఘా ఉంచే ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేశారు. సామూహిక నిమజ్జనాన్ని తిలకించడానికి ప్రతి ఏడాదీ మహిళా భక్తులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. దీన్ని అదనుగా చేసుకుని ఆకతాయిలు, స్నాచర్లు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకున్న సిటీ పోలీసులు ఈసారి గతానికి భిన్నంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవ్‌టీజర్లుకు చెక్ చెప్పడానికి 100 షీ–టీమ్ బృందాలను వివిధ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. దాదాపు 40కి పైగా డెకాయ్ టీమ్స్ మోహరిస్తున్న ఉన్నతాధికారులు ఇందులో క్రైమ్ వర్క్‌పై పట్టున్న వాళ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో ఎవరికైనా పుకార్లతో కూడిన సందేశాలు వస్తే వాటిని తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేస్తున్నారు. వీటిని మరో గ్రూపులోకో, వ్యక్తిగతంగానో ఫార్వర్డ్ చేస్తే సాంకేతిక నిఘాతో వారిని కనిపెట్టేలా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడానికి విగ్రహాల ఎత్తు కూడా ఓ కారణమయ్యే అవకాశం ఉంది. నగర వ్యాప్తంగా ప్రధాన ఊరేగింపులు జరిగే మార్గాల్లో 17 ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు ఉన్నాయి. వీటి ఎత్తును, విగ్రహాల ఎత్తుతో పోల్చుకుని అందుకు తగ్గ ఊరేగింపు మార్గాన్ని ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఊరేగింపు సమయంలో విగ్రహాలు వంతెనల వద్ద ఇరుక్కుపోయి తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్...ఒక్కోసారి శాంతి భద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. గణేష్ విగ్రహం వెళ్లే ఊరేగింపు మార్గంలోని వంతెనల కన్నా కనీసం 5 అడుగులు తక్కువగా విగ్రహం ఎత్తు ఉండాలి. వంతెన కింది నుంచి ఉన్న రోడ్డు దగ్గర ఈ ఎత్తును పరిగణనలోకి తీసుకుంటారు. 'గణేష్'ని తీసుకువెళ్లే వాహనం (లారీ, వ్యాన్ తదితరాలు) ఎత్తు గరిష్టంగా 5 అడుగులు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే విగ్రహం ఎత్తు వంతెన కంటే కనిష్టంగా 5 తక్కువగా ఉండాల్సిన అవసరం ఉంది. అలా సరిపోయే ఊరేగింపు మార్గాన్ని మండపాల నిర్వాహకులు ఎంపిక చేసుకోవాలి. నగరంలోని దాదాపు ప్రతి ఫ్లైఓవర్, ఇతర బ్రిడ్జిల వద్ద వాటి ఎత్తును సూచిస్తూ ట్రాఫిక్ పోలీసులు బోర్డులు ఏర్పాటు చేశారు.



ఉత్సాహంగా వినాయక నిమజ్జనం

ఘనంగా ఏర్పాట్లు చేసిన
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు



కూకట్‌పల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు జీఎల్ఎన్ రెడ్డి, కోటిరెడ్డి, చెన్నారెడ్డి, శివ, మాధవరెడ్డిల ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ గణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో భారీ వినాయకుడిని ఏర్పాటు చేశారు. నిత్యం పూజలతో పాటు అన్నదానం నిర్వహించారు. సోమవారం వినాయక నిమజ్జనం ఉత్సాహంగా సాగింది. కాలనీలో జగన్‌మోహన్‌రెడ్డి లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు.

యజమానుల నిర్లక్ష్యమే కలిసొచ్చింది!

- తాళం వేయని వాహనాలే టార్గెట్
- కడప నుంచి వచ్చి నగరంలో చోరీలు
- ఎనిమిదింటిని తస్కరించిన ద్వయం
- అరెస్టు చేసిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఐదు ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కేవలం తాళం వేయని వాహనాలనే టార్గెట్ చేసుకున్న వీరికి ఆయా వాహన యజమానుల నిర్లక్ష్యమే కలిసి వచ్చింది. వీరి నుంచి ఎనిమిది ఖరీదైన బైక్స్ స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర సోమవారం వెల్లడించారు. కడప జిల్లాకు చెందిన పి.ధర్మతేజ ప్రైవేట్ ఉద్యోగి, అతను గతంలో కొన్నాళ్లు ఎస్సార్‌నగర్‌లోని ఓ హాస్టల్ ఉన్నాడు. జల్సాలకు అలవాటుపడిన ఇతను వాహనాల చోరీకి అలవాటుపడ్డాడు. ఏపీలోని కడప, విజయవాడల్లో ఇతడిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలోనే జైలు నుంచి బయటకు వచ్చిన ధర్మతేజ తన స్నేహితుడైన ఎస్.గురప్పతో జట్టు కట్టాడు. ఇద్దరూ కలిసి హైదరాబాద్ వచ్చి ఓ హోటల్‌లో బస చేశారు. గతంలో నగరంలో ఉండి వెళ్లడంతో ఇక్కడి పరిస్థితులపై ధర్మతేజకు అవగాహన ఉంది. దీని ఆధారంగా బంజారాహిల్స్, మధురానగర్, కాచిగూడ, దోమలగూడ, ఎస్సార్‌నగర్‌ల్లో సంచరిస్తూ తాళం వేయని ద్విచక్ర వాహనాలను గుర్తించి, అదను చూసుకుని తస్కరించారు. ఇలా మొత్తం ఐదు చోరీ చేసి రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పలువురి వద్ద తాకట్టు పెట్టారు. వీరి వ్యవహారంపై వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య నేతృత్వంలో ఎస్సై బి.అర్వింద్‌గౌడ్‌తో కూడిన బృందం వలపన్ని పట్టుకుంది. విచారణ నేపథ్యంలో కడపలోనూ మరో మూడు బైక్‌లను తస్కరించి తాకట్టు పెట్టినట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో మొత్తం ఎనిమిది వాహనాలకు రికవరీ చేసిన అధికారులు కేసును ఎస్సార్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఇప్పటి వరకు వీరిపై తెలంగాణ, ఏపీల్లో కలిపి 16 కేసులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు.

తీన్‌మార్ స్టెప్పులేసి.. తిరిగి రాని లోకాలకు

- వినాయక నిమజ్జనంలో అపశృతి
- గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి
- అలకాపూర్ టౌన్‌షిప్ విషాద ఛాయలు



శ్యాంకుమార్ (ఫైల్)

మణికొండ: వినాయక నిమజ్జనోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. అప్పటి వరకు తీన్ మార్ స్టెప్పులకు అనుగుణంగా గంటన్నర పాటు స్టెప్పులేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుప్పకూలడంతో హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేక పోవటంతో అతను మృతి చెందిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అలకాపూర్ టౌన్‌షిప్ వినాయక ఉత్సవాలకు కోశాధికారిగా ఉన్న శ్యాంకుమార్(41) ఆదివారం నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. లడ్డూ వేలం పాట జరగటంతో దానిని దక్కించుకునేందుకు రూ. 15లక్షల వారు పాడాడు. అయినా పోటీదారుడు తగ్గక వదిలేయడంతో మరో వ్యక్తి దానిని రూ. 16లక్షలకు దక్కించుకున్నాడు. అయినా జోష్ తగ్గని శ్యాంకుమార్ లడ్డూ దక్కించుకున్న అతనితో కలిసి డ్యాన్స్ చేశాడు. మండపం నుంచి వంద అడుగుల దూరంలో ఉన్న యోగా సర్కిల్ వద్దకు ఊరేగింపు రాగానే డ్యాన్స్ చేస్తున్న అతను ఒక్కసారిగా కుప్పకూలాడు. దీనిని గుర్తించిన అతడి మిత్రులు సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు గంట పాటు విశ్వప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. శ్యాంకుమార్ మృతితో అలకాపూర్ టౌన్‌షిప్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. సోమవారం సాయంత్రం పుప్పాలగూడలోని స్మశానవాటికలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు. అతడి భార్య ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, వారికి ఓ కుమారుడు ఉన్నాడు.

వైద్యులు చెప్పినా...

అతని గుండెకు ఉన్న రెండు వాల్వ్‌లు మూసుకు పోయాయని, శస్త్ర చికిత్స చేయించుకోవాలని వైద్యులు ఏడాది క్రితమే శ్యాంకుమార్‌కు సూచించినట్లు అతని మిత్రులు తెలిపారు. అయినా అతను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. ఆదివారం రాత్రి ఏకధాటిగా రెండు గంటల పాటు డ్యాన్స్ చేయటంతో శ్వాసకోశాల్లో ఒత్తిడి పెరిగి గుండె ఆగిపోయిందని డాక్టర్లు తెలిపారన్నారు.

నాసిరకం చిప్స్‌తో దోచేస్తున్నారు..

రవాణా శాఖలో స్మార్ట్ కార్డ్స్ స్కామ్

- చైనాలో తయారైన నాసిరకం చిప్స్ వినియోగం
- నిబంధనలు తుంగలో తొక్కిన కలర్ ప్లాస్ట్ సంస్థ
- ధ్రువీకరించిన నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్
- చర్యలు తీసుకోవడంలో అధికారుల వెనుకడుగు
- వెల్లడించిన 'రాహత్' చైర్మన్ డాక్టర్ కమల్ సోయి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖలో భారీ స్మార్ట్ కార్డ్స్ స్కామ్ చోటు చేసుకుందని చండీఘడ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'రాహత్ ఫౌండేషన్' చైర్మన్ డాక్టర్ కమల్ సోయి ఆరోపించారు. వీటి తయారీ కాంట్రాక్టు దక్కించుకున్న కలర్ ప్లాస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నాణ్యమైన చిప్స్‌కు బదులుగా చైనాలో తయారైన నాసిరకం చిప్స్ వాడుతోందన్నారు. ఈ విషయాన్ని ఢిల్లీ కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సైతం నిర్ధారించిందని, అయితే కలర్ ప్లాస్ట్ సంస్థపై చర్యలు తీసుకోవడానికి రవాణా శాఖ అధికారులు, ప్రభుత్వం కూడా వెనుకడుగు వేస్తున్నాయన్నారు. సోమవారం సోమాజీగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడారు.

ఏటా 40 లక్షల కార్డుల సరఫరా...

రవాణా శాఖ జారీ చేసే స్మార్ట్ కార్డుల రూపంలో జారీ చేసే డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ల తయారీ కాంట్రాక్టును కలర్ ప్లాస్ట్ సంస్థ దక్కించుకుంది. ఏడాదిలో 40 లక్షల కార్డులు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకున్నారు. ఇందులోని నిబంధనల ప్రకారం ఈ కార్డుల తయారీలో స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఫర్ ట్రాన్స్‌పోర్టు అప్లికేషన్ (స్కోస్టా) అనుకూలంగా ఉన్న చిప్స్‌ను మాత్రమే వినియోగించాలి. అయితే కలర్ ప్లాస్ట్ సంస్థ చైనా నుంచి దిగుమతి చేసుకున్న నాశిరకమైన చిప్స్‌తో ఈ కార్డులను తయారు చేస్తోంది. వీటిని హ్యాక్ చేయడం, అనధికారికంగా యాక్సస్ చేయడం, డేటా సంగ్రహించడం చాలా తేలిక. రహదారి భద్రతా రంగంలో కృషి చేస్తున్న రాహత్ ఫౌండేషన్‌కు దీనిపై సమాచారం అందింది.



20 కార్డుల్లో 12 నాసిరకంగా నిర్ధారణ...

ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కమల్ సోయి దీనిపై ఈ ఏడాది మేలో మీడియాకు వివరించారు. దీంతో స్పందించిన రవాణా శాఖ అధికారులు కలర్ ప్లాస్ట్ సంస్థ సరఫరా చేసిన 20 కార్డులను పరీక్షల నిమిత్తం ఢిల్లీలోని ఎన్ఐసీకి పంపారు. వీటిని పరీక్షించిన ఎన్ఐసీ నిపుణులు కేవలం 8 కార్డులు మాత్రమే నిబంధనల మేరకు నాణ్యమైన చిప్‌తో తయారయ్యాయని, మిగిలిన 12 నాసిరకం చిప్స్‌తో ఉన్నాయని నిర్ధారిస్తూ ఈ ఏడాది జూన్ 10న నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా ఆర్టీఏ అధికారులు అదే నెల 24న కలర్ ప్లాస్ట్ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై 10 రోజుల్లోనే సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికీ సదరు సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే కంపెనీ బీహార్ రవాణా శాఖకు స్మార్ట్‌కార్డులు సరఫరా చేస్తోంది.

60 శాతం నాసిరకం చిప్‌తోనే..

ఎన్ఐసీ నివేదిక ఆధారంగా తెలంగాణలో సరఫరా అయిన స్మార్ట్‌కార్డుల్లో దాదాపు 60 శాతం నాసిరకమేనని రాహత్ సంస్థ అంచనా వేస్తోంది. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మరోసారి స్మార్ట్‌కార్డుల సరఫరాకు టెండర్లు ఆహ్వానించగా కలర్ ప్లాస్ట్ కూడా పాల్గొంది. ఈ సంస్థపై తక్షణం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు దేశ వ్యాప్తంగా ఎక్కడా స్మార్ట్ కార్డుల సరఫరా చేయకుండా నిషేధించాలని కమల్ సోయి డిమాండ్ చేశారు. తెలంగాణ అధికారులు, ప్రభుత్వ ఉదాశీన వైఖరిని చూస్తుంటే ఈ వ్యవహారంలో వారి పాత్ర ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ స్మార్ట్ కార్డ్స్‌ను ప్రతి నెలా తనిఖీ చేయించాలని, ఆ ఖర్చు సరఫరా చేస్తున్న సంస్థే భరించాలని నిబంధనలు చెబుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో భారీ మొత్తం ప్రజా ధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వారాలు వేచి చూసిన తర్వాత ప్రభుత్వం స్పందించకుంటే న్యాయస్థానంతో పాటు సీబీఐని ఆశ్రయిస్తామని కమల్ సోయి పేర్కొన్నారు.

లాడ్జిలో నర్సు అనుమానాస్పద మృతి

గచ్చిబౌలి: లాడ్జిలో ఓ నర్సు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మాదాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జడ్చర్లకు చెందిన గొల్ల వెంకటయ్య కుమార్తె శ్రుతి(23) నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది. గచ్చిబౌలిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో కొన్నాళ్లపాటు నర్సుగా పని చేసింది. కొద్ది రోజుల క్రితం ఇంటికి వెళ్లిన ఆమె ఓ ప్రమాదంలో గాయపడటంతో అక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 14న షాద్‌నగర్‌కు చెందిన తన స్నేహితురాలు మౌనికతో కలిసి హైదరాబాద్‌కు వచ్చింది. అనంతరం శ్రుతి, మౌనిక, విద్యపోగు జీవన్‌పాల్, పిన్నెల్లి వెంకటేష్‌తో కలిసి శనివారం రాత్రి చిన్న అంజయ్యనగర్‌లోని రెడ్ స్టోన్ లాడ్జిలో రెండు గదులు అద్దెకు తీసుకున్నారు. రూమ్ నెంబర్ 301లో శ్రుతి, జీవన్ పాల్, రూమ్ నెంబర్ 505లో మౌనిక, వెంకటేష్ బస చేశారు. ఆదివారం సాయంత్రం నలుగురు కలిసి రూమ్ నెంబర్ 301లో పార్టీ చేసుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికి శ్రుతి తల నొప్పిగా ఉందని చెప్పి రూమ్ నెంబర్ 505కి వెళ్లింది. రాత్రి 9.30 గంటల సమయంలో అందరూ కలిసి నిమజ్జనం చూసేందుకు సికింద్రాబాద్ వెళ్లాలనుకున్నారు. మౌనిక ఫోన్ చేసినా శ్రుతి స్పందించకపోవడంతో రూమ్‌కు వెళ్లి తలుపు తట్టినా సమాధానం రాకపోవడంతో వారు ముగ్గురు మాత్రమే సికింద్రాబాద్‌కు వెళ్లారు. తెల్లవారు జామున లాడ్జికి తిరిగి వచ్చిన వారు మళ్లీ గది తలుపులు తట్టినా శ్రుతి స్పందించకపోవడంతో నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో వారు మాస్టర్ కీతో తలుపులు తెరచి చూడగా శ్రుతి సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకు కనిపించింది. దీంతో వారు మృతురాలి తండ్రి వెంకటేష్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ ఏసీపీ సీహెచ్. శ్రీకాంత్



గొల్ల శ్రుతి(ఫైల్)

నా కుమార్తెను హత్య చేశారు

తన కుమార్తె ఎంతో ధైర్యంగా ఉండేదని, ఆమెపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసి ఉంటారని మృతురాలి తండ్రి గొల్ల వెంకటేష్ ఆరోపిస్తున్నాడు. తనకు సమస్యలు ఉన్నట్లు ఎప్పుడూ చెప్పలేదని కన్నీరు మున్నీరయ్యాడు. రాత్రి 3 గంటలకు శ్రుతి చనిపోయిందని చెబితే వెంటనే వచ్చామని అప్పటికే మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించారని తెలిపారు. శ్రుతి స్నేహితురాలితో పాటు ఇద్దరు యువకులను విచారించాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్టీలో ఏం జరిగింది..?

మహబూబ్‌నగర్‌లోని ఓ డ్రైవింగ్ స్కూల్ థియరీ క్లాస్‌లు చెప్పే జీవన్ పాల్‌తో రెండేళ్ల క్రితం శ్రుతికి పరిచయం ఏర్పడింది. శ్రుతి ద్వారా మౌనిక, వెంకటేష్ స్నేహితులయ్యారు. వీకెండ్‌లో నగరానికి వచ్చే వీరు హోటళ్లలో బస చేసి ఎంజాయ్ చేసేవారు. ఇదే క్రమంలో రెడ్ స్టోన్ లాడ్జిలో దిగారు. నలుగురు కలిసి చేసుకున్న పార్టీలో ఏం జరిగిందనే విషయమై ఇప్పటికీ స్పష్టత రాలేదు. తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నా జీవన్ పాల్ శనివారం రాత్రి శ్రుతితో కలిసి ఒకే గదిలో ఉన్నాడు. శ్రుతి తలుపు తెరవకపోయినా పట్టించుకోకుండా నిమజ్జనం కోసం ఎందుకు వెళ్లారో అర్థం కావడం లేదు. ప్రాథమిక ఆధారాలను బట్టి ఆత్మహత్యగా పోలీసులు పేర్కొంటున్నా అందుకు కారణాలు తెలియ రాలేదు.

ఎంప్లాయీస్ సంఘ్ బలోపేతానికి కృషి



ఎంప్లాయీస్ సంఘ్‌లో చేరిన మజ్దూర్ యూనియన్ నేతలతో వేగి మురళీకృష్ణ

నాంపల్లి: రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బలోపేతానికి కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణి భానూ ప్రసాద్ అన్నారు. సోమవారం రైల్వే మజ్దూర్ యూనియన్ నేతలు పలువురు ఎంప్లాయీస్ సంఘ్‌లో చేరారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ హైదరాబాద్ సీఎండబ్ల్యూ మెకానికల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వేగి మురళీకృష్ణ నేతృత్వం వహించారు. మజ్దూర్ నేతలు రాజేష్ కుమార్ చౌదరి, వినోద్ కుమార్, సనత్‌నగర్ సీఎండబ్ల్యూ డిపోకు చెందిన రాజేష్ కుమార్ ఎంప్లాయీస్ సంఘ్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ చౌదరి, వినోద్‌కుమార్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఎంప్లాయీస్ సంఘ్‌ను మరింత బలోపేతం చేయడానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య నేతృత్వంలో పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న వేగి మురళీకృష్ణ నాయకత్వాన్ని బలపరుస్తామన్నారు. రాబోయే రైల్వే ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయకేతనం ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు ఎం.హెచ్.కిరణ్ కుమార్, చంద్ర కి రణ్, సంతోష్, సనత్‌నగర్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, సాజిద్ బేగ్, హేమంత్‌కుమార్, సింద్రాబాద్ డివిజన్ మహిళా కార్యదర్శి జ్యోతి, సికింద్రాబాద్ ఇంజినీరింగ్ చైర్మన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌జే స్థలంపై కుట్రలు తగవు

సాక్షి, హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ఇటీవల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని అప్పగించడంపై కొందరు కుట్రదారులు కడుపుమంటతో అక్కసు వెళ్లగక్కుతున్నారని సొసైటీ డైరెక్టర్లు బి.కిరణ్ కుమార్, ఆర్.రవికాంత్‌రెడ్డి, ఎస్.వంశీ శ్రీనివాస్, పీవీ రమణారావు, కె.అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. స్థలాల కేటాయింపును అడ్డుకుంటామని బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు. అప్పట్లో స్థలం కొనుగోలుకు సభ్యులు అప్పులు చేశారన్నారు. కుట్రదారులు వాస్తవాలను విస్మరించి సొసైటీపై విషం చిమ్ముతున్నారని, ఆంధ్ర, తెలంగాణ పేరిట ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై రాజకీయ ప్రేరేపిత స్వయం ప్రకటిత సోషల్ మీడియా జర్నలిస్టులు చేస్తున్న దుష్ప్రచారాన్ని బుద్ధి జీవులు, విద్యావంతులు, సాధారణ ప్రజానీకం నమ్మవద్దని సొసైటీ డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. తమ సొసైటీపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సొంతింటి కల నెరవేరిన వేళ...

'1960ల నుంచి వచ్చిన ప్రభుత్వాలు జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం భూమిని కేటాయించాయి. డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి 70 ఎకరాలు కేటాయించింది. సొసైటీలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న వెయ్యి మంది జర్నలిస్టులు ఉన్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉండి కూడా సభ్యులు రూ. 2 లక్షల చొప్పున 2011లో అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రూ.12.33 కోట్లను ప్రభుత్వానికి చెల్లించారు. లీగల్ ఇష్యూస్ కారణంగా స్థలం అప్పగింతలో జాప్యం ఏర్పడింది. ఈ క్రమంలో సొసైటీకి భూమిని అప్పగించాలని సుప్రీం కోర్టు 2017లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడంతో గత ప్రభుత్వం 2018లో 32 ఎకరాలను సొసైటీకి అప్పగించింది. మళ్లీ 2022లో మిగిలిన 38 ఎకరాలను అప్పగించాలని అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో మా సొసైటీకి మిగిలిన 38 ఎకరాలను అప్పగించింది' అని పేర్కొన్నారు.

కొందరు అకాల మరణం.. మరికొందరు ఆధారం కోల్పోయి..

జేఎన్‌జే స్థలాల కోసం నిరీక్షించి కుంగిపోయి కొందరు, అనారోగ్యంతో మరికొందరు.. మొత్తం 70 సభ్యులు అకాల మరణం చెందారని సొసైటీ డైరెక్టర్లు తెలిపారు. కుటుంబ యజమానిని కోల్పోయిన జర్నలిస్టుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడ్డాయని విచారం వ్యక్తం చేశారు. కోవిడ్ మహమ్మారి తరువాత చాలామంది జర్నలిస్టులు ఉద్యోగాలు కోల్పోయారని పేర్కొన్నారు. 16 ఏళ్ల అవిశ్రాంత న్యాయ పోరాటం అనంతరం దక్కిన నోటి కాడి బుక్కను దక్కకుండా చేయాలని కుట్రదారులు చూస్తున్నారని ఆరోపించారు. సొసైటీ సభ్యులు కూడా ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి సహకరించారని, ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా దుష్ప్రచారాన్ని మానుకోవాలని కోరారు.

బాలలను ప్రోత్సహించడానికే సాంస్కృతికోత్సవం

దర్శకుడు కె.మోహన్



సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్‌లో రెయిన్‌బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు డ్యాన్స్, డ్రాయింగ్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై, విజేతలకు మెమొంటో, పాల్గొన్నవారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. అలాగే పిల్లలతో పాటు పెద్దలకు కళారత్న, సేవా రత్న అవార్డులను ప్రదానం చేశారు. 'బాలలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించాం' అని బాలల చిత్రం 'అప్పూ' దర్శకుడు, రెయిన్‌బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి కె.మోహన్ పేర్కొన్నారు. బాలల చలన చిత్ర దర్శకుడు సైదా సురాజ్, నటీమణి వీఎన్ పద్మావతి, హీరోయిన్ లక్కీ, మేఘనా చౌదరి, నటుడు, సోషల్ వర్కర్ మూసా అలీఖాన్, బి.సత్యనాదం, ఆనంద్ సింగ్, గడ్డం మహిపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సాంస్కృతిక కార్యక్రమానికి లక్ష్మీ సాత్విక యాంకర్‌గా వ్యవహరించారు.

మినీ లారీ కింద పడి చిన్నారి దుర్మరణం



మృతి చెందిన చిన్నారితో తండ్రి కృష్ణ, కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: మినీ లారీ కింద ఆడుకుంటున్న కుమారుడిని గమనించక తండ్రి వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకెళ్లడంతో చక్రాల కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సై కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, గుడికల్ ప్రాంతానికి చెందిన కృష్ణ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి బతుకు తెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. కిస్మత్‌పూర్ ప్రాంతంలో సిమెంట్ ఇటుకలు తయారు చేసే వ్యక్తి వద్ద పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. కృష్ణ ఇటుకల తయారీతో పాటు మినీ డీసీఎంలో ఇటుకలను చేరవేసేవాడు. అతడి చిన్న కుమారుడు విఘ్నేష్ (3) సోమవారం మధ్యాహ్నం పార్కు చేసిన మినీ డీసీఎం ముందు చక్రాల కింద ఆడుకుంటున్నాడు. దీనిని గుర్తించని కృష్ణ వాహనాన్ని స్టార్ట్ చేసి ముందుకు పోనివ్వగా చక్రాలు చిన్నారి విఘ్నేష్ మీదుగా వెళ్లాయి. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాకేష్‌రాయ్ మృతదేహం

దుండిగల్: రెడీమిక్స్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బీహార్‌కు చెందిన రాకేష్‌రాయ్(33), గుడ్డి దంపతులు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చారు. రాకేష్ భౌరంపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కూరగాయల దుకాణం నడుపుతున్నాడు. సోమవారం ఉదయం అతను భార్య గుడ్డితో కలిసి బైక్‌పై షాపూర్‌నగర్ వెళుతుండగా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో మియాపూర్ నుంచి బహదూర్‌పల్లికి వైపు వెళుతున్న రెడీమిక్స్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాకేష్‌రాయ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య గుడ్డికి కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.అతివేగం కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. రెడీమిక్స్ వాహన డ్రైవర్ పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పీపుల్స్ ప్లాజాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జలమండలి ఉన్నతాధికారులు...

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

● సమన్వయంతో ముందుకెళ్తున్న వివిధ శాఖలు ● ఉచితంగా నీటి సరఫరా చేయనున్న జలమండలి ● పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు

గత కొన్ని రోజుల నుంచి భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు మంగళవారం గంగమ్మ ఒడికి చేరనున్నారు. బొజ్జ గణపయ్య నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభయాత్రలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకుసాగుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే నిమజ్జన శోభాయాత్ర జరగనుండగా సాయంత్రానికి ఊపందుకోనుంది. పంజగుట్ట, ఖైరతాబాద్, సైఫాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో అదనపు పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి ఆయా పోలీస్‌స్టేషన్లకు సిబ్బంది చేరుకున్నారు. –బంజారాహిల్స్

5 లక్షల మంచి నీటి ప్యాకెట్లు రెడీ

బంజారాహిల్స్: జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ ఆపరేషన్స్ విజయారావు, సీజీఎం ప్రభు, డివిజన్ –6 జీఎం హరి శంకర్ నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, అమీర్‌పేట, పంజగుట్ట ప్రధాన రహదారుల్లో నిమజ్జన శోభాయాత్ర, నిమజ్జనం జరిగే ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే గుర్తించిన ప్రాంతాల్లో ఉచిత మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. జలమండలి డివిజన్–06 పరిధిలో ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, ఈఎస్ఐ, పంజగుట్ట, ఆర్టీఏ కార్యాలయం, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా, ఎస్పీటీనగర్ కమాన్, బోరబండ ప్రాంతాల్లో మంచినీటి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 10 చోట్ల ఏర్పాటు చేస్తున్న ఈ క్యాంపుల ద్వారా 5 లక్షల నాణ్యమైన మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేయాలని తలపెట్టారు. శోభాయాత్ర జరిగే మార్గాల్లో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా ఆరు ఎయిర్‌టెక్ మిషన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 24 గంటలపాటు డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తలెత్తకుండా చూసేందుకు 60 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే అన్నప్రసాద వితరణ కేంద్రాల వద్ద కూడా ఉచిత నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ల వద్ద క్రేన్లు సిద్ధం



బంజారాహిల్స్: గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద విగ్రహాలను ఎత్తేందుకు ఒక్కో ఏసీపీ డివిజన్‌కు మూడు క్రేన్ల చొప్పున అధికారులు కేటాయించారు. కేటాయించిన క్రేన్లు ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్ల వద్దకు చేరుకున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ డివిజన్లకు 12 క్రేన్లను కేటాయించారు. మండపాల నుంచి ఈ క్రేన్లు గణనాథులను భారీ టస్కర్లపైకి ఎక్కించేందుకు వినియోగిస్తారు.

శోభాయాత్రలో కలర్ షాట్స్ వద్దు

బంజారాహిల్స్: గత నాలుగైదు రోజుల నుంచి జరుగుతున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్రల సందర్భంగా నిర్వాహకులు రంగురంగుల పేపర్లతో కూడిన కలర్‌షాట్స్‌ను వినియోగిస్తున్నారు. ఇవి రోడ్లపైన పడటంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. స్వీపర్లు రోడ్లు ఊడుస్తున్నా ఇవి రోడ్డుకు అలాగే అంటుకుపోయి ఉంటున్నాయి. దీంతో మంగళవా రం జరగనున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు కలర్ షాట్స్ వినియోగించవద్దంటూ ఎ న్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, అమీర్‌పేట, పంజగుట్ట రహదారుల్లో బ్యానర్లు పట్టుకొని అవగాహన కల్పిస్తున్నట్లు సర్కిల్–17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై శోభాయాత్ర నిర్వాహకులు జీహెచ్ఎంసీకి సహకరించాలని కోరారు.


శోభాయాత్రలో కలర్ షాట్స్ వినియోగించవద్దంటూ అవగాహన కల్పిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

240 పోలీస్ సిబ్బందితో బందోబస్తు


కార్యక్రమంలో మాట్లాడుతున్న బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం జరిగే వినాయక నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. మొత్తం 240 మంది సిబ్బందితో ఈ బందోబస్తు ఉంటుందన్నారు. బంజారాహిల్స్ మొత్తం 294 విగ్రహాలకు గాను ఇప్పటికే చాలావరకు నిమజ్జనం అయ్యాయని, ఆఖరి రోజైన మంగళవారం 74 విగ్రహాలు నిమజ్జనానికి తరలుతాయని పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ పరిధిలో 47 విగ్రహాలకుగాను చివరిరోజు 13 విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎనిమిది పికెట్లు బంజారాహిల్స్, మరో ఎనిమిది పికెట్లు మాసబ్‌ట్యాంక్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఆరు పుషింగ్ పార్టీలు, ఒక వాచ్‌టవర్, రెండు స్టాటిక్ జనరేటర్లు, నాలుగు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు, మూడు మొబైల్ టీమ్‌లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఏసీపీతోపాటు నలుగురు సీఐలు, 30 మంది ఎస్ఐలు, 180 మంది కానిస్టేబుళ్లు, 20 మంది హోంగార్డులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ప్రతీ వాహనంలో ఒక జవాన్ నిమజ్జనం వరకు వెళ్లి తిరిగి అదే పాయింట్‌కు చేరుకున్నాక పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. విగ్రహాలు తరలించే వాహనాల్లో టపాకాయలు, లాఠీలు, రాళ్ళు ఉంచకూడదన్నారు. రంగులు చల్లవద్దని, డీజేలు నిషిద్ధమని పేర్కొన్నారు.



ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన మొబైల్ టాయ్‌లెట్

శోభాయాత్రలో డీజేలు వాడొద్దు

నిర్వాహకులకు పోలీసుల సూచన

బంజారాహిల్స్: వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, ట్యాంక్‌బండ్‌లోనూ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే పీపుల్స్ ప్లాజా, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్‌కు దగ్గరగా వచ్చిన తర్వాత శోభాయాత్ర నిర్వాహకులు సంగీత సాధనాలను ఉపయోగించవద్దని సూచిస్తున్నారు. పోలీసులు, నిమజ్జన అధికారులు చేసే అనౌన్స్‌మెంట్లు భక్తులకు సరిగ్గా చేరాలంటే ఖచ్చితంగా ఈ సాధనాలను బంద్ చేయాలని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. మరోవైపు హుస్సేన్‌సాగర్ చుట్టూ వేలాదిగా వచ్చే సందర్శకులు, నిర్వాహకుల సౌకర్యార్థం అన్ని వైపులా పదుల సంఖ్యలో మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్, శానిటేషన్, నీటి పారుదల, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు నిమజ్జనాలు పూర్తయ్యే వరకు 24 గంటలూ షిఫ్టులవారీగా అందుబాటులో ఉంటారని తెలిపారు.


సంగీత వాయిద్యాలు వాడొద్దంటూ నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన బోర్డు


ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్

గణనాథుడికి పూజలు

బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ఫిలింనగర్, పంజగుట్ట ప్రాంతాల్లో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు వినాయక మండపాల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. మండపాల వద్ద లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. మంగళవారం నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కు తరలించేందుకు టస్కర్లను సిద్ధం చేశారు.


ఖైరతాబాద్ భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


గౌరీశంకర్ కాలనీలో మండపంలో పూజలు చేస్తున్న బస్తీవాసులు


గణేశుడి నిమజ్జనానికి బయలుదేరుతున్న మాజీ కార్పొరేటర్ వనజ లక్ష్మణ్‌గౌడ్


రాజీవ్‌నగర్‌కాలనీ మండపంలోని గణేశుడి చిన్నలడ్డూని దక్కించుకున్న కనకదుర్గ


రాజీవ్‌నగర్‌కాలనీ గణనాథుడి పెద్ద లడ్డూను దక్కించుకున్న నరేంద్రకుమార్


వినాయక మండపం వద్ద విశ్వకర్మ సంఘం నాయకుల పూజలు


ఇందిరానగర్‌లో త్రిశూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలు...


ఫిలింనగర్ యువజన సంఘం గణేశుడికి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ


ఉదయ్‌నగర్‌లో వినాయకుడి పూజల్లో విద్యుత్ ఉద్యోగులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ నేతలు


గణనాథుడి చెంత కళాకారులను సన్మానిస్తున్న గుడూరి విజయలక్ష్మి, చింతపల్లి శోభారెడ్డి


గణనాథుడి లడ్డూను అందుకుంటున్న లక్ష్మణ్ నాయక్


బంజారాహిల్స్ రోడ్-12లోని శ్రీరామ్ నగర్ కాలనీలో వినాయకుడి వద్ద మేయర్ విజయలక్ష్మి

‘వర్గీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి’


సమావేశంలో మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

లిబర్టీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ అంగీకరించబోమని తేల్చి చెప్పారు. సోమవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని, వర్గీకరణ వల్ల దళితులు నష్టపోతారని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలను ఎస్సీ కులాలు, ఎస్సీ ఉప కులాలు అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు.

మహేష్ కుమార్‌గౌడ్‌కు అభినందనలు

కాచిగూడ: టీపీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్ గౌడ్‌ను హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన పార్టీ సీనియర్ నేత ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను అభినందిస్తున్న ఎం.ఆర్.జి.వినోద్ రెడ్డి

స్ఫూర్తికి చిహ్నాలు.. అభిమానానికి నిదర్శనం


తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్..


సర్వాయి పాపన్న కమ్యూనిటీ హాల్..

రహమత్‌నగర్: తెలంగాణ ఉద్యమ చరిత్ర, త్యాగధనులను స్మరిస్తూ బోరబండ డివిజన్‌లో పలు నిర్మాణాలు చేపట్టి, జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో నామకరణాలు ప్రవేశపెట్టి, వాటికి చట్టబద్ధత కల్పించి ఉద్యమస్ఫూర్తిని చాటుకున్నారు జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్. నగరంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ ఉద్యమ కారులు, స్వాతంత్ర్య సమరయోధుల పేర్లతో మూడు కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ హాళ్లకు ఆచార్య జయశంకర్, షహీద్ తుర్రేబాజ్ ఖాన్, సర్వాయి పాపన్నల పేర్లు పెట్టారు. అంతేకాకుండా బోరబండ పంకా రెక్కలపై తెలంగాణ ఉద్యమకారులు పేర్లు రాయించి అభిమానాన్ని చాటుకున్నారు. సైట్ 4లో శ్రీకాంత్‌చారి చిల్డ్రన్స్ పార్కును సైతం ఏర్పాటు చేయించారు.

నా జన్మ ధన్యం: బాబా ఫసీయుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్



నగరంలో ఎక్కడాలేని విధంగా బోరబండ డివిజన్ తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు, వారి పేర్లతో కమ్యూనిటీ హాళ్లు నిర్మించడంతో నా జన్మ ధన్యమైంది. ఆ నిర్మాణాలు చరిత్రలో చిరస్మరణీయంగా మిగిలిపోతాయి. రాబోయే తరాలవారికి ఆదర్శంగా నిలుస్తాయి. ఒక తెలంగాణ ఉద్యమకారుడిగా నాకు సంతృప్తిగా ఉంది.

నేడు నిమ్స్‌లో ప్రజాపాలన దినోత్సవం

లక్డీకాపూల్: నిమ్స్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప జాతీయ జెండాని ఎగురవేస్తారన్నారు. తొలుత మహాత్మగాంధీ, నిజామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. దళ్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు పెంచాలని గత ప్రభుత్వాలకు విన్నవించినా పెడచెవిన పెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, దానిని నెరవేర్చాలని అన్నారు.

అంబారీపై లంబోదరుడు



బంజారాహిల్స్: రాంకోఠిలో ఓ నగల వ్యాపారి ఏనుగు బొమ్మపై గణేష్ నిమజ్జనం ఊరేగింపు నిర్వహించి ఆకట్టుకున్నారు. అచ్చం నిజం ఏనుగులా ఉన్న బొమ్మ ఏనుగును చూసి భక్తజనం ఆశ్చర్యచకితులయ్యారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

వెంగళరావునగర్: బాకీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కె.సురేందర్‌కుమార్ అనే వ్యక్తి ర్యాపిడో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ యాదగిరినగర్‌లో ఉంటున్నాడు. ఈనెల 15 తేదీ రాత్రి తన స్నేహితుని వద్దకు వెళ్లి వచ్చాడు. రూం బయట కూర్చుని ఉండగా ఎదురుగా నివసిస్తున్న చంద్రశేఖర్ వచ్చాడు. అతనిని తన పాత బాకీ డబ్బులు ఇవ్వాలని సురేందర్‌కుమార్ అడిగాడు. దాంతో చంద్రశేఖర్ అతనిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

26న క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు

కాచిగూడ: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్, కో చైర్మన్ మేకల సారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి రూ.12 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యకారుడికి ప్రతి నెలా పదివేల పెన్షన్ ఇవ్వా లని కోరారు. క్రిస్టియ న్ జేఏసీకి తుక్కుగూడ లో జరిగిన విజయభే రి సభలో కాంగ్రెస్ ప్రకటించిన సంక్షేమ ఫలాలు అందించాల ని అన్నారు. రాష్ట్ర సదస్సుకు మంత్రి కొండ సురేఖ, ఎంపీ మల్లు ర వి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ కోదండరాం, మాజీమంత్రి బాబు మోహన్, ఎస్.బాబు రావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఉత్సాహంగా నిమజ్జన వేడుకలు




పీపుల్స్ ప్లాజాలో నిమజ్జన దృశ్యాలు..

గణేశ్ నిమజ్జన వేడుకలు సోమవారం పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌లలో ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. నెక్లెస్ రోడ్డులో కిలోమీటర్‌పైగా పొడవునా గణనాథుల వాహనాలు బారులు తీరి కనిపించాయి. మరోవైపు సంజీవయ్య పార్కు వద్ద ఉన్న బేబీ పాండ్‌లో కూడా నిమజ్జనాలు జోరుగా జరిగాయి. –బంజారాహిల్స్





సాక్షి
మంగళవారం, 17, సెప్టెంబర్, 2024

గణపతి లడ్డూను కైవసం చేసుకున్న ముస్లిం భక్తుడు



మేడ్చల్: పట్టణంలోని రాఘవేంద్రనగర్‌లో శక్తి యూత్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఆదివారం రాత్రి వేలం వేయగా పట్టణానికి చెందిన రహమత్ అలీ రూ.99,999కి సొంతం చేసుకున్నాడు. హిందూ ముస్లింలు వేలంపాటలో పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

ట్రిపుల్ ఐటీలో ఏఐ ఆన్‌లైన్ కోర్సు

- వైద్య నిపుణుల కోసం ప్రత్యేక కోర్సు ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: వైద్య నిపుణుల కోసం కృత్రిమ మేధ ఆన్‌లైన్ కోర్సును ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రారంభించింది. కేంద్ర కుటుంబ సంక్షేమ, ఆరోగ్య శాఖ, నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఏఎంఎస్), ఐ-హబ్ డేటా సంయుక్తంగా ఈ కోర్సు ఇవ్వనున్నారు. 12 వారాల పాటు ఈ ఆన్‌లైన్ ఓరియెంటేషన్ కోర్సు ఇస్తారు. క్లినికల్ ప్రాక్టీస్‌లో, పేషెంట్ కేర్, ఆపరేషన్ చేసే విధానంలో నైపుణ్యత పెంపొందించుకునేందుకు వైద్య సిబ్బందికి ఏఐ ఎలా ఉపయోగపడుతుందో ఈ కోర్సులో నేర్పిస్తారు. ఏఐతో పాటు మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ బేసిక్స్‌తో పాటు ట్యూటోరియల్స్, థియరీ కూడా నేర్పిస్తారు. ఏఐ టూల్స్, టెక్నిక్స్ వాడకంలో ఎథికల్, గవర్నెన్స్ సమస్యలను కూడా తెలియజేస్తారు. కేస్ స్టడీస్‌తో పాటు క్విజ్‌లు, అసైన్‌మెంట్స్ ఇస్తారు. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ కూడా ఇస్తారు. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఎన్ఏఎంఎస్ నుంచి ప్రముఖ బోధనా సిబ్బంది బోధిస్తారు.

ఎస్ఐఓ అంతర్జాతీయ విద్యా సదస్సు



చార్మినార్: ముస్లింలలో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించి సామూహిక పోరాటానికి మార్గదర్శకతను చూపాల్సిన అవసరం ఉందని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐఓ) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ అన్నారు. ముస్లిం రాజకీయాలను తిరిగి ఊహించుకోవడం పేరుతో ఎస్ఐఓ ఆదివారం పాతబస్తీలో అంతర్జాతీయ విద్యా సదస్సు జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మేధావులు ఏకమై ముస్లింలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా మార్గదర్శకాలను రూపొందించి అవగాహన కల్పిస్తే.. ఆశించిన ఫలితాలొస్తాయన్నారు. ముస్లింల రాజకీయ భవిష్యత్తుతో పాటు విద్యా, ఉద్యోగ, సాంకేతిక రంగాల్లో రాణించే విధంగా ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ బోర్డు సభ్యులు, ప్రొఫెసర్ అమీర్ ఉల్లాఖాన్, టర్కీలోని ఇబ్నా హల్దున్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఇర్ఫాన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



కీసర: తెలంగాణలో ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి సేవలో సోమవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం(హైకోర్టు) జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ దంపతులకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి(శివలింగం)కు అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. దేవాలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కేశవరావు, జయశంకర్‌సార్‌ల ఆశయాన్ని కొనసాగించాలి

- తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ



నాగోలు: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరంతరం పోరాటం చేసిన ప్రొఫెసర్ కేశవరావు, జయశంకర్ సార్ల ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎమ్మెల్సీ కోదండరాంను తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారి కోరారు. తెలంగాణ వనరుల పరిరక్షణ ఆధ్వర్యంలో కోదండరామ్‌ని కలిసి పెన్సిల్‌తో గీసిన ఆయన చిత్రపటాన్ని సోమవారం బహుకరించారు. జీవితాంతం తెలంగాణ కోసం పోరాటం చేసిన చరిత్ర కేశవరావు, జయశంకర్ సార్ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గోర శ్యాంసుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సహజ వనరులైన భూమి, నీటి పరిరక్షణ కోసం కమిటీ పోరాటం చేస్తుందని చెప్పారు.

ప్రైవేటు కాలేజీల ప్రవేశాలపై విముఖత

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీల పరిధిలో గల ప్రైవేటు పీజీ కాలేజీల్లో ప్రవేశాలకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. కేవలం వర్సిటీల క్యాంపస్ కాలేజీలు, హాస్టల్ వసతి గల అనుబంధ కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారు. టీజీసీపీజీఈటీ-2024 మొదటి విడత కౌన్సెలింగ్‌లో వివిధ కోర్సుల్లో 50 వేల పీజీ సీట్లకు ఇంత వరకు సుమారు పది వేల విద్యార్థులు మాత్రమే చేరారు. వర్సిటీల క్యాంపస్ కాలేజీల్లో మాత్రమే విద్యార్థులు చేరుతున్నారు. అధ్యాపకుల కొరత, ఇతర కారణాల వలన ప్రైవేటు పీజీ కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదు. ఇదిలా ఉండగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 20 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొ.జలపతి తెలిపారు.



ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి

నిమజ్జనానికి ఘనంగా ఏర్పాట్లు

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

కవాడిగూడ: జంట నగరాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా మంగళవారం నగరవ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్యాంక్‌బండ్‌పై జరిగే నిమజ్జన ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం, వ్యర్థాల తొలగింపు, ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు, భక్తులకు నీటి సౌకర్యం కల్పించేలా జలమండలి అధికారులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జంటనగరాల్లో మంగళవారం ఉదయం నుంచి నిర్విరామంగా కొనసాగే గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గణేష్ మండప నిర్వాహకులు భక్తులు అధికారులకు సహకరించాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన క్రేన్లు, నిమజ్జనం తర్వాత వ్యర్థాలు తొలగించడానికి శానిటేషన్ సిబ్బంది, విద్యుత్, వాటర్ వర్క్స్, శాంతి భద్రతల పరిరక్షణపై పోలీసులకు తగిన సూచనలు చేశారు.

జీహెచ్ఎంసీ అన్ని ఏర్పాట్లు: కమిషనర్ ఆమ్రపాలి

ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ తదితర ప్రాంతాలతో పాటు నగరవ్యాప్తంగా జరిగే గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 465 క్రేన్లు, హుస్సేన్‌సాగర్, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో 38 క్రేన్లను వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. అన్ని శాఖల సమన్వయంతో జీహెచ్ఎంసీ వినాయక నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. నిమజ్జన ఉత్సవాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

ట్యాంక్‌బండ్‌పై 15 క్రేన్లు..

నిన్నమొన్నటి వరకు ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం నిషేదం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ, పోలీసులు చివరకు ట్యాంక్‌బండ్‌పై వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి 15 క్రేన్లను ఏర్పాటు చేశారు. ప్రతి క్రేన్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది పోలీసు అధికారులు, గజ ఈతగాల్లు విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నారు.



గంగ ఒడికి గణేషుడు ఇలా..

శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా 70 అడుగుల ఎత్తులో ఖైరతాబాద్‌లో పర్యావరణ హితంగా మట్టితో రూపుదిద్దుకున్న మహాగణపతి మహా నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం 70 అడుగుల మట్టితో రూపుదిద్దుకున్న మహాగణపతిని 10 రోజుల్లో 30 లక్షల మంది భక్తులు దర్శించుకోవడం విశేషం. మంగళవారం ఉదయం గణపయ్య గంగ ఒడికి పయనం కానున్నారు. దీంతో పోలీసులు, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించి గతేడాది కంటే ముందుగానే నిమజ్జనం పూర్తి చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా మహాగణపతి సాగర నిమజ్జన యాత్ర పక్కా షెడ్యూల్ తయారు చేశారు.

– ఖైరతాబాద్

- సోమవారం ఉదయం నుంచే భక్తుల దర్శనాలను నిలిపివేసిన పోలీసులు ఉదయం 6 గంటల నుంచే షెడ్డు తొలగించే పనులను మొదలయ్యేలా చూశారు. సాయంత్రం వరకు షెడ్డు తొలగించే పనులు పూర్తయ్యాయి.
- సోమవారం రాత్రి 8 గంటలకు కలశం కదిలించిన అనంతరం రాత్రి 9 గంటలకు మహాగణపతికి హారతి కార్యక్రమం నిర్వహించారు.
- 11.45 గంటలకు భారీ క్రేన్ సాయంతో 100 టన్నుల బరువు మోసే సామర్థ్యం ఉన్న ట్రాయిలర్ వాహనంపై వినాయకుడిని ఉంచుతారు. 2 గంటల పాటు వెల్డింగ్ పనులు చేస్తారు.
- ట్రాయిలర్ వాహనం అలంకరణ అనంతరం మంగళవారం ఉదయం 6.30 గంటలకు మహాగణపతి శోభాయాత్రను ప్రారంభిస్తారు. శోభాయాత్రలో 500 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారు.
- మహాగణపతి నిమజ్జనానికి రవి క్రేన్స్‌కు చెందిన హైడ్రాలిక్ క్రాప్ భారీ క్రేన్ సాయంతో మహాగణపతి నిమజ్జనం చేయనున్నారు.
- గతేడాది కూడా ఈ క్రేన్ సాయంతోనే మహాగణపతి నిమజ్జనం సాగింది. 11మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు ఉన్న భారీ క్రేన్ 150 టన్నుల బరువు మోస్తుంది. ఈ క్రేన్ సాక్ 142 ఫీట్ల పొడవు ఉంటుంది. ఈ భారీ క్రేన్ ఆపరేటర్‌గా యూపీకి చెందిన అన్వర్ ఉల్ హక్ పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా ఖైరతాబాద్ మహాగణపతి భారీ క్రేన్ ఆపరేటర్‌గా ఆయనే వ్యవహరిస్తున్నాడు. ఈ సంవత్సరం కూడా ఆయనే ఆపరేటర్‌గా వ్యవహరిస్తున్నాడు.

- ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 6.30 గంటలకు శోభాయాత్ర ప్రారంభం
- మధ్యాహ్నం 1.30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జనం

నిమజ్జన రూట్ మ్యాప్..

ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్ నుంచి రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఎక్బాల్‌మినార్, తెలుగుతల్లి చౌరస్తా, సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్-4 వద్దకు చేరుకుంటుంది. గతేడాది మధ్యాహ్నం 1.27 గంటలకు నిమజ్జనం చేశారు. ఈ సంవత్సరం అంతకంటే ముందుగానే నిమజ్జనం చేయాలని పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళిక సిద్ధం చేశారు.





ఖైరతాబాద్ వినాయకుడి వద్ద షెడ్డు తొలగిస్తున్న కార్మికులు

నగరంలో నేడు

- గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు ఉదయం 6 గంటల నుంచి నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్‌లోని జరుగుతాయి.
- తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవ వేడుకలు జరుగుతాయి. వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు.
- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఉదయం 7.30గంటల నుంచి జరుగుతాయి. వేడుకల్లో కేంద్ర మంత్రులు పలువురు పాల్గొంటారు.
- ఖైరతాబాద్ బడా గణేష్‌డి శోభయాత్ర ఉదయం 6.30 గంటలకు ఖైరతాబాద్ గ్రంథాలయం చౌరస్తా వద్ద ప్రారంభమవుతుంది. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రైన్ నెం.4 మధ్యాహ్నం 1.30 గంటలకు నిమజ్జనోత్సవ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఇక రేషన్ స్మార్ట్ కార్డులు?

స్మార్ట్ కార్డు చిప్‌లో సభ్యుల పూర్తి వివరాలు

పీడీఎస్ ఈ-పోస్‌తో అనుసంధానం

సాక్షి, సిటీబ్యూరో: ఇక రేషన్ కార్డులు స్మార్ట్(ఎలక్ట్రానిక్ చిప్) కార్డుగా జారీ చేసేందుకు పౌరసరఫరా శాఖ కసరత్తు చేస్తోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంతో పాటు సబ్సిడీ సరుకులు పక్కదారి పట్టకుండా తెల్లరేషన్ కార్డులను స్మార్ట్ కార్డు రూపంలో తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెల్లరేషన్ కార్డులు జారీ కాగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆహార భద్రత కార్డులుగా మారిపోయాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త కార్డులు ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేసినా.. ప్రత్యేకంగా కార్డులు జారీ చేయలేదు. ఆన్‌లైన్ ద్వారా తీసిన ప్రింట్‌నే రేషన్ కార్డుగా పరిగణిస్తూ వస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సిద్ధం కావడంతో స్మార్ట్ కార్డు రూపంలో జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపట్టింది.



స్మార్ట్ కార్డులో..

స్మార్ట్ కార్డులో రేషన్‌కార్డు లబ్ధి కుటుంబంలోని ఇంటి పెద్ద, ఐదేళ్లు దాటిన సభ్యుల పేర్లు, ఆధార్ సంఖ్య, బయోమెట్రిక్, రేషన్ కార్డు సంఖ్య, సర్కిల్, దుకాణం సంఖ్య తదితర వివరాలతో కూడిన చిప్ ఉండే విధంగా రూపకల్పన కోసం పౌరసరఫరా శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఆధార్ కార్డు బయోమెట్రిక్ పీడీఎస్ ఈ-పోస్‌కు అనుసంధానం చేసి సరుకులను పంపిణీ చేస్తున్నారు. ఇటీవల రేషన్ కార్డు లబ్ధిదారుల ఈ-కేవైసీ కూడా పునరుద్ధణ ప్రక్రియ కొనసాగింది. వాస్తవంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే స్మార్ట్ రేషన్ కార్డు జారీ కోసం కసరత్తు సాగినా పెండింగ్‌లో పడిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధం కావడంతో స్మార్ట్ ప్రక్రియ తిరిగి తెరపైకి వచ్చింది.

20న కలెక్టరేట్ల ముట్టడి విజయవంతం చేయండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణనను చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి సోమవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 3 ఏళ్లుగా బీసీ విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,500 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావొస్తున్నా బీసీలకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, నంద గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలోనే అంతులేని ఆనందం



ఆశ్రిత కల్ప ఆశ్రమంలో వంటశాలను ప్రారంభిస్తున్న సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకులు రత్నాకర్

సత్యసాయి ట్రస్ట్ నిర్వాహకులు రత్నాకర్

బంజారాహిల్స్: నిస్వార్థ సేవలోనే ఆనందం ఉంటుందని సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న రోగులు, వారి సహాయకుల కోసం ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆశ్రిత కల్పలో అందుతున్న సేవలు భేష్ అనానరు. ఆశ్రిత కల్ప ఆశ్రమంలో సత్యసాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సహకారంతో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన వంటశాలను ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ డీజీపీ, సత్యసాయి ట్రస్ట్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ హెచ్‌జే దొరతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవా కార్యక్రమాలతోనే సత్యసాయి ట్రస్ట్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందన్నారు. వైద్య ఖర్చుల భారాన్ని మోయలేని పేద రోగుల కోసం సత్యసాయి శివం సేవా సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవలు అభినందనీయమని అన్నారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న వారు ఇతర ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న వారి కంటే త్వరితగతిన రికవరీ అవుతున్నారన్నారు. ఇందుకు కారణం ప్రేమతత్వంతో కూడిన చికిత్సలు అందించడమేనన్నారు. కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు కలిగిన భారతదేశంలో సేవా కార్యక్రమాల విశిష్టతను సత్యసాయి ఆనాడే గుర్తించారని చెప్పారు. సుమారు 70 ఏళ్ల క్రితమే పుట్టపర్తిలో ఆస్పత్రిని ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి సత్యసాయి అని కొనియాడారు. కేన్సర్‌తో బాధపడుతున్న రోగులకు ఆశ్రయం కల్పించడంతో పాటు మూడు పూటలా భోజన వసతి కల్పించడం అభినందనీయమని ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకటరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతిని దర్శించుకున్న మంత్రి పొన్నం



ఖైరతాబాద్:ఖైరతాబాద్ మహాగణపతిని మంత్రి పొన్నం ప్రభాకర్, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, మేయర్ విజయలక్ష్మి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాగణపతి హుండీ ఆదాయం రూ.75 లక్షలు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి వద్ద మొదటిసారి హుండీ లెక్కించారు. పది రోజుల పాటు భక్తులు మహాగణపతిని దర్శించుకొని సమర్పించిన హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.75 లక్షలు కానుకల రూపంలో సమర్పించినట్లు ఉత్సవ కమిటీ అడ్‌హాక్ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా మహాగణపతి తయారీ పనులకు రూ.85 లక్షలు ఖర్చయినట్లు తెలిపారు.

విలక్షణ నటులు అక్కినేని, భానుమతి



పురస్కారాలను అందజేస్తున్న సుజాతగుప్తా, సముద్రాల వేణుగోపాలచారి

చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వర్‌రావు, భానుమతి రామకృష్ణ విలక్షణ నటులని ఆర్య వైశ్య కార్పొరేషన్ కల్ప సుజాతగుప్తా అన్నారు. సోమవారం రాత్రి సాంస్కృతిక సంఘ సేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో ప్రముఖ నటులు భానుమతి రామకృష్ణ, అక్కినేని నేగాశ్వర్‌రావు, సూర్యకాంతం జయంతి కార్యక్రమాన్ని త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోవెల శాంతకు భానుమతి సంగీత పురస్కారం, కాదంబరి కిరిణ్‌కుమార్‌కు నాగేశ్వర్‌రావు ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి మాట్లాడుతూ కిరణ్‌కుమార్ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, ప్రముఖులు దైవజ్ఞశర్మ, బద్రినాథ్, మురళీధర్, ఎంవీ రావు, పుష్పలత, సురేందర్, రేవతి, శ్రీదేవి, అనురాధ, ప్రదీప్‌చంద్ర, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత, నాట్య నివేదన



చిక్కడపల్లి: శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల సందర్భంగా సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో నర్తనం సంగీత, నాట్య నివేదనాన్ని సమర్పించారు. వర్ధమాన కళాకారుల నృత్యాంశాలను ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సజని వల్లభనేని ప్రముఖ సంఘసేవకుడు జె.దశరథ్‌కు ఇండియా స్వరభారతి అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ అలీఖాన్, బీజేపీ నేత ప్రతాప వంశీ కృష్ణ, జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, మంగళవారం,
17, సెప్టెంబర్‌, 2024

లేడికి లేచిందే పరుగు.. అన్నట్టు ఆలోచన వచ్చిందే తడవు ఇంటికి తెచ్చేసుకుని మరీ భౌభౌలూ, మ్యావ్‌ మ్యావ్‌లూ, కిచకిచలూ.. వింటూ ఆనందించేద్దాం అనుకుంటే సరిపోదు.. కొనడం నుంచి పెంచడం దాకా పెట్స్‌ పేరెంటింగ్‌ కూడా ఒక కళే అంటున్నారు నిపుణులు. దీంతో పాటు వాటికి అనువైన ప్రదేశం ఉండేలా చూసుకోవాలి. తరచూ వాటికి ఇవ్వాల్సిన టీకాలు ఇప్పించడం, వాటి నుంచి సంక్రమించే వ్యాధులకు తగిన చికిత్సలు తీసుకోవడం చాలా ముఖ్యమని చెబుతున్నారు..

- సాక్షి, సిటీబ్యూరో



- భిన్న రకాల పెట్స్‌తో మమేకమవుతున్న నగరవాసులు
- ముందస్తు అవగాహన లేని పెంపకంతో అనర్థం..
- పెట్స్‌ పేరెంటింగ్‌కు ముందు జాగ్రత్త అవసరం అంటున్న నిపుణులు

పెంపకంలో అలక్ష్యం వద్దు..



పెట్స్‌ని పెంచుకునేవారు నగరంలో బాగా పెరుగుతున్నారు. అలాగే ఏ మాత్రం అవగాహన లేకుండా వాటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నవారూ పెరుగుతున్నారు. రకరకాల అనారోగ్యాలతో మా దగ్గరకు తమ పెట్స్‌ను తీసుకొచ్చే కేసుల్లో చాలా సందర్భాల్లో యజమానుల అవగాహన లోపమే కారణంగా తెలుస్తోంది. తరచూ వాటి బాగోగులు పర్యవేక్షించడం, నిరంతరం వైద్యులతో సంభాషించడం. చేస్తూ జాగ్రత్తగా చూసుకోవాలి.

-డా.బి.యమున,
శునకాల, పిల్లుల వైద్య నిపుణులు



పెట్‌ పేరెంటింగ్‌..

నివాసంలో మూగజీవులతో సహవాసం

నగరంలో పెంపుడు జీవులను మచ్చిక చేసుకోవడం... వాటి పెంపకం పట్ల హాబీ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా పెరుగుతోంది. అయితే ఏవి కొనాలి? ఎలా పెంచాలి? ఎలా ఉంచాలి? వంటి కీలక విషయాల పట్ల అవగాహన లేకుండానే ఇంటికి తెచ్చేసుకుంటూ ఇబ్బందులు పడుతున్నవారు తక్కువేం కాదు. ఈ నేపథ్యంలో నిపుణులు అందిస్తున్న సూచనలివి...

కొనేముందు..

పెంపుడు జీవిగా శునకమైనా, పిల్లులైనా, పక్షులైనా.. తెచ్చు'కొనే'ముందు తమ ఇంటి పరిస్థితులను విశ్లేషించుకోవాలి. కుటుంబ జీవనశైలి, మనకు అందుబాటులో ఉన్న స్థలం వంటి అంశాలపై ఆధారపడి పెట్‌ని ఎంపిక చేసుకోవాలి. అలాగే సదరు జీవి స్వభావం, దాని శక్తి స్థాయిలు, దానికి అందించాల్సిన సంరక్షణ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. ఇంట్లోని పిల్లలు/వృద్ధుల వయస్సు, వారి ఆరోగ్య పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.



ఇలాగైతే బాగు 'భౌగు'..

శునకాలు, పిల్లులు, పక్షులకు సరిపడేలా, సౌకర్యవంతమైన స్థలాన్ని అందించాలి. అలాగే ఫుడ్‌కీ, ఆటలకీ తగిన టైమ్‌ కోసం షెడ్యూల్‌ సెట్‌ చేసుకోవాలి. వాటికి ఇవ్వాల్సిన ఆహారం తదితరాల గురించి అలాగే టీకాల షెడ్యూల్‌ గురించి డాక్టర్‌ నుంచి సరైన మార్గదర్శకాలు తీసుకోవాలి.. అలాగే జనన నియంత్రణ శస్త్రచికిత్స ఎప్పుడు నిర్వహించాలి వంటివి తెలుసుకోవాలి. శునకాలకు సోషల్‌ లైఫ్‌ ముఖ్యం. చుట్టుపక్కల వారితో, సాటి జీవులతో స్నేహపూర్వక బంధం ఏర్పడడం కోసం అవకాశం ఇవ్వాలి. శునకం 4–5 నెలలకు చేరుకున్నప్పుడు వాటికి పలు అంశాల్లో శిక్షణ ఇప్పించడం అవసరం. అదే విధంగా 3 నెలల వయసు వరకూ ఫోమ్‌ బాత్‌/డ్రై బాత్‌, 4–6 నెలల వయసులో 15 రోజులకు ఒకసారి, 6 నెలలు దాటిన తర్వాత వారానికోసారి స్నానం తప్పనిసరి. దాంతో పాటే హెయిర్‌ కోట్‌ను క్రమం తప్పకుండా బ్రష్‌ చేయడం ముఖ్యం. హెయిర్‌ కట్‌, గోర్లు కత్తిరించడం చెవి శుభ్రపరచడం ఆసన గ్రంథులు శుభ్రపరచడం అవసరమే.

వండని మాంసాన్ని ఇవ్వకూడదు..

పక్షులను పంజరంలో ఉంచవద్దు. వీలైనంత వరకూ పక్షులను బందిఖానాలో ఉంచడం వాటికి హానికరం. ఇది వాటికి తీవ్రమైన కఠినమైన పరిస్థితిగా మారుతుంది. పోషకాహార లోపం, సరిపడని వాతావరణం, ఒంటరితనం, నిర్బంధంలో ఉన్న ఒత్తిడి వంటి సమస్యలకు దారి తీస్తుంది. పక్షులు ఎగురుతూ ఇతర పక్షులతో కలిసి జీవించాలి. ఓపెన్‌ స్కై కింద. వాటిని చిన్న ప్రదేశాల్లో ఉంచినప్పుడు, స్వభావ ప్రకోపాలు మానసిక కల్లోలాలకు గురవుతాయని నిపుణులు చెబుతున్నారు.

హైదరాబాద్‌ వైబ్స్‌


బ్రీడ్‌. గుడ్‌..

శునకాలను కొనుగోలు చేసేముందు వాటి బ్రీడ్స్‌ను పరిశీలించడం మంచిది. సహనం, ఉల్లాసభరితమైన స్నేహపూర్వక స్వభావంతో పిల్లలున్న కుటుంబాలకు, లాబ్రడార్‌ రిట్రీవర్లు, గోల్డెన్‌ రిట్రీవర్లు బీగల్స్‌ వంటివి, అలాగే అపార్ట్‌మెంట్స్‌కు పగ్స్‌, షిహ్‌ త్జుస్‌ వంటి చిన్న బ్రీడ్స్‌ నప్పితే, ఫార్మ్‌ హౌస్‌ల కోసం డాబర్‌మ్యాన్‌, రోట్‌వెల్లర్‌.. ఇలా ప్రత్యేకించిన బ్రీడ్స్‌ కూడా ఉన్నాయి. ఇండియన్‌ పరియా డాగ్‌ వంటి స్థానిక భారతీయ జాతులు మన వాతావరణానికి బాగా సరిపోతాయి కావలీర్‌ కింగ్‌, చార్లెస్‌ స్పానియల్స్‌, బాక్సర్లు కూడా పిల్లలతో ఆప్యాయంగా ఉండడానికి పేరొందాయి.



మ్యావ్‌. మ్యాచ్‌..

ఇటీవల పిల్లులను పెంచుకుంటున్నవారు బాగా పెరుగుతున్నారు. పెట్స్‌గా పిల్లులను ఎంచుకున్నవారు వాటి కోసం ఇంట్లో సరైన ప్రదేశాన్ని కనుగొనాలి. నులిపురుగుల నివారణకు వైద్య సలహాలు తీసుకోవాలి. పిల్లులకు రెగ్యులర్‌గా టీకా వేయడం వల్ల దానికి మాత్రమే కాదు పెంచుకునే వారికీ మంచిది. పిల్లులకు మూత్ర, మల విసర్జనలకు ఉపయోగించేందుకు లిట్టర్‌ బాక్స్‌ తప్పనిసరి. వాటికి లిట్టర్‌ శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యం. సంవత్సరం కంటే తక్కువ వయసున్న పిల్లులకు వైరల్‌ ఇన్ఫెక్షన్లకు ఎక్కువ అవకాశం ఉంది. కాబట్టి వైరల్‌ సంక్రమణను నివారించడానికి ఇతర వీధి పిల్లులతో సంబంధాన్ని నివారించాలి. మగ ఆడ పిల్లుల హార్మోన్ల మార్పులు గురించి అవగాహన ఉండాలి. చాలా మంది పిల్లి యజమానులు ఈ సమయంలో వాటిని చూసి పిల్లికి ఏదో అనారోగ్యం ఉందని అనుకుంటారు. పిల్లులకు తరచూ వస్త్రధారణ అవసరం లేదు అలాగే పిల్లులు తమను తాము శుభ్రం చేసుకుంటాయి కానీ నెలకు ఒకసారి మాత్రం శుభ్రపరచడం తప్పనిసరి..



గణమే.. ఘనమై..

బాలాపూర్‌ గణనాథుడి లడ్డూ అ'ధర'హో



బాలాపూర్‌లో 1995లో వరుసగా రెండోసారి లడ్డూ దక్కించుకున్న కొలన్‌మోహన్‌రెడ్డి

- ఎత్తైన విగ్రహంగా ఖైరతాబాద్‌ గణేషుడు
- 1954లో ఖైరతాబాద్‌లో మొదలైన ఉత్సవాలు
- 1994లో బాలాపూర్‌లో లడ్డూ ప్రసాదం వేలం ప్రక్రియ మొదలు

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరంలో గణేష్‌ ఉత్సవాలంటే ప్రతి ఒక్కరికీ ఠక్కున గుర్తుకొచ్చేది ఖైరతాబాద్‌ వినాయకుడు. ఆ తర్వాత అంతే ప్రాముఖ్యత కలిగిన బాలాపూర్‌ లడ్డూ వేలం పాట. 1954లో తొలిసారిగా ఒక్క అడుగుతో ఖైరతాబాద్‌ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఎత్తైన గణేష్‌ విగ్రహం (70 అడుగులు) కూడా ఇదే. కాగా బాలాపూర్‌ గణేష్‌ ఉత్సవ సమితి మొదటిసారి 1994లో లడ్డూ వేలంపాట ప్రారంభించింది. తొలి వేలంపాటలో అదే ప్రాంతానికి చెందిన కొలను మోహన్‌రెడ్డి రూ.450 లడ్డూ కైవసం చేసుకున్నారు. ఆయన వరుసగా మూడు సార్లు వేలంపాటలో పాల్గొన్నారు. ఈ లడ్డూను దక్కించుకున్న వారికి మంచి జరిగిందనే ప్రచారంతో కాల క్రమంలో ప్రసాదానికి డిమాండ్‌ పెరిగింది. 2002 నుంచి లక్షల్లో ధర పలకడం మొదలైంది. ఒకప్పుడు కేవలం బాలాపూర్‌కు మాత్రమే పరిమితమైన ఈ లడ్డూ వేలంపాట ప్రస్తుతం ఇంతింతై అన్నట్లు గ్రేటర్‌ అంతా విస్తరించింది.

విగ్రహ సంస్కృతి ఇలా..

ఖైరతాబాద్‌ గణేషుడితో మొదలైన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన సంస్కృతి.. క్రమంగా నగరమంతా విస్తరించింది. ప్రస్తుతం గ్రేటర్‌లో చిన్న, పెద్ద కలిపి మొత్తం రెండు లక్షలకుపైగా విగ్రహాలు నెలకొల్పినట్లు అంచనా. ఇదిలా ఉంటే రెండు మూడేళ్ల క్రితం వరకూ బాలాపూర్‌ లడ్డూకు మాత్రమే రికార్డు స్థాయిలో ధర పలికేది. 2023లో బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని సన్‌సిటీ రిచ్‌మండ్‌ విల్లాలోని గణనాథుడి చేతిలో ఉన్న లడ్డూ ప్రసాదం బాలాపూర్‌ లడ్డూ రికార్డును బ్రేక్‌ చేసింది. ఏకంగా రూ.1.25 కోట్లు పలికి భక్తులందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. నిత్యం రికార్డుల్లో నిలిచే బాలాపూర్‌ లడ్డూ మాత్రం గతేడాది రూ.27 లక్షలు పలికింది. ఈ యేడాదికి సంబంధించి మంగళవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే వేలం పాటలో ఎంత ధర పలుకుతుందో వేచి చూడాల్సిందే.





నగరంలో చెట్టినాడ్‌ రుచులు

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రుచులకు మన నగరం ఎప్పుడూ కేరాఫ్‌ అడ్రస్‌గా ఉంటుంది. తాజాగా తమిళనాడులోని ప్రఖ్యాత చెట్టినాడ్‌ రుచులను భాగ్యనగరవాసులకు అందించేందుకు బార్బెక్యూ నేషన్‌ రెడీ అయ్యింది. సెప్టెంబర్‌ 10న చెట్టినాడ్‌ ఫుడ్‌ ఫెస్టివల్‌ పేరిట విభిన్నమైన ఫెస్ట్‌ను ప్రారంభించింది. నెల్లికాయ్‌మల్లి రసమ్‌, తందూరి పాలకట్టి స్క్వేర్‌, పొడి ఇడ్లీ, స్పైసీ పన్నీర్‌ 65, వెజ్‌ కొత్తుపరాటా వంటి వెజ్‌తో పాటు ఫైరీ చికెన్‌ 65, హార్టీ చికెన్‌ కొత్తుపరాటా వంటి నాన్‌వెజ్‌ ఐటమ్స్‌ కూడా నోరూరించనున్నాయి. నగరంలోని అన్ని బార్బెక్యూ నేషన్స్‌ ఔట్‌లెట్స్‌లో అందుబాటులో ఉండనున్నాయి.

'సిడ్స్‌ ఫార్మ్‌' హెల్త్‌ రన్‌ 22న..



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ సిడ్స్‌ ఫార్మ్‌ ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించే లక్ష్యంతో తొలిసారిగా హెల్త్‌ రన్‌ ను నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. నగరవాసులు తమ ఫిట్‌నెస్‌ లక్ష్యాలను చేరుకోవడానికి రన్నింగ్‌, జాగింగ్‌, వాకింగ్‌ ఏదైనా సరే, 10 కి.మీ, 5 కి.మీ, 2 కి.మీ విభాగాల్లో ఎంచుకోవచ్చని తెలిపారు. పూర్తయిన తర్వాత కుటుంబంతో సహా తమ పెట్టింగ్‌ జూ, ఫార్మర్స్‌ మార్కెట్‌, ట్రాక్టర్‌ రైడ్‌, లైవ్‌ మ్యూజిక్‌, సిడ్స్‌ ఫార్మ్‌ ఆవరణలో అల్పాహారం ఆస్వాదించవచ్చని వివరించారు. ఈ హెల్త్‌ రన్‌ గచ్చిబౌలి ప్రాక్టీస్‌ స్టేడియం (గేట్‌ 1 ద్వారా ప్రవేశం)లో ఈ నెల 22న ఉదయం 6 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో పాల్గొనేవారు ఈ నెల 18 లోగా https://ifinish.co.in/running/hhrలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.





లక్ష్యం వైపు.. లాక్షనాయుడు

ఏ రంగంలో అడుగిడినా ముందడుగు వేస్తూ..

- చదువులోనే కాదు.. సాంస్కృతిక కార్యక్రమాలలోనూ.. పలు రంగాల్లో ప్రతిభ చూపుతూ..
- కాశీలో జరిగిన వోకల్‌ ప్రజెంటేషన్‌లో వరల్డ్‌ రికార్డు

సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా రంగంలో రాణించాలంటే ఎంతో శ్రమించాలి.. అలాంటిది అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ ప్రతిభ కనబర్చాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చాలి? ఏదైనా పని మొదలు పెట్టాలన్నా.. కొత్త రంగంలోకి వెళ్లాలన్నా ఇంటి నుంచే సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కొంటుంటాం. మనకు అవసరమా..? చక్కగా ఉన్న పని చేసుకుని హాయిగా ఉండొచ్చుగా అని సలహాలు ఇస్తుంటారు. మరికొందరేమో రెండు, మూడు పడవలపై ప్రయాణం చేయడం మంచిది కాదంటూ హితవు పలుకుతారు. ఇంకొందరు వెనక్కి లాగే ప్రయత్నం చేస్తుంటారు. కానీ వైఫల్యం గురించి బాధపడుతూ ఒకే దగ్గర కూర్చుంటే అంతకన్నా వైఫల్యం మరొకటి ఉండదని నిరూపిస్తున్నారు డాక్టర్‌ లాక్షనాయుడు. డాక్టర్‌గా, సింగర్‌గా, శాస్త్రీయ నృత్యకారిణిగా, రాజకీయవేత్తగా చిన్న వయసులోనే రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



డాక్టర్‌ లాక్షనాయుడు అడుగుపెట్టిన ప్రతి రంగం బంగారు బాట చేసుకోవడం అలవాటే. చిన్నప్పటి నుంచి చదువులోనే కాదు.. సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ.. యాక్టివిటీస్‌లోనూ ముందుండేవారు. ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌ పూర్తి చేసిన లాక్షనాయుడు.. గోల్డ్‌ మెడల్‌ సాధించి ఔరా అనిపించుకున్నారు. అనంతరం మణిపాల్‌లో ఇంటర్నల్‌ మెడిసిన్‌ పూర్తి చేశారు. ఆ తర్వాత సంగీతంపై ఇష్టంతో ఒహితా సంగీత అకాడమీలో చేరారు. ఈ సంస్థ రవీంద్రభారతి యూనివర్సిటీతో అనుసంధానమై ఉండటంతో అక్కడ కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. మన్నెం రాముా మాస్టర్‌ ఆధ్వర్యంలో డిప్లొమా పూర్తి చేశారు.

ఎన్‌సీసీలో యాక్టివ్‌గా..

డిగ్రీలో ఉన్న సమయంలో ఎన్‌సీసీలో చేరి ఎన్నో క్యాంపుల్లో లాక్షనాయుడు పాల్గొన్నారు. ఎన్‌సీసీలో 'సి' సర్టిఫికెట్‌ పొందారు. ఆర్మీలో సార్జెంట్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత ఆర్మీలో ఏఎస్‌వోగా పనిచేసేందుకు అవకాశం వచ్చింది. అయితే భవిష్యత్తులో కచ్చితంగా చేరి, దేశానికి సేవ చేస్తానని చెబుతున్నారు. వాలీబాల్‌లో కూడా ఆమెకు ప్రవేశం ఉంది. 2016లో ఉస్మానియా కాలేజీ తరఫున వాలీబాల్‌ జాతీయ జట్టుకు నేతృత్వం వహించారు. గుర్రపు స్వారీ అంటే తనకు ఎంతో ఇష్టమని పేర్కొంటున్నారు. లాక్షనాయుడుకు ఎన్నో రంగాల్లాగే నటన అంటే ఎంతో ఆసక్తి. ఇప్పటికే పలు వెబ్‌సిరీస్‌లలో నటించారు. సినిమాల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ప్రస్తుతం ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ హెల్త్‌ విభాగం అధ్యక్షురాలిగా పనిచేస్తూ సమాజానికి సేవ చేయాలనే తలంపుతో ముందుకు వెళ్తున్నారు.

సక్సెస్‌ మంత్ర..

ఒకే సమయంలో అనేక రంగాల్లో రాణించడానికి ముఖ్య కారణం తాను ఉదయమే కనీసం గంటపాటు మెడిటేషన్‌ చేస్తుంటానని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా యోగాసనాలు వేస్తుంటానని, ఇదే తనలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుందని వివరించారు. మనతో మనం కాసేపు మాట్లాడుకుంటూ.. ప్రతిదీ లెక్క ప్రకారం ముందుకు వెళ్తే సాధించలేనిది ఏదీ లేదని యువతకు సూచిస్తున్నారు.



వరల్డ్‌ రికార్డు..


వారణాసిలో ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ క్లాసికల్‌, మోడర్న్‌ డ్యాన్స్‌ (ఐసీఎండీ) నిర్వహించిన కార్యక్రమంలో లాక్షనాయుడు వోకల్‌ ప్రజెంటేషన్‌లో వరల్డ్‌ రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి వందలాది మంది కళాకారులు హాజరయ్యారు. శంకర్‌ మహదేవన్‌ వంటి ఎంతోమంది ప్రముఖులు కూడా ఇందులో భాగస్వామ్యం అయ్యారు.



బానిస బతుకులే.. బందూకులైనయ్..

మీర్ ఉస్మాన్ అలీఖాన్ సుదీర్ఘ పాలన (1911–1948) సమయంలో హైదరాబాద్ రాజ్యంలో అరాచకాలు పెరిగిపోయాయి. శాసన, కార్యనిర్వాహక, న్యాయ, పోలీస్ వ్యవస్థలన్నీ నిజాం నవాబు ఫర్మానాలకు లోబడే పనిచేసేవి. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండే, పటేల్, పట్వారీలు ఊరికో నియంతలా మారిపోయారు. దీనికి తోడు ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలోని రజాకార్ (ఉర్దూలో స్వయం సేవకులు అని అర్థం) బృందాలు రెచ్చిపోయి హత్యలు, లూటీలకు తెగబడ్డాయి. ప్రతి గ్రామంలో వారానికో రోజు రజాకార్లు సమావేశమై ఆయుధాలతో మార్చ్‌ఫాస్ట్ చేసేవారు. రాజ్యంలో సంస్థానాలు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, పటేల్, పట్వారీ వ్యవస్థలు రైతుకూలీలను పీల్చి పిప్పిచేశాయి. అయితే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి, ఆంధ్ర మహాసభలు తెచ్చిన చైతన్యంతో హైదరాబాద్ రాజ్యంలో సాయుధ రైతాంగ పోరాటం మొదలైంది. 1946 జూలై 4న అప్పటి నల్లగొండ జిల్లా కడవెండిలో విసునూరు దేశ్‌ముఖ్ ఇంటిమీదుగా వెళ్తున్న జులూస్‌పై రజాకార్లు పేల్చిన తూటాలకు దొడ్డి కొమురయ్య హతమయ్యాడు. దాంతో రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలోని సేనలు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఆగస్టు 15న కోఠిలో జాతీయ జెండాను ఆవిష్కరించే ప్రయత్నం చేసిన రామానందతీర్థను నిజాం సేనలు జైల్లో వేశాయి. నిజాం నిరంకుశ పాలనపై వార్తలు రాస్తున్న ఇమ్రోజ్ పత్రిక ఎడిటర్ షోయబుల్లాఖాన్‌ను 1948 ఆగస్టు 22న రజాకార్లు హత్య చేశారు. అన్ని జిల్లాల్లోనూ ప్రశ్నించిన వారిపై, నిజాంకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దారుణకాండకు పాల్పడ్డారు. ఈ హింసను నిరసిస్తూ హిందూ మహాసభ, స్టేట్ కాంగ్రెస్ సైతం సత్యాగ్రహ పోరాటాలు చేపట్టాయి. భారత ప్రభుత్వం హైదరాబాద్ అంశంపై దృష్టి సారించి 1948 సెప్టెంబర్ మొదటి వారంలో పోలీస్ యాక్షన్ చేపట్టింది.


సాయుధ పోరాట సాధనలో మల్లు స్వరాజ్యం తదితరులు


రజాకార్లు

ప్రభుత్వ స్కూలు పిల్లలపై ఎందుకీ వివక్ష?

సీబీఎస్ఈ బోధన రద్దుతో పేదల వ్యతిరేకి అని మరోసారి నిరూపించుకున్నారు

- మీ ఇళ్లలో పిల్లలకు అత్యుత్తమ చదవులు అందించాలనుకుంటారు
- పేద పిల్లలు ఎప్పటికీ కింది స్థాయిలోనే ఉండిపోవాలా?
- వారి జీవితాలకు మీరు శాపం పెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏంటి?
- పేద పిల్లల తలరాతలు మార్చే కార్యక్రమాలు మేం అమలు చేశాం.. మీరు ఒక్కొక్కటిగా వాటిని రద్దు చేస్తున్నారు
- ప్రభుత్వ టీచర్లను తక్కువగా చూసే మీ మనస్తత్వాన్ని మార్చుకోండి
- గవర్నమెంటు స్కూళ్ల పిల్లల చదువు అవకాశాలను దెబ్బతీయకండి
- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన రద్దుతో మీరు మరోసారి పేదల వ్యతిరేకి అని నిరూపించుకున్నారు అని సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీబీఎస్ఈ బోధన రద్దు ద్వారా నాణ్యమైన విద్యకు గండి కొడుతున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల భవితను అంధకారంలోకి నెట్టేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ నిలదీశారు. సోమవారం ఎక్స్‌లో చేసిన పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే.. "ముఖ్యమంత్రిగా మీరు, విద్యాశాఖ మంత్రిగా మీ కుమారుడు తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళ్తున్నారు. మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, గవర్నమెంటు స్కూలు పిల్లల విషయంలో వివక్ష ఎందుకు? వాళ్లు ఎప్పటికీ కింద స్థాయిలోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు మీరు శాపంపెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏంటి?



గవర్నమెంటు స్కూళ్ల పిల్లలను ప్రైవేటు బాట పట్టించే కుట్ర..

గవర్నమెంటు స్కూళ్ల రూపురేఖలు మార్చే కార్యక్రమాలను రద్దు చేయడం ఎంతవరకు సమంజసం? ముఖ్యమంత్రిగా మీ 14 ఏళ్ల కాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసింది. నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీవైపు అడుగులు, టోఫెల్, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్, 8వ తరగతి వచ్చే సరికే ట్యాబుల పంపిణీ, విద్యాకానుక, రోజుకో మెనూతో గోరుముద్ద.. ఇలా పేద పిల్లల తలరాతలను మార్చే చదువులను అందించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకువచ్చింది. మీ హయాంలో ఇప్పుడు ఒక్కొక్కటిగా వీటిని రద్దుచేస్తూ వస్తున్నారు. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలను ప్రైవేటు బాట పట్టించడానికి మీరు, మీ కుమారుడు కుట్రను అమలు చేస్తున్నారు. మీ పార్టీ నాయకులకు చెందిన ప్రైవేటు స్కూళ్లు బాగుండాలి? గవర్నమెంటు స్కూళ్లు నిర్వీర్యం అయిపోవాలి? మీ ఉద్దేశం అదేగా? తమ పిల్లలకు మంచి చదువులు అందించడం కోసం తల్లిదండ్రులు వారి సొంత జేబు నుంచి ఎందుకు ఖర్చుచేయాలి? అలాంటప్పుడు ఇక ప్రభుత్వాలు ఎందుకు? గవర్నమెంటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు, ఈ "ఈనాడు" కోర్టులకు వెళ్లి అడ్డుకున్న తీరును ఇప్పటికీ ప్రజల మరిచిపోలేరు.

గవర్నమెంటు స్కూలు పిల్లలు, టీచర్లను తక్కువగా చూడొద్దు..

మన గవర్నమెంటు స్కూలు పిల్లలు, అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దేనిలోనూ తక్కువ కాదు చంద్రబాబూ. వీళ్లంతా తెలివైన వారు. పైగా ప్రభుత్వ టీచర్లు లక్షల మంది పోటీపడే పరీక్షల్లో ఉత్తీర్ణులై, చక్కటి శిక్షణ కూడా పొందినవారు. ప్రైవేటు స్కూళ్లలో ఉన్నవారి కంటే గొప్ప చదువులు చదివినవారు, గొప్పగా చదువులు చెప్పగలిగిన వారు. అలాంటివారిని తక్కువగా చూసే మీ మనస్తత్వాన్ని ముందు మార్చుకోండి. పిల్లలకు కావాల్సింది వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, సరైన శిక్షణ, పటిష్ట బోధన. టీచర్లకు అందించాల్సింది ప్రేరణ, ప్రోత్సాహం, ఓరియంటేషన్. గడచిన ఐదేళ్లలో ఈ దిశగా వారు ఎంతో ప్రయాణంచేశారు. మళ్లీ ఇప్పుడు వారిని నిరుత్సాహపరిచి, ఉద్దేశపూర్వకంగా ఎందుకు దెబ్బతీస్తున్నారు చంద్రబాబూ?

చదువుతోనే పేదరికం దూరం

పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే ఆయుధం చదువు మాత్రమే. వెంటనే ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యంచేసే తప్పుడు పనులు మానుకోండి. మేం తీసుకొచ్చిన సంస్కరణలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లండి. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలు ప్రపంచస్థాయి చదువులను చదువుకునే అవకాశాలను దెబ్బతీయకండి. లేదంటే మీరు పేదప్రజల వ్యతిరేకులుగా, చరిత్రహీనులుగా మిగిలిపోతారు" అని చంద్రబాబు విధానాలను ఎండగట్టారు.

సమీకృత గురుకులాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష!

ప్రత్యేక విధానం తీసుకురావడంపై సర్కారు దృష్టి

- ఐదో తరగతి మొదలు కళాశాలలకు సెట్
- పాత గురుకులాలకు ప్రస్తుత నిబంధనలే కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటివరకు గురుకుల సొసైటీలు వాటి పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించేవి. అన్ని తరగతుల్లో కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు చేపట్టగా.. సీట్లు మిగిలిన సందర్భాల్లో స్పాట్ అడ్మిషన్ల విధానం ద్వారా పూర్తిస్థాయిలో సీట్లను భర్తీ చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న సమీకృత గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లకు ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చే అంశంపై అధికారులు దృష్టి సారించారు. సాధారణ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ఇప్పుడున్న నిబంధనలు కొనసాగిస్తూనే.. సమీకృత గురుకులాలకు మాత్రం ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని భావిస్తున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచే..

గురుకుల విద్యా సంస్థల్లో ఇప్పటివరకు జరుగుతున్న ప్రవేశాలకు అర్హత పరీక్షలు ఒక్కో సొసైటీ ఒక్కో విధంగా నిర్వహించేది. కేవలం ఐదో తరగతికి మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు ఉమ్మడిగా ప్రవేశ పరీక్ష నిర్వహించినప్పటికీ.. ఫలితాలు ప్రకటించిన తర్వాత విద్యార్థులు దరఖాస్తు సమయంలో ఎంచుకున్న సొసైటీకి రిజర్వ్ చేస్తూ ఆ మేరకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే ఇకపై సమీకృత గురుకుల పాఠశాలలన్నిటికీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలే నిర్వహిస్తారు. ఐదో తరగతి మొదలు, 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఇంటర్మీడియట్ ఫస్టియర్, డిగ్రీ ఫస్టియర్‌లో అడ్మిషన్ల ప్రక్రియంతా ఉమ్మడిగానే నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో తొలి విడత కింద 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 సమీకృత గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈమేరకు ఆయా జిల్లా కలెక్టర్లకు భూలభ్యత, ఇతర వసతులకు సంబంధించి సూచనలు ఇవ్వగా.. కలెక్టర్లు సైతం ఇప్పటికే పూరిస్థాయి నివేదికలు పంపినట్లు సమాచారం. ఒక్కో సమీకృత గురుకులాన్ని కనిష్టంగా 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలుంటాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సమీకృత గురుకులాల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. నెల రోజుల్లోగా డిజైన్లు పూర్తి చేయాలని కమిటీ సూచించగా..అవి కూడా ఇప్పటికే తయారైనట్లు సమాచారం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సమీకృత గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది.

టాప్‌లో కటాఫ్

ఏపీలో నీట్ స్కోర్ 600 దాటినా ఈసారి నిరాశే.. కన్వీనర్ కోటా తొలి కౌన్సెలింగ్‌లో దక్కని సీటు

చంద్రబాబు సర్కార్ నిర్వాకంతో ఆగిన కొత్త మెడికల్ కాలేజీలు

గతేడాది 563 స్కోర్‌కే ఎంబీబీఎస్ సీటు.. ఐదు కొత్త కాలేజీలు, 750 సీట్లు అదనంగా రావడమే కారణం

ఈ దఫా మంచి ర్యాంకు సాధించినా రిజర్వేషన్ వర్గాలకూ రిక్త హస్తం

సాక్షి, అమరావతి:

ఏపీలో గతేడాది ఏయూ పరిధిలో ఓసీ విద్యార్థికి ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు నీట్ కటాఫ్ మార్కులు 563.. మరి ఈ ఏడాది ఏకంగా 615..!

ఇదే కేటగిరీకి ఎస్వీయూ పరిధిలో గతేడాది కటాఫ్ 550.. ఈ ఏడాది 601..!!

ఆదివారం కన్వీనర్ కోటా తొలిదశ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు పరిస్థితి ఇదీ!!

అప్పుడు సీటు దొరకటానికి.. ఇప్పుడు గగనంగా మారటానికి కారణం.. కొత్త మెడికల్ కాలేజీలే!

గతేడాది 5 కొత్త మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రావడంతో సీట్లు పెరిగి మన విద్యార్థులు ఎంతో మంది డాక్టర్లు కాగలిగారు!

ఇప్పుడు నాలుగు కొత్త కాలేజీలకు కూటమి సర్కారు నిర్వాకంతో అనుమతులు రాకపోగా పాడేరులో వచ్చింది 50 సీట్లే!

ఎంబీబీఎస్ సీట్లు పెరగకపోవడంతో ఎంత నష్టం జరిగిందో తొలి దశ కౌన్సెలింగ్‌లోనే స్పష్టంగా కనిపించింది!!

గతేడాది ప్రభుత్వ ఆధ్వర్యంలో 5 కొత్త వైద్య కళాశాలలు ప్రారంభం కావడంతో అదనంగా 750 సీట్లు సమకూరి మన విద్యార్థుల ఎంబీబీఎస్ కలల నెరవేరాయి. ఏటా పెరుగుతున్న పోటీకి అనుగుణంగా దూరదృష్టితో వ్యవహరించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారు. ఈక్రమంలో ఐదు కొత్త కాలేజీలు గతేడాది అందుబాటులోకి రాగా ఈ సంవత్సరం కూడా మరో ఐదు నూతన మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభమైతే తమ కలలు ఫలిస్తాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు! కూటమి సర్కారు ప్రైవేట్ జపం, కొత్త కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంతో ఆ ఆశల సౌధాలు కుప్పకూలాయి. ఏడాదంతా లాంగ్ టర్మ్ శిక్షణతో రూ.లక్షలు వెచ్చించి సిద్ధమైన విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారింది. తొలి దశ కౌన్సెలింగ్‌లోనే సీట్ దొరక్కపోవడంతో ఇక మిగిలిన దశల్లో సీటు లభించే అవకాశాలు తక్కువేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే రెండు మూడు సార్లు లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు అప్పు చేసిన మధ్యతరగతి కుటుంబాలు మేనేజ్‌మెంట్ కోటా సీట్ కొనే పరిస్థితి లేదు. మరోసారి ధైర్యం చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ పంపుదామంటే కూటమి సర్కారు ప్రైవేట్ మోజుతో వచ్చే ఏడాదైనా సీట్లు పెరుగుతాయనే నమ్మకం పోయింది. సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో నీట్ యూజీ విద్యార్థుల భవిష్యత్తు తలకిందులైంది. ప్రైవేట్‌కు కట్టబెట్టే ఉద్దేశంతో నాలుగు కొత్త కాలేజీలకు అనుమతులు రాకుండా ప్రభుత్వమే అడ్డుపడింది.


పిల్లల గొంతు కోశారు!

ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లకు సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని.. అది కూడా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే చేసి చూపిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి సర్కారు దాన్ని గాలికి వదిలేసి బేరాలకు తెర తీసింది. వైఎస్సార్ సీపీ హయాంలో తీసుకున్న చర్యల ఫలితంగా గిరిజన ప్రాంతంలోని పాడేరు మెడికల్ కాలేజీకి ఈ ఏడాది అరకొరగానైనా 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు కాగా వాటిలో 21 సీట్లను సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా కింద తాజాగా అమ్మకానికి పెట్టింది. ఈమేరకు 2024–25 విద్యా సంవత్సరానికి కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం నోటిఫికేషన్ జారీ చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పులివెందుల, పాడేరు, మార్కాపురం, మదనపల్లె, ఆదోనిలో ప్రారంభించాల్సిన ఐదు నూతన వైద్య కళాశాలలను కుట్రపూరితంగా అడ్డుకుని 700 ఎంబీబీఎస్ సీట్లను పోగొట్టి పిల్లల భవిష్యత్తును అంధకారంగా మార్చారని మండిపడుతున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు

- తనపై పలుమార్లు వేధింపులకు పాల్పడ్డాడని సహాయకురాలి ఫిర్యాదు
- కేసు నమోదు చేసి నార్సింగి స్టేషన్‌కు బదిలీ చేసిన రాయదుర్గం పోలీసులు



మణికొండ: సినిమాల్లో నృత్య దర్శకునిగా పనిచేస్తూ పాపులర్ అయిన జానీ మాస్టర్ తనపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు అతని సహాయకురాలు (21) పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, చెన్నై, ముంబై తదితర నగరాల్లో ఔట్‌డోర్ షూటింగ్‌లలో పాల్గొన్నప్పుడు ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే నార్సింగిలోని తన నివాసానికి వచ్చి పలుమార్లు వేధింపులకు గురి చేశాడని వివిధ ఆధారాలతో ఆమె ఆదివారం రాత్రి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన మతం మార్చుకుని అతడిని వివాహం చేసుకోవాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆ యువతి ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, బాధితురాలు ఉండేది నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో కావటంతో రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నంబర్ 1371/2024 ప్రకారం సెక్షన్ 376 (రేప్), 506 (క్రిమినల్ బెదిరింపులు), 323(2) గాయపర్చడం వంటి సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా జానీ మాస్టర్‌కు గతంలోను నేరచరిత్ర ఉందని, 2015లో ఓ కాలేజీలో మహిళపై దాడి కేసులో 2019లో మేడ్చల్ కోర్టు అతనికి ఆరునెలల జైలుశిక్ష విధించిందని పోలీసులు తెలిపారు. ఇటీవల ఆయన రాజకీయాల్లోచేరి ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ తరపున గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారు. కేసు తమ స్టేషన్‌కు వచ్చిందని, విచారణ చేస్తున్నామని నార్సింగి సీఐ హరికృష్ణారెడ్డి తెలిపారు. మరో పక్క సఖీ బృందం బాధితురాలి వద్ద రహస్య ప్రదేశంలో వివరాలు సేకరించింది.

బాధితుల గోప్యతను కాపాడాలి

'ఓ ఇష్యూ కోర్టులో ఉన్నప్పుడు ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత వ్యక్తుల తాలూకు ముసుగు లేని ఫొటోలను, వీడియోలను ఉపయోగించవద్దని, ఒకవేళ ఇప్పటికే ఉపయోగించినట్లయితే వెంటనే తీసివేయాలని కోరుతున్నాం' అని తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ఓ నోట్‌ని విడుదల చేసింది. బాధిత పార్టీల గోప్యతను కాపాడాలని అన్ని ప్రింట్, డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాలను అభ్యర్థిస్తున్నాం.. అంటూ తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి తరఫున గౌరవ కార్యదర్శి కె.ఎల్.దామోదర్‌ప్రసాద్ ఆ నోట్‌లో పేర్కొన్నారు.

జానీ మాస్టర్ 'వ్యవహారం'లో స్పందించిన జనసేన

జానీ మాస్టర్ వ్యవహారంపై జనసేన స్పందించింది. ఆయన్ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించినట్టు జనసేన కార్యాలయం పార్టీ ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పేరుతో సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రపంచస్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

- హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీలో పర్యటించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు
- రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో రెండు ఫార్మా ల్యాబ్‌లను ప్రారంభించిన మంత్రి

శామీర్‌పేట్: హైదరాబాద్‌ను ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఫేస్ 1లో సోమవారం ఆయన పర్యటించారు. జీనోమ్‌వ్యాలీలో అధునాతన సర్టిఫైడ్ లైఫ్ సైన్సెస్ 3 జీవిని ఆయన ప్రారంభించారు. అనంతరం సైనోపోలిస్‌లో నిర్వహించిన కనెక్ట్ 2024 కార్యక్రమంలో పాల్గొని ప్రముఖ ఫార్మా దిగ్గజాలైన 60 మంది ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ...జీనోమ్‌వ్యాలీలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తుందన్నందున అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల మౌలికవసతులు కల్పిస్తామని వివరించారు. ప్రపంచ ఫార్మా దృష్టిని హైదరాబాద్ జీనోమ్‌వ్యాలీ ఆకర్షించేలా అత్యాధునిక ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతామన్నారు. పెట్టుబడులు రాబట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులోభాగంగానే జీనోమ్‌వ్యాలీని సందర్శించి ఫార్మా దిగ్గజాలతో సమావేశమైనట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. అనంతరం రూ.2 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న కర్కల్యాబ్స్, లారస్ ల్యాబ్స్ పనులను ఆయన ప్రారంభించారు.

2035 నాటికి 40000 మెగావాట్ల గ్రీన్ పవర్

- రాష్ట్రంలో ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- హరిత విద్యుత్‌లో పెట్టుబడులకు తెలంగాణ సరైన వేదిక
- ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానం తెస్తాం
- గుజరాత్‌లో నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ సదస్సు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సౌర విద్యుత్ రంగంలో పెట్టుబడులతో రాష్ట్రానికి రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. గుజరాత్ గాంధీనగర్‌లో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ప్రారంభమైన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సదస్సులో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో సహజ వనరులతోపాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, టీఎస్–ఐపాస్ వంటి సరళీకృత వాణిజ్య విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రీన్ పవర్ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రం సరైన వేదిక అని తెలిపారు. 300 రోజులకుపైగా సూర్యరశ్మి లభ్యత ఉంటుందని, 26.4 గిగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. దేశంలో బలంగా గాలులు వీచే మొదటి 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. సుమారు 54 గిగావాట్ల పవన విద్యుదుత్పత్తికి అవకాశముందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని వెల్లడించారు. ఇతర రిజర్వాయర్లు, పాడుబడిన గనుల్లో సైతం ఈ ప్రాజెక్టులు చేపట్టవచ్చన్నారు. రాష్ట్రంలో 1500–3000 మెగావాట్ల హైడ్రోజన్, జియోథర్మల్, 250 మెగావాట్ల మినీ హైడల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశముందని చెప్పారు.

దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు సహకారం

రాష్ట్రంలో గ్రీన్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి త్వరలో కొత్త విధానాన్ని ప్రకటిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అద్భుత ఆర్థిక వ్యవస్థతో ఐటీ, ఔషధ రంగాల్లో మేటిగా నిలిచిన తెలంగాణ.. 500 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలన్న భారత దేశ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తోందన్నారు. రాష్ట్రంలో రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ నదీ పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుల విశేషాలను వివరించారు. ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు సుస్థిర సాంకేతికతను కలిగి ఉంటాయన్నారు. పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి చేపట్టనున్న ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ ప్రాజెక్టులు హరిత విద్యుదుత్పత్తికి విస్తృత అవకాశాలు కల్పిస్తాయన్నారు.



పెట్టుబడులకు ఆహ్వానం

సుమారు 40 మందికి పైగా ఔత్సాహిక పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకున్న అవకాశాలపై చర్చించారు. జర్మనీకి చెందిన గిజ్, టాటా పవర్, సెమ్‌కార్ప్, వెల్‌స్పన్, రెన్యూ పవర్, ఇండియా ఆయిల్, ఎన్‌హెచ్‌పీసీ, ఐఐటీ బాంబే, ఓనిక్స్, హీరో పవర్, ఊర్జా ఎనర్జీ, కేజీఎం వంటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపాయి. రాష్ట్రంలో పెట్టుబడులకు పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు ఆసక్తి కనబరచడంతో హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 గిగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తికి చేసిన ప్రణాళికలను భట్టి కేంద్ర మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో డిస్కంల సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

నాగ్‌పూర్–సికింద్రాబాద్ వందేభారత్ రాక

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ ప్రారంభించిన నాగ్‌పూర్–సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 11 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సికింద్రాబాద్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్‌కు చేరుకున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు గవర్నర్, మంత్రులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ప్రపంచంలోనే అతి పెద్ద నెట్ వర్క్ కలిగిన భారతీయ రైల్వేలు ప్రధాని మోదీ సారథ్యంలో పరుగులు పెడుతున్నాయని ప్రశంసించారు. తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం రూ.5 వేల కోట్లకు పైగా నిధులను కేటాయించిందని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 4 వందేభారత్‌లు వచ్చాయని, నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ రైలు తెలంగాణకు అయిదోదని గుర్తు చేశారు. రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి పనులు వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతాయని వివరించారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, నాగ్‌పూర్–సికింద్రాబాద్ వందే భారత్ వల్ల పర్యాటకంగా, విద్య, వ్యాపారపరంగా పురోగతి ఉంటుందని అభిప్రాయపడ్డారు.


వందే భారత్ రైలులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 17-9-2024

ప్రపంచ సాగర యాత్ర


రూపా – డెల్‌నా

కడలి అలలిక వాళ్ల కాళ్ల కింద...

56 అడుగుల సెయిల్ బోట్.
40000 కిలోమీటర్ల దూరం
250 రోజుల ప్రయాణం
రాకాసి అలలు... భీకరగాలులు
వీటన్నింటినీ ఎదుర్కొంటూ
ఇద్దరే మహిళా నావికులు.
స్త్రీలంటే ధీరలు అని నిరూపించడానికి
ఇండియన్ నేవీ త్వరలో
తన ఇద్దరు నావికులను
సముద్రం మీద ప్రపంచాన్ని
చుట్టి రావడానికి పంపనుంది.
పాండిచ్చేరికి చెందిన రూపా
కాలికట్‌కు చెందిన డెల్‌నా
బయలుదేరనున్నారు.
ఈ సాహస యాత్ర గురించి...

సముద్రం మీద ప్రపంచాన్ని చుట్టి రావాలంటే పెట్టి పుట్టాలి. పట్టిన పట్టు విడువని స్వభావంతో పుట్టాలి. 'ఓషన్ సెయిలింగ్ అడ్వంచర్స్'లో ఇండియా ఉనికి ప్రపంచానికి తెలియాలంటే అందునా స్త్రీ శక్తి తెలియాలంటే 'సర్కమ్‌నావిగేషన్' (ప్రపంచాన్ని చుట్టి రావడం) ఒక్కటే మార్గమని నేవీ వైస్ అడ్మిరల్ మనోహర్ అవతి ఉద్దేశం. అందుకే 'సాగర్ పరిక్రమ' కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. అంటే సముద్ర మార్గాన ప్రపంచాన్ని చుట్టి రావడం. ఇప్పటికి భారతదేశం మూడు సాగర పరిక్రమలు విజయవంతంగా పూర్తి చేసింది. వీటిలో రెండింటిని పురుష ఆఫీసర్లు; ఒకదానిని మహిళా ఆఫీసర్లూ పూర్తి చేశారు. మహిళల కోసమే 'నావికా సాగర్ పరిక్రమ'ను నేవీ ప్రవేశపెడితే 2017లో ఏడుగురు మహిళా నేవీ ఆఫీసర్లు ఆ పరిక్రమను పూర్తి చేసి జేజేలు అందుకున్నారు. ఆ తర్వాత 'నావికా సాగర్ పరిక్రమ 2' యత్నాలు మొదలయ్యాయి. ఏడుగురి స్థానంలో ఇద్దరినే ఉంచి సాహసవంతంగా పరిక్రమ చేయించాలని నేవీ సంకల్పించింది. ఇందుకు నేవీలో పని చేసే మహిళా ఆఫీసర్ల నుంచి స్వచ్ఛందంగా దరఖాస్తులు ఆహ్వానించగా చాలామంది స్పందించారు. వారిలో అనేక దశల వడపోత తర్వాత ఇద్దరు ఆఫీసర్లు మిగిలారు. వారే రూపా, దిల్‌నా. గత మూడేళ్లుగా వారితో చేయించిన ట్రైనింగ్ ముగియడంతో అతి త్వరలో సాహస యాత్ర మొదలుకానుందని నేవీ తెలిపింది.

ఆటల నుంచి సాగరంలోకి...

'నాకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. ఆటలు ఆడుతూనే 2014లో నేవీలోకి వచ్చాను' అంటుంది లెఫ్టినెంట్ కమాండర్ డెల్నా. కేరళకు చెందిన డెల్నా ఆర్మీలో పని చేస్తున్న తండ్రిని చూసి నేవీలో చేరింది. 'నేవీలో లాజిస్టిక్స్ ఆఫీసర్‌గా పని చేస్తూ ఉండగా 'నావికా సాగర్ పరిక్రమ 2' సంగతి తెలిసింది. నేను అప్లై చేశాను. సెలెక్ట్ అయ్యాను. అయితే అప్లై చేసిన చాలామంది మధ్యలోనే కుటుంబ వొత్తిళ్ల వల్ల మానుకున్నారు. సముద్రం మీద సంవత్సరం పాటు కేవలం మరొక ఆఫీసర్ తోడుతోనే ఉండాలంటే ఎవరైనా భయపడతారు. కాని మా నాన్న, నేవీలోనే పని చేస్తున్న నా భర్త నన్ను ప్రోత్సహించారు. నేవీలో పని చేయడం అంటే జీవితం సముద్రంలో గడపడమే. అయినా నేనూ నా భర్త శాటిలైట్ ఫోన్ ద్వారా కనెక్టివిటీలోనే ఉంటాం' అని తెలిపింది డెల్నా.

నన్ను నేను తెలుసుకోవడమే

'నేలకు దూరంగా సముద్రం మీద ఉండటం అంటే నన్ను నేను తెలుసుకోవడమే' అంటుంది లెఫ్టినెంట్ కమాండర్ రూపా. పాండిచ్చేరికి చెందిన రూప తండ్రి నేవీలోనే పని చేస్తుండటంతో 2017లో ఆమె నేవీలో చేరింది. 'ముంబైలో నేవీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తుండగా నావికా సాగర్ పరిక్రమ 2లో పాల్గొనే అవకాశం వచ్చింది. సముద్రం అంటే నాకు ఇష్టం. నేలను ఒదిలి పెట్టి వచ్చిన మనిషిని సముద్రం ఎప్పుడూ నిరాశ పరచదు. అద్భుతమైన ప్రకృతిని సముద్రం మీద చూడవచ్చు. ఒక్కోసారి భయం వేస్తుంది. కాని అంతలో ముందుకు సాగే ధైర్యం వస్తుంది' అంటోందామె.

కఠిన శిక్షణ

'నావికా సాగర్ పరిక్రమ2'కు ఎంపికయ్యాక గత మూడు సంవత్సరాలుగా డెల్నా, రూపాలు శిక్షణ తీసుకుంటున్నారు. తారిణి అనే సెయిల్ బోట్లో వీరికి శిక్షణ జరుగుతోంది. ఇప్పటికే వీరు ఈ బోట్‌లో సముద్రం మీద 34 వేల నాటికల్ మైళ్లు తిరిగారు. బోట్‌ను నడపడం, దిశను ఇవ్వడం, రిపేర్లు చేసుకోవడం, వైద్యం చేసుకోవడం, శారీరక మానసిక దృఢ్యం కలిగి ఉండటం... ఇవన్నీ శిక్షణలో నేర్పిస్తారు. 'మేము ఇద్దరమే బోట్‌లో ఉంటాం. అంటే పని ఎక్కువ నిద్ర తక్కువ ఉంటుంది. ఊహించని తుఫాన్లు ఉంటాయి. ఒకేవిధమైన పనిని తట్టుకునే స్వభావం, ఓపిక చాలా ముఖ్యం. మేము అన్ని విధాలా సిద్ధమయ్యాము. ఇక ప్రయాణమే ఆలస్యం' అన్నారు ఈ ఇద్దరు ధీరవనితలు.

త్వరలో ప్రారంభం కానున్న వీరి సాగర పరిక్రమ కచ్చితంగా విజయవంతం అవుతుందని ఆశిద్దాం.

ముందస్తు భరోసాకు..

భరోసానే మందు

ఇంట్లో ఒక్కరు అనారోగ్యం బారిన పడినవారుంటే ఆ ఇంట్లో వాళ్లందరూ ఆందోళన చెందుతుంటారు. జబ్బున పడిన మనిషికి ఇవ్వాల్సిన భరోసా.. సమస్యను నివారించే ఉపాయాలు.. సరైన సమయంలో రోగ నిర్ధారణ ఆవశ్యకత, తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు.. ఎదుర్కొనే విధానాలు... వీటన్నింటి పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల భరోసాగా ఉండచ్చు.


ప్రతీకాత్మక చిత్రం

మరణం అంచుల్లో ఉన్న రోగులకు తమ స్పర్శ ద్వారా భరోసాను కల్పిస్తోంది హైదరాబాద్‌లోని స్పర్శ్ హాస్పిస్ కేంద్రం. ప్రధానంగా క్యాన్సర్ రోగులకు సాంత్వన కలిగిస్తున్నారు ఇక్కడి నిపుణులు, స్వచ్ఛంద సేవకులు. వరల్డ్ పేషెంట్స్ సేఫ్టీ డే సందర్భంగా వీరిని సంప్రదించినప్పుడు శారదా లింగరాజు చెప్పిన వివరాలు ఎంతో మంది రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఊరట కలిగిస్తాయి.

ఈ యేడాది పేషెంట్ సేఫ్టీ డే థీమ్ 'రోగ నిర్ధారణ ప్రాముఖ్యతను తెలియజేయడం.' ప్రపంచంలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే 'రోగనిర్ధారణ అవకాశాలు మెరుగుపరచడం, పరిష్కరించడం'లో ఆగ్నేయాసియా వెనకంజలో ఉందని డబ్ల్యూహెచ్ఓ రీజినల్ డైరెక్టర్ సైమా వాజెద్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.'గ్లోబల్ పేషెంట్ సేఫ్టీ యాక్షన్‌ప్లాన్ 2021–2030 అమలును అంచనా వేయడానికి గ్లోబల్ మెంబర్ స్టేట్ సర్వేలో కేవలం 47 శాతం దేశాలు మాత్రమే రోగనిర్ధారణ బాధ్యతలను తీసుకుంటున్నాయని తెలిసింది.

*** నేడు పేషెంట్స్ సేఫ్టీ డే**

నిర్ధారణ ముఖ్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019లో నిర్వహించిన సమావేశంలో ప్రతి యేటా సెప్టెంబర్ 17న ప్రపంచ పేషెంట్స్‌సేఫ్టీ డే ని ప్రారంభించింది. రోగి భద్రత –ప్రాముఖ్యతను ఈ స్పెషల్ డే గుర్తు చేస్తుంది. ఆరోగ్య సంరక్షణలో భాగంగా రోగి భద్రత ప్రాముఖ్యతను గురించి అవగాహన పెంచడమే ఈ సేఫ్టీ డే లక్ష్యం. ఇందులో రోగులతో పాటు వారి కుటుంబాలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, నాయకులు, సమాజంలో అందరూ బాధ్యతగా తీసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ పిలుపునిచ్చింది. అంతేకాదు ఎన్జీవో ల నుంచి నిపుణులు, రోగులు లేదా వారి కుటుంబీకులు, ప్రతినిధులను ఒకచోట చేర్చి వివిధ వ్యాధుల నిర్వహణలో 'రోగ నిర్ధారణ ప్రాముఖ్యత'ను చర్చించాలని సూచించింది.

అత్యవసర సేవలు

అత్యవసర సేవలు అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు తరచు వింటూనే ఉన్నాం. అత్యవసర సేవలను అందించడం ద్వారా దేశంలో 50 శాతానికి పైగా మరణాలు, 40 శాతానికి పైగా రోగాల భారాన్ని తగ్గించిన వారవుతారని ఎయిమ్స్ తన నివేదికలో పేర్కొంది. ఆరోగ్య భారతం మనందరి సమష్టి బాధ్యత అని తెలియజేసింది.

''మేం ఇప్పుడు 600 మంది మృత్యుముఖంలో ఉన్న పేషెంట్స్‌కు స్వచ్ఛంద సేవలు అందిస్తున్నాం. కొంతమంది హాస్పిస్‌లో ఉండి సేవలు పొందుతున్నారు. రోగులకు ఇచ్చే సేవ, సంరక్షణ భరోసాతో కూడుకున్నదైతే వారు అంతే ప్రశాంతంగానూ ఉండగలుగుతారు. మరికొందరు వారి కుటుంబ సభ్యుల మధ్యనే ఉంటున్నారు. ఇలాంటప్పుడు ఆందోళనను తగ్గించుకోవడంతో బాటు రోగికి కావాల్సిన ప్రశాంత వాతావరణం, వాడాల్సిన మందులు వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. చెప్పిన సూచనలను పాటిస్తూ ఉండటం వల్ల ఆ పేషెంట్స్ కూడా భద్రతను పీలవుతారు. అది వారి ఆయుష్షునూ పెంచుతుంది.

అవగాహనతో ..

వీటితో పాటు వంశపారంపర్యంగా వచ్చే జబ్బులకు, అంటువ్యాధులకు ముందస్తుగానే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కుటుంబసభ్యులకు చెబుతున్నాం. కౌన్సెలింగ్స్ ఇస్తున్నాం. రొమ్ముక్యాన్సర్‌తో ఇటీవల ఒకామె చనిపోయింది. ఆమె కూతురుకు 22 ఏళ్లు. పెళ్లయ్యింది. కానీ, ఆమె భర్త ఈ అమ్మాయికి కూడా తల్లికి మాదిరే క్యాన్సర్ వస్తుందేమో అనే అనుమానంతో ఆమెను వదిలేశాడు. దీంతో ఇద్దరికీ కౌన్సెలింగ్ చేశాం. కొన్ని ముందస్తు జాగ్రత్తలు చెప్పాం. ఇప్పుడా అమ్మాయి ఆరోగ్యంగా, భరోసాతో కూడిన జీవనం గడుపుతోంది.

మొదటి దశలోనే గుర్తిస్తే..

వ్యాధి మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సులభం అవుతుంది. అది ఆ పేషెంట్‌నే కాదు వారి కుటుంబాన్ని కూడా కాపాడిన సందర్భాలూ ఉన్నాయి. ముందస్తుగా చేయించుకోవాల్సిన వాక్సినేషన్లు, వాడాల్సిన మందులు, జాగ్రత్తల గురించీ వివరిస్తున్నాం. దీర్ఘకాలిక జబ్బులు, పేషెంట్స్‌ను చూసుకోవాల్సి విధానం గురించి తెలుసుకోవాలనుకునే వారికి తగిన అవగాహన కల్పించడానికి మేం ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం'' అని వివరించారు శారద లింగరాజు.


శారద లింగరాజు
స్పర్శ్ హాస్పిస్

సాగుబడి
ఉత్తర కార్తె:
సెప్టెంబర్ 26 వరకు

గాక్ ఫ్రూట్.. అత్యంత ఖరీదైన పండు. మనకు కొత్త పంట. కానీ, అనేక దక్షిణాసియా దేశాల్లో విరివిగా సాగవుతున్నది. ఎన్నెన్నో పోషకాలు, ఔషధ గుణాల గని ఈ అద్భుత పండు. పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమకు కూడా ఎంతో ఉపయుక్తమైన పండ్ల జాతి గాక్. కేరళ, కర్ణాటకలో అతికొద్ది మంది ఇంటిపంటగా సాగు చేస్తున్న ఈ పంటను తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటగా ఏలూరు జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి పెరట్లో సాగు చేస్తూ.. కిలో రూ. 500కు విక్రయిస్తూ.. అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇంటిపంటగా, వాణిజ్య పంటగా సాగు చేసుకోదగిన ఈ కొత్త పంటపై ప్రత్యేక కథనం.

'గాక్' ఫ్రూట్.. ద గ్రేట్!


గాక్ ఫ్రూట్






వెంకట్

బోరగం వెంకట్ బీటెక్ చదువుకొని పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇంతవరకే అయితే పెద్ద విశేషం ఏమీ లేదు. ఏదైనా మంచి కొత్త పంటను మన ప్రజలకు పరిచయం చేయాలన్న తపనతో ఇంటర్నెట్ సహాయంతో లక్షణమైన గాక్ ఫ్రూట్‌ను సాగు చేయనారంభించారు. వెంకట్ స్వస్థలం ఏలూరు జిల్లా పోలవరం మండలం లోని మామిడిగొంది గ్రామం. గాక్ ఫ్రూట్‌ను కేరళలో కొందరు సాగు చేస్తుండటాన్ని ఇంటర్నెట్ ద్వారా తెలుసుకున్న వెంకట్, మొక్కలు తెప్పించి తన ఇంటి పెరట్లో 2023 నవంబర్ నెలలో నాటారు.

సుమారు 300 మొక్కల్ని నాటి, పందిరి పైకి పాకించారు. ఇందులో కొన్ని ఆడ, మగ మొక్కలు కలిసి ఉన్నాయి. చాలా ఏళ్ల పాటు పండ్ల దిగుబడిని ఇవ్వటంతో పాటు.. ఏడాది పొడవునా పండ్లను అందించే అద్భుత తీగజాతి పంట ఇది. అవగాహన లోపం వల్ల మొక్కల్ని దగ్గరగా నాటటం వల్ల కొన్ని మొక్కలు చనిపోయాయని, ప్రస్తుతం 120 మొక్కలు మాత్రమే బతికి ఉన్నాయని వెంకట్ 'సాక్షి సాగుబడి'కి తెలిపారు.

రెండు నెలల క్రితం నుంచి చక్కని ఎర్రటి పండ్ల దిగుబడి తీసుకుంటున్నానని, ఎంతో ఆరోగ్యకరమైన ఈ పండ్లకు చాలా గిరాకీ ఉందని వెంకట్ తెలిపారు. గాక్ ఫ్రూట్ సాగు గురించి తెలుసుకున్న ప్రజలు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి కిలో పండ్లకు రూ. 500 చెల్లించి కొనుగోలు చేస్తున్నారని సంతోషంగా చెప్పారు. ఒక్కో పండు అరకేజీ వరకు బరువు పెరుగుతోంది.

ప్రతి రెండు ఆడ మొక్కల పక్కన ఒక మగ మొక్కను నాటుకోవాలని, 6×6 అడుగుల దూరంలో నాటుకొని పందిరి వేస్తే సరిపోతుందని ఆయన తెలిపారు. ఒక్కసారి నాటితే 30 ఏళ్ల పాటు ఏడాది పొడవునా నిరంతరాయంగా పండ్ల దిగుబడి వస్తూ ఉంటుందన్నారు. దీని తీగలు ఎంత విస్తారంగా పెరిగే వీలుంటే అన్ని ఎక్కువ పండ్ల దిగుబడి వస్తుందని తన అనుభవంలో తెలుసుకున్నానన్నారు.

ఆకాకర జాతికి చెందిన గాక్ ఫ్రూట్ పైన కూడా నూగు ఉంటుంది. లోపల గుజ్జుతో పాటు గింజలు ఎక్కువగానే ఉంటాయి. గింజల్ని తీసేసి గుజ్జును జ్యూస్ చేసుకొని తాగితే పోషకాల లోపం తగ్గిపోతుందని, జబ్బులు సైతం తగ్గుతాయని ఆయన చెబుతున్నారు.

గాక్ ఫ్రూట్ పూలకు కృత్రిమంగా చేతులతో పరపరాగ సంపర్కం చేస్తే అధిక పండ్ల దిగుబడి వస్తుందని, సహజంగా జరిగితే సగం దిగుబడి మాత్రమే వస్తుందని వెంకట్ వివరించారు.

గాక్ ఫ్రూట్ పువ్వు రెండు నెలల్లో పిందె నుంచి పండు దశకు పెరుగుతుంది. రంగులు మారుతుంది. పిందె పడిన తొలి నెలలో ఆకు పచ్చగా ఉంటుంది. ఈ దశలో ఈ కాయలను గోకాకర మాదిరిగానే కూరవండుకొని తినొచ్చు. దోసకాయ మాదిరి రుచి ఉంటుందన్నారు. రెండో నెలలో మొదటి పది రోజుల్లో పసుపు పచ్చ రంగుకు మారుతుంది. 20 రోజులకు నారింజ రంగులోకి మారి, 30 రోజులకు ఎర్రగా మారుతుంది. పండు పండిన తర్వాత త్వరగా మెత్తబడి పోతుందని వెంకట్ వివరిస్తున్నారు. విత్తనాలు నల్లగా ఉంటాయి.

యూట్యూబ్ ద్వారా వెంకట్ దగ్గర ఈ కొత్త పంట సాగవుతున్నట్లు తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ స్పందించి ఉద్యాన శాఖ అధికారులను పంపారు. పండ్లతో పాటు కొన్ని మొక్కలను తెప్పించి ప్రయోగాత్మకంగా సాగు చేయించటం ప్రారంభించారు.

గాక్ ఫ్రూట్ పోషక విలువలతో కూడిన పంటని, దీన్ని సులువుగా తీగ ముక్కలను కత్తిరించి నాటుకోవచ్చని వెంకట్ ఇంటిపంటను పరిశీలించిన ఉద్యానాధికారి సందీప్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఇది చీడపీడలు ఆశించని పంటని, సాగు చేయటం కూడా సులువేనని అన్నారు. ఇద్దరు రైతులతో తాము ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నామన్నారు.

వియత్నాం, చైనా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల్లో చిరకాలంగా సాగులో ఉన్న గాక్ ఫ్రూట్‌ను అనాదిగా సంద్రప్రదాయ వైద్యంలో విస్తృతంగా వినియోగిస్తున్నారని యూనివర్సిటీ సైన్స్ మలేషియా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లైకోపెన్, బీటా కెరోటిన్, ఫ్యాటీ ఆసిడ్స్, యాంటీఆక్సిడెంట్లు అత్యధిక మోతాదులో కలిగి ఉండటం వల్ల కేన్సర్, అల్సర్లు, కంటి సమస్యలు తదితర జబ్బుల్ని నయం చేసే విశేష ఔషధ గుణాలు గాక్ ఫ్రూట్‌లో ఉన్నాయని శాస్త్రవేత్తలు ఆస్ట్రేలియా జర్నల్ ఆఫ్ క్రాప్‌సైన్స్‌లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఔషధాలు, సౌందర్య సాధనాల తయారీ పరిశ్రమలకు గాక్ ఫ్రూట్ ముడిసరుకుగా ఉపయోగపడుతున్నందున వాణిజ్యపరమైన విలువ కలిగి ఉండటం మరో విశేషం.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

> మన ప్రాంతానికి ఓ మంచి కొత్త పంటను పరిచయం చేయాలనే తపన నాకుండేది. ఇంటర్నెట్‌లో గాలిస్తుండగా గాక్ ఫ్రూట్ గురించి తెలిసింది. కేరళలో ఒకరి దగ్గరి నుంచి మొక్కలు తెప్పించి నాటా. 20 సెంట్ల నా పెరటి తోటలో గాక్ ఫ్రూట్స్ వారానికి 10-15 కిలోల వరకు పండుతున్నాయి. కూరకు ఉపయోగపడే పచ్చి గాక్ కాయలను కిలో రూ. 300కు, పండ్లను కిలో రూ. 500కు అమ్ముతున్నా. కేరళలో కిలో రూ. 1,000 - 1,500
>
> **కిలో రూ. 500కు అమ్ముతున్నా..!**
>
> వరకు అమ్ముతున్నారు. గ్యాస్ ఫ్రూట్ జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంపొందించటంతో పాటు.. షుగర్, కేన్సర్ వంటి జబ్బుల్ని కూడా నయం చేస్తుంది. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల వాళ్లు ముందే బుక్ చేసుకొని కొనుగోలు చేస్తున్నారు. మొక్కలు కావాలని కూడా చాలా మంది అడుగుతున్నారు.
>
> – బోరగం వెంకట్ (77999 11174),
> గాక్ ఫ్రూట్ సాగుదారు, మామిడిగొంది,
> పోలవరం మండలం, ఏలూరు జిల్లా

నవంబర్‌లో అంతర్జాతీయ సహకార మహాసభ


130 ఏళ్ల ప్రపంచ సహకార రంగ చరిత్రలో మొట్టమొదటి సారి అంతర్జాతీయ సహకార మహాసభ మన దేశంలో జరగనుంది. ఈ ఏడాది నవంబర్ 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే ప్రపంచ సహకారుల మహాసభకు న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదిక కానుంది. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన 'అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025' కూడా ఈ సందర్భంగా ప్రారంభం కానుంది.

ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలియన్స్ (ఐసిఎ) ఆధ్వర్యంలో జరిగే ఈ మహాసభలో ప్రతినిధులుగా పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వంద దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు పాల్గొంటారని భావిస్తున్నారు. ప్రపంచంలో 8 లక్షల వరకు సహకార సంఘాలు ఉంటే మన దేశంలో సుమారు 25% సొసైటీలు ఉండటం విశేషం. ఇఫ్కో వరుసగా మూడో ఏడాది ప్రపంచంలోనే అతిపెద్ద సహకార సంఘంగా గుర్తింపు పొందింది. నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్, నేషనల్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ వంటి కొత్త తరహా సహకార సంఘాలను ఏర్పాటు చేయటం ద్వారా భారత్ సహకార రంగంలో పురోగమిస్తోందని ఐసిఎ డైరెక్టర్ జనరల్ జెరోన్ డొగ్లస్ ఇటీవల మెచ్చుకున్నారు. భారతీయ ప్రతినిధి రిజిస్ట్రేషన్ రుసుము 550 యూరోలు (సుమారు రూ.51,065). మన దేశంలోని ఐసిఎ సభ్యులకు 400 యూరోలు. యువ సహకారులకు ప్రాధాన్యం ఉంటుంది. 35 కన్నా తక్కువ వయస్కులైన యువతకు 200 యూరోలు (రూ. 18,566) మాత్రమే. రిజిస్ట్రేషన్ రుసుము చెల్లింపునకు స్కాలర్‌షిప్ సదుపాయం కూడా నిర్వాహకులు కల్పించారు. ఇతర వివరాలకు..
https://icanewdelhi2024.coop/welcome

మిద్దెతోటలపై సదస్సు

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో మిద్దెతోట /పెరటి తోటల పెంపకంపై 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉ. 10 గం. నుంచి అవగాహన సదస్సు జరుగుతుంది. ప్రవేశం ఉచితం. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి. ఇతర వివరాలకు.. 97053 83666.

బ్రహ్మజెముడుతో బయోగ్యాస్!



ముళ్లు లేని బ్రహ్మజెముడు (స్పైన్ లెస్ కాక్టస్) పంటను కరువు ప్రాంతాల్లో ఎండాకాలంలోనూ పశుగ్రాసం కోసం సాగు చేయవచ్చన్న విషయం తెలిసిందే. అయితే, ఇటీవల శాస్త్రవేత్తలు దీనితో బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని కనుగొన్నారు. ముళ్లు లేని బ్రహ్మజెముడు మొక్కల్ని తీవ్ర కరువు పరిస్థితుల్లో.. నిస్సారమై వ్యవసాయానికి పనికిరాని భూముల్లో (మన దేశంలో వ్యవసాయ భూమిలో 40% ఇప్పటికే నిస్సారమై సాగు యోగ్యం కాకుండాపోయిందని అంచనా) కూడా సాగు చేయొచ్చు. ఇప్పటికే కొందరు రైతులు ఈ దిశగా అడుగులు వేశారు కూడా. అయితే, బయోగ్యాస్ ఉత్పత్తికి ప్రస్తుతం వాడుతున్న పశువుల పేడకు బదులు పాక్షికంగా బ్రహ్మజెముడు మొక్కల్ని వాడొచ్చని తాజాగా రుజువైంది. బయోగ్యాస్ ఉత్పత్తి ప్రక్రియను ఈ ఆవిష్కరణ కొత్త పుంతలు తొక్కిస్తుందని ఆశిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని ఇండియన్ గ్రాస్‌ల్యాండ్ అండ్ ఫోడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్రహ్మజెముడుతో బయోగ్యాస్‌పై పరిశోధన జరుగుతోంది. కరువు ప్రాంతం బుందేల్‌ఖండ్‌లో బయోగ్యాస్ ఉత్పత్తిని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం పశువుల పేడతో బయోగ్యాస్ ద్వారా 65% బయోమీథేన్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ప్రక్రియలో పేడపై ఆధారపడటం తగ్గించి బ్రహ్మజెముడును వాడుతున్నారు.

ఇండియన్ గ్రాస్‌ల్యాండ్ అండ్ ఫోడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐసిఎఆర్ అనుబంధ సంస్థ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్ ది డ్రై ఏరియాస్ ఉమ్మడిగా ఝాన్సీలో పరిశోధనలు చేపట్టాయి. ముళ్లు లేని బ్రహ్మజెముడు మొక్క ఆకులను పశుగ్రాసంగా, పర్యావరణహితమైన తోలు ఉత్పత్తులకు ముడిసరుకుగా, బయోగ్యాస్ ఉత్పత్తితో ఇంధనంగా, బయోగ్యాస్ ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే బ్రహ్మజెముడు స్లర్రీని సేంద్రియ ఎరువుగా, ఈ చెట్టు పండ్లు ఆహారంగా ఉపయోగపడుతున్నాయి. ఈ పండ్లను అనేక దేశాల్లో ప్రజలు డ్రాగన్ ఫ్రూట్ మాదిరిగా ఇష్టంగా తింటారు.

బ్రహ్మజెముడు ఆకుల గుజ్జుతో పాటు కొంతమేరకు పేడను కలిపి చేసిన బయోగ్యాస్ ప్రయోగాత్మక ఉత్పత్తిలో 61% వరకు మీథేన్ కంటెంట్‌ను సాధించడం విశేషం. దీంతో ఇది వాణిజ్యపరంగా లాభదాయకమైనదేనని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేశారు. డ్రిప్ ద్వారా నీటిని అందించటం, ఎరువుల వాడకం ద్వారా ముళ్లు లేని బ్రహ్మజెముడు పంట ఉత్పాదకతను పెంచే దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టారు. ఒక్కో బ్రహ్మజెముడు మొక్క ఏడాదికి 69 కిలోల బొగ్గుపులుసు వాయువును గ్రహిస్తుందట. రైతులకు కార్బన్ క్రెడిట్స్ ద్వారా అదనపు ఆదాయం కూడా చేకూరుతుంది.



నార్త్ ఈస్ట్ యునైటెడ్‌ను గెలిపించిన అజారయ్

ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) విజయంతో శుభారంభం చేసింది. కోల్‌కతాలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ జట్టు 1–0తో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ జట్టును ఓడించింది. ఇంజ్యూరీ సమయంలో నార్త్ ఈస్ట్ జట్టుకు మొరాకో దేశానికి చెందిన అలెదిన్ అజారయ్ (90+4వ నిమిషంలో) గోల్ అందించి గెలిపించాడు. నేడు గోవాలో జరిగే మ్యాచ్‌లో ఒడిశా ఎఫ్‌సీ జట్టుతో గోవా ఎఫ్‌సీ జట్టు ఆడుతుంది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సహజ



భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సహజ నాలుగు స్థానాలు ఎగబాకి 298వ ర్యాంక్‌లో నిలిచింది. తెలంగాణకే చెందిన మరో ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కూడా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకుంది. రష్మిక ఏకంగా 34 స్థానాలు పురోగతి సాధించి 340వ ర్యాంక్‌లో నిలిచింది.

ముమ్మర సాధనలో...

రోహిత్ బృందం నిమగ్నం • తుది జట్టు కూర్పుపై కసరత్తు పూర్తి



రోహిత్



కోహ్లి

చెన్నై: టీమిండియా ప్రాక్టీస్‌లో తలమునకలై శ్రమిస్తోంది. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం తీవ్రంగా సాధన చేస్తోంది. నిజానికి భారత్ స్థాయితో పోల్చుకుంటే బంగ్లాదేశ్ ఏమంత గట్టి ప్రత్యర్థి కానప్పటికీ... ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించిన బంగ్లాదేశ్ 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో కొత్త సీజన్‌లో ఎలాంటి ఆదమరుపునకు తావివ్వకుండా భారత ఆటగాళ్లు చెమటోడ్చుతున్నారు. సోమ వారం పూర్తిస్థాయిలో 16 మంది జట్టు సభ్యులంతా ప్రాక్టీస్ చేశారు. కోహ్లి నెట్స్‌లో ఎక్కువసేపు బ్యాటింగ్ చేశాడు. తర్వాత యువ సంచలనం యశస్వి జైస్వాల్ సాధనకు దిగాడు. ఇద్దరు చాలాసేపు వైవిధ్యమైన బంతుల్ని ఎదుర్కొనేందుకు ఆసక్తి చూపారు. భారత స్పీడ్‌స్టర్ బుమ్రా, స్థానిక వెటరన్ స్పిన్నర్ అశ్విన్ వాళ్లిద్దరికి బంతులు వేశారు. బుమ్రా బౌలింగ్‌లో షాట్లు ఆడే ప్రయత్నంలో జైస్వాల్ పలుమార్లు బౌల్డయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్, ఓపెనర్ శుబ్‌మన్ గిల్, సర్ఫరాజ్ ఖాన్‌లు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. అనంతపురంలో దులీప్ ట్రోఫీ మ్యాచ్ అయిపోగానే సర్ఫరాజ్ జట్టుతో కలిశాడు. సారథి రోహిత్ శర్మ ప్రధానంగా స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు మొగ్గు చూపాడు. చాలాసేపు స్పిన్ బంతులపైనే ప్రాక్టీస్ చేశాడు. రవీంద్ర జడేజా, రిషభ్ పంత్‌లు కూడా త్రోడౌన్ స్పెషలిస్టుల బంతుల్ని ఆడారు. సోమవారంతో భారత్ జట్టు మూడు ప్రాక్టీస్ సెషన్లను పూర్తి చేసుకుంది. మ్యాచ్‌కు మూడు రోజుల సమయం ఉండటంతో మరో రెండు సెషన్లు ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో గడపనున్నారు.



లిటన్ దాస్

ముగ్గురు స్పిన్నర్లతో...

చెపాక్ పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామం కావడంతో భారత్ ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. అనుభవజ్ఞులైన అశ్విన్, జడేజాలతో కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో దాదాపు బెర్త్ ఖాయమనిపిస్తోంది. దీంతో బ్యాటింగ్‌లోనూ మెరిపిస్తున్న స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు ఈ మ్యాచ్‌లో చోటు లేనట్లే! పేసర్ల విషయానికొస్తే బుమ్రాతో సిరాజ్ బంతిని పంచుకుంటాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగమైన ఈ రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో తొలి టెస్టు ఎంఎ చిదంబరం మైదానంలో గురువారం నుంచి జరుగుతుంది.

బంగ్లాదేశ్ ఆటగాళ్లు కూడా...

ఆదివారం చెన్నై చేరుకున్న బంగ్లాదేశ్ జట్టు క్రికెటర్లు కూడా సోమవారం నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. పాక్‌ను వారి సొంతగడ్డపై వైట్‌వాష్ చేసి ఊపు మీదున్న బంగ్లాదేశ్... ప్రపంచ రెండో ర్యాంకర్ భారత్‌ను ఓడించడమే లక్ష్యంగా నెట్స్‌లో చెమటోడ్చుతోంది. బ్యాటర్లు లిటన్ దాస్, ముష్ఫికర్ రహీమ్, మహ్ముదుల్ హసన్, జాకిర్ హసన్, షాద్‌మన్ ఇస్లామ్‌లు భారీ షాట్లపై కసరత్తు చేశారు. త్రోడౌన్ స్పెషలిస్టులపై స్ట్రెయిట్ డ్రైవ్ షాట్లు ఆడారు. స్పిన్నర్లకు కలిసొచ్చే చెన్నై పిచ్‌పై సత్తా చాటేందుకు తైజుల్ ఇస్లామ్, నయీమ్ హసన్‌లు బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు.

కొరియాను కొట్టేసి...



అమిత్ రోహిదాస్
హర్మన్‌ప్రీత్ సింగ్

ఆద్యంతం తమ ఆధిపత్యం కనబరిచిన భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు విజయం దూరంలో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి జట్టును ముందుండి నడిపించగా... ఇతర ఆటగాళ్లు కూడా రాణించడంతో ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత జైత్రయాత్ర కొనసాగుతోంది. లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా నాకౌట్ దశ సెమీఫైనల్ మ్యాచ్‌లోనూ అదే జోరు కనబరిచింది. తనదైన రోజున ఎంతటి మేటి జట్టునైనా ఓడించే సత్తాగల దక్షిణ కొరియాతో జరిగిన సెమీఫైనల్ పోరులో భారత్ ఏకపక్ష విజయాన్ని అందుకుంది. 13 ఏళ్ల చరిత్ర కలిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఆరోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జరిగే టైటిల్ పోరులో చైనాతో భారత్ అమీతుమీ తేల్చుకుంటుంది.

ఆరోసారి ఫైనల్లో భారత్

- రెండు గోల్స్‌తో మెరిసిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- నేడు చైనాతో టైటిల్ పోరు
- మధ్యాహ్నం గం. 3:30 నుంచి సోనీ స్పోర్ట్స్ టెన్–1 చానెల్‌లో, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

హులున్‌బుయిర్ (చైనా): డిఫెండింగ్ చాంపియన్ హోదాకు తగ్గట్టు ఆడిన భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అంతిమ సమరానికి అర్హత సాధించింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4–1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియా జట్టును ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ (19వ, 45వ నిమిషంలో) సాధించగా... ఉత్తమ్ సింగ్ (13వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (32వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. కొరియా జట్టుకు యాంగ్ జిహున్ (33వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు.

ఆరంభం నుంచే...

అటాకింగ్ ఆటకు ప్రసిద్ధి అయిన కొరియాతో మ్యాచ్‌లో భారత్ పక్కా వ్యూహంతో ఆడింది. ప్రత్యర్థి జట్టుకు ఎదురుదాడులు చేసే అవకాశం ఇవ్వకుండా హర్మన్‌ప్రీత్ బృందం ఆరంభం నుంచే సమన్వయంతో ముందుకు కదులుతూ కొరియా గోల్‌పోస్ట్ లక్ష్యంగా దాడులు చేసింది. దాంతో భారత ఫార్వర్డ్ ఆటగాళ్లను నిలువరించడంపైనే కొరియా ఆటగాళ్లు ఎక్కువ దృష్టి పెటాల్సి వచ్చింది. ఆట నాలుగో నిమిషంలోనే భారత్ ఖాతా తెరిచేది. అభిషేక్ కొట్టిన రివర్స్ షాట్‌ను కొరియా గోల్‌కీపర్ కిమ్ జేహన్ నిలువరించాడు. ఆ తర్వాత కూడా భారత్ తమ దాడులు కొనసాగించగా 13వ నిమిషంలో ఫలితం వచ్చింది. అరిజీత్ సింగ్ హుండల్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో అందుకున్న ఉత్తమ్ సింగ్ దానిని లక్ష్యానికి చేర్చాడు. ఆ తర్వాత కొరియా దూకుడు పెంచి నిమిషం వ్యవధిలో రెండు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. అయితే ఈ రెండింటినీ భారత రక్షణపంక్తి ఆటగాళ్లు నిర్వీర్యం చేశారు. రెండో క్వార్టర్‌లో నాలుగు నిమిషాలు గడిచాక భారత్‌కు లభించిన తొలి పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలచడంతో భారత ఆధిక్యం 2–0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో సుమిత్ అందించిన పాస్‌ను సర్కిల్ బయట అందుకున్న జర్మన్‌ప్రీత్ సింగ్ 'డి' ఏరియాలోనికి వచ్చి కొరియా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించడంతో భారత్ ఖాతాలో మూడో గోల్ చేరింది. ఈ గోల్ తర్వాత కొరియాకు దక్కిన పెనాల్టీ కార్నర్‌ను యాంగ్ జిహున్ లక్ష్యానికి చేర్చాడు. కొరియా ఖాతా తెరిచినప్పటికీ భారత్ తమ దాడులను యథేచ్ఛగా కొనసాగించింది. 45వ నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్ గోల్‌గా మలిచాడు. దాంతో భారత ఆధిక్యం 4–1కు చేరుకుంది. మూడు గోల్స్ ఆధిక్యం పొందిన భారత్ ఆ తర్వాత నియంత్రణతో ఆడి కొరియాను కట్టడి చేసి విజయాన్ని ఖరారు చేసుకుంది.




పాక్‌కు చైనా షాక్

అంతకుముందు జరిగిన తొలి సెమీఫైనల్లో ఆతిథ్య చైనా జట్టు అద్భుతం చేసింది. రెండుసార్లు చాంపియన్ పాకిస్తాన్ జట్టును మట్టికరిపించి తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరుకుంది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్' నిర్వహించగా పాకిస్తాన్ ఆటగాళ్లు వరుసగా నాలుగు షాట్‌లలో విఫలమయ్యారు. చైనా రెండు షాట్‌లను వృథా చేసినా మిగతా రెండు షాట్‌లను గోల్‌గా మలిచి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది.



అర్జున్



దివ్య

భారత జట్ల 'సిక్సర్'

చెస్ ఒలింపియాడ్‌లో వరుసగా ఆరో విజయం


బుడాపెస్ట్ (హంగేరి): ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల, పురుషుల జట్లు అంచనాలకు మించి రాణిస్తున్నాయి. ఈ మెగా ఈవెంట్‌లో భారత జట్లు వరుసగా ఆరో విజయం సొంతం చేసుకోవడం విశేషం. సోమవారం జరిగిన ఆరో రౌండ్ మ్యాచ్‌లలో భారత మహిళల జట్టు 2.5–1.5తో అర్మేనియా జట్టుపై నెగ్గగా... భారత పురుషుల జట్టు 3–1తో హంగేరి జట్టును ఓడించింది. అర్మేనియాతో జరిగిన గేముల్లో ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ 40 ఎత్తుల్లో ఎలీనా డానిలియన్‌పై గెలుపొందగా... లిలిత్ మ్రికియన్‌తో ద్రోణవల్లి హారిక 44 ఎత్తుల్లో...మరియం మ్రికియన్‌తో వైశాలి 50 ఎత్తుల్లో... అనా సర్గ్‌సియాన్‌తో తానియా సచ్‌దేవ్ 60 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. వంతిక అగర్వాల్‌కు ఈ మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చారు. హంగేరితో జరిగిన గేముల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్ 57 ఎత్తుల్లో సనన్ జుగిరోవ్‌పై, విదిత్ 52 ఎత్తుల్లో గ్లెడూరా బెంజిమన్‌పై నెగ్గగా...రిచర్డ్ రాపోర్ట్‌తో దొమ్మరాజు గుకేశ్ 44 ఎత్తుల్లో... పీటర్ లెకోతో ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. పెంటేల హరికృష్ణకు ఈ మ్యాచ్‌లోనూ విశ్రాంతి ఇచ్చారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

నా శాశ్వత తోడు నువ్వే

- అదితీరావు హైదరీ



● అదితీరావు హైదరీ, సిద్ధార్థ్

నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ ఏడడుగులు వేసి వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ ఏడాది మార్చిలో వనపర్తి జిల్లాలోని శ్రీ రంగాపూర్ రంగనాథ స్వామి దేవాలయంలో సిద్ధార్థ్–అదితీల నిశ్చితార్థం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. వీరి వివాహం కూడా ఈ దేవాలయంలోనే జరిగింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల సమక్షంలో సిద్ధార్థ్–అదితీల పెళ్లి జరిగింది. ''నువ్వే నా సూర్యుడు... నువ్వే నా చంద్రుడు... నక్షత్రాలన్నీ నువ్వే నాకు. జీవితంలో నవ్వడానికి, ఎదగడానికి నా శాశ్వత తోడు నువ్వే. మిసెస్ అండ్ మిస్టర్ అదు–సిద్ధు'' అని పేర్కొని, పెళ్లి ఫొటోలను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు అదితీరావు. పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక వనపర్తి సంస్థానాధీశుల వారసుల్లో అదితీరావు హైదరీ ఒకరు. ఈ కారణంగానే ఆమె సంస్థానానికి చెందిన దేవాలయంలో సిద్ధార్థ్–అదితీల వివాహం జరిగింది.

భారతరత్నానికి విద్యా చిత్ర నీరాజనం






● విద్యాబాలన్

''గాన కోకిల ఎమ్మెస్ సుబ్బులక్ష్మి అమ్మాళ్ అంటే నాకు వల్లమాలిన ఇష్టం. చిన్నప్పటి నుంచి ఆమె కమనీయ కంఠస్వరాన్ని వింటూ పెరిగాను. మా అమ్మ ద్వారా నాకు సుబ్బులక్ష్మి అమ్మ సుప్రభాతం వినడం అలవాటైంది. ఇప్పటికీ నా దినచర్య ప్రారంభమయ్యేది ఆ అమ్మ గాంధర్వ గానం వినడంతోనే. ఆమె 108వ జయంతి సందర్భంగా ఆ భారతరత్నానికి నేను సమర్పించగల చిరు కానుక ఇదే'' అంటూ విద్యాబాలన్ భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టారు. ప్రముఖ గాయని ఎమ్మెస్ సుబ్బులక్ష్మిని తలపించేలా నాలుగు రకాల చీరల్లో విద్యాబాలన్ ఫొటోషూట్ చేయించుకున్నారు. ఈ చీరల గురించి ఆమె ఆ పోస్ట్‌లో... ''1960–80ల మధ్య ఎమ్మెస్ అమ్మ ఈ తరహా చీరలు ధరించారు. అప్పట్లో ఈ చీరలకు చాలా ప్రాచుర్యం ఉంది. ఎమ్మెస్ అమ్మ హుందాతనానికి చీరలది సగ భాగం అయితే మిగతా సగం ఆమె నుదుటి పైన కుంకుమ, విభూది, రెండు వైపులా ముక్కు పుడకలు, కొప్పు, కొప్పు చుట్టూ మల్లెపువ్వులకు దక్కుతుంది'' అని పేర్కొన్నారు విద్యాబాలన్. కాగా ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా తయారు కావడానికి ఆమె మనవరాలు, ప్రఖ్యాత ఫ్లూటిస్ట్ సిక్కీమాలా సహాయం చేశారట. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ... ''నేను మనస్ఫూర్తిగా సంకల్పించుకున్న ఈ ప్రయత్నానికి విలువైన సలహాలు, సూచనలు ఇచ్చినందుకు ధన్యవాదాలు సిక్కీమాలా మేడమ్. అలాగే నా ఈ కల సాకారం కావడానికి కారణమైన అనూ పార్థసారథి (కాస్ట్యూమ్ డిజైనర్)కి ఎన్ని ధన్యవాదాలు చెప్పినా చాలదు. భారతీయ గానకోకిల, భారతరత్న డా. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి విలక్షణమైన శైలికి నివాళిగా ఈ చిత్రమాలికను విడుదల చేయడాన్ని గర్వంగా భావిస్తున్నాను'' అని పేర్కొన్నారు విద్యాబాలన్. కాగా ఎమ్మెస్‌గా విద్య చక్కగా ఒదిగిపోయారంటూ ఈ ఫొటోషూట్‌కి ప్రశంసలు వెల్లువెత్తాయి.

ఇదిలా ఉంటే... ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా సినిమా రూపొందించడానికి బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ గాన కోకిలగా ఫలానా తార నటించనున్నారంటూ వచ్చిన వార్తల్లో విద్యాబాలన్ పేరు కూడా ఉంది. తాజా ఫొటోషూట్ చూస్తే ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా విద్యాబాలన్ న్యాయం చేయగలరనిపించక మానదు. మరి... వెండితెర సుబ్బులక్ష్మిగా ఎవరు కనిపిస్తారో చూడాలి.

మిత్రుడు టిక్కి



● విష్ణు మంచు

విష్ణు మంచు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్‌బాబు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్, ప్రీతీ ముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంలోని శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా పాత్రలకు చెందిన ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను ఇప్పటికే విడుదల చేశారు. తాజాగా తిన్నడు (మంచు విష్ణు పాత్ర)కి విధేయుడైన టిక్కి (గుర్రం పేరు)ను పరిచయం చేస్తూ, పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రం డిసెంబరులో రిలీజ్ కానుంది.

మా అబ్బాయి కోసమే ఈ సినిమా తీశా - ప్రభాకర్



● ప్రభాకర్, చంద్రహాస్, మలయజ, వెలిగొండ శ్రీనివాస్

చంద్రహాస్ (టీవీ ఫేమ్ ప్రభాకర్ తనయుడు) హీరోగా నటించిన చిత్రం 'రామ్‌నగర్ బన్నీ'. ఈ చిత్రంలో విస్మయ శ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్లుగా నటించారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో దివిజా ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 4న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో చంద్రహాస్ మాట్లాడుతూ– ''నాకు రామ్‌చరణ్, అల్లు అర్జున్, ఎన్టీఆర్... ఇలా హీరోలందరూ ఇష్టమే. వాళ్లల్లో ఉన్న గొప్ప క్వాలిటీస్‌ని స్ఫూర్తిగా తీసుకుని నటిస్తాను'' అన్నారు. ''చంద్రహాస్ పై ట్రోల్ జరిగినప్పుడు బాధపడ్డాం. కానీ చంద్రహాస్ పాజిటివ్‌గా తీసుకుని, తనలో ఏవైనా లోపాలుంటే సరి చేసుకుంటూ తనకు తాను ఎదుగుతున్నాడు. చంద్రహాస్ కుటుంబ ప్రేక్షకులకు దగ్గర కావాలని, మరో రెండు సినిమాలు ఉన్నా కూడా ఈ సినిమానే ముందు రిలీజ్ చేస్తున్నాం. నటన పరంగా నా కొడుకులో ఉన్న తపన చూసి, నేను ఇండస్ట్రీలో సంపాదించిన డబ్బుతో 'రామ్‌నగర్ బన్నీ' తీశా'' అన్నారు ప్రభాకర్. ''ఈ సినిమా కోసం చంద్రహాస్ నాకన్నా ఎక్కువగా కష్టపడ్డాడు'' అన్నారు వెలిగొండ శ్రీనివాస్. ''ఈ సినిమా ప్రేక్షకులందరికీ నచ్చుతుంది'' అన్నారు మలయజ.

గొర్రె మీద కేసా?



● సుహాస్

సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గొర్రె పురాణం'. బాబీ దర్శకత్వంలో ప్రవీణ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'గొర్రె మీద కేసా? ఎవడా కేసుపెట్టిన గొర్రె? మనం బతకడం కోసం వాటిని చంపేయొచ్చు... మనది ఆకలి... మరి అవి బతకడం కోసం మనల్ని చంపేస్తే అది ఆత్మరక్షణే కదా సార్...' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.



● అద్వయ్

జై శ్రీరామ

నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ పి. రవిశంకర్ దర్శకత్వంలో ఆయన తనయుడు అద్వయ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సుబ్రహ్మణ్య'. ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ చిత్రాన్ని ప్రవీణ కడియాల, రామలక్ష్మిల సమర్పణలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. హీరో ఓ బావిలోకి దూకి అక్కడ ఉన్న ఓ పురాతన పుస్తకాన్ని తీసుకు రావడం, ఆ పుస్తకానికి కాపలాగా ఉన్నట్లుగా ఉన్న పాములు అతనిపై దాడి చేయడం, ఓ గుడి అతని బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించడం, జై శ్రీరామ అంటూ వాయిస్ ఓవర్ రావడం వంటివి టీజర్‌లో కనిపిస్తాయి. ఈ చిత్రం 2025లో తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

రోహిణి ఫిర్యాదుతో డా. కాంతరాజ్‌పై కేసు



● రోహిణి, కాంతరాజ్

కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హేమా కమిషన్ చిత్ర పరిశ్రమల్లో సంచలనం అయిన నేపథ్యంలో నటి రోహిణి అధ్యక్షతన ఇటీవల కోలీవుడ్‌లో ఈ తరహా కమిటీని ఏర్పాటు చేశారు. ఇక తాజాగా డా. కాంతరాజ్ ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన భేటీలో సినీ పరిశ్రమలో అవకాశాల కోసం నటీమణులు అడ్జెస్ట్ అవుతారనే విధంగా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలకు స్పందించి... ''సోషల్ మీడియాలో వ్యూస్ కోసం ఆయన ఈ విధంగా మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నటీమణుల గురించి వైరల్ కంటెంట్‌ని విడుదల చేశారు'' అంటూ చెన్నై పోలీస్ కార్యాలయంలో కాంతరాజ్‌పై రోహిణి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈ కేసుపై విచారణ చేపట్టారు. కాంతరాజ్‌పై ఐదు సెక్షన్లతో కేసు నమోదు చేశారు.

– సాక్షి సినిమా ప్రతినిధి, చెన్నై

మహిళల సమస్యలపై చర్చించాం

- కేఎఫ్‌సీసీ అధ్యక్షుడు ఎన్ఎమ్ సురేష్

మలయాళ చిత్ర పరిశ్రమను జస్టిస్ హేమా కమిటీ నివేదిక కుదిపేసింది. చిత్ర పరిశ్రమలోని మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో దాదాపు 20 మంది మలయాళ నటులపై కేసులు నమోదు అయ్యాయి. తాజాగా కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ (కేఎఫ్‌సీసీ) ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎన్ఎమ్ సురేష్ నేతృత్వంలో కన్నడ చిత్ర పరిశ్రమలోని నటీమణులతో ఓ సమావేశం జరిగింది. కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, కన్నడ పరిశ్రమలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి? మహిళల సంరక్షణ కోసం ఎటువంటి చర్యలు చేపట్టాలి? వంటి అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లుగా ఎన్ఎమ్ సురేష్ పేర్కొన్నారు.

కలి చుట్టూ...



● ప్రిన్స్, నరేశ్

ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన చిత్రం 'కలి'. కథారచయిత కె. రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో లీలా గౌతమ్ వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. శివ శేషు రచనతోపాటు దర్శకత్వం వహించారు. ఈ సినిమా అక్టోబర్ 4న విడుదల కానుంది. ''కలి అనే పాత్ర చుట్టూ అల్లుకున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ కథాంశం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే విధంగా ఉంటుంది'' అని చిత్ర బృందం పేర్కొంది. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జీవన్ బాబు, కెమెరా: నిషాంత్ కటారి, రమణ జాగర్లమూడి.

సందేశం... వినోదం



● అజయ్, ఇంద్రజ, సుమన్

జయసుధ, సుమన్, ఇంద్రజ, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. గడ్డం వెంకట రమణారెడ్డి దర్శకత్వంలో బొల్లా రామకృష్ణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సుమన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో పోలీసాఫీసర్‌గా నటించాను'' అన్నారు. ''ఈ సినిమాలో సీఎం భార్యగా నటించాను. సందేశాన్నిచ్చే చిత్రం ఇది'' అని తెలిపారు ఇంద్రజ. ''రాజకీయ నేపథ్యంలో సాగే ఈ సందేశాత్మక చిత్రం ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తూనే ఆలోచింపజేస్తుంది. ఓ సీఎం పెళ్లాం సమాజానికి మంచి చేసేందుకు ముందుకొస్తే ఎలా ఉంటుందనేది చూపించే ప్రయత్నం చేశాం'' అని వెల్లడించారు గడ్డం వెంకట రమణారెడ్డి. ''ఈ చిత్రంలో మహిళా సాధికారకత అంశాలు ఉన్నాయి'' అని పేర్కొన్నారు బొల్లా రామకృష్ణ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
98	27
82,989	25,384

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,576	▼	108
డోజోన్స్	41,544	▲	150
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,278	▲	5
డాక్స్	18,633	▼	66
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,704	▼	13
నికాయ్ (శుక్రవారం ముగింపు)	36,582	▼	252

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	73,489
బంగారం (99.5 స్వచ్ఛత)	73,195
వెండి (కిలో)	88,314

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధరమనకత	82.05	85.73
£	బ్రిటన్ పౌండ్	ధరమనకత	107.85	112.79
€	యూరో	ధరమనకత	90.84	95.34
¥	జపాన్ ఎన్ (100)	ధరమనకత	48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధరమనకత	53.96	58.83
S$	సింగపూర్ డాలర్	ధరమనకత	62.31	67.01
SAR	సౌదీ రియాల్	ధరమనకత	21.47	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	ధరమనకత	21.95	23.73
¥	చైనా యువాన్	ధరమనకత	10.95	12.79

పచ్చని కొలువులు తోడుంటే..!

2070 నాటికి కర్బన ఉద్గార రహిత (నెట్ జీరో) దేశంగా అవతరించాలనేది భారత్ లక్ష్యం. ఈ దిశగా ఇప్పటికే వడివడిగా అడుగులు పడుతున్నాయి. దిగ్గజ కంపెనీలు పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ ప్రాజెక్టులకు తెరతీయడంతో.. గ్రీన్ జాబ్స్‌కు ఫుల్ డిమాండ్ నెలకొంది.

గ్రీన్ జాబ్స్.. ఫుల్ డిమాండ్!

- పునరుత్పాదక ఇంధన రంగంలో కొలువుల జోరు
- అదానీ గ్రీన్ ఎనర్జీ, టాటా పవర్ రెన్యూవబుల్ దూకుడు
- భారీ సామర్థ్య విస్తరణతో దండిగా అవకాశాలు



పునరుత్పాదక ఇంధన (రెన్యూవబుల్ ఎనర్జీ) కంపెనీలు ఇప్పుడు నిపుణులకు రారామ్మంటూ రెడ్ కార్పెట్ వేస్తున్నాయి. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు తోడు మరిన్ని కొత్త ప్రాజెక్టులు జతవుతుండటంతో భారీగా సిబ్బంది కొరత నెలకొన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ, టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ, విక్రమ్ సోలార్, జెన్సాల్ గ్రూప్ తదితర సంస్థలు నియామకాల జోరు పెంచిన వాటిలో ఉన్నాయి. ముఖ్యంగా డేటా సైన్స్, వాతావరణ విశ్లేషణ, సోలార్ సెల్–మాడ్యూల్ తయారీ, కార్యకలాపాలు, సరఫరా వ్యవస్థ నిర్వహణ, మెయింటెనెన్స్ వంటి విభాగాల్లో నిపుణులకు భారీగా అవకాశాలున్నాయనేది పరిశ్రమ ఎగ్జిక్యూటివ్‌లు, హెచ్‌ఆర్ ఏజెన్సీల మాట! సౌర, పవన విద్యుత్‌తో పాటు జల, అణు విద్యుత్ ఇతరత్రా హైబ్రీడ్ ప్రాజెక్టులు రెన్యూవబుల్ ఎనర్జీలోకి వస్తాయి.

అదానీ.. 50 గిగావాట్లు

బహుముఖ రంగాల్లో దూసుకుపోతున్న అదానీ గ్రూప్.. పునరుత్పాదక ఇంధనంపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. సౌర, పవన, హైబ్రీడ్ ప్రాజెక్టుల విస్తరణకు అనుగుణంగా అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రధాన కార్యకలాపాలు, మెయింటెనెన్స్‌లో నిపుణుల నియమాకాలపై దృష్టి పెట్టినట్లు కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. 2030 నాటికి 50 గిగావాట్ల (జీడబ్ల్యూ) రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలని అదానీ లక్ష్యంగా పెట్టుకుంది. డేటా సైంటిస్టులు, ఎలక్ట్రికల్–సివిల్ ఇంజినీర్లు, బిజినెస్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీలు, సరఫరా వ్యవస్థల స్పెషలిస్టులతో పాటు పరికరాల ప్రొక్యూర్‌మెంట్‌లో అనుభవం గల వారికి కూడా కంపెనీ పెద్దపీట వేస్తోంది.

హైరింగ్‌లో టాటా 'పవర్'

ఇక టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ; సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణ, ఆపరేషన్స్–మెయింటెనెన్స్, ఇంజినీరింగ్–టెక్నాలజీ తదితర ఉద్యోగాల భర్తీలో తలమునకమైంది. భారీ ప్రాజెక్టులకు తోడు, రూఫ్‌టాప్ సోలార్ పవర్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ కేంద్రాల ఏర్పాటులో కూడా శరవేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థలో 2,500 పైగా సిబ్బంది ఉన్నారు. 'పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు ఫాస్ట్‌ట్రాక్‌లో నడుస్తున్నాయి. ఈ మేరకు అనేక ఎంఓయూలు కుదుర్చుకున్నాం. గుజరాత్‌లో 10,000 మెగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయి. వీటిద్వారా అనేక ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఈ భారీ విస్తరణ, వృద్ధికి అనుగుణంగా హైరింగ్ జోరు పెంచుతున్నాం' అని టాటా పవర్ చీఫ్ హెచ్ ఆర్ ఆఫీసర్ హిమల్ తివారీ పేర్కొన్నారు. ఇక జెన్సాల్ గ్రూప్ బ్యాటరీలు, డేటా ఎనలిటిక్స్, ప్రాజెక్ట్–ల్యాండ్ డెవలప్‌మెంట్, పర్యావరణం, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో నిపుణుల వేటలో ఉంది. 2024–2032 మధ్య కాలంలో పునరుత్పాదక ఇంధన మార్కెట్ వార్షికంగా 8.7 శాతం వృద్ధి (సీఏజీఆర్) చెందుతుందని అంచనా.

- సాక్షి, బిజినెస్ డెస్క్

- 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని సాధించాలనేది భారత్ లక్ష్యం.
- ప్రస్తుతం భారత్‌లో గ్రీన్ ఎనర్జీ (భారీ జలవిద్యుత్, అణు విద్యుత్‌తో సహా) ఉత్పత్తి సామర్థ్యం 208 గిగావాట్లు. మొత్తం విద్యుదుత్పత్తిలో ఇది దాదాపు 46%. గత 9 ఏళ్లలో 400 శాతం ఎగబాకడం విశేషం.
- సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గత 9 ఏళ్లలో 30 రెట్లు ఎగసి 89.4 గిగావాట్లకు చేరింది.
- పవన విద్యుత్ సామర్థ్యం 2014 నుంచి ఇప్పటిదాకా రెట్టింపునకు పైగా ఎగసి 47.19 గిగావాట్లకు చేరుకుంది.



బజాజ్ హౌసింగ్ రికార్డ్

114 శాతం ప్రీమియంతో లిస్టింగ్ ● మార్కెట్ విలువలో టాప్

న్యూఢిల్లీ: గత వారం పబ్లిక్ ఇష్యూకి వచ్చిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిస్టింగ్ రోజునే సరికొత్త రికార్డుకు తెరతీసింది. ఇష్యూ ధర రూ. 70తో పోలిస్తే ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 114 శాతంపైగా లాభంతో రూ. 150 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి రెండు ఎక్స్ఛేంజీలలోనూ 136 శాతం దూసుకెళ్లి రూ. 165కు చేరింది. ఇది అప్పర్ సర్క్యూట్‌కాగా.. ఇదే ధర వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 1,37,406 కోట్లను అధిగమించింది. వెరసి దేశీ లిస్టెడ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలలో టాప్ ర్యాంకులో నిలిచింది. ఆర్‌బీఐ వద్ద అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన బజాజ్ హౌసింగ్ 2025 సెప్టెంబర్‌లోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావలసి ఉంది. దీంతో నిబంధనలకు అనుగుణంగా కంపెనీ ఐపీవోకు వచ్చిన విషయం విదితమే.

టాప్-10 కంపెనీలు

కంపెనీ పేరు	మార్కెట్ విలువ రూ. కోట్లలో
బజాజ్ హౌసింగ్	1,37,406
హడ్కో	49,477
ఎల్ఐసీ హౌసింగ్	37,435
పీఎన్‌బీ హౌసింగ్	27,581
ఆధార్ హౌసింగ్	20,045
ఆప్టస్ వేల్యూ	16,598
ఆవాస్ ఫైనాన్షియర్స్	14,278
క్యాన్‌ఫిన్ హోమ్స్	11,984
సమ్మాన్ క్యాపిటల్	11,773
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్	10,603



లిస్టింగ్ కార్యక్రమంలో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ చైర్మన్ సంజీవ్ బజాజ్, ఎన్ఎస్ఈ సీఈవో ఆశిష్ చౌహాన్ తదితరులు

ఈ-కామర్స్ పండుగ సేల్ 26 నుంచి షురూ..

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ పోటాపోటీ

న్యూఢిల్లీ: ఈ–కామర్స్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇండియా సెప్టెంబర్ 26 నుంచి వార్షిక పండుగ సేల్ ప్రారంభించనున్నాయి. 27 నుంచి అందరికీ సేల్ అందుబాటులోకి వస్తుందని, అంతకన్నా 24 గంటల ముందు తమ పెయిడ్ సబ్‌స్క్రయిబర్స్‌కు యాక్సెస్ లభిస్తుందని ఇరు సంస్థలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ది బిగ్ బిలియన్ డేస్ (టీబీబీడీ) 2024 పేరిట ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ (ఏజీఐఎఫ్) పేరుతో అమెజాన్ ఇండియా వీటిని నిర్వహించనున్నాయి. 20 నగరాలవ్యాప్తంగా 2 లక్షల పైచిలుకు ప్రోడక్టు కేటగిరీల్లో ఉత్పత్తులను అదే రోజున అందించేందుకు సన్నాహాలు చేసుకున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ఈసారి విక్రేతలకు 20 శాతం అధికంగా రివార్డులు ఉంటాయని పేర్కొంది. మరోవైపు, ఏజీఐఎఫ్‌లో భాగంగా 14 లక్షల మంది పైగా విక్రేతలు, ప్రోడక్టులను విక్రయించనున్నట్లు అమెజాన్ పేర్కొంది.

ఒకసారి చార్జింగ్‌తో 809 కిలోమీటర్లు

భారత్‌కు మెర్సిడెస్ కొత్త ఈవీ



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ భారత్‌లో బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికిల్ ఈక్యూఎస్ 580 4మేటిక్ ఎస్‌యూవీ ప్రవేశపెట్టింది. పుణే ప్లాంటులో ఈ కారును ఉత్పత్తి చేస్తున్నారు. కంపెనీ నుంచి ఇది ఆరవ ఈవీ కావడం విశేషం. పరిచయ ఆఫర్‌లో ధర ఎక్స్‌షోరూంలో రూ.1.41 కోట్లు. 544 హెచ్‌పీ పవర్, 858 ఎన్ఎం పీక్ టార్క్ అందించే డ్యూయల్ ఎలక్ట్రిక్ మోటార్స్‌తో 122 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. 100 కిలోమీటర్ల వేగాన్ని 4.7 సెకన్లలో అందుకుంటుంది. ఒకసారి చార్జింగ్‌తో 809 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. 12.3 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 17.7 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, సాఫ్ట్ క్లోజ్ డోర్స్, లెవెల్–2 అడాస్, 9 ఎయిర్‌బ్యాగ్స్, 7 సీట్లతో తయారైంది. 10 ఏళ్ల బ్యాటరీ వారంటీ ఉంది.

సరికొత్త శిఖరంపై సెన్సెక్స్

- ఇంట్రాడేలో నిఫ్టీ కొత్త రికార్డు
- పరిమిత శ్రేణిలో ట్రేడింగ్
- సూచీలకు స్వల్ప లాభాలు



ముంబై: పరిమిత శ్రేణిలో ట్రేడైన స్టాక్ సూచీలు సోమవారం తాజా రికార్డులు నమోదు చేశాయి. సెన్సెక్స్ 98 పాయింట్లు పెరిగి సరికొత్త రికార్డు 82,989 వద్ద ముగిసింది. నిఫ్టీ 27 పాయింట్లు బలపడి 25,384 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగొచ్చనే ఆశలు సూచీలను రికార్డుల బాట పట్టించాయి. ఇంధన, యుటిలిటీ, బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 293 పాయింట్లు బలపడి 83,184 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు ఎగసి 25,446 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి.

→ ఆటో విడిభాగాల తయారీ కంపెనీ క్రాస్ లిమిటెడ్ షేరు ఫ్లాటుగా లిస్టయ్యింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.240) వద్దే లిస్టయ్యింది. ఇంట్రాడేలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో 13% ఎగసి రూ.271 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో కొంత లాభాల స్వీకరణతో 8% లాభంతో రూ.260 వద్ద స్థిరపడింది.

→ కేరళకు చెందిన టొలిన్స్ టైర్స్ టైర్స్ షేరు కూడా ఫ్లాటుగా లిస్టయ్యింది. ఇష్యూ ధర రూ.226తో పోలిస్తే 0.44% స్వల్ప లాభంతో రూ.227 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 5% పెరిగి రూ.238 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకి.., అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.941.50 కోట్లుగా నమోదైంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

స్టార్టప్‌లకు 'భాస్కర్' బూస్ట్	బోనస్ షేర్ల జారీ ఇక స్పీడ్.. సెబీ తాజా మార్గదర్శకాలు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 437 ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్).. ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 437.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (ఈఎం)–162, ఎలక్ట్రీషియన్–70, ఫిట్టర్–70, మెకానిక్(ఆర్–ఏసీ)–17, టర్నర్–17, మెషినిస్ట్–17, మెషినిస్ట్ (గ్రైండర్)–13, సీవోపీఏ–45, వెల్డర్–22, పెయింటర్–04.
» **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» **వయసు:** 31.10.2024 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.09.2024
» **సర్టిఫికేట్‌ల పరిశీలన తేదీలు:** 07.10.2024 నుంచి 09.10.2024 వరకు
» **ప్రవేశాల ప్రారంభతేది:** 28.10.2024.
» **ప్రవేశానికి గడువు తేది:** 30.10.2024.
» **అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రారంభం:** 01.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

టీఎంసీ ముంబైలో 29 నాన్ మెడికల్ పోస్టులు

ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)–టాటా మెమోరియల్ హాస్పిటల్(టీఎంహెచ్).. నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 29.
» **పోస్టుల వివరాలు:** సైంటిఫిక్ ఆఫీసర్ 'ఎస్‌బీ'(పాథాలజీ)–02,సైంటిఫిక్ అసిస్టెంట్'బి'–10, అసిస్టెంట్ మెడికల్ సోషల్ వర్కర్–02, టెక్నీషియన్ ఎ/సి–06, క్లర్క్ కమ్ టెలిఫోన్ ఆపరేటర్–01, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్–08.
» **విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–ప్రోగ్రామర్, రేడియేషన్ ఆంకాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, రేడియో డయాగ్నోసిస్, సెంట్రల్ స్టెరైల్ సప్లై, మైక్రోబయాలజీ, బయో మెడికల్, పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్ ల్యాబ్, జనరల్ మెడిసిన్,ఐసీయూ, ఓటీ, ప్లంబర్, మెకానికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి,ఇంటర్, ఐటీఐ,డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సైంటిఫిక్ ఆఫీసర్‌కు 35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్/క్లర్క్ కమ్ టెలిఫోన్ ఆపరేటర్/అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులకు 27ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2024.
» **వెబ్‌సైట్:** https://tmc.gov.in

ఎన్‌టీపీసీలో 250 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, సీ అండ్‌ఐ, సివిల్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి: 40 ఏళ్లు.
» **వేతనం:**నెలకు రూ.70,000 నుంచి రెండు లక్షలు

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.09.2024
» **వెబ్‌సైట్:** https://ntpc.co.in

జేసీఐ, కోల్‌కతాలో 90 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

కోల్‌కతా (పశ్చిమ బెంగాల్)లోని జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(జేసీఐ).. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 90.
» **పోస్టుల వివరాలు:**అకౌంటెంట్–23,జూనియర్ అసిస్టెంట్–25, జూనియర్ ఇన్‌స్పెక్టర్–42
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మెరిట్ లిస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024
» **వెబ్‌సైట్:** https://www.jutecorp.in

అవుతారా.. జియో సైంటిస్ట్!

జియాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, హైడ్రాలజీలతో పీజీ ఉత్తీర్ణులైన వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! తాజాగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది! దీని ద్వారా కేంద్ర గనులు, జల వనరుల శాఖల్లో.. 85 గ్రూప్-ఎ స్థాయి పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది! ఈ నేపథ్యంలో.. సీజీఎస్ఈ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర సమాచారం..

» కేంద్ర గనులు, జలవనరుల శాఖల్లో 85 గ్రూప్ ఏ పోస్ట్‌లు
» కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామ్ 2025 నోటిఫికేషన్ విడుదల
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్న యూపీఎస్సీ
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100 -రూ.1,77,500



యూపీఎస్సీ సీజీఎస్ఈ-2025

మొత్తం 85 గ్రూప్ ఏ పోస్టులు

- యూపీఎస్సీ.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ, జల వనరుల మంత్రిత్వ శాఖల్లో స్పెషలైజ్డ్ పోస్ట్‌ల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. ఈ పోస్ట్‌లను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. రెండు కేటగిరీలలో కలిపి మొత్తం 85 ఖాళీలు ఉన్నాయి.
- **కేటగిరీ–1:** కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఉన్న మూడు విభాగాల పోస్ట్‌లను ఈ కేటగిరీలో పేర్కొన్నారు. అవి.. జియాలజిస్ట్ గ్రూప్–ఎ: 16 పోస్ట్‌లు; జియో ఫిజిసిస్ట్ గ్రూప్–ఎ: 6 పోస్ట్‌లు; కెమిస్ట్–గ్రూప్–ఎ: 2 పోస్ట్‌లు.
- **కేటగిరీ–2:** ఇందులో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, జల్‌శక్తి శాఖ, జల వనరుల శాఖ, నదీ అభివృద్ధి–గంగా పునర్జీవనం విభాగాల్లో ఆరు రకాల పోస్ట్‌లను పేర్కొన్నారు. అవి.. సైంటిస్ట్–బి(హైడ్రాలజీ) గ్రూప్–ఎ: 13 పోస్ట్‌లు; సైంటిస్ట్–బి(కెమికల్) గ్రూప్–ఎ: 1 పోస్ట్; సైంటిస్ట్–బి(జియోఫిజిక్స్) గ్రూప్–ఎ:1 పోస్ట్; అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ గ్రూప్–బి: 31 పోస్టులు; అసిస్టెంట్ కెమిస్ట్ గ్రూప్–బి: 4 పోస్ట్‌లు; అసిస్టెంట్ జియో ఫిజిస్ట్ గ్రూప్–బి: 11 పోస్ట్‌లు.

విద్యార్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి జియోలాజికల్ సైన్స్/జియాలజీ/అప్లయిడ్ జియాలజీ/జియో ఎక్స్‌ప్లోరేషన్/మినరల్ ఎక్స్‌ప్లోరేషన్/ఇంజనీరింగ్ అప్లయిడ్ జియోఫిజిక్స్/మెరైన్ జియోఫిజిక్స్/అప్లయిడ్ జియోఫిజిక్స్/కెమిస్ట్రీ/అప్లయిడ్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ/హైడ్రాలజీ)లో మాస్టర్స్ డిగ్రీ, ఎంఎస్సీ–టెక్(అప్లయిడ్ జియోఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
- ఈ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు, ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాంటి అభ్యర్థులు మెయిన్ పరీక్ష దరఖాస్తు సమయానికి కోర్సు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

వయసు

జనవరి 1, 2025 నాటికి 21–32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు; ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎంపిక ప్రక్రియను మూడంచెల విధానంలో నిర్వహిస్తారు. తొలుత స్టేజ్–1లో ప్రిలిమినరీ పరీక్ష, స్టేజ్–2లో మెయిన్ పరీక్ష ఉంటాయి. ఈ రెండింటిలోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ) ఉంటుంది.

స్టేజ్-1 రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియ తొలిదశ స్టేజ్–1 ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఆయా పోస్ట్‌లను అనుసరించి పరీక్షను వేర్వేరుగా నిర్వహిస్తారు. పేపర్–1కు 100 మార్కులు, పేపర్–2కు 300 మార్కులు కేటాయించారు. పేపర్–1 జనరల్ స్టడీస్ కాగా, పేపర్–2 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు సంబంధించిన సబ్జెక్ట్ పేపర్. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. పరీక్ష సమయం నాలుగు గంటలు (ఒక్కో పేపర్‌కు రెండు గంటలు).

రెండో దశ మెయిన్ పరీక్ష

ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా, ఆయా కేటగిరీల్లోని పోస్ట్‌ల సంఖ్యను అనుసరించి.. ఒక్కో పోస్ట్‌కు ఆరుగురు లేదా ఏడుగురిని చొప్పున రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లతో నిర్వహిస్తారు. ఒక్కో సబ్జెక్ట్‌కు సంబంధించి మూడు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు చొప్పున మొత్తం 600 మార్కులకు పరీక్ష జరుగుతుంది. మెయిన్ ఎగ్జామినేషన్ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది.

తుది దశ పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఆయా విభాగాల్లో ఖాళీల సంఖ్యను అనుసరించి ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున (1:2 నిష్పత్తిలో) 200 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ దశలో.. అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే కాకుండా.. వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలపై అవగాహన, దృక్పథం తదితర అంశాలను పరిశీలిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, సెప్టెంబర్ 24
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 1 వరకు
- ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ తేదీ: 2025, ఫిబ్రవరి 9.
- మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: 2025,జూన్ 21, 22
- తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ, మెయిన్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.upsc.gov.in

రాత పరీక్షకు సిద్ధం ఇలా

- ప్రిలిమినరీ పరీక్షలోని జనరల్ స్టడీస్ పేపర్ కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన సమకాలీన అంశాలు, భారత చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, పాలిటీ, పరిపాలన, ఎకానమీ, సామాజిక అభివృద్ధి అంశాలు, పర్యావరణం, జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు, జనరల్ సైన్స్‌లో ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టాలి.
- సబ్జెక్ట్ పేపర్‌గా ఉండే పేపర్–2 కోసం అభ్యర్థులు తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా వాటిని అప్లికేషన్ ఓరియెంటేషన్, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటూ అభ్యసిస్తే మరింత మెరుగైన ఫలితం పొందొచ్చు.

మెయిన్స్‌తో అనుసంధానం

అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షలోని పేపర్–2ని, మెయిన్ ఎగ్జామినేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించే అవకాశం ఉంది. మెయిన్‌లోని మూడు పేపర్లు అన్నీ అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించినవే. దీంతో ప్రిలిమినరీ ప్రిపరేషన్ దశ నుంచే సబ్జెక్ట్ పేపర్‌ను మెయిన్ కోణంలో విశ్లేషణాత్మకంగా, డిస్క్రిప్టివ్ విధానంలో చదవాలి. తద్వారా ఒకే సమయంలో ప్రిలిమ్స్ పేపర్–2 (సబ్జెక్ట్ పేపర్), మెయిన్ ఎగ్జామ్ పేపర్లకు సన్నద్ధత లభిస్తుంది. ప్రిలిమినరీ పరీక్ష పూర్తయిన తర్వాత మెయిన్ ఎగ్జామ్‌కు నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లను సిలబస్‌కు అనుగుణంగా వెయిటేజీని గుర్తిస్తూ ప్రిపరేషన్ సాగించాలి.


అరవై శాతం సాధించేలా


ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ మూడు దశలు కలిపి మొత్తం 1200 మార్కులకు జరిగే ఎంపిక ప్రక్రియలో తుది విజేతలుగా నిలవాలంటే.. అరవై శాతం మార్కులు సాధించేలా కృషి చేయాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు మెయిన్ ఎగ్జామ్‌లో 40 నుంచి 45శాతం మార్కులు సాధిస్తే.. పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపికయ్యే అవకాశాలుంటాయి. అదే విధంగా మొత్తం 1200 మార్కులకుగాను 60 శాతం మార్కులు సొంతం చేసుకునేలా సన్నద్ధత పొందితే తుది విజేతలుగా నిలిచే వీలుంది.



సెప్టెంబర్ 17.. స్వేచ్ఛా'భాగ్యం'

1947 ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య సంబురాలతో, త్రివర్ణ పతాకాలతో రెపరెపలాడితే.. హైదరాబాద్‌లో మాత్రం నిజాం రాజుకు వ్యతిరేకంగా నిలబడ్డ యోధుల తలలు తెగాయి. హైదరాబాద్ స్టేట్‌ను భారత్‌లో విలీనం చేయాలని నెహ్రూ, పటేల్ చేసిన విజ్ఞప్తులను పట్టింపు లేకుండా నిజాం ఉస్మాన్ అలీఖాన్ పాకిస్తాన్‌తో రాయబారాలు నడిపారు. అలాంటి సమయంలో హైదరాబాద్ స్టేట్‌పై భారత ప్రభుత్వం పోలీస్ యాక్షన్ చేపట్టింది. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానాన్ని నలుదిక్కుల నుంచీ చుట్టుముట్టాయి. యుద్ధ ట్యాంకులు, తేలికపాటి స్టువర్ట్ ట్యాంకులు, వాటి వెనక ఆయుధ వాహనాలు, పదాతి దళాలు దూసుకురాగా.. నిజాం సైన్యాలు, రజాకార్ల బృందాలు ఎక్కడా నిలువరించలేకపోయాయి. ముట్టడి ప్రారంభమైన తొలిరోజునే పశ్చిమ దిక్కు నుంచి వచ్చిన భారత దళాలు నల్‌దుర్గ్‌ను స్వాధీనం చేసుకోగా.. తూర్పున మునగాల, సూర్యాపేట వరకు వశమయ్యాయి. సూర్యాపేట శివారులో మకాం వేసిన నిజాం సైన్యం.. భారత సైన్యాలను అడ్డుకునేందుకు మూసీ వంతెనను పేల్చేసినా, శరవేగంగా తాత్కాలిక వంతెన సిద్ధం చేసుకుని దాడి కొనసాగించాయి. 16వ తేదీ మధ్యాహ్నానికి పరిస్థితేమిటో అర్థమైన హైదరాబాద్ ఆర్మీ చీఫ్ ఈఎల్ ఇద్రూస్.. లొంగిపోవటం తప్ప మరో మార్గం లేదని ప్రధాని లాయక్ అలీ ద్వారా ఉస్మాన్ అలీఖాన్‌కు సమాచారం అందించాడు. మరుసటి రోజు ఉదయమే ఇద్రూస్ హకీంపేట విమానాశ్రయం సమీపంలో భారత మేజర్ జనరల్ జేఎన్ చౌదరి ఎదుట లొంగిపోయారు. 17న సాయంత్రం 5 గంటల సమయంలో ఉస్మాన్ అలీఖాన్ నాంపల్లిలో దక్కన్ రేడియోకు వెళ్లి.. భారత్‌పై ఐక్యరాజ్యసమితికి చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. భారత సైన్యాల రాకను స్వాగతించారు. దీంతో ఆజాదీ హైదరాబాద్ అవతరించింది.


జేఎన్ చౌదరి ఎదుట ఇద్రూస్ లొంగుబాటు


భారత సైనికుల రాక.. స్థానికుల స్వాగతం

'ట్యాపింగ్' కేసులో ఎమ్మెల్సీపై ఎల్ఓసీ

ఈ వ్యవహారంలో నవీన్‌రావు పాత్రపై ఆధారాలు
- కొన్ని రోజుల క్రితం నోటీసుల జారీకి యత్నం
- ఆయన దుబాయ్ వెళ్లిపోవడంతో కుదరని వైనం
- దీంతో ఎల్ఓసీ జారీ చేసిన హైదరాబాద్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు పోలీసులు, మీడియా సంస్థకు చెందిన వారి చుట్టూనే దీని దర్యాప్తు తిరుగుతుండగా.. తాజాగా రాజకీయ నాయకులకు ఆ మకిలి అంటింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ నవీన్‌రావు పాత్రను ఈ వ్యవహారంలో రూఢీ చేసిన హైదరాబాద్ పోలీసులు ఆయనపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్ఓసీ) జారీ చేశారు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న నవీన్‌రావు దేశంలోకి అడుగు పెట్టిన వెంటనే అదుపులోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే విదేశాల్లో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, ఓ మీడియా సంస్థ అధినేత శ్రవణ్‌రావులపై ఎల్ఓసీ ఉంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న హైదరాబాద్ వెస్ట్‌జోన్ పోలీసులు ఈ ఏడాది జూన్ 29న హైకోర్టుకు ఓ నివేదిక సమర్పించారు. అందులో మూడు చోట్ల ఎమ్మెల్సీ పేరు ప్రస్తావించడంతో తొలిసారిగా నవీన్‌రావు పేరు వెలుగులోకి వచ్చింది. అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు కర్త, కర్మ, క్రియగా ఉన్న ప్రభాకర్‌రావుతో పాటు శ్రవణ్‌రావుతో కూడా కలసి నవీన్‌రావు పని చేశారన్నది ప్రధాన ఆరోపణ. అప్పటి అధికార పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేందుకు వీళ్లు ప్రయత్నించారని పోలీసులు ఆరోపించారు. దీనికోసం ఎస్ఐబీలో ప్రత్యేకంగా ఓ బృందాన్ని సైతం ఏర్పాటు చేశారు. నాటి ప్రతిపక్షంతో పాటు వివిధ విభాగాలకు చెందిన పలువురి ఫోన్ నంబర్లను ట్యాప్ చేయడంతో పాటు సున్నితమైన డేటాను అక్రమంగా సంగ్రహించారు. వివిధ రంగాలకు చెందిన వారిని బెదిరించడం ద్వారా ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేసేలా ఒత్తిడి చేశారని పోలీసులు చెపుతున్నారు.



హార్డ్ డిస్క్‌ల ధ్వంసంలోనూ పాత్ర

గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. అదే సందర్భంలో ఎస్ఐబీ కార్యాలయంలోని పలు హార్డ్ డిస్క్‌లను డీఎస్పీ ప్రణీత్‌రావు తదితరులు ధ్వంసం చేశారు. ఈ వ్యవహారం వెనుకా ప్రభాకర్‌రావుతో పాటు నవీన్‌రావు ఉన్నారని ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. సంధ్య కన్వెన్షన్స్ అధినేత ఎస్.శ్రీధర్‌రావును బెదిరించడం, ఆయన ఫోన్లు ట్యాప్ చేయడంతో పాటు ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేయించడంలోనూ నవీన్‌రావు పాత్రను దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు నవీన్‌రావును విచారించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి కొంత కాలం కిందట ఆయనకు నోటీసులు జారీ చేయడానికి ఓ ప్రత్యేక బృందం ముమ్మరంగా ప్రయత్నించింది. వాటి ఆధారంగా ఆయనను పిలిచి విచారించాలని భావించింది. నోటీసులతో అధికారులు నవీన్‌రావు ఇల్లు, కార్యాలయాల వద్ద కాపుకాసినా ఆయనను కలవలేక పోయారు. ఈ లోపు పోలీసుల కదలికలు తెలుసుకున్న నవీన్‌రావు దుబాయ్ వెళ్లిపోయారని తెలిసింది. ఆయన విదేశాలకు వెళ్లిపోయారనే సమాచారం ఆధారంగా హైదరాబాద్ పోలీసులు ఎల్ఓసీ జారీ చేయాలని నిర్ణయించారు. ఈ విషయాల్లో రాష్ట్రానికి సంబంధించిన నోడల్ ఏజెన్సీగా ఉన్న సీఐడీ ద్వారా ఎల్ఓసీని దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడ రేవులతో పాటు సరిహద్దుల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టులకు పంపారు. ఎల్ఓసీలో నవీన్‌రావు పాస్‌పోర్టు నంబర్, ఇతర వివరాలు పొందుపరిచారు. దీని ఆధారంగా ఆయన దేశంలో అడుగుపెట్టగానే ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుంటారని తెలుస్తోంది. అనంతరం ఆయనను హైదరాబాద్ పోలీసులకు అప్పగిస్తారని సమాచారం.

ఉద్యోగాల 'ఉచ్చు'లో చిక్కొద్దు!

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు తెర తీస్తున్న ఏజెన్సీలు
- ఇటీవలే వెలుగులోకి కాంబోడియా సైబర్ ముఠా ఆగడాలు
- ఏజెన్సీల వివరాలు పరిశీలించాకే ముందుకు వెళ్లాలంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాలు చేయాలని ఈ రోజుల్లో యువత ఎక్కువగా కోరుకుంటోంది. మంచి జీవితం, లక్షల్లో జీతం సంపాదించాలన్న ఆశతో ఎంత కష్టమైనా సరే విదేశాలకు వెళ్లేందుకు ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. అయితే యువత బలహీనతను ఆసరాగా చేసుకుని కొన్ని ఏజెన్సీలు, సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయి. ఎన్నో ఆశలతో విదేశాలకు వెళుతున్న వారు చివరకు బానిసలుగా, లేదంటే స్థానిక నేరముఠాల చేతుల్లో పావులుగా మారి జీవితాలు దుర్భరం చేసుకుంటున్నారు. తాజాగా కాంబోడియాకు అమాయకులను తరలిస్తున్న ఓ ముఠా మోసాలను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కాంబోడియాలో చైనా ముఠాలు ఇలాంటి అమాయకులతో బలవంతంగా సైబర్‌నేరాలు చేయిస్తున్నాయి. ఆ ముఠాల చిత్రహింసల నుంచి ఇద్దరు తెలుగు యువకులు బయటపడిన నేపథ్యంలో ఇలాంటి ముఠాపై దర్యాప్తు ముమ్మరం చేశారు. విదేశాల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న యువత ఇలాంటి ముఠాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

లక్షల్లో జీతాలంటే.. మోసమని గ్రహించాలి

విదేశాల్లో ఉద్యోగావకాశాలు, లక్షల్లో జీతాలు.. అని ఏజెన్సీలు ఊదరగొడుతున్నాయంటే అది కచ్చితంగా మోసమని గ్రహించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. విద్యార్హతకు సంబంధం లేని ఉద్యోగాల్లోనూ అవకాశం కల్పిస్తామని చెప్పే ఏజెన్సీల మాటలు నమ్మవద్దని చెపుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే వారు ఏజెంట్లు ఇచ్చే విజిట్ వీసాలను అంగీకరించవద్దని, ట్రావెల్ ఏజెంట్లకు సంబంధించిన పూర్తి వివరాలు సరిచూసుకోవాలని సూచిస్తున్నారు.

అనుమానం ఉంటే ఫిర్యాదు చేయండి..

విదేశాల్లో ఉద్యోగావకాశాల పేరిట మోసాలకు పాల్పడే సంస్థలు, ఏజెన్సీలకు సంబంధించి సమాచారం ఉన్నా.. ఆ సంస్థలు మోసానికి తెరతీస్తున్నట్టు అనుమానం ఉన్నా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, లేదంటే నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీఎస్‌బీ అధికారులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు మరవొద్దు..
- సోషల్ మీడియాలో, ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలు నమ్మి మోసపోవద్దు. నిజమైన జాబ్ పోర్టల్స్, న్యూస్ పేపర్లలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి.
- మీరు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వెబ్‌సైట్‌లకు సంబంధించిన ప్రైవసీ పాలసీని తెలుసుకోవాలి. ఆ సైట్‌వాళ్లు మనకు సంబంధించిన ఏయే వ్యక్తిగత వివరాలు తీసుకుంటున్నారన్నది గమనించాలి.
- ఉద్యోగ ప్రకటనలు చూసినప్పుడు సదరు కంపెనీ లేదా సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే వివరాలు చూడాలి. విదేశాల్లో ఉద్యోగాల పేరిట వచ్చే ఈ-మెయిల్స్, వాట్సప్‌కు వచ్చే అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దు.
- కొన్ని ప్రముఖ ఏజెన్సీలు, సంస్థల పేరిట ఆన్‌లైన్‌లో జాబ్ ప్రకటనలు ఇస్తూ.. సైబర్ నేరగాళ్లు కొద్దిపాటి అక్షరాల మార్పులతో మోసాలకు పాల్పడతున్నారన్నది మరవొద్దు.
- ఉద్యోగాల కోసం ముందుగానే ఆయా ఏజెన్సీలు, సంస్థలకు డబ్బులు చెల్లించవద్దు.



సర్ప గణపతి

జగిత్యాల టౌన్: జగిత్యాల వాణినగర్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన గణేశుని ప్రతిమ మెడలో నాగుపాము దర్శనమిచ్చింది. ఇక్కడ 48 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాని పక్కనే మరో చిన్న విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం భక్తులు పూజలు చేసేందుకు రాగా.. చిన్న గణేశుడి మెడలో నాగుపాము కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు.

సత్తా చాటిన తెలంగాణ అమ్మాయి

- అంతర్జాతీయ వేదికపై పాకశాస్త్రంలో అవార్డు గెలుచుకున్న అశ్విత పోలీస్
- వరల్డ్ స్కిల్స్–2024లో 16 పతకాలతో మెరిసిన భారత్



సాక్షి, న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై పాకశాస్త్రంలో తెలంగాణ అమ్మాయి అశ్విత పోలీస్ సత్తా చాటింది. ఫ్రాన్స్‌లోని లియాన్‌లో జరుగుతున్న వరల్డ్ స్కిల్స్–2024లో అశ్విత బెస్ట్ ఆఫ్ నేషన్ అవార్డును గెలుచుకుంది. భారతదేశం స్కిల్ సెట్లలో 4 కాంస్య పతకాలు, 12 మెడలియన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులతో కలిపి మొత్తం 16 పతకాలు సొంతం చేసుకుంది. 'పాటిస్సెరీ–కన్ఫెక్షనరీ'లో అశ్విత పోలీస్, 'ఇండస్ట్రీ 4.0'లో గుజరాత్‌కు చెందిన ధ్రుమిల్‌కుమార్ ధీరేంద్రకుమార్ గాంధీ, సత్యజిత్ బాలకృష్ణన్, 'హోటల్ రిసెప్షన్'లో ఢిల్లీకి చెందిన జోతిర్ ఆదిత్య కృష్ణప్రియ రవికుమార్, 'రెన్యూవబుల్ ఎనర్జీ'లో ఒడిశాకు చెందిన అమరేష్ కుమార్ సాహు కాంస్యపతకాలు గెలుచుకున్నారు. వీటితోపాటు భారతీయ బృందం 12 మెడలియన్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సంపాదించింది. 'పాటిస్సెరీ అండ్ కన్ఫెక్షనరీ'లో పోటీ చేసిన అశ్విత టీమ్ ఇండియా నుంచి అత్యుత్తమ పోటీదారుగా బెస్ట్ ఆఫ్ నేషన్ అవార్డును కూడా గెలుచుకుంది. అశ్విత చిన్నప్పటి నుంచి స్వీట్స్ తయారుచేయడం, టీవీ షోల ద్వారా పాకశాస్త్రంలో నైపుణ్యాన్ని పెంచుకుంది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థిని అయిన అశ్విత.. చెఫ్ వినేష్ జానీ మార్గదర్శకత్వంలో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. అశ్విత విజయం ప్రపంచ వేదికపై భారతీయ పాకశాస్త్ర ప్రతిభ పెరుగుతున్న ప్రాముఖ్యతను చాటుతోంది. ఈ విజయం దేశవ్యాప్తంగా ఔత్సాహిక చెఫ్‌లను ప్రేరేపిస్తుందని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ కొనియాడింది. పాటిస్సెరీ అండ్ కన్ఫెక్షనరీ విభాగంలో 21 దేశాలతో పోటీపడి కాంస్యం సాధించిన అశ్విత పోలీస్ మాట్లాడుతూ.. 'ఈ ప్రయాణం సవాలుతో కూడుకున్నది. నా దేశానికి ప్రాతినిధ్యం వహించి పతకం సాధించాలనే కల నిజమైంది. కానీ నమ్మశక్యంగా లేదు'అని అన్నారు. వరల్డ్ స్కిల్స్ 2024లో 70కి పైగా దేశాల నుంచి 1,400 మందికి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. భారత్ 52 నైపుణ్య విభాగాల్లో పోటీపడింది.

మెడికల్ ప్రొఫెషనల్స్ కోసం కృత్రిమ మేధ కోర్సు

- హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక ఆన్‌లైన్ కోర్సుకు శ్రీకారం
- నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సహకారంతో ఏర్పాట్లు

రాయదుర్గం (హైదరాబాద్): వైద్య నిపుణుల కోసం కృత్రిమ మేధపై ప్రత్యేక ఆన్‌లైన్ కోర్సుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ శ్రీకారం చుట్టింది. ట్రిపుల్‌ఐటీ, కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థ 'నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎన్ఏఎంఎస్)'సహకారంతో ఈ కోర్సును నిర్వహించనున్నారు. 12 వారాల పాటు ఉండే ఈ ఆన్‌లైన్ కోర్సులో.. వివిధ ఆరోగ్య సమస్యలు, లక్షణాలను కచ్చితంగా నిర్ధారించడంలో, తగిన చికిత్స అందించడంలో కృత్రిమ మేధను వినియోగించే నైపుణ్యాలను బోధిస్తారు. రోగుల సంరక్షణకు సంబంధించి మెరుగైన పద్ధతులను అనుసరించే సామర్థ్యాన్ని మెరుగుపర్చేలా శిక్షణ ఉంటుంది. ఈ కోర్సులో భాగంగా వీడియో పాఠాలు, సంప్రదింపుల సెషన్లు, కేస్ స్టడీస్, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు ఉంటాయని.. కోర్సు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేస్తారు.

19 వరకూ దోస్త్ సెల్ఫ్ రిపోర్టింగ్

సాక్షి, హైదరాబాద్: దోస్త్ స్పెషల్ డ్రైవ్‌లో డిగ్రీ సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 19 వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. వాస్తవానికి ఈ గడువు 16వ తేదీతో ముగిసింది. విద్యార్థుల కోరిక మేరకు తేదీని పొడిగించినట్టు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం । 17-9-2024



వివాహ'బంధం' తెగతెంపులు!

దేశంలో నానాటికీ పెరుగుతున్న విడాకుల శాతం • గతంలో సెలబ్రిటీల్లోనే అధికంగా ఈ ట్రెండ్

ఇప్పుడు పెళ్లి అయిన ఏడాది, రెండేళ్లకే విడాకులకు సిద్ధమవుతున్న పలు జంటలు

మహారాష్ట్రలో అత్యధికంగా 18.7 శాతం.. 6.7 శాతంతో ఏడో స్థానంలో తెలంగాణ

వివాహ వ్యవస్థ ఒత్తిళ్లకు గురికావడం, పాత–ఆధునిక భావాల మధ్య సంఘర్షణ తదితరాలు కారణాలు

సాక్షి, హైదరాబాద్: వివాహమైన ఏడాది, రెండేళ్లకే విడాకులకు సిద్ధమౌతున్న విచిత్రపరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొంది. గతంలో భారత సెలబ్రిటీల్లోనే (సినిమా, క్రీడలు, వ్యాపార, ఇతర రంగాల వారు) ఈ ట్రెండ్ అధికంగా కనిపించగా, రానురాను దాదాపు అన్ని వర్గాల్లో ఈ ధోరణి సాధారణంగా మారుతోంది. గతంతో పోల్చితే... గత రెండు దశాబ్దాల కాలంలో దేశంలో విడాకుల శాతం గణనీయంగా పెరిగినట్టుగా గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. విడాకులంటేనే ఏదో చేయరాని నేరం అని ఏళ్లుగా పేరుకుపోయిన భావన నుంచి నేటితరం బయటపడడంతో జీవితంలో నూతన అధ్యాయం కోసం యువతరం మొగ్గుచూపుతున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఇవి పెరగడానికి వైవాహికపరమైన వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించే ప్రయత్నాలు జరగకపోవడం, ఇతర మార్గాలను అన్వేషించకుండానే కోర్టు మెట్లు ఎక్కడం కూడా ఒక కారణమనే అభిప్రాయం వినిపిస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా దేశంలోని వివాహ వ్యవస్థ, కుటుంబ విలువలు ఒత్తిళ్లకు గురికావడం, సామాజిక–సంప్రదాయ విలువలు, పాత–ఆధునిక భావాల మధ్య సంఘర్షణ తదితర కారణాలతో విడాకులు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుబాటులో ఉన్న గణాంకాలను బట్టి చూస్తే (2022 సంవత్సరం చివర్లో) దేశంలో విడాకుల శాతంలో తెలంగాణ ఏడో స్థానంలో ఉంది. విడాకుల కోసం కోర్టులో కేసు ఫైల్ చేశాక వివిధ దశలు దాటి తీర్పు వెలువడే నాటికి పదేళ్లకుపైగా పడుతున్న సందర్భాలు కూడా ఉండటంతో... అనధికారికంగా విడిపోతున్న జంటలు పెద్ద సంఖ్యలో ఉంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

అత్యధికంగా ఇండోర్‌లో...

- ★ 2022 నాటికి దేశవ్యాప్తంగా ఫ్యామిలీ కోర్టుల్లో 11.4 లక్షల విడాకుల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
- ★ దేశంలోని 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 715 ఫ్యామిలీ కోర్టులున్నాయి.
- ★ ఇండోర్ ఫ్యామిలీ కోర్టులో 8,400 కేసులు పెండింగ్‌లో ఉండగా వాటిలో 5,500 విడాకుల కోసమే కాగా... వాటిలో పెళ్లయిన ఏడాదిలో పెట్టిన కేసులు 3,000. 2018లో 2,250 కేసులు ఫైల్ కాగా, 2022లో 2,723 కేసులు నమోదయ్యాయి.
- ★ గత పదేళ్లలో...అత్యధిక అక్షరాస్యత ఉన్న కేరళలో 350 శాతం పెరిగిన విడాకులు. ఇదే సమయంలో పంజాబ్, హరియాణాల్లో 150 శాతం ఈ కేసుల వృద్ధి
- ★ గత ఐదేళ్లలో ఢిల్లీలో విడాకుల శాతం రెండింతలు పెరిగింది.
- ★ ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర మెట్రో నగరాల్లో విడాకుల కేసులు అధికంగా ఉంటున్నాయి

దేశంలో విడాకుల్లో టాప్-8 రాష్ట్రాలివీ..

1. మహారాష్ట్ర	18.7%
2. కర్ణాటక	11.7%
3. యూపీ	8.8%
4. పశ్చిమబెంగాల్	8.2%
5. ఢిల్లీ	7.7%
6. తమిళనాడు	7.1%
7. తెలంగాణ	6.7%
8. కేరళ	6.3%

జాగ్రత్తలు తీసుకుంటే...

'ఈ మధ్య వారానికి ఏడెనిమిది కేసులైనా విడాకుల కోసం మా దగ్గరకు వస్తున్నాయి. వీరిలో 30 శాతం దాకా తమ నిర్ణయం నుంచి వెనక్కు తగ్గేందుకు మొగ్గుచూపుతుంటే, అధికశాతం మొండికేసి విడాకుల కోసం పట్టుపడుతున్నారు. తెగతెంపులకు 40 నుంచి 50 శాతం తల్లితండ్రుల పాత్ర ఎక్కువగా ఉంటోంది. విడాకులు తీసుకున్నామని చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడడం లేదు. అదేదో డయాబెటిస్, థైరాయిడో వచ్చిందనేంత తేలికగా తీసుకుంటున్నారు. ప్రస్తుతం దంపతుల మధ్య ఒకరి పట్ల ఒకరికి సరైన అవగాహన లేకపోవడం, చిన్న చిన్న విషయాలకు సర్దుబాటు చేసుకోలేక ఘర్షణ పడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇద్దరిలోనూ స్వార్థం పెరిగిపోవడం, సహానుభూతి కొరవడడం, అనుమానాలు పెరగడం ప్రభావం చూపుతున్నాయి. తల్లితండ్రులు కూడా సర్దుబాటు అవగాహన కల్పించకపోగా, చదువుకున్నారు, సంపాదిస్తున్నారు మీకేమీ తక్కువ అనేలా రెచ్చగొడుతుండటంతో పరిస్థితులు తెగే దాకా వస్తున్నాయి. ఒకరి తప్పులను మరొకరు ఎత్తి చూపడం తగ్గిపోయి, పాత విషయాలను పదేపదే ప్రస్తావనకు తేవకపోవడం, గొడవలకు తల్లితండ్రులను మధ్యలోకి తెచ్చి బాధ్యులను చేయకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే ఇద్దరి మధ్య సర్దుబాటుకు అవకాశాలుంటాయి.

– అనిత, ఫ్యామిలీ కౌన్సెలర్, భాస్కర మెడికల్ కాలేజీ క్లినికల్ సైకాలజిస్ట్

వివాహబంధం అక్కర్లేదనే అంచనాకు..

'మన దగ్గరా విడాకులు అనేవి క్రమంగా పెరుగుతున్నాయి. 2000 సంవత్సరం తర్వాత నుంచి చూస్తే... దేశంలో అమ్మాయిలకు మంచి విద్యతోపాటు ఉద్యోగావకాశాలు పెరగడంతో ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది. యూఎస్, ఇతర దేశాల్లో ఉద్యోగ అవకాశాలు వృద్ధికావడంతో గిల్లికజ్జాలు, చికాకులు, సమస్యలతో వివాహబంధాన్ని తప్పక కొనసాగించాల్సిన అవసరం లేదనే అంచనాకు ఇటు అమ్మాయిలు, అటు అబ్బాయిలు వస్తున్నారు. అటు ఆఫీసులో, ఇటు ఇంట్లో బాధ్యతలు పెరిగిపోవడంతో ఇంటాబయటా మహిళలపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. రోజూ సమస్యలు ఎదుర్కొంటూ బతకడం కంటే విడిపోయి సంతోషంగా జీవించవచ్చనే అభిప్రాయానికి అమ్మాయిలు వస్తున్నారు. మారుతున్న కాలాన్ని బట్టి ఇళ్లలోని పరిస్థితులు మారకుండా సంప్రదాయ పద్ధతుల్లోనే ఆలుమగల సంబంధాలు ఉండాలని పెద్దవాళ్లు కోరుకుంటున్న సందర్భాలున్నాయి. దీంతోపాటు వారిద్దరి మధ్య ప్రతీ చిన్న విషయంలో తల్లితండ్రులు కలగజేసుకోవడంతో ఘర్షణలు పెరుగుతున్నాయి. సమాజంలో ఇంకా పురుషాధిక్యత అనేది ఏదో ఒక రూపంలో కొనసాగడం, పిల్లలుంటే వారి భారమంతా తమపైనే పడుతుందని సంతానం వద్దనే నిర్ణయానికి 10 నుంచి 15 శాతం యువతులు వస్తున్నారు. ఈ మేరకు పెళ్లికి ముందే ఒప్పందం చేసుకుంటున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. తాము అబ్బాయిల కంటే ఏ విషయంలోనూ తక్కువ కాదనే భావన అమ్మాయిల్లో బలపడటం, దానిని అంగీకరించేందుకు అబ్బాయిలు సిద్ధంగా లేకపోవడంతో విడిపోవడానికి సిద్ధమవుతున్నారు.

– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్



ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి దించేశారు

• మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదల

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ దిగువ మానేరు జలాశయం(ఎల్‌ఎండీ) గేట్లను అధికారులు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఎత్తారు. తిరిగి 11.30 గంటలకు ఆ గేట్లను దించేశారు. ప్రాజెక్టులో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడం, ఎగువన ఉన్న మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తుండటంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రెండు గేట్లను 0.75 అడుగుల మేరకు ఎత్తి 3 వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి విడుదల చేసినట్లు ఈఈ నాగభూషణం తెలిపారు. తర్వాత 11.30 గంటలకు నీటి విడుదలను 1,500 క్యూసెక్కులకు తగ్గించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 11.30 గంటలకు గేట్లు మూసివేశారు. తర్వాత కాకతీయ కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తర్వాత క్రమంగా దానిని 1,500 క్యూసెక్కులకు పెంచారు. సాయంత్రానికి 2 వేల క్యూసెక్కులకు పెంచామని ఈఈ వివరించారు. ఆయకట్టు రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు పాల్గొన్నారు.



మానేరు డ్యాం నుంచి నీటిని దిగువకు వదులుతున్న ఎస్సారెస్పీ అధికారులు





సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విమోచన దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన రిహార్సల్స్



సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే దానం నాగేందర్

57 ఏళ్ల తర్వాత రికార్డులు కోరలేరు

మ్యుటేషన్ అప్పీల్‌లో హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్: దాదాపు 57 ఏళ్ల తర్వాత భూరికార్డులు కోరలేరని మ్యుటేషన్ వివాదం అప్పీల్‌లో హైకోర్టు స్పష్టం చేసింది. చట్టంలో కాలవ్యవధి పేర్కొననప్పటికీ కక్షిదారులు సహేతుకమైన వ్యవధిలోనే అధికారులను సంప్రదించాలని తేల్చిచెప్పింది. 57 ఏళ్ల తర్వాత రికార్డుల్లో నమోదుకు దరఖాస్తు సమర్పించినందున అప్పీలుదారు సవరణకు అర్హుడు కాదని చెప్పింది. సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం అప్పీల్‌ను కొట్టివేసింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయ్‌పల్లిలోని 64.30 ఎకరాల భూమి తమదేనంటూ బూరుగుపల్లికి చెందిన హనుమంతరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. తన తల్లి 1963లో ఆ భూమిని కొనుగోలు చేసిందని, మ్యుటేషన్ కోసం తహసీల్దార్‌ను సంప్రదించిందన్నారు. అయితే మొత్తం భూమిలోని 4.23 ఎకరాలు ఆమె పేరు మీద లేదంటూ మ్యుటేషన్‌కు నిరాకరించారని.. ఈ క్రమంలోనే భూమి, పట్టాదార్ పాస్‌బుక్‌లో తెలంగాణ హక్కుల చట్టం –2020 అమల్లోకి వచ్చిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ (ప్రత్యేక ట్రిబ్యునల్)కు అప్పీల్ చేసుకోగా.. దీన్ని కొట్టివేశారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించినట్లు వివరించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 1963లో భూమి కొనుగోలు చేసి 2019లో మ్యుటేషన్‌కు అధికారులను సంప్రదించడాన్ని తప్పుబట్టి పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై హనుమంతరావు అప్పీల్ దాఖలు చేయగా.. ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విని అప్పీల్‌ను కొట్టివేసింది. అయితే, అప్పీలుదారు, అతని తల్లి చట్టప్రకారం సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చంటూ స్వేచ్ఛనిచ్చింది.


సోనీ.. సో లక్కీ..

• శునకానికి గణేశ్ లడ్డూ



గెలుచుకున్న లడ్డూతో కుటుంబసభ్యులు, సోని

నయీంనగర్: గణపతి లడ్డూను ఓ పెంపుడు శునకం దక్కించుకుంది. హనుమకొండ 54వ డివిజన్ కేయూ రోడ్ డబ్బాల్ జంక్షన్ వద్ద హనుమాన్ గజానన మండలి సభ్యులు గణపతి నవరాత్రుల లడ్డూకు లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో స్థానికుడు పాలాల వాణి, రాజేశ్ కుటుంబ సభ్యులందరి పేర్లను రాసి డ్రాలో వేశారు. వారి పెంపుడు శునకం సోని పేరుతోనూ చీటీ వేశారు. సోమవారం నిర్వహించిన లక్కీ డ్రాలో శునకానికి లడ్డూ దక్కడం విశేషం.



ఎడారిగా మారిన పొలంలో దిగులుగా కూర్చున్న రైతు ఉపేందర్‌రెడ్డి

తడారి.. ఎడారి

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగడంతో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బాల్నిధర్మారం గ్రామానికి చెందిన రైతు గట్టికొప్పుల ఉపేందర్‌రెడ్డి వరిపొలం ఎడారిగా మారింది. రైతుకు 4 ఎకరాల 17 గుంటల భూమి ఉండగా.. రెండెకరాల్లో వరి సాగు చేశాడు. మిగిలిన భూమిలో మిర్చిసాగు చేయాలని డ్రిప్ ఏర్పాటు చేసుకున్నాడు. ఈక్రమంలో భారీ వర్షంతో ఆకేరు వాగు వరదకు వరి పొలమంతా కొట్టుకుపోయి ఇసుక మేటలు వేసి ఎడారిని తలపిస్తోంది. మిర్చి మొక్కలు నాటేందుకు అచ్చుతోలిన చెలకలో మట్టి కొట్టుకుపోయి నెర్రెలుబారింది. చివరికి ట్రాక్టర్ సైతం కొట్టుకుపోయి కొంతదూరంలో మట్టిలో కూరుకుపోయింది. కాగా, సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఉపేందర్‌రెడ్డి కన్నీటిపర్యంతమయ్యాడు.

ఏదైనా జరిగితే బీఆర్‌ఎస్‌కే నష్టం

• రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుపై మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయం ముందు ప్రభుత్వం పెట్టిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని కూలగొడతామని బీఆర్‌ఎస్ నేతలు వ్యాఖ్యానించడం సరైందికాదని, అవాంఛనీయ ఘటనలు జరిగితే అది బీఆర్‌ఎస్ పార్టీకి పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ...దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లడానికి రాజీవ్‌గాంధీ కృషి చేశారన్నారు. దేశం కోసం ఆ కుటుంబం ప్రాణాలిచ్చిందని, రాజీవ్ సతీమణి సోనియా కారణంగానే తెలంగాణ ఏర్పాటైందని ఆయన చెప్పారు. అలాంటి నేత గురించి బీఆర్‌ఎస్ విపరీత ఆలోచనలు చేస్తే వారి ప్రతిష్ట తగ్గిపోతుందని, రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకుంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని బీఆర్‌ఎస్ నేతలకు హితవు పలికారు.



బట్టీగూడెం నుంచి గర్భిణి తరలింపు

మంచాన్ని జోలెగా మార్చి గర్భిణులను తీసుకొస్తున్న ఆదివాసీలు

జోలె తప్ప.. వేరే'దారి' లేదు

• జోలె కట్టి ఇద్దరు గర్భిణుల తరలింపు
• ఐదు కిలోమీటర్ల దూరం మోత
• రహదారిలేక మన్యం బిడ్డల కష్టాలు

చర్ల: మన్యంలో ఆదివాసీ గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు రహదారి లేక.. అంబులెన్స్‌లు రాక జోలెలే దిక్కవుతున్నాయి. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇదే పరిస్థితి ఎదురైంది. జిల్లాలోని చర్ల మండలం తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధి బట్టీగూడెంకు చెందిన రవ్వా దేవి, సుబ్బమ్మకు నెలలు నిండగా.. సోమవారం సాయంత్రం పురిటి నొప్పులు మొదలయ్యాయి. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా.. ఆ సమయానికి వాహనం లేదని, ఒక వేళ ఉన్నా రహదారి బాగా లేనందున బట్టీగూడెం వచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేదిలేక కుటుంబ సభ్యులు ఇద్దరు గర్భిణులను విడివిడిగా మంచాలను జోలెలుగా మార్చి బట్టీగూడెం నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరాన తిప్పాపురం ప్రధాన రహదారి వరకు చేర్చారు. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనంలో 20 కిలోమీటర్ల దూరంలోని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి పరీక్షలు చేయించేసరికి అంబులెన్స్ రావడంతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. కానీ భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు పరీక్షించి గర్భిణుల ప్రసవానికి ఇంకా సమయం ఉందని.. నీరసంగా ఉన్న వారికి చికిత్స చేస్తున్నట్లు తెలిపారు.



ముస్లిం కుటుంబానికి గణేశ్ లడ్డూ



లడ్డూ అందుకుంటున్న ఖయ్యూం, కుటుంబ సభ్యులు

కాటారం(మహాముత్తారం): గణేశ్ లడ్డూ వేలంపాటలో ఒక ముస్లిం కుటుంబం పాల్గొని లడ్డూను దక్కించుకుంది. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం నర్సింగాపూర్‌లో వినాయకుడి లడ్డూను సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తుల సమక్షంలో వేలం వేశారు. గ్రామానికి చెందిన ఖయ్యూం కుటుంబ సభ్యులతో కలిసి వేలం పాటలో పాల్గొన్నారు. రూ.20 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఖయ్యూం, కుటుంబ సభ్యులను అభినందించారు.



తాటాకు శిరస్త్రాణం

పొలంలో పనిచేసే కూలీలు వర్షాకాలంలో నిత్యం తడుస్తూనే ఉంటారు. దీంతో జలుబు, జ్వరం వంటివాటి బారిన పడకుండా ఇలా తాటాకు గొడుగును తలకు రక్షణగా వినియోగిస్తుంటారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం గరిగిపాడు గ్రామానికి చెందిన మహిళా కూలీలు పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- డి.సత్యనారాయణమూర్తి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



గోవిందునికి గగన తివాచీ..

తిరుపతి నగరంలోని గోవిందరాజు స్వామి ఆలయ శిఖరంపై సోమవారం సాయంత్రం ఆకాశం ఎర్ర తివాచీ పరచినట్లుగా మనోహరంగా మారింది. ఆలయానికి విచ్చేసిన భక్తులు, స్థానికులు ఆ దశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ అద్భుత దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- మోహన్‌కృష్ణ కేతారి, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఇక బడికి సిద్ధం కావాలి

వరద వెళ్లిపోయింది. బురద తొలగించే పనిలో పెద్దలు బిజీగా ఉన్నారు. చిన్నారులు మాత్రం తడిసిన తమ పుస్తకాల మీద దృష్టిపెట్టారు. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో పిల్లలు వరదకు తడిసిపోయిన తమ పుస్తకాలను జాగ్రత్తగా ఆరబెట్టుకుంటున్న దృశ్యం

- నడిపూడి కిశోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అనకాపల్లి బెల్లానికి అంతర్జాతీయ ఖ్యాతి

యూపీ, మహారాష్ట్రకు దీటుగా అనకాపల్లి బెల్లం ఎగుమతులు

- దేశంలోనే అతిపెద్ద బెల్లం మార్కెట్లలో ఒకటిగా అనకాపల్లి
- బెల్లం ఉత్పత్తిలో పోషక విలువలు ఉండేలా ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రయోగాలు
- బెల్లంలో తేమ శాతం తగ్గించి నిల్వ సామర్థ్యం పెంచేలా కృషి
- బెల్లం పొడి, జొన్న, ఓట్సు బిస్కెట్లు, జెల్లీలు, చాక్లెట్‌లు, పల్లీ చెక్కీల ఎగుమతి



సాక్షి, అనకాపల్లి: సేంద్రియ పద్ధతుల్లో తయారుచేసే రుచికరమైన అనకాపల్లి ఆర్గానిక్ బెల్లానికి, దానితో తయారు చేసే ఉత్పత్తులకు అంతర్జాతీయంగా గిరాకీ పెరిగింది. తయారీదారులకు విదేశాల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నాయి. నాణ్యమైన పద్ధతుల్లో తయారుచేసే ఈ బెల్లం దేశ విదేశాల్లో వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు అమెరికా, మారిషస్, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలకు ఇక్కడి నుంచి బెల్లం ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం బెల్లం సీజన్ ప్రారంభం కావడంతో ఆయా దేశాలనుంచి ఇక్కడి వ్యాపారులకు ఆర్డర్లు ఊపందుకున్నాయి. అనకాపల్లి జిల్లా నుంచి 'ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా'' మార్క్‌తో సేంద్రియ బెల్లం, దానితో తయారయ్యే ఉత్పత్తులను ఎగుమతి చేస్తుంటారు. ఏటా అనకాపల్లి జిల్లా నుంచి సుమారు 25 వేల టన్నుల సేంద్రియ బెల్లం ఎగుమతి అవుతోంది. అదేవిధంగా 30కి పైగా సేంద్రియ బెల్లం ఉత్పత్తులు కూడా ఎగుమతవుతున్నాయి. అనకాపల్లిలో ఆర్గానిక్ బెల్లం, బెల్లం ఉత్పతులపై ఆధారపడి జీవించే కుటుంబాలు 100కి పైగా ఉన్నాయి. హైడ్రోస్ కలపకుండా మంచి ఫ్లేవర్స్ వచ్చేలా వినూత్న రీతిలో తయారుచేయడం, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో అనకాపల్లి ఆర్గానిక్ బెల్లానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. అనకాపల్లి, మునగపాక, మాడుగుల, కోటవురట్ల మండలాల్లో ఆర్గానిక్ బెల్లం తయారుచేస్తున్నారు. చక్కెర కర్మాగారాలు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో చెరకు రైతులకు ఆర్గానిక్ బెల్లం తయారీ సంస్థలు అండగా నిలుస్తున్నాయి.

హైడ్రోస్ కలపకుండా..

బెల్లం తయారీలో సహజంగా సల్ఫర్, పంచదార వినియోగిస్తుంటారు. కానీ సేంద్రియ బెల్లం తయారీలో అవి కలపకుండా వాటి స్థానంలో సుక్రోజ్, విటమిన్–ఎ, విటమిన్–సి లను తగు మోతాదులో కలిపి అత్యున్నత ప్రమాణాలతో తయారుచేయడం ప్రారంభించారు. పంచదారతో సంబంధం లేకుండా, రంగుకు ప్రాధాన్యమివ్వకుండా, హైడ్రోస్ కలపకుండా బెల్లం అందిస్తారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆధునిక పద్ధతుల్లో బెల్లం తయారు చేసే యూనిట్లను ఇక్కడ కూడా ఏర్పాటుచేశారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పోటీ పడుతూ.. అనకాపల్లి పరిశోధన కేంద్రాల్లో విలువ ఆధారిత బెల్లం తయారు చేస్తున్నారు.

ఆర్గానిక్ పద్ధతిలో తయారీ

అనకాపల్లి జిల్లాలో పలువురు సంప్రదాయ పద్ధతిలో బెల్లం తయారీ యూనిట్లు ఏర్పాటుచేశారు. 5 గ్రాముల నుంచి 850 గ్రాముల బరువు బెల్లం దిమ్మలు, కుందులు, పౌడర్, బెల్లం ద్రావణాన్ని తయారు చేస్తున్నారు. ప్రస్తుతం భారత దేశం నుంచి ప్రపంచ దేశాలకు ఆరు మిలియన్ టన్నుల బెల్లం ఎగుమతిచేస్తున్నారు. ఇంకా డిమాండ్ భారీ స్థాయిలో ఉంది. దీంతో సేంద్రియ బెల్లం తయారీదారులు ఎగుమతులపై దృష్టి పెట్టారు. విదేశీయులు ఇష్టపడే ఫ్లేవర్లలో బెల్లం తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు.



తయారయ్యే ఉత్పత్తులు ఇవే...

ఘన బెల్లం, పొడి బెల్లం, బెల్లం ఆధారిత ఉత్పత్తులు, బెల్లం జొన్న బిస్కెట్లు, బెల్లం ఓట్సు బిస్కెట్లు, బెల్లం జెల్లీలు, బెల్లం చాక్లెట్లు, బెల్లం పల్లీ చెక్కీలు

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో తయారైన బెల్లం ఉత్పత్తులు

ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి ఎగుమతి

ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు దీటుగా అనకాపల్లి బెల్లం ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఆర్‌ఏఆర్ఎస్ (రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్)లో శాస్త్రవేత్తల సహకారంతో సేంద్రియ పద్ధతిలో బెల్లం ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. అత్యుత్తమ నాణ్యత కారణంగా ఈ ఉత్పత్తులకు దేశ విదేశాల నుంచి ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తున్నాయి. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీఎంఎఫ్ఎంఈ(ప్రైమ్‌మినిస్టర్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకంలో భాగంగా అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో రూ.3.5 కోట్లతో చెరకు, పనస, చిరుధాన్యాలకు సంబంధించి ఇంక్యుబేషన్ సెంటర్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో చెరకు ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఉత్పత్తి ప్రారంభమై గణనీయమైన ఆదరణ కనిపిస్తోంది. పనస, చిరుధాన్యాల ఉత్పత్తులకు సంబంధించిన ఇంక్యుబేషన్ సెంటర్ల నిర్మాణంకూడా దాదాపు పూర్తయింది. దీంతో ఈ ప్రాంతంలో వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు మంచి డిమాండ్ వచ్చి రైతులకు మేలు జరగనుంది.

రైతుకు అండగా..



ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుతో చెరకు, చిరుధాన్యాలు, పనస రైతులకు అండగా నిలవడంతో పాటు వారి ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని చెరకు రైతులకు ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు ఒక మంచి శుభవార్తగా చెప్పవచ్చు. దీంతో పాటు పనస, మిల్లెట్స్ పండించే గిరిజన రైతులకు కూడా మంచి లాభాలు వస్తాయి. ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణం కూడా పూర్తయింది.

– పి.వి.కె జగన్నాథరావు, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీ

బాబు 'బీమా మాటలు' బోగస్..

బుడమేరు వరదలో మునిగిన వాహనాలకు ఇన్సూరెన్స్ సంస్థల ఝలక్

- చంద్రబాబు చెప్పే మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతనే లేదు
- కంపెనీలతో మాట్లాడేశానన్న మాటలు ఆచరణ కాని వైనం
- వరద బాధితుల్ని పట్టించుకోని బీమా కంపెనీలు
- వరదవల్ల దెబ్బతిన్న వాహనాలకు బీమా సంస్థల కొర్రీలు
- మరమ్మతులకు రూ.30 వేల నుంచి రూ.50 వేల ఖర్చు
- రూ.5 వేల లోపే ఇస్తామంటున్నారని వాహన యజమానుల గగ్గోలు



సాక్షి, అమరావతి : 'నా ఆటో వరదలో మునిగి వారం రోజులు ఉండిపోయింది. అన్ని భాగాలు పాడైపోయాయి. ఇంజిన్ సీజ్ అయిపోయింది. దాన్ని బాగుచేయాలంటే రూ.60 వేలు వరకు అవుతుందని మెకానిక్ చెప్పాడు. బండికి ఇన్సూరెన్స్ ఉంది. వాళ్లు చూసి ఇంజిన్ సీజ్ అయితే ఇన్సూరెన్స్ ఇవ్వలేమని చెప్పారు. గట్టిగా అడిగితే రూ.4 వేలు ఇస్తామంటున్నారు. చంద్రబాబు చెప్పిన దానికి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి సంబంధం లేదు. ఆటోనే నా జీవనాధారం. పైగా.. ఇంట్లో అన్ని వస్తువులు వరదలో మునిగి పాడైపోయాయి. ఏం చేయాలో, ఎలా బతకాలో తెలీడంలేదు'.. ఇదీ విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతంలోని శాంతినగర్‌లో ఉంటున్న వేల్పుల మురళి ఆవేదన.

.. ఇలా బుడమేరు వరదలో మునిగి విజయవాడలో దాదాపు రెండు లక్షల వాహనాలు పాడైపోయినట్లు అంచనా. అందులో సుమారు లక్షన్నర ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. ఆటోలు 15 వేలు, కార్లు 20 వేల వరకూ ఉండొచ్చని అంచనా. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ముంపు వాహనాలే కనిపిస్తున్నాయి. వరద నీటిలో మునగడంతో చాలా వాహనాల ఇంజన్లు సీజ్ అయిపోయాయి. కానీ, ఇన్సూరెన్స్ ఉన్న ఇలాంటి వాహనాలకు ఇబ్బందుల్లేకుండా క్లెయిమ్‌లు ఇప్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. బీమా సంస్థలతో సమావేశం నిర్వహించి క్లెయిమ్‌ల పరిష్కారంలో ఉదారంగా ఉండాలని చెప్పామని, వాళ్లు ఒప్పుకున్నారనీ చెప్పారు. ఈయన మాటలు నమ్మి పూర్తి ఇన్సూరెన్స్ వస్తుందన్న ధీమాతో బాధితులు దెబ్బతిన్న తమ వాహనాలను కంపెనీలకు తీసుకెళ్తున్నారు. అక్కడ కంపెనీల ప్రతినిధులు వీటికి అసలు బీమా ఎలా వస్తుందని బాధితుల్ని ఎదురు ప్రశ్నిస్తున్నారు.

బీమా నిబంధనలతో ఆందోళన..

వాహనాలు వరద నీటిలో ఉన్నప్పుడే తాము చూడాలని, కడిగి తీసుకొస్తే బీమా క్లెయిమ్ చేయడం కుదరదని చెబుతుండడంతో వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. వాహనాలను చూసేందుకు సైతం కంపెనీల ప్రతినిధులు రావడంలేదు. 10–15 రోజుల సమయం పడుతుందని చెబుతున్నారు. అప్పటివరకు ఆగలేమని చెబుతుండడంతో ఎంతోకొంత క్లెయిమ్ ఇస్తామని చెప్పి రూ.2 నుంచి రూ.5 వేల వరకూ నిర్ధారించి పంపేస్తున్నారు. ఇదిలా ఉంటే.. మీ వాహనం మునిగిందని గ్యారంటీ ఏమిటని చాలామందిని ప్రశ్నిస్తున్నారు. అలాగే, వరదలో బండి మునిగిన ఫొటోను అడుగుతుండడంతో బాధితులకు ఏం చేయాలో పాలుపోవడంలేదు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉండే నరసింహారావు ఇంజన్, ఎలక్ట్రిక్ వైరింగ్, గేర్‌బాక్స్ ఇతర పరికరాలు పనికిరాకుండా పోవడంతో రిపేర్‌కు రూ.30 వేలు అవుతుందని షోరూమ్‌లో కొటేషన్ ఇచ్చారు. కానీ, ఇన్సూరెన్స్ కంపెనీ మాత్రం వాహనాన్ని కడిగేసి తీసుకొచ్చారు కాబట్టి తామేమీ చేయలేమని చేతులెత్తేసింది. అతను ప్రాధేయపడితే రూ.3 వేలు ఇవ్వడానికి ఒప్పుకుంది. మరోవైపు.. ఇలాంటి ద్విచక్ర వాహనాల్లో దాదాపు 70 శాతానికి పైగా ఇన్సూరెన్స్ లేదని చెబుతున్నారు. వారంతా సొంత డబ్బుతోనే వాహనాలను బాగుచేయించుకుంటున్నారు.

ఆటోవాలాల పరిస్థితి దయనీయం..

ఇక పిల్లలను స్కూళ్లు, కాలేజీలకు తీసుకెళ్లే ఆటోవాలాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వెంటనే ఆటో మరమ్మతు చేయించుకోకపోతే ఉన్న వ్యాపారం పోయి రోడ్డు మీద పడతామని గగ్గోలు పెడుతున్నారు. కంపెనీల వాళ్లు కనీసం 10 రోజుల సమయం అడుగుతుండడం, వేచి ఉన్నా నామమాత్రంగా ఎంతోకొంత ఇచ్చే పరిస్థితి ఉండడంతో దానిపై ఆశలు వదిలేసుకుని అప్పుచేసి ఆటోలను బాగు చేయించుకుంటున్నారు.

రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చెయ్యి

నందలూరు: అన్నమయ్య జిల్లా నందలూరు రైల్వే కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రైలు ప్రమాదంలో యువకుడి చెయ్యి తెగిపోయింది. గుంతకల్లుకు చెందిన కురుబ ధనుష్ పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం గుంతకల్ నుంచి కళాశాలకు వెళ్లేందుకు ముంబై – చెన్నై (12163) ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నందలూరులో అదే రైలు కిందపడిపోవడంతో చేయి పూర్తిగా తెగిపోయింది. వెంటనే స్థానిక ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది క్షతగాత్రుడ్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. 108 వాహనాన్ని సంప్రదించగా గంట సమయం పడుతుందని చెప్పడంతో బాధితుడిని ఆటోలో తరలించారు.



ప్రమాదంలో చేయి పోగొట్టుకున్న ధనుష్



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ టీబీసీ అతిథిగృహం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,626 మంది స్వామివారిని దర్శించుకోగా 33,138 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ఆదాయం రూ. 3.13 కోట్లు వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



అందుబాటులోకి సత్యగిరి మెట్ల దారి



అన్నవరం: రత్నగిరిపై విద్యుత్ సబ్ స్టేషన్ పక్క నుంచి సత్యగిరి రెండో మలుపు వరకూ రూ.10.50 లక్షలతో నిర్మించిన మెట్ల దారి పనులు పూర్తవడంతో రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఈ మెట్ల దారికి రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సత్రాల్లో బస చేసే భక్తులు స్వామివారి ఆలయానికి రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ఘాట్‌రోడ్ ద్వారా నడిచి లేదా వాహనాల్లో వెళ్లాల్సి వచ్చేది. ఈ సత్యగిరి మెట్ల దారి అందుబాటులోకి రావడంతో భక్తులకు, పెళ్లి బృందాలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ



సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రముఖ పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. తెల్లవారుజామున స్వామి వారికి తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలతోను, ఆలయ కోనేరులోని నీటితోను అభిషేకాలు చేసుకున్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. ఈ క్రమంలో ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. ద్వారతోరణ ధ్వజకుంభ ఆవాహనం, చక్రాది మండలపూజ, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం జరిపించారు. పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకం చేశారు. సిరులతల్లిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వైభవంగా సింహగిరి పవిత్రోత్సవాలు



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పూర్ణాహుతి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం కుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, రథబలి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ శిఖరాలకు పవిత్ర సమర్పణ చేశారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి దివ్యప్రబంధ పారాయణాలు, సింహాచలం క్షేత్ర మహత్యం, వేద మంత్రోశ్చరణలతో స్వామిని కీర్తించారు.

సహస్ర దీపాలంకరణ సేవ మండపానికి శంకుస్థాపన



సింహాచలం: సింహగిరిపై రాజగోపురం సమీపంలో దాత సహకారంతో నిర్మించనున్న సహస్రదీపాలంకరణ మండపం పనులకు సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు శంకుస్థాపన చేశారు. 2014 డిసెంబర్‌లో దేవస్థానంలో సహస్రదీపాలంకరణ సేవ ప్రవేశపెట్టారు. 2020లో కోవిడ్ కారణంగా నిలిపివేశారు. ఇటీవల మళ్లీ పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సహస్రదీపాలంకరణ సేవకు ప్రత్యేక మండపాన్ని నిర్మించేందుకు దాత నారాయణరెడ్డి ముందుకువచ్చారు.


దర్గాలో దీపారాధన

ముమ్మిడివరం: కోనసీమ జిల్లా కొత్తలంక హజరత్ సయ్యద్ అహ్మద్ అలీషా ఖాదర్ వలీబాబా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం దీపారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది హిందూ, ముస్లిం భక్తులు బాబా దర్గాలో బాబా సమాధిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయాన్నే బాబాకు కరాచీ నూకతో తయారుచేసిన ప్రత్యేక ప్రసాదాన్ని సమర్పించి దీపాలతో దర్గాను అలంకరించి పూజలు జరిపారు.

19న తడలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్: తడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా అధికారి లోకనాథం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే మేళాకు పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9154449677 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.





డిగ్రీ, పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ కోసం మూడో విడత కౌన్సిలింగ్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. 22న మూడో విడత సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నారు. అలాగే మంగళవారం నుంచి ఎస్వీయూ, పద్మావతీ వర్సిటీల్లో రెండో విడత పీజీ సెట్–2024 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలవనుంది. వెటర్నరీ వర్సిటీలో ఈనెల చివరి వారంలో బీవీఎస్సీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

బీఎడ్ కళాశాలల స్టాఫ్ ర్యాటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీఎడ్ కళాశాలలస్టాఫ్ ర్యాటిఫికేషన్ మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నత విద్యామండలి, నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల మేరకు స్టాఫ్ అర్హతలు ఉండాలి. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో సాగుతుంది. జిల్లాలో ప్రస్తుతం 13 బీఎడ్ కళాశాలలు ఉన్నాయి. సింగిల్ సెక్షన్ కళాశాలలకు ప్రిన్సిపాల్‌తో పాటు ఏడుగురు అధ్యాపకులు, డబుల్ సెక్షన్‌కు ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్‌తో పాటు 14 మంది అధ్యాపకులు ఉండాలి.

18న ఐటెప్ ప్రవేశాల జాబితా

ఎచ్చెర్ల క్యాంపస్: గత విద్యా సంవత్సరం శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఐటెప్ (ఐటీఈపీ, నాలుగేళ్ల సమీకృత విద్యా డిగ్రీ కోర్సు) ప్రవేశాల జాబితా ఈ నెల 18వ తేదీన ప్రకటించనున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్ష స్కోర్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

హెల్త్ సాక్షి ప్లస్
మంగళవారం ॥ 17-9-2024



గర్భధారణ జరిగాక సాధారణంగా పారాసిటమాల్ వంటి మందులు తప్ప మహిళలకు ఎలాంటి మందులూ ఇవ్వరు. కొన్ని రకాల మందులైతే అస్సలు ఇవ్వకూడదు కూడా. కొన్ని మందులు తీసుకోవడం వల్ల గర్భంలోని పిండంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఉన్నందున ఈ జాగ్రత్త. అలాంటి మందులేవో తెలుసుకుని, వాటికి దూరంగా ఉండేందుకు ఉపయోగపడేదే ఈ కథనం...

నీళ్లోసుకుంటే ఈ మాత్రేసుకోవద్దు!



గర్భవతులు వాడకూడని మందులేమిటో, పొరబాటున వాడితే వచ్చే ప్రతికూల ప్రభావాలెలా ఉంటాయో తెలుసుకుందాం.

యాంటీకన్వల్సెంట్స్ : ఫిట్స్ వ్యాధి ఉన్నవారిలో సీజర్స్ తగ్గడానికి వాడే మందులివి. కార్బమాజిపైన్, సోడియం వాల్‌ప్రోయిక్ యాసిడ్, ఫెనీటోయిన్ వంటి అన్ని యాంటీకాన్వల్సెంట్ మందుల వల్ల పుట్టబోయే బిడ్డలో చెవి, ముఖానికి సంబంధించిన ఎముకల అపసవ్యత, న్యూరల్ ట్యూబ్ లోపాలు, గుండె జబ్బులు వచ్చే అవకాశాలెక్కువ.

అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. గతంలో ఫిట్స్ రావడంతో మందులు వాడుతున్నవారు సైతం గర్భధారణకు ప్లాన్ చేసుకోవచ్చు. కాకపోతే ఫిట్స్ కోసం ఒకటి కంటే ఎక్కువగా మందులు వాడుతున్న వారు దాన్ని కేవలం ఒకే ఒక టాబ్లెట్‌కు పరిమితం చేసుకుని, ఫిట్స్‌ను పూర్తిగా నియంత్రణలో ఉంచుకుని, కాబోయే తల్లి తన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటుంటే నిరభ్యంతరంగా గర్భధారణకు ప్లాన్ చేసుకోవచ్చు. కానీ తల్లి వాడే కొన్ని రకాల ఫిట్స్ మందులు పిండంపై దుష్ప్రభావం చూపవచ్చు. అలాంటప్పుడు బిడ్డలో వెన్నెముక పూర్తిగా అభివృద్ధి చెందని స్పైనా బైఫిడా, గ్రహణం మొర్రిగా పేర్కొనే క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలెట్ లేదా పుట్టుకతో వచ్చే గుండెజబ్బులు (కంజెనిటల్ హార్ట్ డిసీజెస్) వంటివి వచ్చే అవకాశాలుంటాయి. అందుకే ఫిట్స్ మందులను తల్లికి ప్రయోజనకరంగానూ, బిడ్డకూ హానికరం కాకుండా ఉండేలా మోతాదులు తగ్గించిన తర్వాతనే గర్భధారణ ప్లాన్ చేయాలి.

యాంటిసైకోటిక్ : ఇవి మానసిక సమస్యలకూ, మనసు నిలకడగా ఉండటానికి వాడతారు. ప్రెగ్నెన్సీ వచ్చిన తొలి రోజుల్లో ఇచ్చే లిథియమ్ వల్ల గుండెకు సంబంధించిన ఎబ్‌స్టైన్ అనామలీ వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి మానసిక సమస్యలకు మందులు వాడుతున్నప్పుడు ప్రెగ్నెన్సీ ప్లానింగ్ చేసుకోకూడదు.

యాంటీమైగ్రెయిన్ మందులు : ఎర్గోటమైన్, మెథీజర్‌జైడ్ వంటి మందుల్ని తలనొప్పి తగ్గడానికి ఇస్తారు. వీటి వల్ల సమయానికి ముందే ప్రసవం అయిపోయే అవకాశాలెక్కువ. కాబట్టి మైగ్రేన్ మందులు వాడుతుంటే గైనకాలజిస్టుకు ఆ విషయం చెప్పాలి.

యాంటీ బయాటిక్స్ : ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి వాడే ఈ మందులు బిడ్డలో అనేక దుష్ప్రభావాలు కలగజేయవచ్చు. ఉదా: టెట్రాసైక్లిన్స్ వల్ల దంతాల రంగుపోవడం, ఎముకల ఎదుగుదలకు అడ్డంకులు వంటి సమస్యలు రావచ్చు. సల్ఫోనమైడ్స్ అనే మందుల వల్ల బిడ్డ పుట్టిన నెలలోపే కామెర్లు, స్ట్రెప్టోమైసిన్ వాడటం వల్ల చెవుడు వచ్చే అవకాశాలెక్కువ.

యాంటీకోయాగ్యులెంట్స్ : రక్తం గడ్డకట్టడంలో లోపాలుంటే ఇచ్చే వార్‌ఫేరిన్ డైఫినాడైయాన్ గ్రూపుకు చెందిన ఈ మందుల వల్ల ముక్కు రంధ్రం పూర్తిగా తయారుకాకపోవడం, గర్భవతిలో రక్తస్రావం, కంటి అపసవ్యతలు ఏర్పడటం, తల పెరగకుండా ఉండటం, ఫలితంగా చిన్నారుల్లో బుద్ధి మాంద్యం వచ్చే అవకాశాలెక్కువ.

యాంటీ డయాబెటిక్ : మధుమేహానికి వాడే మందులైన క్లోరోప్రోమైడ్ వంటివి తీసుకోవడం వల్ల బిడ్డ పుట్టిన నెలలోపే చిన్నారి తాలూకు రక్తంలో గ్లూకోజ్ తగ్గడం (హైపోగ్లైసీమియా) వంటి కండిషన్లు ఏర్పడవచ్చు.

విటమిన్-ఎ అనలాగ్స్ : ఈ మందుల్ని మొటిమలు (యాక్నే) చికిత్సలో వాడతారు. ఎట్రటినేట్, ఐసోట్రెటినోయినిన్‌లాంటి మందులతో చెవులు చిన్నగా ఉండటం, గుండె సమస్య, మెదడులోకి నీరు చేరడం, అబార్షన్ కావడం, ముఖాకృతిలో తేడాలు రావడం వంటివి జరగవచ్చు.

డయాగ్నస్టిక్ రేడియోలజీ : గర్భం ధరించిన తొలిరోజుల్లో ఎక్స్-రే తీయించిన కేసుల్లో... చిన్నారి పుట్టిన తొలి ఏళ్లలో లుకేమియా వంటి రక్త సంబంధిత క్యాన్సర్ల బారిన పడే అవకాశాలెక్కువ. అందుకే గర్భవతులు రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ కావద్దంటూ ఎక్స్‌రే రూమ్‌ల ముందు స్పష్టంగా హెచ్చరిక రాసి ఉంటుంది.

గర్భవతిగా ఉన్నప్పుడు ఏ మందులు వాడినప్పటికీ చిన్నారి మీద ఎంతో కొంత ప్రభావం చూపే అవకాశాలే ఎక్కువ. ఏ మందు ఎంత సురక్షితమో లేదా ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపుతుందో తెలియదు. కాబట్టి గర్భవతులు మందులు వాడాల్సిన పరిస్థితి వస్తే వారు డాక్టర్‌ను తప్పక సంప్రదించాకే వాడాలని గుర్తుంచుకోండి. డాక్టర్లు సైతం ఆ మందుల అవసరాన్ని, బిడ్డపై పడే ప్రభావాల్ని జాగ్రత్తగా బేరీజు వేశాకే తల్లికి ప్రిస్క్రయిబ్ చేస్తారు.



డాక్టర్ సరోజ
సీనియర్ అబ్‌స్ట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్

కుండంత కడుపు కొండంత భారం

శరీరం బరువు ఉండాల్సినంతే ఉన్నప్పటికీ పొట్ట పెద్దగా ముందుకు వచ్చి కనిపిస్తుంటే అది కాస్తంత ప్రమాదకరమైన కండిషన్ అని గుర్తుంచుకోవాలి. ఇదెంత ప్రమాదకరం, పొట్టను ఏ మేరకు తగ్గించుకోవాలి అనే విషయాలు ఓ టేప్ సహాయంతో తెలుసుకోవచ్చు. ఇలా కొలిచే సమయంలో పొట్టను బొడ్డుకు ఒక అంగుళంపైనే కొలవాలి. ఆ కొలతకూ, పిరుదుల కొలతకు నిష్పత్తిని లెక్కగట్టాలి. అంటే నడుము కొలతని హిప్ కొలతతో భాగించాలి. అదెప్పుడూ ఒకటి కంటే తక్కువగానే (అంటే జీరో పాయింట్ డెసిమల్స్‌లో) వస్తుంది. సాధారణంగా నడుము కొలత, హిప్స్ భాగం కొలత కంటే తక్కువగా ఉండటమే ఇందుకు కారణం.



సాధారణంగా మహిళల్లో ఈ కొలత విలువ 0.85 కంటే తక్కువగా ఉండాలి. పురుషులకు ఇది 0.9 కంటే తక్కువగా రావాలి. ఈ నిష్పత్తినే డబ్ల్యూహెచ్‌ఆర్ (వేయిస్ట్ బై హిప్ రేషియో) అంటారు. పైన పేర్కొన్న ప్రామాణిక కొలతల కంటే ఎక్కువగా వస్తే ... అంటే... ఈ రేషియో విలువ... మహిళల్లో 0.86 కంటే ఎక్కువగానూ, పురుషులలో 0.95 కంటే ఎక్కువగా ఉంటే అది కాస్త ప్రమాదకరమైన పరిస్థితి అని గుర్తుంచుకోవాలి. అలా కొలతలు ఎక్కువగా ఉన్నాయంటే వారికి 'అబ్డామినల్ ఒబేసిటీ' ఉందనడానికి అదో సూచన. దీన్నే సెంట్రల్ ఒబేసిటీ అని కూడా అంటారు. ఇలా అబ్డామినల్ ఒబేసిటీ లేదా సెంట్రల్ ఒబేసిటీ ఉన్నవారికి గుండెసమస్యలు / గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ. అందుకే ఈ నిష్పత్తి (వేయిస్ట్ బై హిప్ రేషియో) ఉండాల్సిన ప్రామాణిక విలువల కన్నా ఎక్కువగా ఉన్నవారు వాకింగ్ లేదా శరీరానికి మరీ ఎక్కువ శ్రమ కలిగించని వ్యాయామాలతో పొట్ట చుట్టుకొలతను (పొట్టని) తగ్గించుకోవడమన్నది గుండెకూ, ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది.

● క్యాన్సర్ కేర్

వంటిల్లూ పుట్టిల్లే!



క్యాన్సర్ రావడానికి కొన్ని పద్ధతుల్లో వంట కూడా కారణమవుతుంది. ఉదాహరణకు ఒకసారి వేడి చేసిన నూనెను మళ్లీ వాడకూడదనేది అందరికీ తెలిసిన విషయం. అలా మాటిమాటికీ నూనెను వేడి చేయడం వల్ల అందులో క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు ఏర్పడతాయి. అందుకే అలా వాడకూడదని నిపుణులు సలహా ఇస్తుంటారు. ఇది మాత్రమే కాకుండా వంట విషయంలో క్యాన్సర్‌కు కారణమయ్యే అంశాలేమిటీ... వంటలో చేయకూడనివేమిటీ, చేయాల్సినవేమిటో తెలుసుకుందాం.

చేయకూడనివి...

✗ వాడిన నూనెను మళ్లీ మళ్లీ వేడి చేసి వాడకూడదు.

✗ కొవ్వులు ఎక్కువ ఉన్న ఆహారం క్యాన్సర్ కారకమయ్యే అవకాశముంది. అందుకే వేట మాంసం (రెడ్ మీట్) వద్దని నిపుణుల సలహా. రెడ్ మీట్ ఎక్కువగా తినే దేశాల్లో కొలోన్ క్యాన్సర్, కొలోరెక్టల్ క్యాన్సర్లు ఎక్కువ. రెడ్ మీట్‌తో ప్యాంక్రియాటిక్, ప్రోస్టేట్, పొట్ట క్యాన్సర్ల ముప్పు కూడా పెరుగుతుంది. మామూలు కూరగాయలు, ఆకుకూరల ఆహారం తినేవారితో పోలిస్తే ప్రతిరోజూ ప్రతి 100 గ్రాముల రెడ్‌మీట్ తినేవారిలో క్యాన్సర్ వచ్చే అవకాశాలు 17 శాతం పెరగడం కొందరు అధ్యయనవేత్తల పరిశీలనలో తేలిన విషయం. అయితే మాంసాహార ప్రియులకు న్యూట్రిషనిస్టులు, డాక్టర్లు ఇచ్చే సలహా ఏమిటంటే... మాంసాహార ప్రియులు రెడ్‌మీట్‌కు బదులు వైట్ మీట్ అంటే కొవ్వులు తక్కువగా ఉండే చికెన్, చేపలు తినడం మంచిది. చేపలైతే పోషకాహారపరంగా కూడా మంచివి. అందులోని ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ క్యాన్సర్‌ను నివారిస్తాయి కూడా.

✗ క్యాన్సర్ నివారణలో ఏం వండారన్నది కాదు... ఎలా వండామన్నది కూడా కీలకమే. ముఖ్యమే. ఒక వంటకాన్ని చాలా ఎక్కువ ఉష్ణోగ్రతతో వండటం కొన్నిసార్లు క్యాన్సర్ కారకాలైన రసాయనాలు వెలువడేందుకు అవకాశమివ్వవచ్చు. ఉదా: మాంసాన్ని చాలా ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద ఉడికిస్తున్నా... అంటే గ్రిల్డ్ ఐటమ్స్, ఫ్రైడ్ (వేపుడు) ఐటమ్స్‌గా చేస్తుంటే అందులోని కొన్ని పదార్థాలు హెటిరోసైక్లిక్ అరోమాటిక్ అమైన్స్ అనే రసాయనాలుగా మారవచ్చు. అవి క్యాన్సర్ కారకాలు.



✗ విదేశీ తరహాలో ఇప్పుడు మనదేశంలోనూ స్మోక్‌డ్ ఫుడ్ తినడం మామూలుగా మారింది. స్మోకింగ్ ప్రక్రియకు గురైనా, నేరుగా చాలా ఎక్కువ ఉష్ణోగ్రత తగిలేలా మంట మీద వండిన ఆహారపదార్థాల్లోంచి వెలువడే 'పాలీ సైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్' అనే (పీఏహెచ్‌స్) అనే రసాయనాలు క్యాన్సర్ కారకాలు. అందుకే ఈ పద్ధతుల్లో వడటం సరికాదు.

✗ ఆహారాన్ని సరైన పద్ధతుల్లో నిల్వ చేసుకోడానికి వాడే కొన్ని రకాల పదార్థాల వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. ఉదాహరణకు ఆహారాల నిల్వకు ఉప్పు వాడటం అనాదిగా వస్తున్న పద్ధతి. అయితే ఉప్పులో చాలాకాలం పాటు ఊరిన పదార్థాల వల్ల పొట్ట లోపలి లైనింగ్ దెబ్బతిని, అది ఇన్‌ఫ్లమేషన్‌కు గురికావచ్చు. అలా కడుపు లోపలి పొరలు (లైనింగ్) దీర్ఘకాలం ఒరుసుకుపోవడంతో కడుపులో ఒరుసుకుపోయిన లైనింగ్ పొరలు నైట్రేట్ల వంటి క్యాన్సర్ కారక రసాయనాల ప్రభావానికి గురయ్యే అవకాశముంది. అలాంటప్పుడు కడుపులో 'హెలికోబ్యాక్టర్ పైలోరీ' అనే సూక్ష్మజీవి ఉంటే అది ఆ ప్రాంతాల్లో పుండ్లు (స్టమక్ అల్సర్స్) వచ్చేలా చేస్తుంది. ఈ స్టమక్ అలర్స్ కొన్ని సందర్భాల్లో క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉంది. అందుకే ఉప్పు ఎక్కువగా ఉండే చిప్స్, సాల్టెడ్ పదార్థాలు, బేకరీ ఐటమ్స్‌ను చాలా పరిమితంగా తీసుకోవాలన్నది వైద్యనిపుణుల సలహా. ఆహారంలో ఉప్పు పెరుగుతున్నకొద్దీ హైబీపీ కూడా పెరుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోజుకు ఆరు గ్రాములకు మించి ఉప్పు వాడటం సరికాదు.

చేయాల్సినవి...



✓ ఆహారంలో తగినంత పీచు (ఫైబర్) ఉండే పదార్థాలను తీసుకోవాలి. ఫైబర్ పేగులను శుభ్రం చేయడంతో పాటు క్యాన్సర్ నివారణకూ ఇది తోడ్పడుతుంది. క్యాన్సర్ ముప్పు నివారించాలంటే... ముదురు ఆకుపచ్చరంగులో ఉండే ఆకుకూరలు, తాజా పండ్లు, పొట్టు పుష్కలంగా ఉండే అన్ని రకాల ముడిధాన్యాలు (హోల్ గ్రెయిన్స్) తీసుకోవాలి.

✓ విటమిన్-సి, ఫోలేట్, నియాసిన్ వంటి విటమిన్లు నీళ్లలో కరుగుతాయి. ఆ నీటిని చాలాసేపు వేడిచేస్తే అందులోని విటమిన్లు ఇగిరిపోతాయి. ఆకుకూరలతో వంట చేసేటప్పుడు వంటకు ఎక్కువ సమయం పట్టిన కొద్దీ మొక్కల నుంచి లభ్యమయ్యే పోషకాలు, ఫైటోకెమికల్స్ తరిగిపోతాయి. ఈ ఫైటోకెమికల్స్ క్యాన్సర్లతో ఫైట్ చేస్తాయి కాబట్టి పోషకాలు ఆవిరయ్యేలా కాకుండా అవి కోల్పోనివిధంగా ఉడికించాలి.

✓ ఘాటుగా ఉండే ఉల్లి, వెల్లుల్లి క్యాన్సర్లను నివారిస్తాయి. వాటిని నేరుగా వంటల్లో వేయడం కంటే కాస్త కచ్చాపచ్చాగా ఉండేలా నలగ్గొట్టి వేస్తే రుచి పెరగడంతో పాటు క్యాన్సర్‌తో ఫైట్ చేసే పోషకమైన అలిసిన్ వెలువడేందుకూ ఇది దోహదపడుతుంది. టొమాటో, ద్రాక్ష వంటి ఎరుపు రంగులో ఉండే అనేక పండ్లలో లైకోపిన్ అనే క్యాన్సర్‌తో పోరాడే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే టొమాటోను నేరుగా తినడం కంటే కాస్త ఉడికించడం వల్ల వెలువడే లైకోపిన్‌ను మన జీర్ణకణాలు చాలా తేలిగ్గా స్వీకరిస్తాయి. ఆరోగ్యకరమైన వంట ప్రక్రియకు ఇదో మంచి ఉదాహరణ.

✓ క్యాన్సర్‌ను సమర్థంగా నివారించే పండ్లలో తొక్కతో తినగలిగే జామ, ఆపిల్ వంటి పండ్లను బాగా కడుక్కుని తొక్కతోనే తినడం మంచిది. ఆపిల్‌ను తొక్కతో తింటే... అందులో మొత్తం పండులో కంటే ఆ తొక్కలోనే 75% క్వెర్సిటిన్ అనే క్యాన్సర్‌తో పోరాడే ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి.

ఇలా వంట ప్రక్రియల్లో కొన్ని మార్పులు చేర్పులు అనుసరించడం ద్వారా క్యాన్సర్‌ను చాలా వరకు నివారించుకోవడం సాధ్యమవుతుంది.

● ఏఆర్‌డీఎస్

నిమోనియా కాదు... అంతకు మించి!

అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ అనే రుగ్మతకు సంక్షిప్త రూపం ఏఆర్‌డీఎస్. ఇది ఊపిరితిత్తులు దెబ్బతినడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్య. నిమోనియా అంటే ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ అన్న సంగతి తెలిసిన విషయమే. అయితే ఏఆర్‌డీఎస్ అనేది నిమోనియా కంటే తీవ్రమైన దశ. ఊపిరితిత్తులు మరింతగా దెబ్బతిని ప్రమాదకరమైన దశకు వెళ్లే దశ గురించి తెలుసుకుందాం.



వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్... ఇలా ఏ ఇన్ఫెక్షన్ వల్లనైనా ఊపిరితిత్తుల్ని దెబ్బతీసే 'నిమోనియా' రావచ్చు. ఇందులో జ్వరం, ఎడతెరిపి లేకుండా దగ్గు, ఛాతీలో కఫం చేరడంతో గాలి ఆడటానికి తగినంత స్థలం లేక ఊపిరి సరిగా ఆడకపోవడం కనిపిస్తాయి. కానీ ఏఆర్‌డీఎస్ స్థితికి వెళ్లినప్పుడు బాధితులకు పూర్తిగా ఊపిరి అందని పరిస్థితి ఏర్పడుతుంది.

కారణాలు : ఏఆర్‌డీఎస్‌కి అనేక ప్రత్యక్ష, పరోక్ష కారణాలు ఉంటాయి. అవి...

● **ప్రత్యక్ష కారణం :** విషపూరితమైన రసాయనాలు, వాటి నుంచి వెలువడే విషవాయువులకు ఎక్స్‌పోజ్ కావడం.

● **పరోక్ష కారణాలు:** బాధితులకు మద్యం తాగే అలవాటు చాలా ఎక్కువగా ఉండటం. – గాల్ బ్లాడర్‌లో స్టోన్స్ ఉండటం.

● అదుపులో లేని డయాబెటిస్ ఉన్న కొందరిలో కాలికి తగినంత రక్తం అందక కుళ్లి గ్యాంగ్రిన్ రావచ్చు. ఈ గ్యాంగ్రీన్‌తో కాలి తాలూకు కుళ్లిపోయిన విషపదార్థాలు రక్తంలో చేరడం కూడా ఏఆర్‌డీఎస్‌కు దారితీయవచ్చు. ఇలా ఇతర అంశాలు ఏఆర్‌డీఎస్‌కు దారితీయడాన్ని 'ఇన్‌డైరెక్ట్ ఏఆర్‌డీఎస్' అంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో సమస్య మరింత తీవ్రమైనప్పుడు దేహంలోని అన్ని కీలక అవయవాలూ దెబ్బతిని, అన్ని దేహ వ్యవస్థలు వైఫల్యానికి గురయ్యే ప్రమాదముంటుంది.

లక్షణాలు : ● ఊపిరి అస్సలు అందకపోవడం ● బాధితులు చాలా వేగంగా ఊపిరి తీసుకోడానికి ప్రయత్నిస్తుండటం (హైపర్ వెంటిలేషన్) ● ఊపిరి అందక దేహంలోని ఆక్సిజన్ తగ్గిపోవడంతో శరీరం నీలంగా మారిపోవడం.

నిర్ధారణ: ● **ఎక్స్‌రే :** ఎక్స్‌రే చిత్రంలో లంగ్స్ మూడొంతులు దెబ్బతిని కనిపిస్తుంటే దాన్ని ఏఆర్‌డీఎస్‌గా పేర్కొనవచ్చు.

● **ఏబీజీ (ఆర్టీరియల్ బ్లడ్ గ్యాసెస్) :** శరీరానికి మంచి రక్తాన్ని అందించే ధమని (ఆర్టరీ) నుంచి రక్తాన్ని తీసి అందులో ఉండాల్సిన ఆక్సిజన్ మోతాదులను పరీక్షిస్తారు. అందుకే ఈ పరీక్షను ఆర్టీరియల్ బ్లడ్ గ్యాసెస్ అంటారు. ఈ పరీక్షలో ఉండాల్సిన ఆక్సిజన్ మోతాదులను 'ఫ్రాక్షనల్ ఇన్‌స్పిరేటరీ ఆక్సిజన్' అంటారు. ఈ కొలత 500 ఉంటే అది నార్మల్. ఒకవేళ 200 కంటే తక్కువగా ఉంటే దాన్ని 'ఏఆర్‌డీఎస్' అనీ, 100 కంటే తక్కువగా ఉంటే దాన్ని 'సివియర్ ఏఆర్‌డీఎస్'గా పేర్కొంటూ, దాన్ని ప్రమాదకరమైన పరిస్థితిగా డాక్టర్లు పేర్కొంటారు.

● **పల్స్ ఆక్సీమీటర్ :** ఇది రక్తంలోని ఆక్సిజన్ మోతాదును చూపిస్తుంది. పల్స్ ఆక్సిమీటర్‌లో 95 –97 శాతం ఉండటం నార్మల్ కాగా, 90 శాతం కంటే తక్కువగా ఉన్నవారిని హాస్పిటల్‌లో ఉంచి చికిత్స చేయాలి. 85% కంటే తక్కువగా ఉంటే దేహంలో ఏవైనా విషపదార్థాలు ఉన్నాయేమో పరీక్షించాలి.

● రక్తంలో తెల్లరక్తకణాల సంఖ్యను తెలుసుకునేందుకు కంప్లీట్ బ్లడ్ కౌంట్ పరీక్ష చేయించాలి.

నివారణ : ● దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు నోటికి, ముక్కుకు అడ్డుగా చేతిరుమాలు లేదా టిష్యూ పేపర్ ఉంచుకోవాలి. ఒకరు ఉపయోగించిన టవళ్లు, రుమాళ్లు ఇతరులు ఉపయోగించకూడదు. టిష్యూ ఉపయోగించిన తర్వాత వెంటనే దాన్ని ఇతరులెవరూ ముట్టుకోకుండా, జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలి.

● దగ్గు, తుమ్ము సమయంలో అడ్డుపెట్టుకున్న చేతుల్ని నోటికి, ముక్కుకు, కళ్లకు తాకించవద్దు.

● దగ్గు లేదా తుమ్ము సమయంలో చేతుల్ని అడ్డుపెట్టుకుని ఉంటే వాటిని సబ్బుతో లేదా శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవాలి. సబ్బు ఉపయోగించ లేనప్పుడు డాక్టర్లు వాడే ఆల్కహాల్ బేస్‌డ్ క్లెన్సర్స్ కూడా వాడవచ్చు.

● దాదాపు 65 లేదా 70 ఏళ్లు దాటిన పెద్దవయసు వారంతా స్ట్రెప్టోకోకల్ ఇన్ఫెక్షన్లను నివారించే వ్యాక్సిన్లను డాక్టర్లు చెప్పిన ప్రకారం తీసుకోవాలి.

చికిత్స : ● యాంటీబయాటిక్స్ ఇవ్వడం ● ఆక్సిజన్ పెట్టడం ● నాన్ ఇన్వేజివ్ వెంటిలేటర్ పెట్టడం లేదా అప్పటికీ ప్రయోజనం లేకపోతే వెంటిలేటర్ ద్వారా బాధితులకు శ్వాస అందించడం; ఒకవేళ వెంటిలేటర్ కూడా పనిచేయకపోతే హై ఫ్రీక్వెన్సీ ఆసిలేటర్ వెంటిలేటర్ పెట్టడం ● అప్పటికీ ప్రయోజనం లేకపోతే 'ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్' సహాయంతో రక్తం నుంచి కార్బన్ డైయాక్సైడ్‌ను వేరు చేసి, ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని దేహంలోకి పంపడం. ● అవసరాన్ని బట్టి ఈ చికిత్సలతో పాటు ఇతర లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్ సహాయంతో చికిత్స అందించాల్సి రావచ్చు.

రెండు టీ కి చెడకండి!

* మరికొన్ని అంశాలూ కారణం కావచ్చు
* పరిశోధకుల మధ్య భిన్నాభిప్రాయాలు



రోజూ రెండు కప్పుల టీ, మరో రెండు కప్పుల కాఫీ తాగేవారిలో మతిమరపు సమస్య అంత తేలిగ్గా రాదని అంటున్నారు చైనా పరిశోధకులు. టీ, కాఫీలను చాలా పరిమితంగా అంటే రోజూ రెండు కప్పులకు మించకుండా తాగేవారిలో కేవలం మతిమరపు (డిమెన్షియా) నివారితం కావడమే కాదు... పక్షవాతం వచ్చే అవకాశాలూ తక్కువే అంటున్నారు ఈ పరిశోధన నిర్వహించిన పరిశోధకులు.

టీ కాఫీలు తాగని వారితో పోల్చినప్పుడు... రోజూ రెండు కప్పుల చొప్పున టీ, కాఫీ తాగే వారిలో మతిమరపు రావడమన్నది దాదాపు 28 శాతం తక్కువని పేర్కొంటున్నారు చైనాకు చెందిన టియాంజిన్ మెడికల్ యూనివర్సిటీ అధ్యయనవేత్తలు డాక్టర్ యువాన్ ఝాంగ్, ఆయన బృందం. దాదాపు 5,00,000 మందిపై పదేళ్ల పాటు వారు బ్రిటన్‌లో సుదీర్ఘ పరిశోధన చేశారు.

కాఫీ, టీల మీద ఇలా పరిశోధనలు జరగడం మొదటిసారి కాదు. గతంలోనూ జరిగాయి. ఈ ఫలితాల మీద కొన్ని భిన్నాభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. రీడింగ్ యూనివర్సిటీకి చెందిన ప్రముఖ న్యూట్రిషనల్ సైన్సెస్ నిపుణురాలు డాక్టర్ కార్లోట్ మిల్స్ మాట్లాడుతూ... ''మతిమరపు నివారణకు కేవలం కాఫీ, టీలు మాత్రమే కారణం కాకపోచ్చు. ఇతర అంశాలూ కారణమయ్యే అవకాశాలూ లేకపోలేద''న్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇంకొందరు అధ్యయనవేత్తలు సైతం ఈ పరిశోధనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాఫీ, టీలలో మెదడు, నాడీ వ్యవస్థను ఉత్తేజపరిచే పదార్థాలుంటాయి. వాటిని పరిమితికి మించి తీసుకుంటే కలిగే ప్రమాదాల గురించి వారు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు గతంలో ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఒక అధ్యయనంలో రోజుకు ఆరు కప్పులకు మించి కాఫీ/టీ తాగే వారిలో 53% మందికి డిమెన్షియా వస్తుందని తెలిసిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ''కేవలం రెండే'' అన్న పరిమితికి గట్టిగా కట్టుబడి ఉండాలంటున్నారు.

ఈ పరిశోధన ఫలితాలు ప్రముఖ మెడికల్ జర్నల్ 'ప్లాస్ మెడిసిన్' (PLoS Medicine)లో ప్రచురితమయ్యాయి.

సెబీ చీఫ్ ఖండిస్తున్నారు కదా?

కాంగ్రెస్ ఆరోపణలపై నిర్మలా సీతారామన్ సమాధానం



న్యూఢిల్లీ: సెబీ చైర్పర్సన్ మాధవీ పూరీ బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ తమను తాము సమర్థించుకుంటున్నారని, కాంగ్రెస్ ఆరోపణలకు విరుద్ధమైన వాస్తవాలను బయటపెడుతున్నారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మాధవీ పూరీ బుచ్‌పై ఆరోపణల గురించి ఒక ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆర్థికమంత్రి ఈ విధంగా స్పందించారు. ''చాలా కొన్ని ఆరోపణలకు సమాధానం ఇవ్వడం జరిగింది. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుందని నేను భావిస్తున్నాను''అని ఆమె అన్నారు. ఈ వివాదంపై ఆర్థికమంత్రి మాట్లాడ్డం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మాధవీ పూరి బుచ్ సమాధానాలతో మీరు సంతృప్తి చెందారా? అని అడిగినప్పుడు, సీతారామన్ సమాధానం ఇస్తూ, ''అది ఒప్పో, తప్పో చెప్పడానికి నేను ఇక్కడ లేను'' అని అన్నారు.

ఆర్థిక సేవల్లో ఏఐ, జెనరేటివ్ ఏఐ కీలకం

న్యూఢిల్లీ: దేశంలో 90 శాతం ఆర్థిక సంస్థలు కృత్రిమ మేథ (ఏఐ)కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్టు పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది. జెనరేటివ్ ఏఐని ఆవిష్కరణలకు కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంగా పేర్కొంది. డేటా అనలైటిక్స్ సైతం కీలకంగా మారుతున్నట్టు 74 శాతం ఆర్థిక సంస్థలు పీడబ్ల్యూసీ ఇండియా సర్వేలో భాగంగా వెల్లడించాయి. నిర్ణయాలు తీసుకోవడంలో దీని సమగ్రమైన ప్రాధాన్యతను వెల్లడించాయి. ఈ సర్వేలో 31 బ్యాంక్‌లు, బీమా సంస్థలు, ఫిన్‌టెక్‌లో తమ అభిప్రాయాలను పంచుకున్నాయి.

పరిశ్రమ అభిప్రాయాలు..

- కస్టమర్లను సొంతం చేసుకోవడం, వారికి మెరుగైన అనుభవాన్ని ఇవ్వడం నూతన ఆవిష్కరణలకు కీలకమని 84 శాతం సంస్థలు తెలిపాయి.
- ఉత్పత్తుల పంపిణీ అన్నది ఆవిష్కరణలకు కీలకమని 50 శాతం సంస్థలు పేర్కొన్నాయి.
- రిస్క్‌ను పరిమితం చేయడం, మారుతున్న నియంత్రపరమైన నిబంధనలకు అనుగుణంగా పనిచేయడం కీలకమైనవిగా 65 శాతం సంస్థలు చెప్పాయి. ఆవిష్కరణల విషయంలో నియంత్రణ పరమైన అవరోధాలను అధిగమించడం కీలకమని తెలిపాయి.
- ప్రధానంగా అంతర్గత చర్యల ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని 45 శాతం ఆర్థిక సంస్థలు వెల్లడించాయి. ''ఫిన్‌టెక్ పరిశ్రమ అభివృద్ధి చెందే క్రమంలో వృద్ధికి.. డిజిటల్ భద్రత, నియంత్రణపరమైన నిబంధనల అమలుకు మధ్య సమతూకం అవసరం. నిబంధనల అమలు భాగస్వామ్యాల ద్వారా మారుతున్న నియంత్రపరమైన మార్పులను అధిగమించొచ్చు''అని పీడబ్ల్యూసీ ఇండియా పార్ట్‌నర్ మిహిర్ గాంధీ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-9-2024	
విశాఖ	550-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	411.65	2.55
JSWSTEEL	970.9	1.71
HINDALCO	684.5	1.67
SHRIRAMFIN	3,419.50	1.52
LT	3,657.85	1.24

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	7,342.00	-3.38
HINDUNILVR	2,869.50	-2.16
BAJAJFINSV	1,856.10	-2.02
SBILIFE	1,823.00	-1.27
BRITANNIA	6,069.15	-1.04

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,892
ఎన్ఎస్ఈ	1,07,497
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,77,987
ఎఫ్ఐఐ	- 1,635
డీఐఐ	+ 754

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.16	$ 67.75
బ్రెంట్	72.84	$ 71.61

పండుగల ఆఫర్లు షురూ

న్యూఢిల్లీ: పండుగల సీజన్‌లో మెరుగైన అమ్మకాల కోసం కంపెనీలు ఆఫర్ల బాట పట్టాయి. ఇప్పటికే కార్ల కంపెనీలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల అమ్మకాలు గణేశ చతుర్థి, ఓనమ్ పండుగల సందర్భంగా ఆఫర్లతో అమ్మకాలు పెంచుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు డిమాండ్ స్తబ్దుగా ఉండడంతో, ప్రస్తుత పండుగల సమయంలో మెరుగైన అమ్మకాలపై కంపెనీలు కోటి ఆశలు పెట్టుకున్నాయి. కేరళలో ఓనమ్ పండుగకు ముందే మారుతి 10 శాతం అధిక బుకింగ్‌లను సాధించింది. వినాయక చవితి రోజు అయితే మహారాష్ట్ర, కర్ణాటకలో అధిక కార్ల డెలివరీలను నమోదు చేసినట్టు మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ పార్థో బెనర్జీ తెలిపారు. ఇక ఓనమ్ సమయంలో (సెప్టెంబర్ 6 నుంచి 15 వరకు) ద్విచక్ర వాహన అమ్మకాలు 15-16 శాతం పెరిగాయి. కేరళలో కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల అమ్మకాలు గతేడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 7-8 శాతం అధికంగా నమోదయ్యాయి. గతేడాది ఓనమ్ సమయంలో విక్రయాలు తగ్గ



డాన్ని పరిశ్రమ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. కార్లు, ప్రీమియం కన్జ్యూమర్ ఉత్పత్తుల పరంగా డిమాండ్ కొనసాగుతూనే ఉంది. ''ఓనమ్ సమయంలో మాస్ విభాగంలో అమ్మకాల పెరంగా పెద్ద వృద్ధి లేదు. ప్రీమియం ఉత్పత్తుల విభాగంలోనే ఎక్కువ అమ్మకాలు కొనసాగాయి. మాస్ విభాగం అమ్మకాలు అవసరాల ఆధారంగానే ఉన్నాయి. వేసవిలో అధిక వేడి కారణంగా కూలింగ్ ఉత్పత్తులు పెరగడం ఇందుకు నిదర్శనం''అని గోద్రేజ్ అప్లయన్సెస్ బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. ఓనమ్ సందర్భంగా విక్రయాలు గతేడాదితో పోల్చితే పెరిగాయి కానీ, ఆశించిన స్థాయిలో లేవని వెల్లడించారు.

ఫాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్ల అమ్మకాలు ఓనమ్ పండుగ సమయంలో 15 శాతం అధికంగా నమోదయ్యాయి. ఆరంభ స్థాయిలోని సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్ల విక్రయాలు 6-7 శాతం పెరిగాయి. వాషింగ్ మెషిన్లలో అధిక ఫీచర్లతో కూడిన పూర్తి ఆటోమేటిక్ ఉత్పత్తుల విక్రయాలు 12-13 శాతం వృద్ధి చెందాయి. ఇక సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ల అమ్మకాలు కేవలం 4-5 శాతమే పెరిగాయి. యాపిల్ ఐఫోన్ 16 సిరీస్ బుకింగ్‌లను శుక్రవారం ప్రారంభించగా, మొదటి రోజే కస్టమర్ల నుంచి వచ్చిన స్పందన గతేడాది కంటే మెరుగ్గా ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సాధారణంగా పండుగల సీజన్ మెరుగ్గా ఉంటే 12-15 శాతం మేర అధిక

వీటికి డిమాండ్..

అమ్మకాలు కొనసాగుతాయని, కార్ల విక్రయాల్లో వృద్ధి 20 శాతం మేర ఉంటుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దీపావళి వరకు కొనసాగే పండుగల సీజన్‌కు అమ్మకాలు తీరు ఎలా ఉంటాయన్నది ఓనమ్ సమయంలో డిమాండ్ తెలియజేస్తుంటుంది. గతేడాది ఆటో అమ్మకాల బేస్ అధిక స్థాయిలో ఉండడంతో, ఈ ఏడాది విక్రయాలు తక్కువగా ఉండొచ్చన్న అంచనా సైతం నెలకొంది. గడిచిన కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న డిమాండ్‌కు ప్రస్తుత పండుగల సీజన్ అమ్మకాలు సానుకూల సంకేతాలిస్తున్నట్టు మారుతి సుజుకీ పార్థా బెనర్జీ పేర్కొన్నారు. ఈ పండుగల సీజన్ స్కూటర్లు, మోటారు సైకిళ్లకు ఉత్తమంగా నిలిచిపోతుందని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ డైరెక్టర్ యోగేష్ మాథుర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ ఇంకా పుంజుకోవాల్సి ఉందంటూ, ఇప్పటి వరకు కనిపిస్తున్న సంకేతాలు సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో నెలవారీ సగటున 3.30 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదు కాగా, పండగుల సీజన్‌లో 15 శాతం మేర అమ్మకాలు పెరుగుతాయని ఆటోమొబైల్ పరిశ్రమ అంచనాతో ఉంది. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర పరిశ్రమలకు ఏటా పండగుల సీజన్ అమ్మకాల పరంగా ఎంతో కీలకం కావడం తెలిసిందే.

మహీంద్రా వాణిజ్య వాహనం 'వీరో'

ధర రూ. 7.99 లక్షల నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) సంస్థ తాజాగా 3.5 టన్నుల లోపు తేలికపాటి వాణిజ్య వాహన (ఎల్‌సీవీ) విభాగంలో 'వీరో'ను ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 7.99 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో డీజిల్ వెర్షన్ లీటరుకు 18.4 కి.మీ., సీఎన్‌జీ వేరియంట్ కేజీకి 19.2 కి.మీ. మైలేజీనిస్తుంది. ఎల్‌సీవీ విభాగంలో తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ నక్రా తెలిపారు. రూ. 900 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన కొత్త అర్బన్ ప్రాస్పర్ ప్లాట్‌ఫాంపై దీన్ని రూపొందించినట్లు ఆయన చెప్పారు. త్వరలోనే ఎలక్ట్రిక్ వెర్షన్‌ను కూడా ప్రవేశపెడతామని వివరించారు. తమకు 3.5 టన్నుల లోపు ఎల్‌సీవీ సెగ్మెంట్‌లో 51 శాతం, 2-3.5 టన్నుల సెగ్మెంట్‌లో 63 శాతం వాటా ఉందని నక్రా చెప్పారు. దీన్ని మరింత పెంచుకునేందుకు వీరో సహాయపడుతుందని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 2-3.5 టన్నుల విభాగంలో స్వల్పంగా అమ్మకాలు క్షీణించాయని, 2 టన్నుల లోపు సెగ్మెంట్‌లో 12 శాతం క్షీణత నమోదైందని ఆయన పేర్కొన్నారు. అయితే, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు పుంజుకోవడం ప్రారంభమైందని, ఈ సానుకూలత చిన్న వాణిజ్య వాహనాల విభాగంలో కూడా కనిపించవచ్చని నక్రా చెప్పారు.

స్టార్టప్‌ల కోసం 'భాస్కర్' ఆవిష్కరణ



న్యూఢిల్లీ: అంకుర సంస్థలు, ఇన్వెస్టర్లు తదితర వర్గాలకు కేంద్ర హబ్‌గా ఉపయోగపడే భారత్ స్టార్టప్ నాలెడ్జ్ యాక్సెస్ రిజిస్ట్రీ (భాస్కర్)ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి పియుష్ గోయల్ తెలిపారు. స్టార్టప్‌లు, మదుపరులు, సర్వీస్ ప్రొవైడర్లు, ప్రభుత్వ శాఖలు పరస్పరం సహకరించుకోవడానికి, ఆలోచనలు పంచుకోవడానికి ఈ పోర్టల్ ఒక వేదికగా ఉపయోగపడగలదని మంత్రి చెప్పారు. ఇందులో రిజిస్టర్ చేసుకునేవారికి ప్రత్యేకంగా భాస్కర్ (BHASKAR) ఐడీ కేటాయిస్తారు. వనరులు, భాగస్వాములు, అవకాశాల వివరాలను యూజర్లు సులువుగా పొందేందుకు, వేగవంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడేలా ఇందులో సెర్చ్ ఫీచరును శక్తిమంతంగా తీర్చిదిద్దారు. స్టార్టప్ ఇండియా కింద చేపట్టే అన్ని కార్యక్రమాలు, సంస్థలను ఒకే గొడుగు కిందికి తెచ్చే విధంగా కంపెనీల చట్టంలోని సెక్షన్ 8 కింద లాభాపేక్షరహిత కంపెనీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. ఇన్వెస్ట్ ఇండియా తరహాలో పరిశ్రమ వర్గాల పర్యవేక్షణలోనే ఉండే ఈ సంస్థలో నేషనల్ స్టార్టప్ అడ్వైజరీ కౌన్సిల్ కూడా భాగమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అటు, భాస్కర్ పోర్టల్‌ను మరింత పటిష్టంగా మార్చేందుకు పరిశ్రమవర్గాలన్నీ ముందుకు రావాలని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 1,46,000 పైచిలుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన అంకురాలు ఉండగా రాబోయే రోజుల్లో వీటి సంఖ్య 50 లక్షలకు పెంచే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వివరించారు. వచ్చే ఏడాది జనవరి 16 నాటికి దేశంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక స్టార్టప్ ఉంటుందని భాటియా చెప్పారు.

ఐకియా 365 రోజుల ఎక్స్ఛేంజ్ పాలసీ

న్యూఢిల్లీ: కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో హోమ్ ఫర్నిషింగ్స్ సంస్థ ఐకియా ఇండియా తాజాగా 365 రోజుల వరకు వర్తించే ఎక్స్ఛేంజ్, రిటర్న్ పాలసీని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఐకియాలో హోమ్ ఫర్నిచర్, ఫర్నిషింగ్ యాక్సెసరీలను కొనుగోలు చేసిన కస్టమర్లు తమ మనస్సు మార్చుకున్న పక్షంలో వాటిని ఒరిజినల్ ప్యాకేజింగ్ స్థితిలోనైనా లేదా అసెంబుల్ చేసిన స్థితిలోనైనా స్టోర్‌లో వాపసు చేయొచ్చు లేదా ఎక్స్ఛేంజ్ చేసుకోవచ్చు. ఇందుకోసం హోమ్ కలెక్షన్ సర్వీసును కూడా అందిస్తున్నట్లు సంస్థ కంట్రీ కస్టమర్ మేనేజర్ అలెక్జాండ్రా షెస్టాకోవా తెలిపారు.



రూ. 5 వేల కోట్లకు ఆడియో డివైజ్‌ల మార్కెట్

న్యూఢిల్లీ: దేశీయంగా ఆడియో డివైజ్‌ల ఆఫ్‌లైన్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందుతోంది. జూన్‌తో ముగిసిన పన్నెండు నెలల వ్యవధిలో మూవింగ్ యాన్యువల్ టర్నోవర్ (ఎంఏటీ) ప్రాతిపదికన 32 శాతం పెరిగి రూ. 3,400 కోట్ల నుంచి రూ. 5,000 కోట్ల స్థాయికి చేరింది. మరింత మెరుగైన అనుభూతినిచ్చే సౌండ్ టెక్నాలజీలు రావడం, వ్యక్తిగత-గృహ కేటగిరీల్లో అత్యంత నాణ్యమైన ఆడియో ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం వంటి అంశాలు ఈ విభాగ వృద్ధికి తోడ్పడుతున్నాయి. పర్సనల్ ఆడియో సెగ్మెంట్‌లో అమ్మకాల పరిమాణం 61 శాతం మేర పెరిగింది. గ్లోబల్ మార్కెట్, కన్జూమర్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎన్ఐక్యూలో భాగమైన జీఎఫ్‌కే రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఆడియో డివైజ్‌లపై భారతీయ వినియోగదారుల్లో ఆసక్తి భారీగా పెరిగింది. సినిమాటిక్ అనుభూతిని పొందేందుకు, సౌకర్యవంతంగా వినేందుకు వారు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్లో ఇప్పటికీ కాంపాక్ట్ స్టీరియో సిస్టమ్స్ ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ, హోమ్ థియేటర్, స్మార్ట్ ఆడియో విభాగాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నాయి. జెన్ జెడ్ కస్టమర్లకు హెడ్‌ఫోన్లు, హెడ్‌సెట్లు, మినీ/బ్లూటూత్ స్పీకర్లు తప్పనిసరి డివైజ్‌లుగా మారాయి. పాడ్‌కాస్ట్‌లు, ఆడియో సిరీస్‌ల్లాంటి కొత్త రకం కంటెంట్ ఫార్మాట్లు పెరుగుతుండటం కూడా ఈ ఉత్పత్తులకు దన్నుగా ఉంటోంది.



నివేదికలోని మరిన్ని విశేషాలు..

- వైర్‌లెస్, ట్రూ వైర్‌లెస్ డివైజ్‌లకు, నాయిస్ క్యాన్సిలేషన్, వాయిస్ అసిస్టెంట్ ఇంటిగ్రేషన్ వంటి అధునాతన ఫీచర్లకు డిమాండ్ పెరిగింది. సగటు అమ్మకం ధర సుమారు 18 శాతం తగ్గింది.
- పర్సనల్ ఆడియో సెగ్మెంట్‌లో ట్రూ వైర్‌లెస్ హెడ్‌సెట్స్‌కి గణనీయమైన ఆదరణ నెలకొంది. దీంతో ఈ విభాగంలో వాటి వాటా 38 శాతానికి పెరిగింది.
- మినీ/బ్లూటూత్ స్పీకర్ల అమ్మకాలు 15 శాతం వృద్ధి చెందాయి. రూ. 2,000 వరకు ధర ఉండే ఎంట్రీ లెవెల్ ప్రోడక్టుల విక్రయాలు 3 శాతం పెరిగాయి.
- లౌడ్‌స్పీకర్ అమ్మకాలు 24 శాతం వృద్ధి చెంది రూ. 1,100 కోట్లకు చేరాయి. ఇందులో సౌండ్ బార్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 70 శాతం అమ్మకాలు బడా రిటైల్ చెయిన్ల ద్వారా ఉంటున్నాయి. ఇందులోనూ సౌత్ జోన్‌లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలు లౌడ్‌స్పీకర్ల డిమాండ్‌కి హాట్‌స్పాట్లుగా మారాయి. చిన్న పట్టణాలు, నగరాల్లో అమ్మకాలకు ఈ విభాగంలోని విక్రయాల్లో దాదాపు 30 శాతం వాటా ఉండటమనేది, మెట్రోపాలిటన్‌యేతర ప్రాంతాల్లో కూడా ఈ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను సూచిస్తోంది.

రైతు సంక్షేమంపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ దృష్టి

సీఎస్ఆర్‌లో భాగంగా వారి ఆదాయాల పెంపునకు ప్రయత్నం

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)- 'పరివర్తన్'లో భాగంగా 2025 నాటికి సంవత్సరానికి రూ. 60,000 కంటే తక్కువ సంపాదించే 5 లక్షల మంది సన్నకారు రైతుల ఆదాయాన్ని పెంపునకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ''గ్రామీణాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడం అంటే స్థిరమైన వృద్ధిని పెంపొందించడమే. అలాగే బలహీన వర్గాల ఆర్థిక స్థితిగతులను పెంచడానికి సంబంధించి మా నిరంతర నిబద్ధతను మా కార్యక్రమాలు ప్రతిబింబిస్తాయి. 2014లో ప్రారంభమైనప్పటి నుండి, 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలలో క్రియాశీలకంగా ఉన్న భారతదేశపు అతిపెద్ద సీఎస్ఆర్ కార్యక్రమాలలో పరివర్తన్ ఒకటిగా ఎదిగింది'' అని బ్యాంక్ డిప్యూటీ. మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ ఎం భారుచా అన్నారు. భారత్‌లోని సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలనే లక్ష్యంతో 2014లో ప్రారంభమైన హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ 'పరివర్తన్' తన లక్ష్య సాధనలో పురోగమిస్తోందని ఆయన అన్నారు. ఆయన తెలిపిన మరిన్ని అంశాలను పరిశీలిస్తే..



- గత దశాబ్ద కాలంలో రూ. 5,100 కోట్లకు పైగా సీఎస్ఆర్ వ్యయంతో 'పరివర్తన్' కింద స్థిరమైన జీవనోపాధిని సృష్టించడం, అభివృద్ధిని పెంపొందించడం, జీవన ప్రమాణాలను పెంపొందించడం వంటి లక్ష్యాలను కొంతమేర బ్యాంక్ సాకారం చేసుకుంది.
- బ్యాంక్ తన సీఎస్ఆర్ చొరవ కింద దాదాపు 2 లక్షల మందికి స్వయం సమృద్ధిని పెంచడానికి నైపుణ్య శిక్షణను అందించాలని యోచిస్తోంది.
- 2 లక్షల ఎకరాలను నీటిపారుదల కిందకు తీసుకువచ్చి, సాగుకు అనువైనదిగా తీర్చి దిద్దడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, 25,000 మంది ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు విద్య అవకాశాలను మెరుగుపరచడం, ఇందుకు స్కాలర్‌షిప్‌లు వంటివి అందించడం వంటి కార్యకలాపాలను బ్యాంక్ యోచిస్తోంది.
- 17 ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) తొమ్మిదింటిని సాకారం చేయడానికి బ్యాంక్ తన ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. వీటిలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, అందరికీ ఆర్థిక సేవలు అందుబాటు వంటివి ఉన్నాయి.
- సమాజ ఆర్థిక శ్రేయస్సును ప్రతి బాధ్యతగల బ్యాంకింగ్ కోరుకుంటుంది. ఈ సూత్రానికి తన నిబద్ధతను బ్యాంక్ నిరంతరం ఉద్ఘాటిస్తుంది. దేశ నిర్మాణానికి దోహదపడే కార్యకలాపాలు చేపట్టేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కట్టుబడి ఉంది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 945.31 కోట్లను తన కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వెచ్చించింది. ఇది అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు రూ. 125 కోట్లు అధికం.
- కంపెనీల చట్టం 2013 ప్రకారం, సీఎస్ఆర్ నిబంధనలు వర్తించే ప్రతి కంపెనీ ప్రతి ఆర్థిక సంవత్సరంలో కనీసం మూడు ఆర్థిక సంవత్సరాల్లో సంపాదించిన దాని సగటు నికర లాభాలలో కనీసం 2 శాతం ఖర్చు చేసేలా చూసుకోవాలి.
- బ్యాంక్ నికర లాభం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.44,109 కోట్లుకాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ పరిమాణం 38 శాతం పెరిగి రూ.60,812 కోట్లకు చేరుకుంది. ఈ ప్రాతిపదికన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ దాదాపు రూ. 950 కోట్లు సీఎస్ఆర్ కింద వ్యయం చేయాల్సి ఉంది.

గ్రీన్ ఎకానమీ పురోగతికి ప్రాధాన్యం...

భారతదేశ జనాభాలో 65 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నందున, గ్రామాలలో ప్రజల శ్రేయస్సు, జీవనోపాధి దేశ సమగ్ర అభివృద్ధికి కీలకమని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హెడ్ (సీఎస్ఆర్) నుస్రత్ పఠాన్ అన్నారు. బ్యాంక్ తన కార్యక్రమాలకు గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ప్రస్తుతం 70 శాతం బ్యాంక్ సీఎస్ఆర్ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లోనే అమలవుతున్నాయని వెల్లడించారు. 2031-32 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా మారేందుకు బ్యాంక్ తన వంతు కృషి చేస్తుందని వివరించారు. ఈ చొరవలో భాగంగా పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడంపై దృష్టి పెడుతుందని అన్నారు. గ్రీన్ ఇనిషియేటివ్‌లో భాగంగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్యాంక్ తన మొట్టమొదటి ఫైనాన్స్ బాండ్ ఇష్యూ ద్వారా 300 మిలియన్ డాలర్లను సేకరించిందని ఆయన చెప్పారు. సూక్ష్మ, లఘు, చిన్న మధ్య తరహా (ఎంఎస్ఎంఈ)లు, ఈవీలుసహా గ్రీన్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు.

బోనస్ షేర్ల జారీ ఇక స్పీడ్

సెబీ తాజా మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లలో కంపెనీలు ప్రకటించే బోనస్ షేర్లకు సంబంధించి ట్రేడింగ్, షేర్ల కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నడుం బిగించింది. ఇందుకు తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 1నుంచి అమల్లోకి రానున్న నిబంధనల ప్రకారం ఇకపై రికార్డ్ డేట్ తదుపరి రెండో పనిదినం(టీ+2) బోనస్ షేర్లలో ట్రేడింగ్‌కు అనుమతిస్తారు. అన్ని బోనస్ ఇష్యూలకూ 2024 అక్టోబర్ 1నుంచి తాజా నిబంధనలు అమల్లోకిరానున్నాయి. బోనస్ ప్రతిపాదించే కంపెనీలు బోర్డ్ ఓకే చేసిన తదుపరి ఐదు పనిదినాల్లోగా స్టాక్ ఎక్స్ఛేంజీ నుంచి సూత్రప్రాయ అనుమతిని పొందవలసి ఉంటుంది. రికార్డ్ డేట్ తదుపరి రోజు(టీ+1) షేర్ల కేటాయింపును వెల్లడించవలసి ఉంటుంది.



ఎగుమతులకు కఠిన సవాళ్లు

- రవాణా చార్జీల పెరుగుదల
- కంటెయినర్ల కొరత
- గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ సంస్థ ఆందోళన

న్యూఢిల్లీ: రవాణా చార్జీలు పెరుగుతుండడం, అదే సమయంలో కంటెయినర్ల కొరత , ప్రధాన షిప్పింగ్ కేంద్రాలపై ఆధారపడడం ఇవన్నీ దేశ ఎగుమతులకు సవాళ్లుగా పరిణమించినట్టు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సవాళ్ల పరిష్కారానికి కొన్ని సూచనలు చేసింది. దేశీయంగా కంటెయినర్ల తయారీని పెంచడం, స్థానిక షిప్పింగ్ కంపెనీల పాత్రను పెంచడం, దేశీ కంటెయినర్ల వినియోగాన్ని ప్రోత్సహించడం, స్థానిక షిప్పింగ్ సంస్థలను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి సూచించింది. స్థానికంగా కంటెయినర్ల తయారీతోపాటు భారత షిప్పింగ్ కంపెనీలను రవాణాకు వినియోగించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ సమస్యలను అధిగమించొచ్చని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు. 2022 నుంచి 2024 మధ్య 40 అడుగుల కంటెయినర్ షిప్పింగ్ రేట్లు గణనీయంగా పెరిగిన విషయాన్ని జీటీఆర్ఐ ప్రస్తావించింది. 2022లో సగటున 4,942 డాలర్లుగా ఉంటే, 2024లో 4,775 వద్ద స్థిరపడినట్టు, కరోనాకు ముందు 2019లో ఉన్న 1,420 డాలర్లతో పోల్చితే ఇప్పటికీ చాలా ఎక్కువ స్థాయిలోనే ఉన్నట్టు తెలిపింది. ''పెరిగిన రేట్లు గరిష్టాల్లోనే కొనసాగడం సరఫరా వ్యవస్థ సవాళ్లను సూచిస్తోంది. ఇవి అంతర్జాతీయ వాణిజ్యానికి భారంగా మారాయి'' అని శ్రీవాస్తవ తెలిపారు. పోర్టులు రద్దీగా మారడం, రెడ్‌సీ అవరోధాలు అంతర్జాతీయంగా కంటెయినర్ల కొరతకు కారణాలుగా పేర్కొన్నారు. రానున్న నెలల్లో యూఎస్-చైనా వాణిజ్య యుద్ధం రూపంలో భారత ఎగుమతిదారులు కొత్త సమస్యలను ఎదుర్కోవచ్చని జీటీఆర్ఐ ఆందోళన వ్యక్తం చేసింది. చైనా-యూఎస్ వాణిజ్య యుద్ధం, ఇతర భౌగోళిక సమస్యల ప్రభావాన్ని అధిగమించేందుకు భారత్ కంటెయినర్ల తయారీని ప్రోత్సహించాలని, దేవీ షిప్పింగ్ పరిశ్రమపై మరిన్ని పెట్టుబడులు పెట్టాలని సూచించింది.



మానసిక దృఢత్వం కీలకం

ఆఖరి ఓవర్లలో ప్రదర్శన మెరుగవ్వాలి

నిలకడ కొనసాగించడంపై కసరత్తు

భారత మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్



ముంబై: మానసిక స్థయిర్యం సాధించేందుకు మహిళా భారత మహిళా క్రికెటర్లు కసరత్తు చేస్తున్నారని జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. మహిళల టి20 ప్రపంచకప్‌నకు ముందు జట్టు శారీరక ఫిట్‌నెస్‌తో పాటు మానసిక దృఢత్వం కూడా అంతే ముఖ్యమైందని ఆమె వివరించింది. భారత మహిళల జట్టు కొన్నేళ్లుగా ఫైనల్ మెట్టుపై చతికిలబడుతోంది. 2020 మెగా ఈవెంట్‌లో టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన అమ్మాయిల జట్టు టైటిల్ పోరులో కంగుతిని రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 'చాలా రోజులుగా మేమంతా మానసిక సంసిద్ధతపై దృష్టి పెట్టాం. మ్యాచ్‌ల్లో ఎప్పుడైనా చివరి మూడు, నాలుగు ఓవర్ల ఆట చాలా ప్రభావాన్ని చూపిస్తోంది. నిజానికి టి20 క్రికెట్ అందరు అనుకున్నట్లు పొట్టి ఫార్మాట్ కానేకాదు. ఆ రోజు 40 ఓవర్ల మ్యాచ్ జరుగుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మేం ఆఖరి నాలుగైదు ఓవర్లు మానసిక పట్టుదలను కనబరిస్తే మ్యాచ్‌లు గెలవచ్చు. ఈ ఓవర్లే ఫలితాలను తారుమారు చేస్తున్నాయి. అక్కడిదాకా వచ్చి చతికిలబడటం చాలా నిరాశను మిగులుస్తోంది. అందుకే అలాంటి సమయంలో నిలకడను కొనసాగించేందుకు ఈసారి మెంటల్ ఫిట్‌నెస్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం' అని హర్మన్‌ప్రీత్ తెలిపింది. ఇకపై అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్త వహిస్తామని చెప్పింది. జట్టులో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లతో కలిసి ఆడటం వల్ల విభిన్న సంస్కృతులు తెలుసుకునేందుకు, ఏదైనా కొత్త విషయాలు నేర్చుకునేందుకు అవకాశముంటుందని హర్మన్ చెప్పుకొచ్చింది. 2017 వన్డే ప్రపంచకప్‌లోనూ ఇంగ్లండ్‌తో భారత్ తుదిమెట్టుపై దాదాపు గెలిచే స్థితిలో ఉండి... అనూహ్యంగా 9 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. రెండేళ్ల క్రితం జరిగిన 2022 కామన్వెల్త్ క్రీడల్లోనూ ఆస్ట్రేలియా చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి స్వర్ణాన్ని సమర్పించుకొని... రజతంతో సరిపెట్టుకుంది. యూఏఈ ఆతిథ్యమిస్తున్న మెగా ఈవెంట్ అక్టోబర్ 3 నుంచి 20 వరకు షార్జా, దుబాయ్ వేదికలపై జరుగుతుంది. ఈ టోర్నీలో భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఆరుసార్లు విజేత, డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, పాకిస్తాన్, శ్రీలంక, న్యూజిలాండ్‌లో ఈ గ్రూపులోనే ఉన్నాయి. భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌ను అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో ఆడుతుంది. లీగ్ దశలోని మొదటి మూడు మ్యాచ్‌ల్ని దుబాయ్‌లో ఆడనున్న భారత్... ఆసీస్‌తో జరిగే ఆఖరి మ్యాచ్‌ను షార్జాలో 13వ తేదీన ఆడుతుంది. నిజానికి ఈ మెగా ఈవెంట్ బంగ్లాదేశ్‌లో జరగాల్సింది. కానీ అక్కడ నెలకొన్న రాజకీయ అనిశ్చితి, హింసాత్మక ఘటనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వేదికను యూఏఈకి మార్చింది.

రెజ్లర్ల ఆధ్వర్యంలో కొత్త లీగ్



సాక్షి మలిక్

సాక్షి మలిక్, గీతా ఫొగాట్‌ల ప్రణాళిక

దేశీయ రెజ్లర్లకు లబ్ధి కోసం నిర్వహణ

లీగ్‌ను ఆమోదించే ప్రసక్తే లేదన్న భారత రెజ్లింగ్ సమాఖ్య

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు... రెజ్లింగ్ లీగ్ నిర్వహించే ఏర్పాట్లలో ఉన్నారు. రెజ్లింగ్ చాంపియన్స్ సూపర్ లీగ్ (డబ్ల్యూసీఎస్ఎల్) పేరిట టోర్నమెంట్‌ను భారత్‌లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మాలిక్, అమన్ సెహ్రావత్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత గీతా ఫొగాట్ ఈ మేరకు లీగ్‌పై ప్రకటన చేశారు. అయితే 'ఆదిలోనే హంసపాదు'లా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) లీగ్‌కు మోకాలడ్డుతోంది. రెజ్లర్లు నిర్వహించాలనుకునే టోర్నీకి ఆమోదం ఇవ్వబోమని ప్రకటించింది. సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ కొన్ని నెలల క్రితం సాక్షి... బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లతో కలిసి ఢిల్లీ రోడ్లపై నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల బజరంగ్, వినేశ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వినేశ్ హరియాణా అసెంబ్లీ ఎన్నికలో బరిలో కూడా నిలిచింది. కానీ రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాత్రం రాజకీయాల్లో చేరలేదు. 'చాలా రోజులుగా ఈ లీగ్ కోసం నేను సాక్షి సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలోనే లీగ్‌కు తుదిరూపు తీసుకొస్తాం. అంతా అనుకున్నట్లు జరిగితే అప్పుడు క్రీడాకారులు మాత్రమే నిర్వహించే తొలి లీగ్‌గా రెజ్లింగ్ లీగ్ ఘనతకెక్కుతుంది. అయితే ఇప్పటివరకు సమాఖ్యతో మాట్లాడలేదు. కానీ ప్రభుత్వం, సమాఖ్య మాకు మద్దతు ఇస్తే బాగుంటుంది. పూర్తిగా రెజ్లర్ల ప్రయోజనాల కోసమే లీగ్ నిర్వహించబోతున్నాం' అని గీతా ఫొగాట్ తెలిపింది. ప్రపంచస్థాయి రెజ్లర్లు, కోచ్‌లు ఇందులో పాల్గొంటారని, దీని వల్ల దేశీయ రెజ్లర్లకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, అంతర్జాతీయ స్థాయి రెజ్లర్లతో తలపడే అనుభవం వారికి లభిస్తుందని ఆమె చెప్పింది. ఇదివరకే కెరీర్‌కు వీడ్కోలు చెప్పిన సాక్షి మలిక్ మళ్లీ ఈ లీగ్‌తో రెజ్లింగ్‌కు దగ్గరవడం ఆనందంగా ఉందని చెప్పింది. అంకితభావం, నిబద్ధతతో లీగ్ విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపింది. వేదికలు, ప్రైజ్‌మనీ, విధివిధానాలు తదితర అంశాలన్నీ త్వరలోనే వెల్లడిస్తామని గీత పేర్కొంది.

లీగ్‌కు గుర్తింపు లేదు

కానీ డబ్ల్యూఎఫ్ఐ వాదన మరోలా ఉంది. 'సమాఖ్య లీగ్‌కు ఆమోదం తెలపడం లేదు. మేం



గీతా ఫొగాట్

మూలనపడిన ప్రొ రెజ్లింగ్ లీగ్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. త్వరలోనే పట్టాలెక్కిస్తాం. కావాలంటే రెజ్లర్లు వారి లీగ్ నిర్వహించుకోవచ్చు. క్రీడకు ప్రాచుర్యం తేవొచ్చు. అయితే మా లీగ్‌ను వారి లీగ్‌తో కలువదు' అని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ తెలిపారు.

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు కొత్త కోచ్‌గా సంతోష్



న్యూఢిల్లీ: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) జాతీయ మహిళల జట్టుకు కొత్త కోచ్‌ను నియమించింది. ప్రస్తుతం హెడ్ కోచ్‌గా ఉన్న లాంగం చౌయిబా దేవిని తప్పించి ఆమె స్థానంలో సంతోష్ కశ్యప్‌కు బాధ్యతలు అప్పగించింది. సంతోష్ కశ్యప్ ఆధ్వర్యంలో భారత జట్టు అక్టోబర్ 17 నుంచి 30 వరకు నేపాల్‌లో జరిగే దక్షిణాసియా చాంపియన్‌షిప్‌లో పోటీపడుతుంది. 58 ఏళ్ల సంతోష్ కశ్యప్ గతంలో భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. మోహన్ బగాన్, ఐజ్వాల్ క్లబ్, ముంబై ఎఫ్‌సీ జట్లకు కోచ్‌గా కూడా పని చేశారు. అసిస్టెంట్ కోచ్‌లుగా పీవీ ప్రియా, రఘువీర్ ప్రవీణ్‌లను నియమించారు.

ఐఓసీ అధ్యక్ష రేసులో ఏడుగురు

- బరిలో జింబాబ్వే మహిళ
- ఇంగ్లండ్ మాజీ ఒలింపిక్ చాంపియన్ సెబాస్టియన్ కో కూడా పోటీ
- వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు



జెనీవా: ఇద్దరు మాజీ ఒలింపిక్ చాంపియన్లు, ఒక మిడిల్ ఈస్ట్ రాజు ఇలా ఏడుమంది అభ్యర్థులు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్ష పీఠంపై కన్నేశారు. ప్రస్తుత చీఫ్ థామస్ బాచ్ పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో మార్చిలో అధ్యక్ష ఎన్నికలకు ఇదివరకే నోటిఫికేషన్ ఇవ్వడంతో చివరకు ఏడుగురు రేసులో నిలిచారు. ఇందులో ఎన్నికైన అభ్యర్థి ఎనిమిదేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు పోటీలో 7 మంది ఉన్నట్లు ఐఓసీ సోమవారం ప్రకటించింది. జింబాబ్వేకు చెందిన మహిళ కిర్ కొవెంట్రీ అధ్యక్ష ఎన్నికల బరిలో ఉంది. ఈ జింబాబ్వే మాజీ స్విమ్మర్ ఒలింపిక్ చాంపియన్. 130 ఏళ్ల ఐఓసీ చరిత్రలో ఇప్పటి వరకు అంతా పురుషులే ఐఓసీని పాలించారు. ఒక వేళ మార్చిలో ఆమె గెలిస్తే ఐఓసీలో అధ్యక్ష పీఠాన్ని చేపట్టిన తొలి మహిళగా రికార్డుల్లోకెక్కుతుంది. బ్రిటన్‌కు చెందిన మిడిల్ డిస్టెన్స్ రన్నర్ సెబాస్టియన్ కో కూడా మాజీ ఒలింపిక్ చాంపియన్. ఆయనతో పాటు జోర్డాన్ రాజు ఫైజల్ అల్ హుసేన్ కూడా ఐఓసీ పీఠంపై ఆసక్తి కనబరిచారు. మరో నలుగురు బరిలో నిలువగా 111 మంది సభ్యులు గల కమిటీ వచ్చే మార్చిలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనుంది.

టి20ల్లో ఇంగ్లండ్‌పై ఐర్లాండ్ తొలి గెలుపు



ఒర్లా ప్రెండర్‌గాస్ట్

డబ్లిన్: ఐర్లాండ్ మహిళల క్రికెట్ జట్టు సమష్టి ఆటతీరుతో ఆకట్టుకుంది. ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగిన రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 1–1తో సమంగా ముగించింది. తొలి మ్యాచ్‌లో ఓడిన ఐర్లాండ్ రెండో మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. టి20ల్లో ఇంగ్లండ్ జట్టుపై ఐర్లాండ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. ఒర్లా ప్రెండర్‌గాస్ట్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఐర్లాండ్ గెలుపులో కీలకపాత్ర పోషించింది. ముందుగా ఇంగ్లండ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు సాధించింది. టామీ బ్యూమోంట్ (34 బంతుల్లో 40; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఐర్లాండ్ బౌలర్లలో ఒర్లా ప్రెండర్‌గాస్ట్, అర్లెన్ కెల్లీ, ఐమీ మెగూర్ రెండు వికెట్ల చొప్పున తీశారు. అనంతరం ఐర్లాండ్ జట్టు 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి గెలిచింది. ఒర్లా ప్రెండర్‌గాస్ట్ (51 బంతుల్లో 80; 13 ఫోర్లు) దూకుడుగా ఆడి ఐర్లాండ్ విజయంలో ముఖ్యపాత్ర పోషించింది.

నేటి నుంచి చైనా ఓపెన్

చాంగ్జౌ: ఈ ఏడాది చివరి వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీ చైనా ఓపెన్ నేడు మొదలుకానుంది. ఆరు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో భారత్ నుంచి అగ్రశ్రేణి క్రీడాకారులెవరూ పాల్గొనడం లేదు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన లక్ష్య సేన్, ప్రణయ్, పీవీ సింధులతో పాటు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి, అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీలు ఈ టోర్నీకి దూరంగా ఉన్నాయి. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జి... మహిళల సింగిల్స్‌లో సామియా ఇమాద్ ఫారూఖి, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ, రుతుపర్ణ–శ్వేతాపర్ణ జోడీలు... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి, సతీశ్ కుమార్–ఆద్యా జోడీలు పోటీపడుతున్నాయి. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో బ్రియాన్ యంగ్ (కెనడా)తో ప్రియాన్షు తలపడతాడు.

గోల్ఫర్ సాహిత్ రెడ్డికి నిరాశ



కాలిఫోర్నియా: ప్రాకోర్ **చాంపియన్‌షిప్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో** డిఫెండింగ్ చాంపియన్, భారత సంతతి అమెరికా గోల్ఫర్ తీగల సాహిత్ రెడ్డి ఈసారి టైటిల్ నిలబెట్టుకోలేకపోయాడు. ఈ టోర్నీలో సాహిత్ 12 అండర్ 276 పాయింట్లతో మరో నలుగురితో కలిసి సంయుక్తంగా ఐదో స్థానంలో నిలిచాడు. ప్యాటన్ కిజైర్ (అమెరికా) 20 అండర్ 268 పాయింట్లతో చాంపియన్‌గా అవతరించాడు. డేవిడ్ లిప్‌స్కీ (అమెరికా) రెండో స్థానంలో, ప్యాట్రిక్ ఫిష్‌బర్న్ (అమెరికా) మూడో స్థానంలో నిలిచారు. విజేతగా నిలిచిన ప్యాటర్ కిజైర్‌కు **10,80,000** డాలర్లు (రూ. 9 కోట్ల 5 **లక్షలు), రన్నరప్** లిప్‌స్కీకి 6,54,000 **డాలర్లు (రూ. 5 కోట్ల** 48 లక్షలు), సెకండ్ రన్నరప్ ఫిష్‌బర్న్‌కు 4,14,000 డాలర్లు (రూ. 3 కోట్ల 47 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. సంయుక్తంగా ఐదో స్థానంలో నిలిచిన తీగల సాహిత్ 1,76,100 డాలర్ల (రూ. 1 కోటి 47 లక్షలు) ప్రైజ్‌మనీని దక్కించుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన తీగల సాహిత్ తల్లిదండ్రులు 1980 దశకంలో అమెరికాకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. సాహిత్ అమెరికాలోనే పుట్టి పెరిగి గోల్ఫర్‌గా రాణిస్తున్నాడు.

మగ్ధలీనా మెరిసె...

కెరీర్‌లో తొలి డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్ గెలిచిన పోలాండ్ ప్లేయర్

మెక్సికో సిటీ: మహిళల టెన్నిస్‌లో పోలాండ్ నుంచి మరో కొత్త స్టార్ అవతరించింది. 26 ఏళ్ల మగ్ధలీనా ఫ్రెచ్ గ్వాడలహారా ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో విజేతగా నిలిచింది. మగ్ధలీనా కెరీర్‌లో ఇదే తొలి డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. ఫైనల్లో మగ్ధలీనా 7–6 (7/5), 6–4తో ఒలివియా గడెస్కి (ఆస్ట్రేలియా)పై విజయం సాధించింది. 2001 తర్వాత పోలాండ్ నుంచి డబ్ల్యూటీఏ టైటిల్ నెగ్గిన నాలుగో క్రీడాకారిణిగా మగ్ధలీనా గుర్తింపు పొందింది. గత 23 ఏళ్లలో మగ్డా లినెట్టి, అగ్నెస్కా రద్వాన్‌స్కా, ఇగా స్వియాటెక్ ఈ ఘనత సాధించారు. స్వియాటెక్ కొంతకాలంగా మహిళల టెన్నిస్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా ఉంది. గ్వాడలహారా ఓపెన్‌లో టైటిల్ నెగ్గిన మగ్ధలీనా 11 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 32వ ర్యాంక్‌కు చేరుకుంది. మగ్ధలీనాకు 1,42,000 డాలర్ల (రూ. 1 కోటి 11 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



రెండు అవార్డులు శ్రీలంక క్రికెటర్లకే

ఐసీసీ 'ప్లేయర్స్ ఆఫ్ ద మంత్'గా వెలలాగే, హర్షిత ఎంపిక






దుబాయ్: శ్రీలంక క్రికెటర్లు దునిత్ వెలలాగే, హర్షిత సమరవిక్రమలు ఆగస్టు నెలకుగాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్స్ ఆఫ్ ద మంత్' అవార్డులకు ఎంపికయ్యారు. ఇలా ఒకే దేశానికి చెందిన పురుష, మహిళా క్రికెటర్లకు అవార్డులు రావడం ఇది రెండోసారి మాత్రమే. గత జూన్‌లో భారత క్రికెటర్లు బుమ్రా, స్మృతి మంధానలు కూడా 'ఐసీసీ ప్లేయర్స్ ఆఫ్ ద మంత్' అవార్డులకు ఎంపికయ్యారు. ఆగస్టులో లంకలో పర్యటించిన భారత్ వన్డే సిరీస్‌ను 0–2తో కోల్పోయింది. ఈ సిరీస్‌లో ఆల్‌రౌండర్ వెలలాగే రాణించాడు. బ్యాటింగ్‌లో (67 నాటౌట్, 39, 2) మూడు ఇన్నింగ్స్‌లో ఒక అర్ధసెంచరీ చేసిన వెలలాగే బౌలింగ్‌లో 7 వికెట్లు తీశాడు. మూడో వన్డేలో 5/27తో చెలరేగాడు. దీంతో పురుషుల కేటగిరీలో వెలలా... దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్, వెస్టిండీస్ సీమర్ జేడెన్ సీలెస్‌లను వెనక్కినెట్టి అవార్డుకు ఎంపికయ్యాడు. మహిళల కేటగిరీలో హర్షిత ఐర్లాండ్ పర్యటనలో అదరగొట్టింది. రెండు టి20ల్లో 151 పరుగులు చేసిన ఆమె మూడు వన్డేల్లో 172 పరుగులు సాధించింది. ఇందులో ఒక సెంచరీ (105) కూడా ఉంది. హర్షిత సమరవిక్రమ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'కు ఎంపికైన రెండో లంకన్ ప్లేయర్. గతంలో కెప్టెన్ చమరి ఆటపట్టు ఈ ఏడాది మే, జూలై నెలల్లో ఈ అవార్డుకు ఎంపికైంది.

ఉగ్రవాదాన్ని పాతిపెడతాం

- ఇంకెవ్వరూ దానికి పునరుజ్జీవం కల్పించలేరు
- జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రచారంలో అమిత్ షా వ్యాఖ్య



గులాబ్‌గఢ్/కిష్ట్వార్: మళ్లీ కోలుకోనంతగా ఉగ్రవాదాన్ని బీజేపీ ప్రభుత్వం పాతాళంలోకి పాతిపెట్టనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలోని పెదర్–నగ్‌సేని నియోజకవర్గ పరిధిలో సోమవారం గులాబ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ ప్రసంగించారు. ''1990దశకం నుంచి ఉగ్రవాదంతో కష్టాలుపడుతున్న జమ్మూ కశ్మీర్ ప్రజలకు ఈరోజు మాట ఇస్తున్నా. మళ్లీ ఈ గడ్డపై కనిపించనంత లోతుల్లో ఉగ్రవాదాన్ని మా ప్రభుత్వం పాతిపెడుతుంది. ఇక్కడ తమ ప్రభుత్వం ఏర్పాటైతే జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడుదలచేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) కాంగ్రెస్ పార్టీలు హామీ ఇచ్చాయి. మచియాల్ మాత సాక్షిగా చెబుతున్నా. భారతగడ్డపై ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే సాహసం ఇంకెవ్వరూ చేయరు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు గ్రామ రక్షణ గార్డులు, స్పెషల్ పోలీస్ అధికారులకు పాతరకం .303 రైఫిళ్ల స్థానంలో అధునాతన ఆయుధాలిచ్చాం. ఎక్కడి నుంచైనా ఇక్కడికి ఉగ్రవాదులొస్తే వారి కథ ఇక్కడి మంచుకొండల్లో ముగిసిపోతుంది'' అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీ, కాంగ్రెస్‌లపై అమిత్ విమర్శలుచేశారు. '' డోగ్రాల చివరి రాజు మహారాజా హరిసింగ్‌ను వీళ్లు అవమానించారు. కశ్మీరీ పండిట్లు బలవంతంగా వెళ్లిపోవడానికి కారణం వీళ్లే. వీళ్లు మహిళ హక్కులను లాగేసుకున్నారు. అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కకుండా చేశారు'' అని ఆరోపించారు. '' రువ్వేందుకు రాళ్లు పట్టుకున్న యువతకు జైళ్లు సిద్ధంగా ఉన్నాయి. అలాగే ల్యాప్‌టాప్‌లు, త్రివర్ణపతాకం పట్టుకున్న యువతకు ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయి' అని షా అన్నారు.

రాహుల్ కశ్మీర్‌లో ఐస్‌క్రీమ్ తినొచ్చు

రామ్‌బాన్‌లో జరిగిన ర్యాలీలోనూ అమిత్ మాట్లాడారు. '' కశ్మీర్‌ను ఎన్‌డీఏ సర్కార్ సురక్షితమైన ప్రాంతంగా మార్చేసింది. అయితే ఇటీవల రాహుల్ ఇక్కడి కొచ్చి లాల్‌చౌక్‌లో ఐస్‌క్రీమ్ తిన్నారు. బైక్ నడిపారు. పైగా మా ప్రభుత్వాన్నే విమర్శిస్తున్నారు. రాహుల్ బాబా.. మీరు మమ్మల్ని విమర్శిస్తున్నారుగానీ ఇంతటి రక్షణ వాతావరణం మా వల్లే సాధ్యమైంది. మీ ప్రభుత్వాల్లో ఇది అసాధ్యం'' అని అన్నారు. కాంగ్రెస్ హయాంలో హోం మంత్రిగా ఉండి కూడా లాల్‌చౌక్ ప్రాంతానికి వెళ్లాలంటేనే భయపడేవాడినని కాంగ్రెస్ నేత సుశీల్‌కుమార్ షిండే చేసిన వ్యాఖ్యలను అమిత్ గుర్తుచేశారు. '' షిండే గారూ.. ఇప్పుడు పిల్లాజెల్లాతో వచ్చేయండి. ఎంచక్కా లాల్‌చౌక్‌లో వాకింగ్ చేయండి. మీకు హాని చేసేందుకు ఎవరూ సాహసించరు'' అని అమిత్ అన్నారు.

రైతులు, మహిళలకు సంక్షేమ పథకాలు

జమ్మూకశ్మీర్ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ హామీ

శ్రీనగర్: త్వరలో జరిగే జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సోమవారం మేనిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వస్తే రైతులు, మహిళలు, యువత కోసం పలు సంక్షేమ పథకాల ను అమలు చేస్తామని ప్రకటించింది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే అన్ని రకాల పంటలకు బీమా సౌకర్యం, యాపిల్‌కు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) కిలోకు రూ.72 అమలు చేస్తామంది. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రతినిధి పవన్ ఖేరా, పీసీసీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా మేనిఫెస్టోను విడుదల చేశారు.

కౌలు రైతులకు సాయం

భూమిలేని, కౌలుదార్లకు ఏటా అదనంగా రూ.4 వేల ఆర్థిక సాయం. రైతులకు సాగు భూములను 99 ఏళ్లకు లీజుకివ్వడం. సాగు భూములను 100 శాతం సాగులోకి తెచ్చేందుకు జిల్లా స్థాయి సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2,500 కోట్లతో నిధి ఏర్పాటు.

నిరుద్యోగ యువతకు..

జమ్మూకశ్మీర్‌లోని అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,500 చొప్పున ఏడాదిపాటు అలయెన్స్. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో జాబ్ క్యాలెండర్ విడుదల. ఖాళీగా ఉన్న లక్ష ప్రభుత్వ పోస్టుల భర్తీ. పోలీసు, ఫైర్, ఫారెస్ట్ పోస్టుల భర్తీకి ప్రత్యేక రిక్రూట్‌మెంట్ కార్యక్రమం. నిర్మాణ రంగ పనుల్లో నిరుద్యోగ ఇంజినీర్లకు 30 శాతం ఇచ్చే పథకం పునరుద్ధరణ. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ సమయంలో, పాస్‌పోర్టులు, ఇతర అవసరాల కోసం ధ్రువీకరణ పత్రాల పరిశీలన సులభతరం చేయడం.

మహిళలకు నెలకు రూ.3 వేలు

భారత్ జోడో యాత్ర సమయంలో రాహుల్ గాంధీ, ఇతర నేతలు ఇచ్చిన హామీల మేరకు మహిళా సమ్మాన్ కార్యక్రమం అమలు. ఇందులో భాగంగా కుటుంబ యజమాని అయిన మహిళకు నెలకు రూ.3 వేలు చొప్పున సాయం అందజేత. స్వయం సహాయక బృందాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణం. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మైనారిటీ కమిషన్ ఏర్పాటు. కశ్మీరీ పండిట్లకు పునరావాసం కల్పిస్తామంటూ గతంలో మాజీ ప్రధాని మన్మోహన్ ఇచ్చిన హామీ అమలు.

స్టాండింగ్ కమిటీల ఏర్పాటు కొలిక్కి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభకు సంబంధించి వివిధ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల కూర్పు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ పరిధిలోని 16, రాజ్యసభ పరిధిలోని 8 విభాగాల స్టాండింగ్ కమిటీల్లో తమకు కనీసంగా 5 కమిటీలకు ఛైర్మన్ పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తూ వచ్చింది. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు కాంగ్రెస్ నేతలు గౌరవ్ గొగోయ్, కె.సురేశ్, జైరాం రమేశ్ తదితరులతో చర్చించారు. 5 కమిటీలతో పాటు, కమిటీల్లో అత్యంత కీలకమైన హోంశాఖను కాంగ్రెస్ కోరింది. అయితే హోంశాఖను అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు. లోక్‌సభ స్టాండింగ్ కమిటీల్లో మూడింటికి ఓకే చెబుతూనే.. విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి– పంచాయతీ రాజ్, వ్యవసాయం వంటి కీలక విభాగాల స్టాండింగ్ కమిటీలకు కాంగ్రెస్ ఎంపీలను ఛైర్మన్‌లుగా నియమించేందుకు అంగీకరించింది. ఇక రాజ్యసభ కమిటీల్లో విద్యా శాఖను అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ వర్గాలు సోమవారం దీన్ని ధ్రువీకరించాయి.



పోలండ్ దక్షిణ ప్రాంత పట్టణం గ్లుచోలజీ వీధులను ముంచెత్తిన వరద



హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో నీట మునిగిన రోమన్ బీచ్




ఆస్ట్రియా రాజధాని వియన్నాలో పోటెత్తిన వరద



వరద నీటిలో దక్షిణ పోలండ్‌లోని రుడావా గ్రామం

వరదలతో యూరప్ అతలాకుతలం

ప్రేగ్: వరద బీభత్సం యూరప్‌ను వణికిస్తూనే ఉంది. బోరిస్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేని భారీ వర్షాలకు మధ్య, తూర్పు యూరప్‌లోని పలు దేశాలు అతలాకుతలమవుతున్నాయి. సోమవారం మరో నలుగురు వరదలకు బలయ్యారు. దాంతో వరద మృతుల సంఖ్య 17కు పెరిగింది. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. భారీ వర్షాలు ఆగకపోవడంతో దాంతో వరద ముప్పు మరింత పెరిగేలా కన్పిస్తోంది. చెక్ రిపబ్లిక్, ఆస్ట్రియా, పోలండ్, రొమేనియా, జర్మనీ, స్లొవేకియా, హంగరీ తదితర దేశాల్లో పట్టణాలు, నగరాలు భారీగా ముంపుకు గురవుతున్నాయి. నదులు ప్రమాద స్థాయిలను దాటి పొంగిపొర్లుతూ సమీప ప్రాంతాలను ముంచేస్తున్నాయి. కాలనీలకు కాలనీలే నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. చెక్ రిపబ్లిక్‌లో 90 చోట్లకు పైగా వరద హెచ్చరికలు సోమవారమూ కొనసాగాయి. వానల దెబ్బకు కరెంటు కోతలతో జనం అల్లాడిపోతున్నారు. పలు దేశాల పరిధిలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలున్నట్టు చెబుతున్నారు.



జర్మనీలోని గిర్లిట్జ్ జిల్లాలో ఉప్పొంగిన నీస్ నది



చెక్ రిపబ్లిక్‌లోని ఒస్ట్రావాలో నీట మునిగిన నివాసాలు



రొమేనియాలోని స్లాబోజియా గ్రామంలో వృద్ధుడిని రక్షిస్తున్న స్థానికులు

సందీప్ ఘోష్ మోసపూరిత సమాధానాలు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ పాలిగ్రాఫ్ టెస్ట్ సందర్భంగా కీలక ప్రశ్నలకు మోసపూరిత సమాధానాలిచ్చారని సీబీఐ ఆరోపించింది. ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సీబీఐ అధికారులు సెప్టెంబర్ 2న సందీప్ ఘోష్‌ను అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతి మేరకు విచారణ కోసం ఆయనపై పాలిగ్రాఫ్ టెస్ట్, లేయర్డ్ వాయిస్ అనాలిసిస్ జరిపింది. అయితే, కొన్ని ముఖ్యమైన అంశాలపై ఆయన మోసపూరితంగా వ్యవహరించినట్లు ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ అందించిన నివేదిక పేర్కొందని ఓ అధికారి తెలిపారు. పాలిగ్రాఫ్ పరీక్ష సందర్భంగా వెల్లడించిన సమాచారాన్ని సాక్ష్యంగా వాడుకోలేమని కూడా పేర్కొంది.

పోలియో టీకాలను రద్దు చేసిన తాలిబన్లు

దుబాయ్: అఫ్గానిస్తాన్‌లో పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తాలిబన్లు నిలిపివేసినట్లు ఐక్యరాజ్య సమితి తెలిపింది. అందుకు గల కారణాలను తాలిబన్ ప్రభుత్వం తెలపలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)ఉన్నతాధికారి ఒకరు సోమవారం వెల్లడించారు. టీకాలు వేయడానికి ఇంటింటికీ వెళ్లడానికి బదులుగా మసీదుల్లో వేయాలనే చర్చ జరిగినట్లు సమాచారముందన్నారు.

నైజీరియాలో 270 మంది ఖైదీల పరార్

మెయిదుగురి: నైజీరియాలో అకస్మాత్తు వరదలు ఖైదీలకు అనుకోని వరంగా అందివచ్చాయి. ఎగువ కురిసిన భారీ వర్షాలకు ఆనకట్ట తెగిపోవడంతో ఈశాన్య నగరమైన మెయిదుగురిని వరదలు ముంచెత్తాయి. వాటి ధాటికి స్థానిక జైలు గోడ ఆదివారం ఒకవైపు పాక్షికంగా కూలిపోయింది. దాంతో ఏకంగా 270 మంది ఖైదీలు తప్పించుకుని పారిపోయారు.

16 మంది పాలస్తీనియన్లు దుర్మరణం

జెరూసలేం: గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ బలగాలు జరిపిన తాజా దాడుల్లో నలుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు సహా మొత్తం 16 మంది ప్రాణాలు కోల్పోయారు. సెంట్రల్ గాజాలోని నుసెయిరత్ శరణార్థి శిబిరంపై సోమవారం ఉదయం జరిగిన దాడిలో ఓ నివాసం పూర్తిగా నేలమట్టమయ్యింది. ఘటనలో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు సహా 10 మంది చనిపోయారు. ఘటనలో మరో 13 మంది గాయపడినట్లు స్థానిక ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గాజా నగరంలోని ఓ ఇంటిపై జరిగిన మరో దాడిలో మహిళ, ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు మృతి చెందారు.

ట్రక్కు ఢీకొని కుటుంబంలో ఐదుగురు మృతి

సంభాల్(ఉత్తరప్రదేశ్): రోడ్డు పక్కన కూర్చుని ఉన్న వారిని పికప్ ట్రక్కు ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు చనిపోగా నలుగురు గాయపడ్డారు. వీరంతా ఒకే కుటుంబీకులు. ఈ ప్రమాదం ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లా భోపట్‌పూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు ఉదయం 6 గంటల సమయంలో రోడ్డు పక్కన కూర్చుని ఉన్నారు. అదే సమయంలో, గావా వైపు నుంచి అతి వేగంతో వచ్చిన ట్రక్కు వారిపైకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ఘటనలో ఒకే కుటుంబంలోని ఐదుగురు చనిపోగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

రెండు తెగల మధ్య కాల్పులు: 30 మంది బలి

మెల్‌బోర్న్: పపువా న్యూ గినియాలో బంగారు గని వివాదం రెండు తెగల మధ్య హింసకు కారణమైంది. పరస్పర కాల్పుల్లో 30 మంది మృతి చెందారు. దీంతో హింసను ఆపడానికి భద్రతా దళాలకు అత్యవసర అధికారాలు ఇచ్చారు. బహిరంగ ప్రదేశంలో ఆయుధం ఎత్తినా, మరో వ్యక్తిని బెదిరించినా కాల్చి చంపుతామని ఆ దేశ పోలీసు కమిషనర్ డేవిడ్ మానింగ్ హెచ్చరించారు. మద్యం అమ్మకాలపై నిషేధం, రాత్రిపూట కర్ఫ్యూ అమల్లో ఉందని ఆయన తెలిపారు. దేశంలోని సెంట్రల్ హైలాండ్స్‌లో ఉన్న పోర్గెరా బంగారు గని సమీపంలో సకార్, పియాండే గిరిజన తెగల మధ్య ఆగస్టులో భూ వివాదం చెలరేగింది. రెండు వర్గాల మధ్య శాంతి చర్చలు విఫలం కావడంతో ఆదివారం పరస్పరం దాడులకు దిగారు.



హిజాబ్‌ను ధిక్కరించి తలెత్తుకుని...

- మహసా అమీనీ రెండో వర్ధంతి సందర్భంగా ఇరాన్ వీధుల్లో మహిళల విహారం
- జైల్లో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టిన మహిళా ఖైదీలు

''గుమ్మానికి పరదా కట్టినట్టే అమ్మ ముఖానికి 'నఖాబ్' కట్టారు'' అంటూ ముస్లిం మహిళల జీవితాల్లోని దుఃఖాన్ని వినిపించారో కవయిత్రి. దుఃఖమో.. సంతోషమో.. హిజాబ్ చాటున దాచేది లేదని ఇరాన్ మహిళలు ఇప్పుడు తేల్చి చెబుతున్నారు. సోమవారం ఇరాన్‌లో పలువురు హిజాబ్‌లను తొలగించి స్వేచ్ఛగా వీధుల్లో సంచరించారు. ఇస్లామిక్ డ్రెస్‌కోడ్‌ను ధిక్కరించారనే కారణంతో 2022లో కుర్దిష్ మహిళ అయిన మహసా అమీనీని ఇరాన్ పోలీసులు అరెస్టు చేయడం, తరువాత ఆమె పోలీస్ కస్టడీలో మరణించడం తెలిసిందే. అయితే మహసా అమీనీ రెండో వర్ధంతి సందర్భంగా స్మారక సభను నిర్వహించాలని తల్లిదండ్రులు భావించగా.. పోలీసులు అందుకు అనుమతిని నిరాకరించారు. అంతేకాదు ఆమె తల్లిదండ్రులను బలవంతంగా గృహ నిర్బంధం చేశారు. అమీనీని ఖననం చేసిన సఖెజ్ నగరంలోని స్మశాన వాటికను సైతం మూసేశారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. ఇరాన్ మహిళలు మాత్రం ఆమెను స్మరించుకున్నారు. దేశ రాజధాని టెహ్రాన్ వీధుల్లో 'జిన్.. జియాన్.. ఆజాదీ'(స్త్రీ.. జీవితం.. స్వేచ్ఛ) నినాదాలు చేశారు. ఇక టెహ్రాన్‌లోని ఏవీఎన్ జైలులోని పలువురు మహిళా ఖైదీలు నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మహిళలతోనే తామూ ఉన్నామని చెబుతూ 34 మంది జైలు ఖైదీలునిరాహార దీక్ష చేశారు. వీరిలో ఇరాన్ ఉద్యమకారులు నర్గీస్ మొహమ్మదీ, వెరిషెహ్ మొరాది, మహబూబ్ రెజాయ్, పరివాష్ ముస్లి కూడా ఉన్నారు.

తీవ్రమైన అణచివేత..

1979లో కొత్త ప్రభుత్వం ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ ఏర్పాటయ్యాక ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఖొమేనీ ఆవిర్భవించారు. ఇస్లాం మత విలువలను తిరిగి అమల్లోకి తీసుకొచ్చారు. అందులో భాగంగా మహిళలకు హక్కులను కల్పించిన కుటుంబ రక్షణ చట్టాన్ని రద్దు చేశారు. నాటి నుంచి ఇస్లాం డ్రెస్‌కోడ్ పాటించని మహిళలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ధిక్కరించిన మహిళలను గాయపరిచిన, జరిమానాలు విధించిన ఘటనలు అనేకం. మహిళలపై నిరంతరం కెమెరాల నిఘా కొనసాగుతోంది. 2024 టెహ్రాన్ ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్‌లో మహిళలను పర్యవేక్షించడానికి ఏరియల్ డ్రోన్లను కూడా ఉపయోగించారంటే ఎంతటి నిఘా ఉందో అర్థం చేసుకోవచ్చు. హిజాబ్‌ను తిరస్కరిస్తున్న మహిళల సంఖ్య పెరగడాన్ని ప్రభుత్వం గుర్తించకపోగా.. అణచివేత చర్యలకు పాల్పడుతోంది.

ఎవరీ మహసా అమీనీ ?

2022లో ఇరాన్‌లో హిజాబ్ నియమాలను ఉల్లంఘించారనే నెపంతో సకెజ్ నగరానికి చెందిన కుర్దిష్ మహిళ 22 ఏళ్ల మహసా అమీనీని ఇరాన్ మొరాలిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. కస్టడీలో ఉన్న ఆమెను తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయి, కొద్దిసేపటికే కోమాలోకి వెళ్లిపోయారు. మూడు రోజుల తరువాత ఆమె ఆస్పత్రిలో ప్రాణాలు విడిచారు. కూతురును చూడటానికి అమీనీ తల్లిదండ్రులను కూడా అనుమతించలేదు. శవ పంచనామా నివేదిక అడిగినా నిరాకరించారు. మహసా అమీనీకి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అరెస్టు తరువాత ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిందని పోలీసులు చెప్పారు. డాక్టర్ కావాలని కలలు కన్న యువతి.. మరో వారం రోజుల్లో యూనివర్సిటీకి వెళ్లే ముందు వారం రోజులు తల్లిదండ్రులతో ఉందామని టెహ్రాన్‌కు వచ్చిన అమీనీ.. పోలీసుల చిత్రహింసలతో ప్రాణాలొదిలింది.



మహిళా సాధికారతే దేశానికి బలం

షిశక్తి సమ్మిట్–2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: దేశంలో మహిళల సాధికారతే ఆ దేశానికి నిజమైన బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఏ ప్రాంతంలో అయినా, ఎలాంటి సమయంలోనైనా మహిళలు అభద్రతకు లోనవకుండా, వారి పట్ల గౌరవం చూపేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మన దేశంలో మహిళల గౌరవాన్ని, గౌరవాన్ని కాపాడతామని, వారి పురోభివృద్ధికి కృషి చేస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓ వార్తా సంస్థ సోమవారం నిర్వహించిన షిశక్తి సమ్మిట్–2024లో రాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో మహిళల భద్రతకోసం కఠినమైన చట్టాలను తీసుకొచ్చామన్నారు. అయిన ప్పటికీ అభద్రతా భావం కొనసాగుతుండటం దురదృష్టకరమని, మహిళలను బలహీనులుగా భావించే సామాజిక సంకుచిత మనస్తత్వం, ఛాందసవాదానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేయాల్సిన అవసరముందని ఆమె నొక్కి చెప్పారు. సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా కొన్ని సామాజిక దురభిప్రాయాలు లోతుగా పాతుకుపోయాయని, ఇవి మహిళా సమానత్వానికి అవరోధాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. ''ఎక్కడ తప్పు చేశాం? మెరుగుపడటానికి మనం ఏమి చేయాలి?''అని మహిళలు నిరంతరం ప్రశ్నించుకోవాలని సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తి, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారని మహిళలను కొనియాడారు.

పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలి: సీజేఐ

చట్టం మాత్రమే న్యాయమైన వ్యవస్థను తయారు చేయలేదని, సమాజం మహిళల పట్ల తన మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం నొక్కి చెప్పారు. ప్రతిఒక్కరూ పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలని సూచించారు. మహిళల ప్రయోజనాలను పరిరక్షించడానికి విధానపరమైన, చట్టపరమైన నిబంధనలు అనేకం ఉన్నాయని, కానీ కఠినమైన చట్టాలే సమ సమాజాన్ని నిర్మించలేవన్నారు. మహిళలకు రాయితీలు ఇవ్వడం నుంచి స్వేచ్ఛగా, సమానంగా జీవించే హక్కు వారికుందనే విషయాన్ని గుర్తించే దిశగా మన మనస్తత్వాలు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల గురించి మాట్లాడటమంటే మొత్తం సమాజం మార్పు గురించి మాట్లాడినట్లని వ్యాఖ్యానించారు. తన జీవితంలోని కొన్ని గొప్ప పాఠాలను మహిళా సహోద్యోగుల నుంచే నేర్చుకున్నానని, మెరుగైన సమాజానికి మహిళల సమాన భాగస్వామ్యం ముఖ్యమని తాను నమ్ముతానని చెప్పారు. దేశం రాజ్యాంగాన్ని ఆమోదించకముందే ఇండియన్ ఉమెన్స్ చార్టర్ ఆఫ్ లైఫ్‌ను స్త్రీవాది అయిన హంసా మెహతా రూపొందించారని సీజే గుర్తు చేశారు.

మైకేల్ జాక్సన్ సోదరుడు టిటో జాక్సన్ కన్నుమూత

వాషింగ్టన్: పాప్ దిగ్గజం మైకేల్ జాక్సన్ సోదరుడు టిటో జాక్సన్ ఇక లేరు. ప్రఖ్యాత జాక్సన్5 పాప్ గ్రూప్ సభ్యుడైన 70 ఏళ్ల టిటో సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి కారణం తెలియరాలేదు. మైకేల్‌తో పాటు ఇతర సోదరులు జాకీ, జర్మైన్, మార్లోన్‌లతో కలిసి జాక్సన్5 పేరిట టిటో పలు పాప్ ప్రదర్శనలిచ్చారు. జాక్సన్5 ఖాతాలో ఏబీసీ, ద లవ్ యూ సేవ్, ఐ వాంట్ యూ బ్యాక్ వంటి పలు హిట్లున్నాయి. 1964లో ఏర్పాటైన ఈ గ్రూపు ప్రేక్షకులను ఉర్రూతలూపింది. 1980లో ప్రతిష్టాత్మక హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ అందుకుంది. 1997లో రాక్ అండ్ రోల్ హాలాఫ్ ఫేమ్‌లో చోటుచేసుకుంది. గ్రూప్‌లో టిటో వయోలిన్ వాయించేవారు. ఆయన చివరిదాకా ప్రదర్శనలిస్తూనే ఉన్నారు. సెప్టెంబర్ 10న జర్మనీలో తుది ప్రదర్శన ఇచ్చారు. టిటో ముగ్గురు కుమారులు కూడా 3టీ గ్రూప్ పేరిట పాప్ సంగీతంలో ప్రసిద్ధులే.

అన్ని పోటీపరీక్షలకు ఉపయోగపడే
ముఖ్యమైన కరెంట్ అఫైర్స్ కోసం..
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి...
మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి

కరెంట్ అఫైర్స్



గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం

అంతర్జాతీయం

అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్

స్పేస్‌ఎక్స్ 'పొలారిస్ డాన్' మిషన్ వ్యోమగాముల బృందం ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బిలియనీర్ జేరెడ్ ఐజాక్‌మ్యాన్ మొదట నడవగా.. ఆ తర్వాత స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సరహ్ గిల్లిస్ ఆయనను అనుసరించారు. అంతరిక్ష నడకను 30 నిమిషాల పాటు నిర్వహించారు. స్పేస్‌ఎక్స్ తలపెట్టిన 'పోలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా ఫాల్కన్-9 రాకెట్ ద్వారా సెప్టెంబర్ 10వ తేదీన ఐజాక్‌మాన్ సహా మొత్తం నలుగురు అమెరికాలోని ఫ్లోరిడా నుంచి అంతరిక్షంలోకి బయలుదేరారు.

బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతాదారుల సమావేశం

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా(బ్రిక్స్)దేశాల జాతీయ భద్రతాదారుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి మన జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. ఈ సంవత్సరం బ్రిక్స్ కూటమికి రష్యా అధ్యక్ష బాధ్యతలను నిర్వహిస్తోంది.

జాతీయం

పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్

కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాటు అమలు చేసిన ఫ్లాగ్‌షిప్ ఫేమ్ ప్రోగ్రామ్ స్థానంలో భారత్ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు రూ.10,900 కోట్లతో పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్నోవేటివ్ వెహికల్ ఎన్ హాన్స్‌మెంట్ పథకంపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ పథకం 24.79 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 3.16 లక్షల ఈ-త్రీ వీలర్స్, 14,028 ఈ-బస్సులకు సపోర్ట్ ఇవ్వనున్నది.

తొలి ఏరోస్పైక్ రాకెట్ ఇంజిన్‌ప్రయోగం

భారత తొలి ఏరో స్పైక్ రాకెట్ ఇంజిన్ ప్రయోగం విజయవంతమైంది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొపల్షన్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించారు. తొలుత అసాధారణ స్థితిలో ఉన్న ఇంజిన్ క్రమంగా స్థిరత్వాన్ని సాధించిందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ఇంజిన్ కోసం స్పేస్‌ఫీల్డ్స్.. టైటానియం గ్రేడ్ 5ని వినియోగించింది. ఈ ప్రయోగ విజయం భారత అంతరిక్ష సాంకేతికతలో ముఖ్య ఘట్టంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్

కేంద్ర ప్రభుత్వం, ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించడానికి పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ అనే కొత్త ప్రోగ్రాంను ప్రారంభించనుంది. ఈ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యం ఉన్నత స్థాయి పరిశోధనా సంస్థలను, పరిశోధనా సామర్థ్యం తక్కువగా ఉన్న సంస్థలతో అనుసంధానించడం ద్వారా ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనా సామర్థ్యాలను పెంచడం.

నోయిడాలో 'సెమీకాన్-2024' సదస్సు

సెప్టెంబర్ 11వ తేదీ నోయిడాలో 'సెమీకాన్-2024' సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలో సెమీ కండక్టర్ల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఈ రంగంలో భారీగా పెట్టుబడులు రాబట్టడానికి చర్యలు ప్రారంభించామన్నారు. ఇండియాలో ఎలక్ట్రానిక్స్ రంగం విలువ 150 బిలియన్ డాలర్లకు చేరిందని తెలిపారు. ఈ దశాబ్దం ఆఖరు నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 60 లక్షల కొత్త ఉద్యోగాలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ఈ రంగంలో వృద్ధితో సెమీకండక్టర్ రంగం లబ్ధి పొందుతుందని ఉద్ఘాటించారు. దేశంలో ఉపయోగించే ఎలక్ట్రానిక్స్ పరికరాలు వంద శాతం ఇక్కడే తయారు కావాలన్నదే తమ ధ్యేయమన్నారు.

70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా

దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వృద్ధుల ఆరోగ్య సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆదాయంతో నిమిత్తం లేకుండా వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) కింద రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 11వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు ప్రతిపాదనలను ఆమోదించింది. అర్హులైన లబ్ధిదారులకు త్వరలో కొత్త కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపింది. కుటుంబసభ్యులు ఏబీపీఎంజేఏవై కింద లబ్ధిదారులుగా ఉన్నా.. 70 ఏళ్లు, ఆపై వయసు కలిగిన సీనియర్ సిటిజన్లకు విడిగా ఏటా రూ.5 లక్షల ఆరోగ్యబీమా కల్పించనున్నారు. వృద్ధులు ప్రైవేట్ ఆరోగ్య బీమా పాలసీలు, ఈఎస్ఐ పథకంలో ఉన్నా ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 4.5 కోట్ల కుటుంబాల్లోని వృద్ధులకు మేలు చేకూరనుంది.

భారత్ బయోటెక్ నుంచి 'ఏవీ0328' వ్యాక్సిన్

భారత్ బయోటెక్ కంపెనీ మరో సరికొత్త వ్యాక్సిన్‌ను తయారు చేసేందుకు సిద్ధమైంది. యాంటీ బ్యాక్టీరియల్ వ్యాక్సిన్ 'ఏవీ0328' అభివృద్ధి, వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి కోసం అమెరికాకు చెందిన కంపెనీ అలోపెక్స్.ఇంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

వాతావరణ సూచనలకు 'మిషన్ మౌసమ్'

వాతావరణ అంచనాల్లో కచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన 'మిషన్ మౌసమ్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మిషన్‌కు వచ్చే రెండేళ్లలో రూ.2,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. కచ్చితమైన వర్షపాతం, ఉష్ణోగ్రతల వివరాలు, రాడార్లు, ఉపగ్రహాలు, ఖచ్చితమైన అగ్రోమెట్ అంచనాలపై ఈ మిషన్ దృష్టి పెడుతోంది. భారత వాతావరణ శాఖ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ, నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ సంయుక్తంగా ఈ మిషన్‌ను అమలు చేయనున్నాయి. కచ్చితత్వం, మోడలింగ్, రాడార్లు, ఉపగ్రహాలు, ఖచ్చితమైన అగ్రోమెట్ అంచనాలపై ఈ 'మిషన్ మౌసమ్' దృష్టి పెడుతుంది. వచ్చే 5-6 ఏళ్లలో కచ్చితమైన వాతావరణ సలహాలు, నౌకాస్ట్ సాంకేతిక పరిజ్ఞానం ఉండాలన్నదే తమ లక్ష్యమని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

పిక్సెల్‌కు నాసా కాంట్రాక్టు

భారతీయ స్పేస్‌టెక్ స్టార్టప్ పిక్సెల్ నాసా కాంట్రాక్టును దక్కించుకుంది. 476 మిలియన్ డాలర్ల విలువ చేసే కాంట్రాక్టుకు సంబంధించి మొత్తం ఎనిమిది కంపెనీలు ఎంపికవగా, వాటిలో పిక్సెల్ కూడా ఒకటి. ఈ కాంట్రాక్టు ద్వారా పిక్సెల్ తన హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీని ఉపయోగించి భూమిపై జీవనాన్ని మెరుగుపర్చేందుకు నాసా సాగిస్తున్న పరిశోధన కార్యకలాపాలకు ఉపయోగపడేలా ఎర్త్ అబ్జర్వేషన్ డేటాను అందిస్తుంది. ఈ డేటా వాతావరణ మార్పులు, వ్యవసాయం, జీవవైవిధ్యం వంటి అనేక రంగాలలో విశ్లేషణకు ఉపయోగపడుతుంది.

క్రీడలు

ప్యారిస్ 'పారాలింపిక్స్'లో సత్తా చాటిన భారత్

పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు కొత్త చరిత్ర లిఖించారు. అసమాన పోరాటంతో పారా విశ్వ క్రీడల రికార్డులు తిరగరాశారు. ఈ క్రీడా పండుగ చరిత్రలోనే దేశానికి అత్యధిక పతకాలు అందించారు. దాంతో, భారత్ ఖాతాలో మునుపెన్నడూ లేని విధంగా 29 పతకాలు వచ్చి చేరాయి. పారిస్‌లో మన క్రీడాకారులు పారా విశ్వ క్రీడల్లో 7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్య పతకాలు కొల్లగొట్టారు. దాంతో, ఈసారి ఇండియా పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచింది.

యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విజేత సినెర్

పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఇటలీకి చెందిన జానిక్ సినెర్.. అమెరికా ఆటగాడు టేలర్ ఫ్రిట్జ్‌పై గెలుపొందాడు. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌కు టాప్ సీడ్ హోదాకు న్యాయం చేస్తూ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో సినెర్ విజేతగా నిలిచాడు. విజేతగా నిలిచిన సినెర్‌కు 36 లక్షల డాలర్లు (రూ.30 కోట్ల 23 లక్షలు), రన్నరప్ ఫ్రిట్జ్‌కు 18 లక్షల డాలర్లు (రూ.15 కోట్ల 11 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్ లో బెలారస్ స్టార్ అరీనా సబాలెంకా అమెరికాకు చెందిన జెస్సికా పెగులాపై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది.

క్రికెట్‌కు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ వీడ్కోలు

ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. త్వరలో ఆస్ట్రేలియాతో జరుగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు గాను సెలక్టర్లు అలీని పక్కనబెట్టిన కొద్దిరోజులకే అతడు ఈ నిర్ణయం ప్రకటించడం గమనార్హం. పదేళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో అలీ.. 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టీ20లు ఆడాడు.

వార్తల్లో వ్యక్తులు

ఆసియా పసిఫిక్ సభ్య దేశాల ఛైర్మన్‌గా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఢిల్లీలో జరిగిన రెండవ ఆసియా-పసిఫిక్ మంత్రుల స్థాయి సదస్సులో ఆసియా పసిఫిక్ సభ్య దేశాల ఛైర్మన్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామ్మోహన్ నాయుడు పేరును సింగపూర్ ప్రతిపాదించగా భూటాన్ బలపరిచింది.

పెరూ మాజీ అధ్యక్షుడు ఫుజిమొరి కన్నుమూత

పెరూ మాజీ అధ్యక్షుడు అల్బెర్టో ఫుజిమొరి సెప్టెంబర్ 11వ తేదీ రాజధాని లిమాలో కన్నుమూశారు.



ఎం.బాలలత, సబ్జెక్ట్ నిపుణులు

ఉద్యోగాలు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 90 ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 90.
» **విభాగాల వారీగా ఖాళీలు:** మెకానికల్-29, ఎలక్ట్రికల్-15, ఎలక్ట్రానిక్స్-03, ఇన్‌స్ట్రుమెంటేషన్-04, సివిల్-13, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-01, ఆఫీస్-23, ఫైనాన్స్-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21.09.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** మొదటి ఏడాదికి రూ.24,400, రెండో ఏడాది 25,100, మూడో ఏడాది రూ.25,900
» **ఎంపిక విధానం:** విద్యార్హత, ఆన్‌లైన్ పరీక్ష, పని అనుభవం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.09.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.09.2024
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

ఎన్ఐటీవీఏఆర్, పుణెలో యూడీసీ, ఎల్‌డీసీ పోస్టులు

పుణెలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ వైరాలజీ అండ్ ఎయిడ్స్ రీసెర్చ్(ఎన్ఐటీవీఏఆర్) అప్పర్ డివిజన్ క్లర్క్(యూడీసీ), లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** యూడీసీ-3, ఎల్‌డీసీ-5.
» **అర్హత:** ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 27 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**19.09.2024
» **వెబ్‌సైట్:** https://main.icmr.nic.in

The concept of continuous evaluation is:

EVALUATION & ASSESSMENT



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
సైన్స్ అండ్ పెడగాగి

1. The Assessment and Evaluation relation was:
   1) They are same, can be used any where
   2) They are closely related although there are fine distinctions
   3) Assessment can be done only after completion of teaching learning process
   4) Evaluation doesn't need Assessment as it is ongoing process
2. To tell the relation between Test and Assessment which two of the following statements are correct?
   A) Assessment is a part of Testing
   B) Assessment is more the Testing
   C) All Tests are Assessments, but all Assessments are not Tests
   D) Assessment is basically a Tool
   1) AB 2) BC 3) CD 4) AD
3. In the purpose of Tests which one of the following is not related:
   1) Test to find whether objectives we set for particular topic have been achieved or not
   2) To determine what students have learnt or not learnt in class
   3) Tests are used to predict out comes
   4) Tests are used to design the objectives of the particular Topic
4. The statement related to standardized Test is:
   1) It is made by the teacher who is teaching to these children
   2) It is connected to students, feelings, interests, and skills
   3) It has wide coverage and measures and content common to large number of students
   4) Gives clear picture of strengths and weakness of student and finding out different learning difficulties
5. "It is record of performance of the information which is required to make Judgment."
   This definition is regarding:
   1) Evaluation 2) Assessment
   3) Measurement 4) Test
6. Which one of the following is not related to Evaluation?
   1) It looks at original objectives and at what are either predicted or what was accomplished and how was accomplished
   2) Evaluation is structured interpretation and giving of meaning to predict proposals or results
   3) Critical assessment in as objective a manner as possible
   4) It is ongoing process to know the progress of students when the process is going on
7. In the differences between Assessment and Evaluation which two are correct?
   A) Evaluation focuses on grades and may reflect classroom components
   B) Assessment focuses on learning, teaching and out comes
   C) Commonly Assessment is summative product oriented
   D) Evaluation is formative only and is process oriented
   1) AB 2) BC 3) CD 4) AC
8. The concept of "continuous evaluation" is:
   1) Covers all effectiveness of teaching learning process
   2) It emphasized on scholastic and Non Scholastic achievement
   3) Means regularity of assessment, frequency diagnosis of leering gaps
   4) Summative evaluation is example for continuous evolution
9. A - is the teacher who is testing the scholastic and co-scholastic aspects of the students
   B- is the teacher who concentrate on Assessing throughout the Teaching learning process
   1) A-is continuous evaluation, B-is comprehensive evaluation
   2) A-is comprehensive evaluation, B-is comprehensive evaluation
   3) A-is comprehensive evaluation, B-is continuous evaluation
   4) A-is continuous evaluation, B-is continuous evaluation
10. Which among the following is not objective of continuous and comprehensive evaluation?
    1) To develop cognitive, Psychomotor and Affective skills
    2) To make evaluation and integral part of teaching learning process
    3) To use evaluation form improvement of Teachers achievement in teaching learning strategies
    4) To determine social utility, desirability or effectiveness of a programme and take appropriate decisions about learners
11. Who stated correctly on the features of CCE among the following?
    1) Reena: Continue aspect of CCE, care of continual and periodicity aspect of evaluation
    2) Ritesh: Periodicity means assessment of performance on only at the end of syllabus
    3) Roopa: Scholastic aspects include subject specific area in which the students should be checked and do not gives importance to attitude and values
    4) Robert: The comprehensive component of CCE giving questioning into the Test related to cognitive development of student
12. Regarding scholastic and co scholastic assessment which one of the following is correct?
    1) Learners Attitudes, Values, Skills come under Scholastic
    2) Learners knowledge, Understanding, Application and analysis is co scholastic
    3) The leadership qualities, reactions of student to the punishment can come under co-scholastic
    4) Cognitive development related to co-scholastic
13. Which among the among the following is not a feature of formative assessment?
    1) It is diagnostic and remedial
    2) It produces enormous stress and anxiety among the Learners
    3) Recognizes the need for students to be able to understand how to improve
    4) Helps the students to support their peer group and vice versa
14. Giving Weightage to the Academic standards which one of the following is to be given more importance?
    1) Questioning and making assumptions
    2) Experiments and field trips
    3) Understanding the contest
    4) Information skills
15. Which of the following statements is not related to Assessment?
    1) Arnold: Focus is on learning process and experience
    2) Arpitha: Continuous and Comprehensive approach
    3) Areef: Focus is on strength, ability and need of learner
    4) Asha: Focus is on Learning product and out come
16. In the use of Learning indicator or Academic standards this is not considered:
    1) Knowing various Parameters of Learning Evidences
    2) Monitoring the Teachers abilities in achieving objectives
    3) Providing Feedback for teaching learning process
    4) Enhancing learner's understanding of science as well as teachers understanding about learner understanding
17. Which of the following not used a tool in assessment?
    1) Teacher who assessed through observations
    2) Teacher used inventories is assessment
    3) Teacher arranged group discussion in assessment
    4) Teacher checked portfolios of students
18. Which of the following is not technique in assessment?
    1) Assignment 2) Project
    3) Club activities
    4) Anecdotal record
19. Which two of the following pairs are correct?
    A) Tool - Rating scale
    B) Technique - Checklist
    C) Technique - Observation
    D) Tool - Tests and inventories
    1) AB 2) BC 3) AD 4) CD
20. According to the Definitions for Tools and Technique which two are correct?
    A) Tool is the way of doing some thing in a systematic way
    B) Technique is a device to perform a task
    C) Tool is primary instrument of collecting data and information
    D) Technique is the way of doing something in a systematic way
    1) AB 2) CD 3) BC 4) BD
21. Who among the following Teachers used a tool and technique consequently?
    A) Harhsa: Laboratory work and peer assessment
    B) Hansika: Self assessment, practical examination
    C) Hardik: Project work, Field Diary
    D) Haseena: Questions, Self assessment
    1) A, D 2) A, C
    3) B, C 4) A, B
22. "How would you explain the process of circulation of Blood?" A biology Teacher gave this question in the Test. This question is following type:
    1) Remembering 2) Applying
    3) Understanding 4) Analyzing
23. Who among the following Teachers questions belong to creating type of Questions?
    A) Teacher started a question - 'how many'
    B) Teacher started a question - 'Can you design'
    C) Teacher started a question - Can you see a possible solution to...
    D) Teacher started a question - Which events could not have happened…
    1) A, D 2) B, C
    3) C, D 4) A, B
24. Grade is designed from the Latin word "Gradus" which mean:
    1) Jump 2) Talent
    3) Place 4) Step
25. Who among the following gave absolute grading?
    1) Teacher gave first marks and then converted them in to grade
    2) A teacher directly expressed the student performance in terms of letter grades
    3) A teacher gave the grade based on Predetermined standards categorizing like distinction, first division etc…
    4) A teacher gave the grades first converted them in to marks
26. "Portfolio" description is:
    1) Collection of social background of student
    2) Collection of Hereditary learning disabilities of student
    3) Collection of evidences of student work over a period of time
    4) Collection of misbehavior and indiscipline activity particulars of student
27. Which of the following is not an advantage of Portfolios?
    1) Provide a cumulative record of growth and development of Skill or Competency
    2) Enables a student to demonstrate to others his learning and process
    3) Student becomes an active participant in the learning and assessment process
    4) Teacher can select the approach based on these portfolios and implement in classroom
28. In the term of evaluation of Portfolios which of the following is incorrect?
    1) There is chance of Self evaluation to students
    2) There is possibility of conducting portfolio conferences
    3) The result of evaluation should be kept away from parents
    4) The students are given chance to participate in peer groups evaluation by these portfolios
29. Assessment is both a reflected process it mean:
    1) Both performance of student and other student
    2) Both the classroom activity and play activity
    3) Both the students and Teachers performance
    4) Both Theoretical and practical performance
30. Which among the following involved in indirect measurement?
    1) Student measured the width of a classroom
    2) Teacher measured the knowledge of student
    3) Teacher compared the knowledge of one student with other
    4) Teacher measured the physical growth of student

KEY

1) 2	2) 2	3) 4	4) 3	5) 3
6) 4	7) 1	8) 3	9) 3	10) 3
11) 1	12) 3	13) 2	14) 3	15) 4
16) 2	17) 3	18) 4	19) 3	20) 2
21) 1	22) 3	23) 2	24) 4	25) 3
26) 3	27) 4	28) 3	29) 3	30) 2

డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్‌లో ఉపయోగించే రక్త కణాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

రక్త ప్రసరణ వ్యవస్థ

తెల్ల రక్త కణాలు (ల్యూకోసైట్స్ / డబ్ల్యూబీసీ)

తెల్ల రక్త కణాలను ఫాగోసైట్స్, శరీర రక్షక భటులు (బాడీ సోల్జర్స్), శ్వేత రక్త కణాలు అని కూడా అంటారు. రక్తంలోకి వచ్చిన సూక్ష్మజీవులను తెల్ల రక్త కణాలు చంపి దేహాన్ని కాపాడతాయి. కాబట్టి వీటిని శరీర రక్షక భటులు, లేదా రక్తంలోని పారిశుద్ధ్య పనివారు అని అంటారు.

- ల్యూకోపాయిసిస్ అంటే తెల్ల రక్తకణాలఉత్పత్తి.
- ల్యూకోలైసిస్ అంటే తెల్ల రక్తకణాల విచ్ఛిత్తి.
- ల్యూకోపేనియా అంటే తెల్ల రక్తకణాల సంఖ్య అసాధారణంగా తగ్గడం.
- ల్యూకేమియా (ల్యూకోసైథీమియా) అంటే తెల్ల రక్తకణాల సంఖ్య పెరగడం (బ్లడ్ క్యాన్సర్).
- శరీరంలోకి ప్రవేశించిన సూక్ష్మజీవులను ఎదుర్కొనే క్రమంలో చనిపోయిన తెల్ల రక్తకణాలు చీము రూపంలో బయటకు విసర్జితమవుతాయి.
- డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్‌కు తెల్ల రక్తకణాలను ఉపయోగిస్తారు.
  ఉపయోగం: నేర పరిశోధన, మాతృ, పితృత్వ వివాదాల పరిష్కారం.
- తెల్ల రక్త కణాలు గుండ్రంగా ఉంటాయి.
- వీటిలో కేంద్రం ఉంటుంది.
- కాలేయం, ప్లీహం (లింఫ్ గ్రంథి), థైమస్ గ్రంథి (బాల గ్రంథి),దీర్ఘ అస్థిమజ్జ నుంచి తెల్లరక్త కణాలు ఉత్పత్తి అవుతాయి.
- క్యూబిక్ మి.లీ. రక్తంలో ఉండే తెల్లరక్త కణాల సంఖ్య 5000–9000 ($5–9 \times 10^3$)
- ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాల నిష్పత్తి 500 : 1
- తెల్ల రక్తకణాలు కాలేయం, ప్లీహంలో విచ్ఛిన్నమవుతాయి.

తెల్ల రక్తకణాలు ప్రధానంగా రెండు రకాలు. అవి.. ఎ)గ్రాన్యులోసైట్స్, బి) ఎగ్రాన్యులో సైట్స్

గ్రాన్యులోసైట్స్

ఈ డబ్ల్యూబీసీల జీవ పదార్థంలో రేణువులు (గ్రాన్యుల్స్) ఉంటాయి. మొత్తం డబ్ల్యూబీసీల్లో గ్రాన్యులోసైట్స్ 70 శాతం వరకు ఉంటాయి. వీటిలో కేంద్రకం భిన్న రూపాల్లో ఉంటుంది. కాబట్టి వీటిని బహురూపక కేంద్రక తెల్ల రక్తకణాలు అంటారు. గ్రాన్యులో సైట్స్‌ని తిరిగి మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

1) ఇసినోఫిల్స్ (అసిడోఫిల్స్)
2) బేసోఫిల్స్
3) న్యూట్రోఫిల్స్

ఇసినోఫిల్స్

ఈ కణాలు ఆమ్ల రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. వీటి కేంద్రకంలో రెండు తమ్మెలు ఉంటాయి. జీవ పదార్థంలో అతిపెద్ద కణికలుంటాయి. మొత్తం తెల్ల రక్తకణాల్లో వీటి సంఖ్య 2 నుంచి 8 శాతం వరకు ఉంటుంది. ఇసినోఫిల్స్ జీవిత కాలం 7 నుంచి 12 రోజులు.

విధులు

- ఇసినోఫిల్స్ ఎలర్జీ ప్రతిచర్యలను తగ్గిస్తాయి.
- శరీరంలో ప్రవేశించిన విషపదార్థాలను నాశనం చేస్తాయి.
- ఎలర్జీ కారకాలకు వ్యతిరేకంగా పోరాడుతాయి. ఈ సమయంలో ఇసినోఫిల్స్ సంఖ్య విపరీతంగా పెరగడాన్ని ఇసినోఫిలియా అంటారు.
- ఎలర్జీని కలిగించే మొక్కలు
  1) అర్టికేరియా
  2) పార్థీనియం హిస్టిరోఫోరస్ (వయ్యారి భామ/కాంగ్రెస్ గడ్డి)
- ఈ మొక్కల పరాగ రేణువుల వల్ల వచ్చే జ్వరాన్ని హైఫీవర్ అంటారు.
- ఎలర్జీని కలిగించే కారకాన్ని ఎలర్జీన్ అంటారు.
  ఉదా: పరాగరేణువులు, దుమ్ము, సెంట్, లిప్‌స్టిక్ మొదలైనవి.

బేసోఫిల్స్

ఈ కణాలు క్షార రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. కేంద్రకం ఎస్ (S) ఆకారంలో ఉంటుంది. తెల్ల రక్తకణాలన్నింటి కంటే వీటి సంఖ్య చాలా తక్కువ (0.4 శాతం).

- వీటి జీవిత కాలం 12 నుంచి 15 రోజులు
- పుండ్లు, గాయాలను మాన్పడంలో ఈ కణాలు తోడ్పడుతాయి.

న్యూట్రోఫిల్స్

ఈ కణాలు తటస్థ రంజకాలతో రంగును సంతరించుకుంటాయి. కేంద్రకం అనేక తమ్మెలను (ఐదు లేక ఆరు) కలిగి ఉంటుంది.

- తెల్ల రక్తకణాలన్నింటి కంటే వీటి సంఖ్య చాలా ఎక్కువ (60–65 శాతం).
- వీటి జీవిత కాలం 2 నుంచి 5 రోజులు.
- శరీరంలోకి వచ్చిన బ్యాక్టీరియాలను చంపడం వల్ల వీటిని సూక్ష్మ రక్షక భటులు (మైక్రో పోలీస్ మెన్) అంటారు.
- బ్యాక్టీరియాల నుంచి శరీరాన్ని రక్షించడం వల్ల వీటిని మొదటి వరుస రక్షకులు అంటారు.
- డబ్ల్యూబీసీల్లోని ఏ ఇతర కణాన్ని అయినా ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంటుంది. కాబట్టి న్యూట్రోఫిల్స్‌ను బహు రూపక తెల్ల రక్తకణాలు (ప్లియోమార్ఫిక్ సెల్స్) అంటారు.
- బేసోఫిల్స్, న్యూట్రోఫిల్స్, మోనోసైట్స్ భక్షణ క్రియలో పాల్గొని లైసోసోమ్స్ అనే కణాంగాల సహాయంతో సూక్ష్మజీవులను చంపే (భక్షణ) ప్రక్రియను ఫాగోసైటాసిస్ అంటారు.

ఎగ్రాన్యులో సైట్స్

ఈ కణాల జీవపదార్థంలో రేణువులు (గ్రాన్యుల్స్) ఉండవు. ఇవి తిరిగి రెండు రకాలు..
1) లింఫోసైట్స్ 2) మోనోసైట్స్.

లింఫోసైట్స్

తెల్ల రక్త కణాలన్నింటిలోకి అతి ప్రధానమైనవి. ఇవి మిగతా తెల్ల రక్తకణాల విధులను నియంత్రిస్తాయి. ఇవి శరీరంలోకి వచ్చిన ప్రతి జనకాల (యాంటీజెన్)ను గుర్తించి వాటికి వ్యతిరేక ప్రతిరక్షకాల(యాంటీబాడీస్)ను ఉత్పత్తి చేసి అసంక్రామ్యత (రోగనిరోధక శక్తి)ని పెంచుతాయి. కాబట్టి వ్యాధి నిరోధక శక్తిని పెంచే అతి ముఖ్యమైన కణాలుగా లింఫోసైట్లను పరిగణిస్తారు.

- మొత్తం తెల్ల రక్తకణాల్లో ఇవి 25–28 శాతం వరకు ఉంటాయి.
- డబ్ల్యూబీసీల్లో అతి చిన్న రక్తకణాలు లింఫోసైట్లు. ఇవి గుండ్రంగా ఉంటాయి. కేంద్రకం చాలా పెద్దగా ఉంటుంది.
- వీటి జీవిత కాలం రెండు గంటల నుంచి కొన్ని రోజులు. ❖ లింఫోసైట్స్ రెండు రకాలు..
  1) బి–లింఫోసైట్స్ 2) టి– లింఫోసైట్స్

బి– లింఫోసైట్స్

- ఇవి దీర్ఘ అస్థిమజ్జ నుంచి ఏర్పడతాయి.
- వీటి జీవిత కాలం 12 నుంచి 24 గంటలు. కొన్ని మాత్రం నెల వరకూ జీవిస్తాయి.
- అసంక్రామ్యతను కలిగిస్తాయి.
- వీటిని CD_8 కణాలు అంటారు.

టి– లింఫోసైట్స్ (CD_4 / T_4)

- ఇవి థైమస్ గ్రంథి నుంచి ఏర్పడతాయి.
- రక్తంలోకి ప్రవేశించిన వ్యాధి కారకాన్ని ఇవి గుర్తిస్తాయి. అనంతరం వ్యాధి కారకాన్ని భక్షక కణానికి అందిస్తాయి.
- వ్యాధి కారకాన్ని గుర్తించిన కొన్ని టి – లింఫోసైట్స్, బి–లింఫోసైట్స్‌ని ప్రేరేపిస్తాయి.
- హెచ్ఐవీ వైరస్ లేదా రిట్రో వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత మొదట T_4 లింఫోసైట్స్‌పై దాడిచేసి నాశనం చేస్తుంది. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఎయిడ్స్ వ్యాధి వస్తుంది.
- ఎయిడ్స్ వ్యాధిని 1981లో యూఎస్ఏలో మొదటి సారి గుర్తించారు. భారతదేశంలో 1986లో చెన్నైలో గుర్తించారు.

మోనోసైట్స్

ఇవి తెల్ల రక్తకణాలన్నింటిలో కెల్లా అతిపెద్దవి. ఈ కణాల కేంద్రకం మూత్రపిండాకారం (కిడ్నీ)లా ఉంటుంది. ఇవి అంటు రోగం (వ్యాధి గ్రస్తభాగం) వద్దకు వెళ్లి బ్యాక్టీరియాలను చంపుతాయి. ఈ మోనోసైట్స్ సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల బ్లడ్ క్యాన్సర్ వస్తుంది. మోనోసైట్స్‌నే రక్తం నిజమైన పారిశుద్ధ్య కార్మికులు అంటారు. వీటి జీవిత కాలం 2 నుంచి 5 రోజులు.

రక్త ఫలకికలు

ఈ కణాలు అస్థిమజ్జలోని మెగా క్యారియోసైట్స్ అనే కణాల నుంచి ఏర్పడతాయి. ఇవి పూర్తిస్థాయి రక్తకణాలు కావు. ఇవి ద్వికుంభాకారంలో బల్లపరుపుగా ఉంటాయి.

- ఈ కణాల్లో కేంద్రకం ఉండదు.
- వీటి సంఖ్య 2 నుంచి 4 లక్షలు / క్యూబిక్ మి.లీ. రక్తం.
- వీటి జీవిత కాలం 3 నుంచి 10 రోజులు.
- క్షీరదాల్లో మాత్రమే రక్త ఫలకికలుంటాయి.
- డెంగ్యూ, ఎబోలా వ్యాధుల్లో వైరస్ ప్రభావం వల్ల రక్త ఫలకికల సంఖ్య విపరీతంగా తగ్గి రోగి మరణిస్తాడు.

రక్తఫలకికల విధి: రక్తాన్ని గడ్డకట్టించడం (రక్త స్కందనకు తోడ్పడుతాయి. కాబట్టి వీటిని థ్రాంబోసైట్స్ అంటారు (థ్రాంబస్ అంటే రక్తం గడ్డకట్టడం అని అర్థం).



- గాయమైనప్పుడు ఆ ప్రాంతంలోని రక్త ఫలకికలు విచ్ఛిన్నం చెంది థ్రాంబోప్లాస్టిన్ (థ్రాంబోకైనేజ్) అనే రసాయనాన్ని స్రవిస్తాయి.
- రక్త స్కందనకు నాలుగు కారకాలు అవసరం. అవి..
  1. రక్తం గడ్డ కట్టడానికి తోడ్పడే ఎంజైమ్..థ్రాంబోప్లాస్టిన్ / థ్రాంబోకైనేజ్.
  2. హార్మోన్..ప్రోత్రాంబిన్ లేదా ఫైబ్రినోజన్.
  3. విటమిన్..K.
  4. మూలకం.. Ca^{+2} (కాల్షియం అయాన్లు).
- రక్త స్కందనకు 13 కారకాలు అవసరమని ఇటీవల గుర్తించారు.
- రక్తం గడ్డ కట్టే యాంత్రికాన్ని వివరించింది బెస్ట్, టేటర్.
- రక్తం గడ్డ కట్టే యాంత్రికంలో మూడు దశలు ఉంటాయి.
  I) థ్రాంబోప్లాస్టిన్ విడుదల
- దెబ్బతిన్న రక్త ఫలకికల నుంచి థ్రాంబోప్లాస్టిన్ విడుదలవుతుంది.
  II) ప్రోత్రాంబిన్ థ్రాంబిన్‌గా మారడం
  III) ఫైబ్రినోజన్ ఫైబ్రిన్‌గా మారడం
- ఫైబ్రిన్ రక్తంలో కరిగి ఉన్న ఫైబ్రినోజన్‌ను ఫైబ్రిన్ పోగులుగా మారుస్తుంది. తర్వాత ఈ ఫైబ్రిన్ పోగులు సంక్లిష్టమైన వలను ఏర్పర్చి గాయం లోపలి తలాన్ని అంటిపెట్టుకొని బిరడా వలె మూసి రక్తాన్ని బయటకు రానీయదు.

రక్త స్కందన నివారణ పదార్థాలు

- రక్తం రక్తనాళాల్లో O_2ను రవాణా చేస్తున్నప్పుడు రక్తం గడ్డ కట్టకుండా హిపారిన్ తోడ్పడుతుంది. దీన్ని కాలేయం స్రవిస్తుంది.
- బ్లడ్ బ్యాంకుల్లో రక్తం గడ్డ కట్టకుండా ఉండటానికి సోడియం, పొటాషియం, అల్యూమినియం సిట్రేట్స్, ఆక్సలేట్స్‌ను కలుపుతారు.

సరస్సు	దేశం	ప్రత్యేకత
హ్యురాన్	యూఎస్ఏ, కెనడా	మనిటౌలిన్ ద్వీపం ఉన్న సరస్సు
తాంగాన్యికా	టాంజానియా, జాంబియా, బురుండి	ప్రపంచంలో అతి పొడవైంది, రెండో లోతైన సరస్సు
బైకాల్	రష్యాలోని సైబీరియా	ప్రపంచంలో అత్యంత లోతైన సరస్సు
గ్రేట్‌బేర్	కెనడా	ఒకే దేశంలో విస్తరించి ఉంది.
మలావి	మలావి, మొజాంబిక్, టాంజానియా	

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. శిశువు పితృత్వాన్ని నిర్ధారించడానికి ఉపయోగించే పరీక్ష? (సివిల్స్, 2010)
   1) అమ్నియో సెంటాసిస్
   2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
   3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు
2. అర్టికేరియా అనేది ఒక రకమైన? (గ్రూప్–4, 1989)
   1) వ్యాధి కలుగజేసే మొక్క
   2) ఎలర్జీ మొక్క 3) రసాయనం
   4) ఏదీకాదు
3. మానవ శరీరంలోని ఏ అవయవంలో లింఫోసైట్స్ ఉత్పత్తి అవుతాయి? (సివిల్స్, 2004)
   1) కాలేయం 2) ప్లీహం
   3) దీర్ఘ అస్థి 4) క్లోమం
4. వ్యాధి నిరోధకతను పెంచే రక్త కణాలు? (ఆర్‌డీవోస్ 1992 / వాటర్ వర్క్స్. మెయిన్స్, 2008)
   1) ల్యూకోసైట్స్ 2) మోనోసైట్స్
   3) లింఫోసైట్స్ 4) న్యూట్రోఫిల్స్
5. కొన్ని రకాల పుష్పించే మొక్కలు ఎలర్జీని ఉత్పత్తి చేసే పుప్పొడి రేణువులను కలిగి ఉంటాయి. అలాంటి వాటికి ఉదాహరణ?
   1) పార్థీనియం హిస్టిరోఫోరస్
   2) స్థూలకాయ కోడి
   3) స్పైని అమరాంథీస్ 4) పైవన్నీ
6. రక్తంలోని ప్రతిజనకం అనేది? (సివిల్స్, 2001)
   1) హానికర బ్యాక్టీరియాలను నిర్మూలిస్తుంది
   2) విషానికి వ్యతిరేకంగా పనిచేస్తుంది
   3) శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది
   4) యాంటీబాడీల ఏర్పాటులో కీలకపాత్ర
7. మానవ రక్తంలో అధికంగా ఉండే డబ్ల్యూబీసీలు? (అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్ ఏపీ ట్రైబల్, 2002)
   1) ఇసినోఫిల్స్ 2) బేసోఫిల్స్
   3) న్యూట్రోఫిల్స్ 4) మోనోసైట్స్
8. తెల్ల రక్తకణాల జీవిత కాలం? (ఏపీపీఎస్సీ టౌన్ ప్లానింగ్, 2012)
   1) 12–13 రోజులు 2) 16–18 రోజులు
   3) 11–12 రోజులు 4) 10–12 రోజులు
9. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టకపోవడానికి కారణం? (గ్రూప్–1, 1994)
   1) ఫైబ్రిన్ లేకపోవడం
   2) ఫైబ్రినోజన్ ఉండటం
   3) Ca^{+2} ఉండటం
   4) థ్రాంబో ప్లాస్టిన్ లేకపోవటం
10. మానవుడిలో రక్తం గడ్డ కట్టేందుకు ఎంత సమయం పడుతుంది? (గెజిటెడ్, 2006)
    1) 10 నిమిషాలు 2) 8 నిమిషాలు
    3) 7 నిమిషాలు 4) 3-5 నిమిషాలు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 3; 5) 4; 6) 4; 7) 3; 8) 1; 9) 1; 10) 4.

How is Raju related to Rani?



BANK EXAMS
REASONING

MODEL QUESTIONS

Directions (Q.No.1-5) Study the following information carefully and answer the questions given below.

Suman had put a password to his Gmail account which consists of seven characters. There were three numbers 1, 2 and 3 and four alphabets B, V, S and A in the password. He forgot the password and could only remember the following data about his password. (Take directions as per your left right)

I) S was 3rd to the right of 1.
II) 3 was 2nd to the left of B.
III) B and 2 were at a gap of 3 characters
IV) V was next to 2
V) 2 was not at either of the extreme ends.

1. Which of the following was the leftmost character?
   a) A b) 3 c) 1
   d) V e) Can't be determined
2. What was the position of 3 with respect to S?
   a) Immediate left
   b) Third to the right
   c) Second to the left
   d) Immediate right
   e) Second to the right
3. Which of the following character was exactly in the middle?
   a) 1 b) S c) 2
   d) 3 e) 4
4. How many characters were there to the left of 2?
   a) None b) One c) Two
   d) Three
   e) Cannot be determined
5. How many characters were there between V and 3?
   a) None b) One c) Two
   d) Three
   e) Cannot be determined

Directions (Q.No.6-10): Answer these questions based on the following information.

In a certain code:
"Winter water bottle" is coded as "yon wat bob"
"Win Wow water fat" is coded as "din foa wat dit"
'Wow fat summer", is coded as "foa dit yom"
"Bottle money underground" is coded as "bob wan fud"

6. What maybe the code for "bottle fat"?
   a) foa dit b) dit yon
   c) yon foa d) bob dit
   e) dit foa
7. What is the code for "water summer"?
   a) wat foa b) wat yom
   c) wat dit d) dit wat
   e) dit yom
8. What is code for "underground"?
   a) bob b) wan c) fud
   d) Either bob or wan
   e) Either wan or fud
9. What could be the code for "Win money"?
   a) wan dit b) din wan
   c) foa bob d) din wam
   e) None of these
10. What can be the code for "sister"?
    a) sis b) sit c) yos
    d) dis e) Can't be determined

Directions (Q.No. 11-15): Study the following information carefully and answer the questions given below.

Tamas, Tanoj, Tanuj, Taru, Taporaj, Tarak, Tausiq, Tej and Thaman live in a five floored apartment (from the first floor to fifth floor). In any floor, maximum two people can live and no floor is vacant. The first floor is considered as the lowermost floor.

1) Taporaj lives above Taru and below Tanuj.
2) Tanoj lives exactly between Tamas and Tanuj. It does not necessarily means that they live on consecutive floors.
3) Taporaj lives alone in his floor but not at the lowermost floor.
4) Tej lives above Tausiq and there are two floors in between them.
5) Thaman lives below Tarak and Taru. Floor Gap between Taru and Tej is same as that between Tanuj and Tanoj.

11. Who among the following lives on the third floor?
    a) Taporaj b) Tanoj
    c) Tarak d) Tamas
    e) Tausiq
12. At which floor does Tausiq live?
    a) First floor b) Second floor
    c) Third floor d) Fourth floor
    e) Fifth floor
13. At which floor does Tamas live?
    a) First floor b) Second floor
    c) Third floor d) Fourth floor
    e) Fifth floor
14. Who lives at the floor at which Taru lives?
    a) Tej b) Tanuj c) Tanoj
    d) Taporaj e) Tamas
15. Who lives just below the floor at which Taporaj live?
    a) Tej b) Thamanc) Tamas
    d) Tanoj e) Tanuj

Directions (Q.No. 16-18): Study the following information to answer the given questions.

Mahesh, Balu, Ravi, Vijay, Yogi are sitting around a circular table facing away from the centre. They have different number of books with them. Mahesh sits 2nd to the right of the one who has highest number of books. Yogi has more books than Balu and Vijay, but not the highest. The one who has least number of books sits immediate right to Mahesh, who is not next to Balu. The one who has the 2nd least sits 2nd left to the one who has 2nd highest number of books. Balu does not have the least number of books.

16. If Mahesh has 55 books then what may be the number of books with the one who sits 2nd left to Ravi?
    a) 75 b) 80 c) 31
    d) 74 e) 95
17. If the all the persons except Ravi are made to sit in decreasing order of the number of books they have from left of Ravi, then who will sit 3rd to the right of Ravi?
    a) Mahesh b) Balu
    c) Vijay d) Yogi
    e) Can't be determined
18. Who among the following has the 3rd lowest number of books?
    a) Ravi b) Balu c) Vijay
    d) Yogi e) Mahesh

Directions (Q.No. 19-20): The following questions are based on the three-digit numbers given below:

342 783 617 584 287

19. If 1 is added to the second digit of each of the numbers how many numbers thus formed will be divisible by three?
    a) None b) One c) Two
    d) Three e) None of these
20. If all the digits in each of the numbers are arranged in descending order within the number which of the following will be the second highest number in the new arrangement of the numbers?
    a) 342 b) 783 c) 617
    d) 287 e) 549
21. In a family of six members having two generations. There are two married couples. Vamsi is the father-in-law of Rani. Latha is the sister-in-law of Priya, who is the mother of Madhu. Raju is the brother of Madhu, who is unmarried. Rani has no sister-in-law. Then how is Raju related to Rani?
    a) Brother-in-law b) Wife
    c) Husband d) Father
    e) None of these

Directions (Q.No. 22-24): In each of the questions below are given some statements followed by some conclusions. You have to take the given statements to be at true even if they seem to be at variance with commonly known facts. Read all the conclusions and then decide which of the given conclusions logically does not follow from the given statements, disregarding commonly known facts. Give answer

22. Statements:
    All Bus is Car.
    Some Car is Red.
    All Red is Pop.
    Some Pop is not Boss.
    Conclusions:
    I. Some Pop is Car.
    II. Some Red is not Boss.
    III. All Boss is Pop is a possibility.
    a) Both I and II
    b) Only I
    c) Both II and III
    d) Only II e) All follows
23. Statements:
    Some Days are Hour.
    Some Hour is Seconds.
    Only watches are Seconds.
    Some watches are Dial.
    Conclusions:
    I. Some Dial is not Hour is a possibility.
    II. Some Seconds are Days.
    III. All Days are watches.
    a) Both I and II
    b) Only I
    c) Both II and III
    d) Only II
    e) Both I and III
24. Statements:
    All Lenovo is Honor.
    Some Honor is Moto.
    All Moto is Samsung.
    Some Moto is Huawei.
    Conclusions:
    I. Some Lenovo is Huawei.
    II. Some Samsung is not Huawei.
    III. Some Lenovo is not Honor is a possibility.
    a) Both I and II
    b) Only I c) Both II and III
    d) Only II e) None of these

Key with Solutions

(1-5):

<u>1</u> <u>V</u> <u>2</u> <u>S</u> <u>3</u> <u>A</u> <u>B</u>

1) c; 2) d; 3) b; 4) c; 5) c

(6-10):

Winter	Yon
Water	Wat
Bottle	Bob
Win	Din
Wow	dit/foa
Fat	dit/foa
Summer	Yom
Money	wan/fud
Underground	wan/fud


6) d; 7) b; 8) e; 9) b; 10) e

(11-15):

Floor	Person	
5	Tanuj	Tej
4	Taporaj	
3	Tanoj	Taru
2	Tausiq	Tarak
1	Tamas	Thaman

11) b; 12) b; 13) a; 14) c; 15) d

(16-18):



Ravi > Yogi > Mahesh > Balu > Vijay


16) c; 17) a; 18) e;

19) 342 783 617 584 287
352 793 627 594 297
627, 594, 297 are divisible by 3
Ans: d

20) 342 783 617 584 287
432 873 761 854 872
Ans: d


21) Latha⁻ ← Vamsi+ < = > Priya⁻
↓
Madhu+ → Raju+<=> Rani⁻
Ans: c

22)




Ans: d

23)



Ans: c

24)



Ans: e